# ప్రభాత్

లోపలి పేజీల్లో...


- కామ్రేడ్స్ గణపతి, కిషన్‌లతో ఇంటర్వ్యూ ... 11
- భారత విప్లవ మార్గదర్శి కామ్రేడ్ చారు మజుందార్ ... 23
- భారత విప్లవ మహానాయకుడు కామ్రేడ్ కనాయ్ చటర్జీ ... 24
- కామ్రేడ్ పార్వతితో ఇంటర్వ్యూ ... 25
- భూపరిశోధనా ఉద్యమంలో ప్రజా కృషి -మావో ... 31
- యూపీఏ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ... 34
- అమరులకు శ్రద్ధాంజలి ... 38
- దండకారణ్యంలో పోలీసుల పాశవిక నిర్బంధం ... 42
- మహారాష్ట్ర ఎన్నికలు - ఒక విశ్లేషణ ... 46
- ప్రజా ప్రతిఘటన, ప్రజా పోరాటాల రిపోర్టులు ... 49


భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ అధికార త్రైమాసిక పత్రిక

సీపీఐ (మావోయిస్టు) ఆవిర్భావ ప్రత్యేక సంచిక

సంపుటి - 17 | సంచిక - 4 | అక్టోబర్ - డిసెంబర్ 2004 | వెల - 10 రూపాయలు

ప్రత్యేక వ్యాసం

## భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) ఆవిర్భావం

అదొక గంభీరమైన సన్నివేశం. సెప్టెంబర్ 21, 2004 సాయంత్రం. భారతదేశంలో ఒక చోటది. చుట్టూ దట్టమైన అడవి. గెరిల్లా యోధులతోనూ, సాంస్కృతిక కార్యకర్తలతోనూ, సీనియర్ పార్టీ నాయకులతోనూ కూడిన శ్రోతల సమక్షంలో నూతన కేంద్ర కమిటీ (తాత్కాలిక) సీనియర్ నేత కామ్రేడ్ శోమ్ భారతదేశంలో సమైక్య కార్మికవర్గ పార్టీ – భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) ఏర్పడినట్టుగా ప్రకటన చేశాడు. భారత విప్లవంలోని రెండు ప్రధాన ప్రవంతులైన సీపీఐ (ఎం-ఎల్), ఎంసీసీఐలు ఐక్యమైన ఫలితంగా ఆరోజున సీపీఐ (మావోయిస్టు) అనే మహా ప్రవాహం ఉద్భవించింది. దీనితో సీపీఐ (ఎం-ఎల్) ఉనికిలో ఉన్న 1969-1972ల స్వల్ప కాలాన్ని మినహాయిస్తే, దేశంలో మొట్టమొదటి సారిగా ఒక ఏకైక, సమైక్య కార్మికవర్గ పార్టీ ఏర్పడింది. భారత ప్రజల మహత్తర విప్లవ సాంప్రదాయాలకు సీపీఐ/ సీపీఎం రివిజనిస్టులు ఎనలేని నష్టం చేశారు. కొందరు నిజమైన మావోయిస్టు విప్లవకారులు ఇప్పటికీ ఈ కొత్త పార్టీకి బైట మిగిలిపోయినప్పటికీ, భారతదేశంలోని రెండు ప్రధానమైన మావోయిస్టు ప్రవంతులు ఇప్పుడు ఒక్కటయ్యాయి. యావత్ భారతదేశంలోని విప్లవ శ్రేణులూ, ప్రగతిశీల శక్తులే కాకుండా దక్షిణాసియాలోని, మొత్తం ప్రపంచంలోని మావోయిస్టు శక్తులందరి చిరకాల వాంఛ ఆఖరుకు ఇలా ఫలవంతమైంది. భారత గడ్డపై 6 వేలకు పైగా అమరవీరుల రక్తంతో బలపడిన ఒక నిజమైన కమ్యూనిస్టు పార్టీ ఉదయించింది. అన్నిటికన్నా ముఖ్యంగా, మన దేశాన్ని మొట్టమొదట నిరంకుశ బ్రిటిష్ పాలన నుండీ, ఆ తర్వాత సామ్రాజ్యవాదం, భూస్వామ్యం, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ విధానాల నుండీ విముక్తి చేయడం కోసం తమ ప్రాణాలర్పించిన అమర యోధుల ఆశలకూ, ఆకాంక్షలకూ నివాళి ఇది.



నూతన పార్టీ వ్యవస్థాపక నేతలు
కామ్రేడ్స్ చారు మజుందార్, కనాయ్ చటర్జీ

### విలీన క్రమం చరిత్ర

రెండు పార్టీల నడుమ చర్చలు గత రెండు దశాబ్దాలకు పైగా సుదీర్ఘంగా, ఎగుడుదిగుడు క్రమాల గుండా కొనసాగాయి. ఈ క్రమంలో చీకటి అధ్యాయాన్ని కూడా చూడాల్సి వచ్చింది. అయితే ఆఖరుకు ఈ క్రమం విజయవంతంగా ముగిసింది.

ఈ రెండు పార్టీల నడుమ మొట్టమొదటి సమావేశం 1981లో జరిగింది. అప్పటి ఎంసీసీ నాయకుడు కామ్రేడ్ కనాయ్ చటర్జీ (కేసీ), అప్పటి సీపీఐ (ఎం-ఎల్) [పీపుల్స్‌వార్] నాయకుడు కామ్రేడ్ కొండపల్లి సీతారామయ్య (కేఎస్)లు ఇరువురూ 12 రోజుల పాటు సమావేశమయ్యారు. ఈ మొట్టమొదటి సమావేశం తర్వాత, వేర్వేరు ప్రవంతులకు చెందినప్పటికీ రెండు పార్టీలూ మౌలికంగా ఒకే బాటన నడుస్తున్నాయి కాబట్టి ఐక్యతకు బలమైన అవకాశాలున్నాయని ఇరువురు నేతలూ ప్రకటించారు. రెండు పార్టీలు కూడా డాక్యుమెంట్లు సిద్ధం చేసుకొని ఐక్యత దిశగా సాగాలని పథకాన్ని రూపొందించుకున్నాయి. అదే సమయంలో, మునుపటి

సీపీఐ (ఎం-ఎల్) [పార్టీ యూనిటీ] కూడా ఎంసీసీతో మంచి సంబంధాలు కలిగి ఉండేది. ఇరు పార్టీలూ తరచుగా సమావేశమవుతూ ఉండేవి. ఇది కూడా 1990ల తొలినాళ్ల దాకా కొనసాగినప్పటికీ ఆ తర్వాత సంబంధాలు బెడిసి ఘర్షణల రూపం తీసుకుంది.

పీపుల్స్‌వార్, ఎంసీసీల ఐక్యత ఫలవంతం కావాలన్న బలమైన కోరిక ఉన్నప్పటికీ వివిధ కారణాల రీత్యా ఈ ప్రక్రియ ముందుకు సాగలేదు. అజ్ఞాతంలో కష్టాల జీవితం మూలంగా ఆరోగ్యం క్షీణించడంతో 1982లో కామ్రేడ్ కేసీ అమరుడయ్యాడు. మరోవైపు కామ్రేడ్ కేఎస్ అరెస్టయ్యాడు. ఆ తర్వాత, కేంద్రకమిటీలో రెండు సార్లు తలెత్తిన సంక్షోభాల్ని పీపుల్స్‌వార్ చవి చూడాల్సి వచ్చింది. రెండు సార్లూ పార్టీ ప్రధాన కార్యదర్శులే సంక్షోభానికి ప్రధాన కారకులయ్యారు. రెండు సంక్షోభాల నడుమ (1988-90) స్వల్ప కాలం పాటు ఐక్యతా ప్రక్రియను ముందుకు నడపడానికి ప్రయత్నాలు జరిగినప్పటికీ, 1992 తర్వాతనే చర్చలు సీరియస్‌గా కొనసాగాయి. మూడేళ్ల పాటు కొనసాగిన ఈ చర్చల క్రమం, అంతర్జాతీయ సమస్యలపై తలెత్తిన కొన్ని విభేదాల మూలంగా చివరకు విఫలమయ్యింది. రెండు పార్టీలూ కూడా విభేదాలను వివరిస్తూ చర్చల వైఫల్యం గురించి సంయుక్త ప్రకటన చేశాయి. ఈ చర్చల ప్రక్రియను కొంత కాలం పాటు నిలిపివేస్తున్నట్టు ప్రకటిస్తూనే భవిష్యత్తులో తిరిగి ఐక్యతా చర్చలు ప్రారంభిస్తామని ఇరు పార్టీలూ హామీ పడ్డాయి. ఆ తర్వాత ఎంసీసీ, పీపుల్స్‌వార్‌ల మధ్య సంబంధాలు, ముఖ్యంగా పీపుల్స్‌వార్-పార్టీ యూనిటీల విలీనం తర్వాత ఓ మేరకు చెడిపోయాయి.

1998లో ఎం-ఎల్ స్రవంతిలోని రెండు ప్రముఖ పార్టీలైన పీపుల్స్‌వార్, పార్టీ యూనిటీలు విలీనమై ఐక్య పార్టీని ఏర్పాటు చేశాయి. కానీ బీహార్‌లో కింది స్థాయిలో పరిస్థితి మరింతగా దిగజారిపోయింది. 1998 తర్వాత పీపుల్స్‌వార్, ఎంసీసీల మధ్య ఘర్షణలు కొనసాగడమే కాకుండా తీవ్రమయ్యాయి. ఆ తర్వాత ఇరు పార్టీలూ ఇప్పుడు భారత విప్లవంలో "చీకటి అధ్యాయమ"ని పేర్కొంటున్న కాలంలోకి ప్రవేశించాయి. ఇరు వైపులా పెద్ద సంఖ్యలో కామ్రేడ్స్ చనిపోయారు.

ఈ పరిస్థితి విప్లవోద్యమానికి చాలా నష్టం కలుగజేసింది. ఇరు పార్టీలు చేపట్టిన ప్రతీకార పద్ధతులను ఉద్యమ సానుభూతిపరులు ఎంతో మంది వ్యతిరేకించినప్పటికీ ఆ క్రమం కొనసాగింది. విప్లవాన్ని సమర్థించే మేధావులూ, ప్రగతిశీల వ్యక్తులూ ఎంతో మంది ఈ ఘర్షణల్ని నిలిపివేయాలని ఇరు పార్టీలకూ విజ్ఞప్తి చేశారు. దేశంలోని వేర్వేరు కమ్యూనిస్టు విప్లవ గ్రూపులూ, పార్టీలూ ఘర్షణలను పరిష్కరించుకోవాలని విజ్ఞప్తి చేశాయి. పలు దక్షిణాసియా పార్టీలూ, ఇతర అంతర్జాతీయ మావోయిస్టు శక్తులూ ఘర్షణలను ఆపాలని కోరాయి. ఈ క్రమంలోనే ఎంసీసీలో అంతర్గతంగా పునరాలోచనా క్రమం మొదలైంది. పీపుల్స్‌వార్/పార్టీయూనిటీల ఐక్యత సందర్భంగానే పీపుల్స్‌వార్ ఏకపక్షంగా ఘర్షణను నిలిపివేయాలని నిర్ణయం తీసుకున్నప్పటికీ అది ఈ నిర్ణయాన్ని బహిరంగంగా ప్రకటించకపోవడం వల్లా, ఎంసీసీకి తెలియజేయకపోవడం వల్లా దాని ప్రభావం ఏమీ లేకుండా పోయింది. ఈ మొత్తం నేపథ్యంలో ఎంసీసీ చొరవ తీసుకుంటూ జనవరి 2000లో ఏకపక్షంగా కాల్పుల విరమణను ప్రకటించింది. ఆ తర్వాత పీపుల్స్‌వార్ కూడా ఘర్షణలను నిలిపివేస్తున్నట్టు ప్రతిస్పందించింది. ఆ విధంగా ఇరు పార్టీల మధ్య ప్రతికూల సంబంధాలు సానుకూలంగా మారే క్రమం మొదలైంది. ఈ సమయంలోనే పీపుల్స్‌వార్ 2001 మార్చ్‌లో తన 9వ కాంగ్రెస్‌ను జరుపుకుంది. ఇదే సమయంలో ఎంసీసీఐలో కూడా ఒక ముఖ్యమైన రెండు పంథాల పోరాటం తలెత్తింది. కొన్ని భావజాలపరమైన, రాజకీయపరమైన అంశాలతో పాటు మరి కొన్ని సమస్యలపై ఒక చిన్న గ్రూపుతో అంతర్గత పోరాటం జరిగింది.

చివరగా, ఆగస్టు 2001లో ఇరు పార్టీల మధ్య చర్చల ప్రక్రియ మరోసారి ప్రారంభమైంది. ఈ రెండు పార్టీల మధ్య సఖ్యత పెరగడానికి మరో ముఖ్యమైన కారణం పీపుల్స్‌వార్ కాంగ్రెస్ చేసిన నిర్ణయాలు. ఈ కాంగ్రెస్ గత అవగాహనలను కొన్నిటిని సరిదిద్దడంతో పాటు మావో ఆలోచనా విధానానికి బదులు మావోయిజాన్ని స్వీకరించింది. మొట్టమొదటి సమావేశంలోనే ఇరు పార్టీల ప్రతినిధివర్గాలు సీరియస్‌గా ఆత్మవిమర్శ చేసుకొని బీహార్/ఝార్ఖండ్ స్థాయిలో ఐక్య కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయం తీసుకున్నాయి. రాతపూర్వకమైన ఆత్మవిమర్శలను బీహార్/ఝార్ఖండ్‌లోని మొత్తం పార్టీ శ్రేణుల వరకు బహిరంగంగా తీసుకెళ్లడం ద్వారా పరిస్థితి మరింత సానుకూలంగా మారింది.

2001 చివరి భాగంలోనూ, 2002లో సంవత్సరం పొడుగునా బీహార్-ఝార్ఖండ్‌లలో అనేక ముఖ్యమైన సంయుక్త కార్యక్రమాలు చేపట్టాయి. వీటిలో పోటాకు వ్యతిరేకంగా రెండు రాష్ట్రాల్లో అమలు చేసిన మూడు రోజుల ఆర్థిక దిగ్బంధనం కూడా ఉంది. ఈ కాలంమంతా ఇరు పార్టీల మధ్య చర్చలు కొనసాగుతూ వచ్చాయి. ఆఖరుకు, ఫిబ్రవరి 2003లో జరిగిన ముఖ్యమైన ద్వైపాక్షిక సమావేశంలో స్పష్టమైన దిశలో, ఇరు పార్టీల మధ్య విలీనం లక్ష్యంతో పంథాకు సంబంధించిన భావజాలపరమైన, రాజకీయమైన అంశాలపై చర్చలు ప్రారంభించేందుకు నిర్దిష్టమైన నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశంలో ఇరు పార్టీలూ 'చీకటి అధ్యాయం' విషయంలో విస్తృతమైన, సీరియస్ ఆత్మవిమర్శ ప్రవేశపెట్టాయి. దీన్ని కూడా బహిరంగంగానే ప్రకటించాయి. ఎంత తీవ్రమైన విభేదాలున్నప్పటికీ వర్గ స్నేహితులతో ఇక ముందెప్పుడూ ఘర్షణలకు పూనుకోమని రెండు పార్టీలూ శపథం చేశాయి. ఈ సమావేశంలోనే విలీన ప్రక్రియను ముందుకు తీసుకెళ్లడానికీ, తుదిరూపం ఇవ్వడానికీ రంగం సిద్ధమయ్యింది. ముందుగా పార్టీ భావజాలమైన మార్క్సిజం-లెనినిజం-మావోయిజం డాక్యుమెంట్


సమైక్య పార్టీ ఏర్పాటు ప్రకటన తర్వాత పీఎల్‌జీఏ సైనికుల ఊరేగింపు

తయారు చేయాలని నిర్ణయమైంది. ఇంకా పార్టీ కార్యక్రమం, వ్యూహం-ఎత్తుగడలు, అంతర్జాతీయ-దేశీయ పరిస్థితిపై రాజకీయ తీర్మానం, పార్టీ నిబంధనావళి డాక్యుమెంట్లను తయారు చేయాలని నిర్ణయం జరిగింది. ఈ ఐదు డాక్యుమెంట్లను రూపొందించే పనిని రెండు పార్టీలూ పంచుకున్నాయి.

ఆ తర్వాత, ఇరు పార్టీల కేంద్రకమిటీల నుండి ఉన్నత స్థాయి ప్రతినిధివర్గాలు నాలుగు విడతలుగా చర్చలు జరిపాయి. ఆ తర్వాత సెప్టెంబర్ 2004లో జరిగిన రెండు కేంద్రకమిటీల సంయుక్త సమావేశంలో అన్ని ప్రధాన అంశాలపైనా, అన్ని డాక్యుమెంట్లపైనా వివరమైన చర్చ జరిగిన తర్వాత తుది ఒప్పందం జరిగింది. ఈ డాక్యుమెంట్లను ఆమోదించి, వీటిని దాదాపు 10 ప్రాంతీయ భాషల్లోకి అనువదించి పార్టీ అంతటా చర్చించాలని నిర్ణయించారు. మిగిలిపోయిన కొన్ని చిన్న చిన్న విభేదాలపై మునుముందు చర్చించుకుందామనీ, అధ్యయనం చేద్దామనీ నిర్ణయం తీసుకున్నారు. చివరగా రెండు పార్టీల సంయుక్త సమావేశం విలీనం నిర్ణయాన్ని తీసుకుంది. ఫలితంగా ఒక ఐక్య కేంద్ర కమిటీ (తాత్కాలిక) ఏర్పడింది.

సీపీఐ (మావోయిస్టు) నూతన కేంద్ర కమిటీ (తాత్కాలిక) దేశంలోని వర్తమాన పరిస్థితిని విశ్లేషించి దేశంలో ప్రజాయుద్ధాన్ని పురోగమింపజేయడానికి పథకాలను రూపొందించింది. అలాగే, పార్టీలో ఐక్యం కాకుండా మిగిలిపోయిన నిజమైన మావోయిస్టులందరితోనూ ఐక్యత కోసం ప్రయత్నాలు చేపట్టాలని నిర్ణయం తీసుకుంది. సామ్రాజ్యవాదానికీ, భూస్వామ్యానికీ, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ విధానానికీ వ్యతిరేకంగా సాగే పోరాటాల్లోకి విశాల ప్రజానీకాన్ని కదిలించాలని కూడా నిర్ణయించింది. దేశంలో పెరుగుతున్న సామ్రాజ్యవాద దాడికీ, 'రాజ్య' నిర్బంధానికీ వ్యతిరేకంగా విశాల ప్రజానీకాన్ని కదిలించాలని కూడా నూతన కేంద్ర కమిటీ (తాత్కాలిక) నిర్ణయించింది. సామ్రాజ్యవాదానికీ, భూస్వామ్యానికీ వ్యతిరేకంగా సాగే అన్ని ఉద్యమాలకూ మద్దతును కూడగట్టాలని కూడా నిర్ణయించింది. భారత పాలకవర్గాలు తమ ప్రభువులైన సామ్రాజ్యవాదులతో, ముఖ్యంగా అమెరికన్ సామ్రాజ్యవాదులతో కలిసి అమలు చేస్తున్న విస్తరణవాద కుట్రలను బహిర్గతం చేస్తూ ప్రతిఘటనను కొనసాగించాలని అది నిర్ణయించింది. సీపీఎన్ (మావోయిస్టు) నాయకత్వంలో పోరాడుతున్న నేపాలీ ప్రజల పక్షాన మరింత క్రియాశీలంగా నిలబడాలనీ, భారత విస్తరణవాదులూ, అమెరికన్ సామ్రాజ్యవాదులూ తమ మిలిటరీ బలాధిక్యతతో నేపాల్‌లో జోక్యానికి పాల్పడితే వ్యతిరేకించాలనీ నిర్ణయించింది. పెరూ, ఫిలిప్పీన్స్, టర్కీ, తదితర దేశాల్లో మావోయిస్టు పార్టీల నాయకత్వంలో సాగే ప్రజాయుద్ధానికి మద్దతును కొనసాగిస్తామని కూడా అది ప్రకటించింది. సామ్రాజ్యవాదానికీ, తిరోగమనవాదానికీ వ్యతిరేకంగా ఎక్కుపెట్టిన ప్రజా పోరాటాలన్నిటికీ తమ మద్దతు కొనసాగుతుందని అది పేర్కొంది. పెట్టుబడిదారీ దేశాలలో సాగే కార్మికవర్గ ఉద్యమాలకూ, ఇతర ప్రజా ఉద్యమాలకూ అది తన మద్దతును కొనసాగిస్తుంది. ఇంకా, అమెరికా సామ్రాజ్యవాదం నాయకత్వంలో సాగుతున్న దాడికీ, దురాక్రమణకూ వ్యతిరేకంగా వీరోచితంగా పోరాడుతున్న ఇరాకీ, అఫ్ఘాన్ ప్రజలకు అండగా నిలబడతామని కూడా నూతన సమైక్య పార్టీ ప్రకటించింది. విడిపోయే హక్కు సహా స్వయంనిర్ణయాధికారం కోసం పోరాడుతున్న జాతులకు తమ మద్దతును కొనసాగిస్తామనీ, ఈ ఉద్యమాలపై కొనసాగుతున్న క్రూర రాజ్య నిర్బంధాన్ని ఖండిస్తున్నామని కూడా నూతన పార్టీ పేర్కొంది. విప్లవంలో మహిళలు ఒక బ్రహ్మాండమైన శక్తిగా నిలబడేలా వాళ్లను సమీకరించడానికీ, సంఘటితం చేయడానికీ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని నూతన పార్టీ ప్రకటించింది. అట్లాగే కుల పీడనకూ, అస్పృశ్యతకూ వ్యతిరేకంగా ప్రజలను సమీకరించాలని కూడా నిర్ణయించింది. అతి ప్రమాదకారులైన హిందూ ఫాసిస్టు శక్తులను బట్టబయలు చేసి, వేరు చేసి, ఓడిస్తామనీ, అట్లాగే ఇతర అన్ని ఛాందసవాద శక్తులను బట్టబయలు చేస్తామనీ కొత్త పార్టీ ప్రకటించింది. అదే సమయంలో, ఢిల్లీలో గద్దెనెక్కిన కొత్త కాంగ్రెస్ పాలకులకూ, సీపీఐ/సీపీఎంలకూ, వాళ్ల సామ్రాజ్యవాద యజమానులకూ వ్యతిరేకంగా ప్రజా పోరాటాలను ఎక్కుపెడతామని కూడా నూతన సమైక్య పార్టీ ప్రకటించింది.

## రెండు పార్టీల సంక్షిప్త నేపథ్యం

అది 1960ల కల్లోల సమయం. భూగోళమంతటా అల్లకల్లోలం వ్యాపించింది. వియత్నాం యుద్ధంలో అమెరికా సామ్రాజ్యవాదానికి ఒక చిన్న దేశం చేతిలో పలు ఓటములు చవి చూడాల్సి వచ్చింది. చైనాలో ఒక వినూత్న ప్రయోగంగా ముందుకొచ్చిన మహత్తర శ్రామికవర్గ సాంస్కృతిక విప్లవం నూతన కమ్యూనిస్టు మానవుని ఆదర్శాలు నెలకొల్పింది. చైనా కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలోని విప్లవ కేంద్రానికీ, ఆధునిక రివిజనిజానికి కేంద్రమైన సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీకీ మధ్య సాగిన గ్రేట్ డిబేట్ ప్రపంచంలోని మార్క్సిస్టులను రెండు శిబిరాలుగా ధ్రువీకరించింది. ఈ క్రమంలో మార్క్సిజానికీ, రివిజనిజానికీ మధ్య విభజన రేఖ మరింత స్పష్టంగా మారింది. ఈ సందర్భంలోనే ఎందరో నిజమైన, దృఢమైన కమ్యూనిస్టులూ, కామ్రేడ్స్ సీఎం, కేసీ వంటి ఎందరో విశిష్టులైన అగ్రశ్రేణి నాయకులూ రివిజనిజానికి వ్యతిరేకంగా పోరాటంలో ముందుకు దూసుకొచ్చారు. ఈ పోరాటం 1964లో జరిగిన సీపీఎం ఏడవ కాంగ్రెస్‌లో రెండు పరస్పర వ్యతిరేక పంథాలైన పార్లమెంటరీ పంథా, దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథాల మధ్య పోరాటం రూపంలో ప్రతిఫలించింది.

ఆ తర్వాత, భూగోళాన్ని కదిలించి వేసిన మహత్తర శ్రామికవర్గ సాంస్కృతిక విప్లవ ఘటనలతో భారతదేశంలో రాజకీయ వాతావరణం మరింతగా వేడెక్కింది. కామ్రేడ్ సీఎం నాయకత్వంలో సాగిన మహత్తర నక్సల్బరీ ఉద్యమం పూరించిన శంఖారావం చైనా కమ్యూనిస్టు పార్టీ అభివర్ణించినట్టుగా "వసంత మేఘ గర్జన"గా రుజువయ్యింది. అది సీపీఐ, సీపీఎం మార్కు రివిజనిస్టు నాయకత్వపు వికృత ముఖాన్ని నగ్నంగా బట్టబయలు చేసింది. "చైనా మార్గమే మన మార్గం", "మావో ఆలోచనా విధానమే మా ఆలోచనా విధానం" అన్న శక్తివంతమైన నినాదాలు దేశం నలు దిశలతో పాటు భారత ఉపఖండంలోని మిగతా ప్రాంతాల్లో కూడా మారుమోగాయి. ఆ విధంగా నక్సల్బరీ, కాలం చెల్లిన రివిజనిజంతో గుణాత్మకంగానే తెగతెంపులు చేసుకొని భారతదేశంలో మార్క్సిజం-లెనినిజం-మావో ఆలోచనా విధానపు విశ్వజనీన సత్యాన్ని దృఢంగా నెలకొల్పింది. అఖిల భారత స్థాయిలో కమ్యూనిస్టు విప్లవకారుల సమన్వయ కమిటీ ఏర్పడి ఆ తర్వాత సీపీఐ (ఎం-ఎల్) పేరుతో భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీ పునఃస్థాపన జరిగింది. అది మార్క్సిజం-లెనినిజం-మావో ఆలోచనా విధానాన్ని దృఢంగా ఎత్తిపడుతూ ఆనాటి ప్రధాన సమస్యలపై సరైన భావజాల, రాజకీయ వైఖరిని చేపట్టింది. దీర్ఘకాల ప్రజాయుద్ధ పంథాలో సాయుధ పోరాటాన్ని చేపట్టింది. భారతదేశంలోనూ,

ప్రపంచంలోనూ చాలా మంది కమ్యూనిస్టు విప్లవకారులు సీపీఐ (ఎం-ఎల్) ఏర్పాటును గుర్తించారు. ఈ వాతావరణంలో నక్సల్బరీ మైదానాల మీదుగా గర్జించిన వసంత మేఘం భారతీయ రాజకీయ చిత్రపటాన్నే మార్చి వేసి సాయుధ పోరాటాన్ని భారత విప్లవ ఎజెండా పైకి తెచ్చింది.

భారతదేశంలో చర్చలు అంతకు ముందే ప్రారంభమయ్యాయి. 1964లో సీపీఎం 7వ కాంగ్రెస్ జరగగా కామ్రేడ్ చారు మజుందార్ అధికారిక పంథాను వ్యతిరేకించి భారత విప్లవానికి ఒక నూతన పంథాను ముందుకు తెచ్చే ప్రయత్నం చేశాడు. ఆ తర్వాత, భారత విప్లవానికి ఒక కొత్త విప్లవకర భావజాల, రాజకీయ పంథాను అభివృద్ధి చేసే క్రమంలో భాగంగా రివిజనిజంపైనా, నయా రివిజనిజం పైనా దాడి చేస్తూ ఆయన తన ప్రఖ్యాతి గాంచిన ఎనిమిది డాక్యుమెంట్లు రూపొందించాడు. ఈ క్రమంలో ఆయన ముందుకు తెచ్చిన కొత్త పంథాను చారిత్రాత్మక నక్సల్బరీ రైతాంగ తిరుగుబాటులో అమలు చేశారు. దీనిని దేశంలోని విప్లవకారులందరితో పాటు విద్యార్థులు, యువజనులు, మేధావులు, ముఖ్యంగా వేలాది రైతులు స్వాగతించారు. కొద్ది కాలంలోనే నక్సల్బరీ జ్వాలలు దేశమంతటా వ్యాపించాయి. దేశంలోని అత్యధిక విప్లవకారులు వెంటనే ఒక సమన్వయ కమిటీలో – అఖిల భారత కమ్యూనిస్టు విప్లవకారుల సమన్వయ కమిటీ (ఏఐసీసీసీఆర్)లో సంఘటితమయ్యారు. 1969లో జరిగిన ఒక ర్యాలీలో విప్లవకర పార్టీయైన సీపీఐ (ఎం-ఎల్) ఏర్పడినట్టుగా ప్రకటించారు. 1970లో జరిగిన పార్టీ 8వ కాంగ్రెస్ భారత విప్లవానికి సాధారణంగా, మౌలికంగా సరైన విప్లవ పంథాను రూపొందించింది. 8వ కాంగ్రెస్‌ను దేశంలోని కమ్యూనిస్టు విప్లవకారులతో పాటు మావో సేటుంగ్ నాయకత్వంలోని చైనా కమ్యూనిస్టు పార్టీ కూడా గుర్తించింది.

అదే సమయంలో దేశ విప్లవోద్యమంలో మరో విప్లవ ప్రవంతి కూడా ముందుకొచ్చింది. కామ్రేడ్స్ కనాయ్ చటర్జీ, అమూల్య సేన్, చంద్రశేఖర్ దాస్‌లు కోల్‌కాత, హౌరా, హుగ్లీలలో ప్రజల మధ్య పని చేస్తూ సీపీఎం 7వ కాంగ్రెస్ పంథాకు వ్యతిరేకంగా తిరుగుబాటు బావుటానెత్తారు. 1965లో సీపీఎంలోనే రహస్యంగా ఏర్పాటైన "చింతా" గ్రూపు పార్టీ శ్రేణులలో విప్లవకర ప్రచారాన్ని సాగించింది. వాళ్లు 1965/66లో ఆరు పత్రికలు ప్రచురించారు. ఇవి ఈ కింది అంశాల్ని లేవనెత్తాయి – (అ) భారత రాజ్యపు వర్గ స్వభావం, (ఆ) చైనా మార్గమే మన మార్గం, (ఇ) నయా వలసవాదం, పీఎల్-480ల పాత్ర, (ఈ) 7వ కాంగ్రెస్ కార్యక్రమం, రివిజనిస్టు నాయకత్వపు స్వభావం, భారతదేశంలో రైతాంగ సమస్య వగైరా. సీపీఎం ఇంగ్లీషు, బెంగాలీ పత్రికలు "చింతా"లో ప్రచురించిన వ్యాసాలపై పెద్ద ఎత్తున దాడిని ప్రారంభించాయి. దీని ఫలితంగా పార్టీ శ్రేణులన్నిటిలో పెద్ద చర్చ మొదలైంది. 1966లో రహస్య పత్రికయైన "చింతా"ను ఆపేసి బహిరంగంగా "దక్షిణ దేశ్" అనే పత్రికను ప్రచురించసాగారు. ఆ గ్రూపును "దక్షిణ దేశ్ గ్రూపు" అని వ్యవహరించసాగారు. నక్సల్బరీ తిరుగుబాటుకు ముందుగానే 1967లో కామ్రేడ్ కనాయ్ చటర్జీ కామ్రేడ్ సీఎంతో సుదీర్ఘంగా చర్చలు జరిపాడు. ఈ సమావేశంలో వీరిరువురికీ రైతాంగ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లడంపై ఉమ్మడి అవగాహన ఉండింది. స్నేహ సంబంధాల్ని కొనసాగించాలని కూడా ఇరువురూ అభిప్రాయపడ్డారు.

అయితే సంబంధాలు అభివృద్ధి చెందలేదు. 1967 నుండి 1969 వరకు అప్పటి "దక్షిణ దేశ్" గ్రూపు కోల్‌కాత, హౌరా, హుగ్లీ, మిడ్నపూర్, బర్ద్వాన్, బీర్భూం, 24 పరగణాల ప్రాంతాలలో ఉద్యమాన్ని నిర్మించింది. అస్సాం, త్రిపురలలో కూడా కొంత పని సాగించింది. వీళ్లు 60వ దశాబ్దం మలి భాగంలో మొదట సోనార్‌పూర్‌లోనూ, ఆ తర్వాత బర్ద్వాన్ జిల్లాలో కంక్సాలోనూ రైతాంగ ఉద్యమాన్ని నిర్మించారు. ఆ తర్వాత బీహార్‌లో సంబంధాలు ఏర్పాటు చేసుకొని అక్కడ పని ప్రారంభించారు. అక్టోబర్ 1969లో ఎంసీసీ ఏర్పడింది. 1969లో ప్రచురించిన "లాల్ పతాక" మొట్టమొదటి సంచికలోనే కామ్రేడ్ కనాయ్ చటర్జీ తమ కేంద్రానికి మౌలిక పంథాను ప్రవేశపెట్టాడు. అందులో చర్చించిన అంశాలివి – (అ) ప్రస్తుత యుగంలో మావోయిజం (అప్పుడు 'ఆలోచనా విధానం' అని వ్యవహరించారు) ప్రాముఖ్యత, (ఆ) ప్రస్తుత పరిస్థితిలో ఎత్తుగడల పంథా, ఎత్తుగడల నినాదాలు, (ఇ) ఎన్నికలలో పాల్గొనడంపై సరైన విధానం, ఎన్నికల బహిష్కరణ ఎత్తుగడలకు సంబంధించిన విషయమే అయినప్పటికీ భారతదేశ నిర్దిష్ట పరిస్థితుల్లో దీనికి వ్యూహాత్మక ప్రాముఖ్యత ఉందంటూ చేసిన సరైన విశ్లేషణ, (ఈ) సాయుధ వ్యవసాయ విప్లవ యుద్ధానికి సంబంధించి దీర్ఘకాలిక ప్రజాయుద్ధం, సైన్య నిర్మాణం, స్థావర ప్రాంతాల నిర్మాణాలతో కూడిన సరైన పంథా, (ఉ) పోరాట రూపాల (బహిరంగ, రహస్య, చట్టబద్ధ, చట్ట వ్యతిరేక, శాంతియుత, సాయుధ) గురించిన సరైన దిశానిర్దేశనం, (ఊ) కార్యక్రమం, ఎత్తుగడలు, రైతాంగ పోరాట పద్ధతులు, (ఎ) ఐక్య సంఘటన పట్ల వైఖరి, పద్ధతి, (ఏ) రాజకీయ ప్రచారం, (ఐ) భారతదేశంలో మహిళా సమస్య, విద్యార్థి ఉద్యమం, జాతుల సమస్యలపై, (ఒ) నాయకత్వ పద్ధతులు.

సీపీఐ (ఎం-ఎల్), ఎంసీసీలకు చెందిన ఈ రెండు ధోరణులు భారత మావోయిస్టు ఉద్యమంలో రెండు ప్రధాన ప్రవంతులుగా అభివృద్ధి చెందాయి. గత మూడున్నర దశాబ్దాల కాలంలో సీపీఐ (ఎం-ఎల్), సీపీఐ (ఎం-ఎల్) [పీపుల్స్‌వార్]గానూ, ఎంసీసీ, ఎంసీసీఐగానూ మార్పు చెందాయి. మొదటి పార్టీ ప్రధానంగా దక్షిణాన, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లోనూ, ఉత్తరాన కొన్ని పాకెట్లలోనూ పని చేస్తూ ఉండగా, రెండో పార్టీ ప్రధానంగా బీహార్-ఝార్ఖండ్‌లోనూ, పొరుగు ప్రాంతాల్లోనూ, ఉత్తర, దక్షిణాల్లోని మరి కొన్ని పాకెట్లలోనూ పని చేస్తూ ఉండింది. ఇప్పుడు ఈ రెండు ప్రవంతులు సీపీఐ (మావోయిస్టు)గా సమైక్యం కావడంతో భారత విప్లవంలో ప్రధానమైన శక్తులు చివరికి దేశంలో ప్రజాయుద్ధానికి నాయకత్వం వహించగల ఒక సమైక్య కేంద్రాన్ని ఏర్పాటు చేయడంలో సఫలమయ్యాయి.

## డాక్యుమెంట్ల ఆమోదం : ఐక్యతకు రాజకీయ, భావజాల ప్రాతిపదిక

ఆమోదించిన ఐదు డాక్యుమెంట్లతో పాటు మునుపటి రెండు పార్టీలూ ఒక క్రమబద్ధమైన ఆత్మవిమర్శనా సమీక్షను ప్రవేశపెట్టాయి. దాంట్లో రెండు పార్టీలూ తమ గత పీఓఆర్ (రాజకీయ నిర్మాణ సమీక్ష)లలోని లోపాలను తమ చరిత్రలో వివిధ దశల నేపథ్యంలో లోతుగా విశ్లేషించాయి. ఆత్మవిమర్శలు వాడిగా, నిజాయితీగా ఉండి తప్పులను సరిదిద్దుకొని పార్టీని బోల్షివీకరించడానికీ, కార్మికవర్గేతర పెడధోరణులను వదిలించుకోవడానికీ ప్రాతిపదికను ఏర్పర్చాయి. ఈ క్రమం నూతన సమైక్య పార్టీ రాజకీయ పంథాను అభివృద్ధి చేయడానికి ఉపయోగపడింది. ఈ పీఓఆర్‌లూ, వాటితో పాటు "చీకటి అధ్యాయాని"కి సంబంధించిన లోతైన ఆత్మవిమర్శలూ ఈ

రెండు పార్టీల మధ్య ఐక్యతను మరింత పటిష్టం చేయడానికి ఉపయోగపడ్డాయి.

తర్వాత, ఏకీకరణకు ప్రాతిపదికగా ఉన్న ఐదు మౌలిక డాక్యుమెంట్లకు తుదిరూపం ఇవ్వడానికి రెండు కేంద్రకమిటీలూ విస్తృతమైన చర్చలు కొనసాగించాయి. ఈ డాక్యుమెంట్ల ప్రధాన అంతస్సారాన్ని సంక్షిప్తంగా ఇప్పుడు చూద్దాం :

**మా-లె-మా డాక్యుమెంటు :** "మార్క్సిజం-లెనినిజం-మావోయిజపు అరుణ పతాకాన్ని సమున్నతంగా ఎత్తిపడుదాం" అనే పేరుతో రూపొందిన ఈ డాక్యుమెంటులో కామ్రేడ్ మావో ఏ విధంగా మార్క్సిజం-లెనినిజాన్ని తత్వశాస్త్రం, రాజకీయ అర్థశాస్త్రం, సైన్య శాస్త్రం, శాస్త్రీయ సోషలిజం వంటి అన్ని రంగాల్లో గుణాత్మకంగా ఒక నూతన, మూడో ఉన్నత దశకు తీసుకెళ్లాడో వివరిస్తుంది. వైరుధ్య సూత్రపు అవగాహనలో ఆయన ఒక గెంతును సాధించాడు. వైరుధ్య సూత్రమే ప్రకృతినీ, సమాజాన్నీ, మానవ ఆలోచననూ నిర్దేశించే మౌలిక చలన సూత్రమని మావో చూపించాడు. ఆయన జ్ఞానసిద్ధాంతాన్ని గొప్పగా అభివృద్ధి పరుస్తూ, పదార్థానికీ చైతన్యానికీ ఉండే సంబంధాన్ని సిద్ధాంతానికీ ఆచరణకూ చాలా నైపుణ్యంతో అన్వయించాడు. చైనా విప్లవానికి ముందు, సోవియట్ విప్లవ నమూనాగా పేరు గాంచిన సార్వత్రిక సాయుధ తిరుగుబాటు పంథానే అధికారాన్ని చేజిక్కించుకునే సాధారణ పంథాగా భావించే వాళ్లు. దీర్ఘకాలిక ప్రజాయుద్ధమనే కొత్త పంథాను ముందుకు తేవడం ద్వారా మావో ఈ సమస్యను పరిష్కరించాడు. అర్ధ వలస, అర్ధ భూస్వామ్య దేశాలు ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్న రెండు వేరు వేరు దశల గుండా ప్రయాణించాల్సి ఉంటుందని మావో చెప్పాడు. మొదటి దశయైన నూతన ప్రజాస్వామిక విప్లవ దశ, కమ్యూనిజం అంతిమ లక్ష్యంతో సోషలిస్టు దశలోకి అంతరాయం లేకుండానే ప్రవేశిస్తుంది. అన్నిటికన్నా ముఖ్యంగా మావో చారిత్రాత్మకమైన, భూమండలాన్ని కుదిపివేసిన మహత్తర శ్రామికవర్గ సాంస్కృతిక విప్లవానికి నాయకత్వం వహించాడు. సోషలిస్టు సమాజంలో ఉద్భవించిన పెట్టుబడిదారీ మార్గీయులకు వ్యతిరేకంగా ఎక్కుపెట్టిన ఈ విప్లవం ఉత్పత్తి శక్తుల అభివృద్ధికీ, ఉత్పత్తి సంబంధాలకూ మధ్య తలెత్తే వైరుధ్యాన్ని గతితార్కికంగా పరిష్కరించే ప్రయత్నం చేసింది. మహత్తర శ్రామికవర్గ సాంస్కృతిక విప్లవం, కార్మికవర్గ నాయకత్వంలో విప్లవాన్ని కొనసాగించడం... ఇవి రెండూ పెట్టుబడిదారీ పునరుద్ధరణను నిరోధించడానికి మార్క్సిజం-లెనినిజం-మావోయిజం శస్త్రాగారంలో సంపూర్ణంగా ఒక కొత్త చేర్పు.

మార్క్సిజం ప్రకృతి, సమాజం, మానవ ఆలోచనల చలన సూత్రాల శాస్త్రంగా ముందుకొచ్చింది. తన స్వంత భవితవ్యంతో పాటు సమాజపు భవితవ్యానికీ రూపు దిద్దగల సామర్థ్యం గల విప్లవకర వర్గంగా కార్మికవర్గం చారిత్రక రంగస్థలంపై ప్రవేశించిన సమయంలో ముందుకొచ్చిన విప్లవ శాస్త్రం మార్క్సిజం. కార్మికవర్గ భావజాలమైన మార్క్సిజం మరింత సంశ్లేషణ చెందుతూ నూతన ఉన్నత దశలకు అభివృద్ధి చెందుతూ వచ్చింది. మార్క్సిజం నుండి అది మార్క్సిజం-లెనినిజంగా అభివృద్ధి చెందింది. ఆ తర్వాత, అది మరింతగా అభివృద్ధి చెంది మార్క్సిజం-లెనినిజం-మావోయిజంగా మార్పు చెందింది. అది జ్ఞానానికి చెందిన ఏదో ఒక నిర్దిష్ట రంగానికో సంబంధించిన శాస్త్రం కాదు. అది విప్లవం ద్వారా ప్రపంచాన్ని సమగ్రంగా రూపాంతరం చెందించడానికి అవసరమైన ఒక సమగ్ర తాత్విక వ్యవస్థకూ, రాజకీయ అర్థశాస్త్రానికీ, శాస్త్రీయ సోషలిజానికీ, కార్మికవర్గ వ్యూహం-ఎత్తుగడలకూ ప్రాతినిధ్యం వహించే శాస్త్రం.

**కార్యక్రమం :** 1947 బూటకపు స్వాతంత్ర్యం తర్వాత బ్రిటిష్ సామ్రాజ్యవాదుల ప్రత్యక్ష వలస, అర్ధ భూస్వామ్య వ్యవస్థ స్థానంలో పరోక్ష సామ్రాజ్యవాద పాలన, దోపిడీ, నియంత్రణ రూపాల్లోని అర్ధ వలస, అర్ధ భూస్వామ్య వ్యవస్థ ప్రవేశించిందని సీపీఐ (మావోయిస్టు) తన కార్యక్రమంలో నిక్కచ్చిగా పేర్కొంది. ఆ తర్వాతి సంవత్సరాల్లో దళారీ నిరంకుశ బడా పెట్టుబడిదారీ, బడా భూస్వామ్య పాలక వర్గాలు సామ్రాజ్యవాదానికి నమ్మకంగా సేవ చేయసాగాయి.

ప్రత్యక్ష వలస పాలన ముగిసిన తర్వాత, సామ్రాజ్యవాదం తన అధీనంలోని జాతులపైనా, దేశాలపైనా పరోక్ష పాలన, దోపిడీ, నియంత్రణ అనే కొత్త కొత్త రూపాల్ని చేపట్టింది. దీన్నే నయా వలసవాదమని అంటారు. వలసవాదానికి మరింత మోసపూరిత, మరింత కుటిల రూపం ఇది. ఈ సందర్భంగా, మన జీవితంలోని ప్రతి రంగంలోనూ — ఆర్థిక, రాజకీయ, సైన్య, సాంస్కృతిక — సామ్రాజ్యవాద ద్రవ్య పెట్టుబడి పెత్తనం, అదుపూ మరింతగా పెరిగిపోతున్నాయి. వాస్తవానికి, నేడు సామ్రాజ్యవాదులు భారత ఆర్థికవ్యవస్థలోని కీలక రంగాలను, చివరకు పరిపాలనను కూడా నియంత్రిస్తున్నారు.

నేటికీ మన దేశం మౌలికంగా రైతాంగ ప్రజల దేశమే. ఇక్కడ మూడింట రెండొంతుల జనాభా గ్రామీణ ప్రాంతంలోనే నివసిస్తోంది. రైతాంగంలోని అత్యధిక భాగం అత్యంత దోపిడీపీడనలకు గురవుతూ ఉంది. వాళ్లు చాలా దయనీయమైన పరిస్థితుల్లో, అత్యంత పేదరికంలో బతుకులీడుస్తున్నారు. చెల్లాచెదురుగా ఉండే మడిచెక్కలలో వెనుకబడిన వ్యవసాయం, కొన్ని ప్రాంతాలలో ఇప్పటికీ ఆదిమ పద్ధతులపై ఆధారపడుతూ ఉండడం, ప్రకృతిపరమైన మార్పులు... వీటన్నిటితో అత్యధిక రైతాంగం, మధ్య తరగతి రైతుల్లో గణనీయమైన భాగం దుర్భర దారిద్ర్యంలో కొట్టుమిట్టాడుతున్నారు. గ్రామీణ ప్రాంతంపై భూస్వాముల, వడ్డీ వ్యాపారుల, వ్యాపారుల, మతపరమైన సంస్థల పెత్తనం సాగుతోంది. ఈ దోపిడీ సెక్షన్లే దేశంలో అర్ధ భూస్వామ్య ఉత్పత్తి సంబంధాలకు ముఖ్యమైన పునాదిగా ఉన్నాయి.

సామ్రాజ్యవాద ద్రవ్య పెట్టుబడి చొరబాటు రోజురోజుకూ పెరుగుతుండడంతో దాని పట్టు మరింతగా బిగుసుకుంటున్నది. ఇది కూడా కొన్ని పెట్టుబడిదారీ ఉత్పత్తి సంబంధాలను ప్రవేశపెట్టింది. అయితే ఈ పెట్టుబడిదారీ విధానం చాలా వరకు అపసవ్యమైందీ, అస్పష్టమైందీ.

దక్షిణాసియా మొత్తంలో భారతదేశ ఆధిపత్య స్థానాన్ని గుర్తిస్తూ సామ్రాజ్యవాదులు భారత దళారీ పాలకవర్గాల విస్తరణవాద కాంక్షలను ఎల్లప్పుడూ సమర్థిస్తూ, ప్రోత్సహిస్తూ, ఉత్తేజపరుస్తూ వస్తున్నారు. ఈ విధంగా వాళ్లు ఈ విశాలమైన లాభాల మార్కెట్‌పై తమ అదుపును ఎదురు లేకుండా కొనసాగిస్తున్నారు.

సామ్రాజ్యవాదులకు దాసోహమైన భారత దళారీ నిరంకుశ బూర్జువా వర్గపు ఈ విస్తరణవాద కాంక్షల వల్లా, జోక్యందారీ, విద్రోహకర చర్యల వల్లా భారత విస్తరణవాదం దక్షిణాసియా దేశాలన్నిటి భద్రతకూ, సమగ్రతకూ పెను ప్రమాదంగా ముందుకొచ్చింది. నేపాల్ అంతర్గత వ్యవహారాల్లో భారత పాలకవర్గాల జోక్యం పెరుగుతున్నది. ప్రజా ఉద్యమాలను అణచివెయ్యడానికి అక్కడికి తమ సైన్యాలను పంపడానికి అవి తమ సంసిద్ధతను ప్రకటిస్తున్నాయి.

భారతదేశంపై సామ్రాజ్యవాద దోపిడీకీ, నియంత్రణకూ భారత


నూతన పార్టీ ఆవిర్భావ సభలో పీఎల్‌జీఏ సైనికులు

దళారీ నిరంకుశ బూర్జువా వర్గం ఒక ప్రముఖ వాహనంగా పని చేస్తున్నది. అది తన ఉనికి కోసం, అభివృద్ధి కోసం సామ్రాజ్యవాదంతో పూర్తిగా పెనవేసుకొని ఆధారపడి ఉన్నది. అన్ని రంగాల్లోనూ దాని ప్రయోజనాలు సామ్రాజ్యవాదుల ప్రయోజనాలతో దగ్గరగా అల్లుకొని ఉన్నాయి. అది సామ్రాజ్యవాదంతో పెనవేసుకుపోయి భూస్వామ్యంతో కుమ్మక్కయ్యింది. పూర్తిగా తిరోగమనవాదీ, ప్రజా వ్యతిరేకీ, జాతి వ్యతిరేకీ అయిన ఈ దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ వర్గం (లేదా బడా బూర్జువా లేదా ప్రభుత్వ గుత్త పెట్టుబడి) విశాల ప్రజా రాశులను – కార్మికులనూ, రైతులనూ, పెటీ బూర్జువానూ – నిర్దాక్షిణ్యమైన దోపిడీపీడనలకు గురి చేస్తున్నది. భారత ఆర్థికవ్యవస్థ స్వతంత్రంగా అభివృద్ధి చెందడానికి ఇదొక అడ్డంకిగా ఉంది.

సామ్రాజ్యవాదం ముందు మోకరిల్లిన భారత పాలకవర్గాలు దేశ "సమైక్యత", "సమగ్రత" అనే మోసపు నినాదాల చాటున దేశాన్ని జాతుల బంధీఖానాగా మార్చారు. ఈ నేపథ్యంలోనే నేడు దేశంలోని వివిధ భాగాల్లో జాతులు సాయుధ పోరాటం సహా పలు రూపాల్లో పోరాడుతూ మునుముందుకు సాగుతున్నాయి. పార్టీ కార్యక్రమం ఈ జాతీయ విముక్తి పోరాటాలను దృఢంగా సమర్థిస్తుంది. భారత పాలకవర్గాలు తమ మిలిటరీ బలాధిక్యతతో ఈ ఉద్యమాలను అణచడానికి చేస్తున్న దుష్ట ప్రయత్నాలను కచ్చితంగా వ్యతిరేకించాలని కార్యక్రమం పేర్కొంది. ఎట్టి పరిస్థితిలోనైనా జాతుల స్వయం నిర్ణయాధికార హక్కు సహా, విడిపోయే హక్కును కూడా బలంగా ఎత్తిపట్టాలని అది ప్రకటిస్తుంది.

కుత్సితమైన కుల వ్యవస్థ, కులవాదం, ప్రత్యేకించి బ్రాహ్మణవాద కులవాదం భారతదేశ అర్ధ భూస్వామ్య వ్యవస్థ ప్రత్యేక లక్షణమని కార్యక్రమం పేర్కొంది. కులవాదం మనుషుల ఆత్మగౌరవాన్ని అణచివేస్తుంది. అది వాళ్లను తక్కువవాళ్లుగా చూస్తుంది. ఇది సృష్టించిన నిచ్చెనమెట్ల వంటి సామాజిక అంతస్తుల వ్యవస్థలో ప్రతి తంతెలోని వాళ్లు తమకంటే కింది వాళ్లను హీనంగా చూస్తారు. ఈ విధంగా ఇది ప్రజలను చీల్చేందుకు అడ్డుగోడల్ని సృష్టించి పీడిత ప్రజల ఐక్యతకు అడ్డంకుల్ని కల్పిస్తుంది. దళితులకూ, ఇతర వెనుకబడిన కులాల వాళ్లకూ సమాన అధికారాల కోసం, రిజర్వేషన్ల కోసం, ఇంకా ఇతర ప్రత్యేక సదుపాయాల కోసం పార్టీ పోరాడుతుంది. అదే సమయంలో అది ఈ సమస్యలపై పాలకవర్గ పార్టీలూ, రాజ్యం అనుసరిస్తున్న విధానాల డొల్లతనాన్ని ఎండగడుతుంది. అట్లాగే దళిత సమస్యలను చేపట్టే పేరుతో తమ స్వంత ఎన్నికల ప్రయోజనాల్ని పొందాలని చూసే అవకాశవాద దళిత నాయకుల్ని పార్టీ ఎండగడ్తుంది. ఇందుకోసం పార్టీ ప్రత్యేకంగా కుల ఆధారిత సంఘాల్ని ఏర్పాటు చేయకుండా, స్వంతంగా స్వతంత్రమైన కార్యక్రమంతో ప్రజా సంఘాల్నీ, వర్గ సంఘాల్నీ నిర్మించి ఈ సమస్యలపై పోరాటాలు నిర్వహిస్తుంది.

దేశ జనాభాలో సగంగా ఉండే మహిళలు పురుషాధిపత్యానికీ, పితృస్వామ్య సంస్థలైన కుటుంబం, కుల వ్యవస్థ, ఆస్తి సంబంధాలు, సంస్కృతులతో పాటు సామ్రాజ్యవాద, భూస్వామ్య దోపిడీపీడనలకూ బలవుతున్నారు. ఇటీవలి సంవత్సరాల్లో, ప్రత్యేకించి సామ్రాజ్యవాద ప్రపంచీకరణ, సరళీకరణ, వినిమయవాదాల మూలంగా మహిళలపై లైంగిక వేధింపులూ, అత్యాచారాలూ పెరిగిపోయాయి. 'ఆకాశంలో సగం మహిళలు.' మహిళల్లో గూడు కట్టుకొని ఉన్న కోపాన్ని బైటికి తెచ్చి వాళ్లను విప్లవంలో ఒక బ్రహ్మాండమైన శక్తిగా మలచకుండా విప్లవంలో విజయం అసాధ్యం. కాబట్టి సామ్రాజ్యవాదానికీ, భూస్వామ్యానికీ వ్యతిరేకంగా ప్రజాయుద్ధాన్ని పురోగమింపజేయడానికి మహిళల్ని కూడగట్టడం తప్పనిసరని కార్యక్రమం పేర్కొంది. వర్గ పోరాటంతో పాటుగా, మహిళలకు రాజకీయ, ఆర్థిక, భావజాల, సాంస్కృతిక రంగాల్లో సమాన హక్కుల కోసం పోరాటాన్ని నిర్వహించాల్సిన అవసరం ఉందని కూడా కార్యక్రమం పేర్కొంది.

భారత జనాభాలో మైనారిటీ మతస్తులు 15 శాతం ఉంటారు. పాలకవర్గాలు తమ రాజ్య యంత్రాన్ని ఉపయోగిస్తూ హిందూ మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ అమలు చేస్తున్న వివక్షకూ, వేధింపులకూ, క్రూరమైన నిర్బంధానికి వీళ్లంతా బలవుతున్నారు. పెరుగుతున్న హిందూ ఫాసిస్టు శక్తుల ప్రమాదాన్ని పార్టీ భావజాలపరంగా, రాజకీయంగా ఎదిరిస్తుంది, ఎండగడుతుంది, పోరాడి ఓడిస్తుంది. స్థానిక స్థాయిలో ఈ శక్తులతో పోరాడడం కోసం తగిన రూపాల్ని చేపడుతుంది. అదే సమయంలో పార్టీ ఇతర మతాల మత ఛాందసవాదాన్ని కూడా ఎండగడుతూ ఉంటుంది.

**వ్యూహం-ఎత్తుగడలు :** భారత విప్లవ వ్యూహం-ఎత్తుగడలు అనే డాక్యుమెంటులో భారత సమాజ నిర్దిష్ట వర్గ విశ్లేషణపై ఆధారపడి భారత సమాజ స్వభావాన్ని అర్ధ వలస, అర్ధ భూస్వామ్య సమాజంగా పేర్కొంది. దీని నుండే భారత విప్లవం రెండు దశల గుండా

సాగుతుందని నిర్ధారణ అవుతున్నది. మొదటి దశలో అర్ధ వలస, అర్ధ భూస్వామ్య సమాజాన్ని ఒక స్వతంత్రమైన నూతన ప్రజాస్వామిక సమాజంగా మార్చడం కర్తవ్యంగా ఉంటుంది.

భారత విప్లవపు కూల్చాల్సిన లక్ష్యాలు సామ్రాజ్యవాదం, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ విధానం, బడా భూస్వామ్య వర్గం. భారత ప్రజల మూపులపై ఈ మూడు పర్వతాల పెను భారం ఉంది. సామ్రాజ్యవాదం, భూస్వామ్యం, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ విధానం భారత విప్లవానికి శత్రువులు. కార్మికులూ, రైతులూ, పెటీ బూర్జువాలూ భారత విప్లవానికి చోదకశక్తులు కాగా జాతీయ బూర్జువా వర్గం ఊగిసలాడే మిత్రునిగా ఉంటుంది.

కాబట్టి, భారత కార్మికవర్గపు రాజకీయ ప్రతినిధీ, దాని అగ్రగామి దళమూ అయిన కమ్యూనిస్టు పార్టీ ముందున్న తక్షణ, మౌలిక కార్యక్రమం ఏమిటంటే బడా భూస్వామ్య, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ వర్గాల అర్ధ వలస, అర్ధ భూస్వామ్య పాలననూ, వాటికి అండగా నిలుస్తున్న సామ్రాజ్యవాదాన్నీ సాయుధ పోరాటం ద్వారా కూల్చివేసి కార్మికవర్గ నాయకత్వంలో ప్రజల ప్రజాస్వామిక రాజ్యాన్ని స్థాపించాలి. తిరోగమనవాద నిరంకుశ రాజ్యం స్థానంలో నూతన ప్రజాస్వామిక రాజ్యాన్ని నెలకొల్పాలి.

ప్రస్తుత విప్లవ దశ నూతన ప్రజాస్వామిక విప్లవ దశ. దీన్ని దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథాలో పరిపూర్తి చేయాలి. ప్రజాయుద్ధాన్ని కొనసాగిస్తూ ముందుకు తీసుకుపోవడానికి విప్లవపు ప్రస్తుత దశలో మౌలిక, ప్రధాన, తక్షణ కర్తవ్యం ఏంటంటే గ్రామీణ ప్రాంతాలలో, ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల్లో (గెరిల్లా యుద్ధాన్నీ, ప్రజా సైన్యాన్నీ, స్థావర ప్రాంతాలనూ నిర్మించడానికి బాగా అనుకూలంగా ఉండేవి) ఒక పథకం ప్రకారం ప్రజలను జాగృతం చేసి వ్యవసాయ విప్లవ గెరిల్లాయుద్ధంలో సంఘటితం చేయాలి. ప్రజాసైన్యాన్ని నిర్మించి గెరిల్లా యుద్ధతంత్రం ద్వారా గ్రామీణ ఎర్ర స్థావర ప్రాంతాలను నిర్మించాలి. ఈ క్రమంలో ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం (పీఎల్‌జీఏ) పురోగమించి, అభివృద్ధి చెంది పూర్తి స్థాయి ప్రజా విముక్తి సైన్యం (పీఎల్‌ఏ)గా మారుతుంది, గెరిల్లాజోన్లు స్థావర ప్రాంతాలుగా రూపాంతరం చెందుతాయి.

భారతదేశంలో పార్లమెంటరీ వ్యవస్థను బ్రిటిష్ సామ్రాజ్యవాదం పై నుండి రుద్దింది. అంతకన్నా ముఖ్యంగా, ఇక్కడ బూర్జువా ప్రజాస్వామిక విప్లవం కూడా జరగలేదు. కాబట్టి బూర్జువా ప్రజాస్వామ్యం ఇక్కడ ఉనికిలోకే రాలేదు. నిజానికి, పార్లమెంటరీ సంస్థల ద్వారా ప్రజల మౌలిక సమస్యలకు ఎలాంటి ఆచరణీయ పరిష్కారాన్నీ ఆశించలేం. అంతే కాకుండా, గత 55 ఏళ్ల అనుభవం రూఢి చేసిన వాస్తవం ఏంటంటే ఎన్నికలను ఎత్తుగడల విషయంగా గుర్తిస్తూ వాటిని ఉపయోగించుకునే పేరుతో వాటిలో పాల్గొన ప్రయత్నించిన వాళ్లలో చాలా మంది కాలక్రమంలో పార్లమెంటరీ వ్యవస్థ, రివిజనిజాల రొంపిలో దిగబడిపోయారు. వాస్తవానికి, ఎత్తుగడలను ఉపయోగించుకునే పేరిట ఎన్నికల్లో పాల్గొనడమంటే సాయుధ పోరాటాన్ని నిర్మించి ముందుకు తీసుకుపోయే కర్తవ్యాన్ని వదులుకోవడమే.

పార్టీ, సైన్యం, ఐక్య సంఘటనలను వ్యూహం-ఎత్తుగడలు డాక్యుమెంటు విప్లవానికి కావల్సిన మూడు మంత్రదండాలుగా పేర్కొంది. ఈ మూడు అంశాలనూ, ఈ మూడింటి పరస్పర సంబంధాలనూ సరిగ్గా అర్థం చేసుకోవడం ద్వారానే భారత విప్లవాన్ని మొత్తంగా సరైన దిశలో నడిపించగల్గుతాం. కాబట్టి ప్రారంభం నుండీ ఈ మూడు ఆయుధాల్నీ నిర్మించాల్సిన ప్రాముఖ్యతను అర్థం చేసుకోవడం తప్పనిసరి అని వ్యూహం-ఎత్తుగడలు డాక్యుమెంటు వివరిస్తుంది. అట్లాగే ఈ మూడు ఆయుధాల్నీ మార్క్సిజం-లెనినిజం-మావోయిజం బోధనలపై ఆధారపడి భారత విప్లవపు నిర్దిష్ట ఆచరణకు అన్వయించడంలో నైపుణ్యం సాధించాలని కూడా ఇది చెబుతుంది.

ఈ నూతన ప్రజాస్వామిక రాజ్యం ప్రజల ప్రజాస్వామిక నియంతృత్వంగా ఉంటుంది. దీన్ని కార్మికవర్గ నాయకత్వాన కార్మిక-కర్షక ఐక్యతా పునాదిపై కార్మిక, కర్షక, పెటీ బూర్జువా, జాతీయ బూర్జువాల ఐక్య సంఘటన అమలు పరుస్తుంది. ఈ రాజ్యం అత్యధిక ప్రజానీకానికి నిజమైన ప్రజాస్వామ్యాన్ని గ్యారంటీ చేస్తుంది. అట్లాగే ఇది అల్ప సంఖ్యాకులుగా ఉండే దోపిడీదార్లపై నియంతృత్వాన్ని అమలు చేస్తుంది. ముందుగా సోషలిజం, ఆ తర్వాత ప్రపంచవ్యాప్తంగా కమ్యూనిజం వైపు పురోగమించడమే పార్టీ అంతిమ కార్యక్రమం.

**రాజకీయ తీర్మానం :** ఈ డాక్యుమెంటు అంతర్జాతీయ, దేశీయ పరిస్థితిని వివరిస్తుంది.

అంతర్జాతీయంగా నేటి ప్రపంచం మహా అస్థిరత, కల్లోలం, అస్తవ్యస్తతలతో కూడుకొని ఉంది. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఇటువంటి స్థితి అరుదుగానే కనపడింది. అంతులేకుండా తీవ్రతరమవుతున్న సంక్షోభం మూలంగా ప్రపంచంలోని ప్రముఖ వైరుధ్యాలన్నిటితో పాటు సామ్రాజ్యవాదంతో పీడిత ప్రజలకూ జాతులకూ ఉన్న ప్రధాన వైరుధ్యం పదునెక్కుతున్నది. ప్రపంచంలో అతి పెద్ద ఉగ్రవాదీ, ప్రపంచ ప్రజల మొట్టమొదటి శత్రువూ అయిన అమెరికా సామ్రాజ్యవాదం 9/11 ఘటనల తర్వాత ఉగ్రవాదంపై పోరు పేరుతో దురాక్రమణ యుద్ధాల పరంపరను కొనసాగిస్తూ ప్రపంచవ్యాప్తంగా ప్రజలపై దాడులు చేస్తున్నది. ఇది ప్రజలను వివిధ రూపాల్లో నిరసన పోరాటాలకు పురికొల్పింది. ఇరాక్, అఫ్గాన్ ప్రజలు అమెరికా నాయకత్వాన సాగుతున్న సామ్రాజ్యవాద దురాక్రమణకు వ్యతిరేకంగా వీరోచితంగా పోరాడుతున్నారు. దాదాపు స్తంభించిపోయిన ప్రపంచ మార్కెట్ కోసం, ముడి పదార్థాల వనరులపైనా, వ్యూహాత్మక ప్రాంతాలపైనా నియంత్రణ కోసం సామ్రాజ్యవాద శక్తుల నడుమ సాగుతున్న కుక్కల కొట్లాట వాళ్లలో వాళ్లకు గల వైరుధ్యాన్ని మరింతగా పదునెక్కించింది. ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికాలోని విశాల ప్రాంతాలు ప్రపంచ విప్లవానికి తుఫాను కేంద్రాలుగా కొనసాగుతున్నాయి. ఇరాక్, అఫ్గానిస్తాన్‌లలో అమెరికా దురాక్రమణకు వ్యతిరేకంగా గెరిల్లాయుద్ధం తీవ్రమవుతున్నది. భారతదేశం, నేపాల్, ఫిలిప్పీన్స్, పెరూ, టర్కీలలో మావోయిస్టు పార్టీల నాయకత్వంలో ప్రజాయుద్ధాలు పురోగమిస్తున్నాయి. సామ్రాజ్యవాద దేశాలలో ప్రపంచీకరణ విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు సమరశీలంగా పోరాడుతున్నారు. అనేక పెట్టుబడిదారీ దేశాల్లో మార్క్సిజం-లెనినిజం-మావోయిజంపై ఆధారపడిన నిజమైన విప్లవకర పార్టీలు అభివృద్ధి చెందుతున్నాయి.

ప్రపంచ సోషలిస్టు విప్లవంలో రెండు స్రవంతులుగా... పెట్టుబడిదారీ దేశాల్లో కార్మికవర్గ విప్లవాలనూ, పీడిత దేశాల్లో నూతన ప్రజాస్వామిక విప్లవాలనూ పురోగమింపజేయడానికి భౌతిక పరిస్థితి బ్రహ్మాండంగా ఉందని రాజకీయ తీర్మానం వివరిస్తుంది. అయితే ఈ కర్తవ్యాన్ని విజయవంతంగా నెరవేర్చడానికి గాను స్వీయాత్మక శక్తుల బలం,

మావోయిస్టు పార్టీల సంఘటిత బలం తగినంత గట్టిగా లేదు. ఈ బలహీనత మూలంగా, ప్రపంచవ్యాప్తంగా, పోరాడే ప్రజల్లో విశాల భాగం ఛాందసవాద, రివిజనిస్టు, సోషల్ డెమోక్రట్, ఎన్జీఓ ప్రభావంలో/ నేతృత్వంలో ఉంది. కార్మికులనూ, రైతులనూ, తదితర పీడిత ప్రజానీకాన్నీ వీళ్ల ప్రభావం లోంచి బైటికి తెచ్చి తమ నాయకత్వంలో సంఘటితం చేయడం మావోయిస్టు పార్టీల తక్షణ కర్తవ్యాల్లో ఒకటి. అట్లాగే నిజమైన మావోయిస్టు శక్తుల సమైక్యత కూడా ఒక తక్షణ కర్తవ్యంగా ఉంటుంది.

దేశ పరిస్థితిని గమనిస్తే ప్రపంచ వ్యాప్తంగా సాగుతున్న సామ్రాజ్యవాద దాడి భారతదేశంలో కూడా స్పష్టంగా ప్రతిఫలిస్తుంది. నేడు, ప్రత్యేకించి 1990 తర్వాత, ఎల్‌పిజీ (సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ) బ్యానర్ కింద ఫైనాన్స్ పెట్టుబడి ప్రారంభించిన పెద్ద దాడి నేపథ్యంలో, పాలకవర్గాలు మరింత సిగ్గు విడిచి సామ్రాజ్యవాదుల ఆదేశాలకు పూర్తిగా తలొగ్గి నడచుకుంటున్నాయి. పీవీ నర్సింహారావు-మన్మోహన్ సింగ్ ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన ఈ ప్రక్రియ ఢిల్లీలో బీజేపీ నాయకత్వంలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మరింత ఊపందుకుంది. ప్రత్యేకించి అమెరికా సామ్రాజ్యవాదులు భారత రాజకీయ వ్యవహారాలన్నిటిలో మరింత పెత్తనం చేయడం మొదలుపెట్టారు. సెప్టెంబర్ 11 ఘటనల తర్వాత ఈ క్రమం మరింత వేగవంతమైంది. ఎందుకంటే ప్రపంచ పరిస్థితిని ఈ సంఘటనలు ఒక కొత్త మలుపు తిప్పాయి. అందుకే అమెరికా సామ్రాజ్యవాదులు భారతదేశాన్ని ఆసియాలో తమ కొత్త "వ్యూహాత్మక స్తంభం"గా ప్రకటించారు. కొత్తగా అధికారంలోకొచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సంస్కరణల కార్యక్రమాన్ని "మానవీయ ముఖం"తో అమలు చేస్తూ ప్రజల కళ్లు గప్పాలని ప్రయత్నిస్తున్నది. ఈ పరిణామాలు భూస్వామ్యానికీ విశాల భారత ప్రజానీకానికీ మధ్యనున్న ప్రధాన వైరుధ్యం సహా ప్రముఖ వైరుధ్యాలన్నిటినీ మరింతగా తీవ్రం చేశాయి.

సామ్రాజ్యవాదుల ఆదేశాలకు తలొగ్గి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఎల్‌పిజీ విధానాల మూలంగా భారత ప్రజల జీవన పరిస్థితులు దిగజారిపోయాయి. లేఆఫ్, రిట్రెంచ్‌మెంట్, మూసివేత, వేతన స్తంభన, సామాజిక సదుపాయాల్లో కోత, కార్మికుల్ని తొలగించి పనుల్ని కాంట్రాక్టుకివ్వడం, క్యాజువల్ కార్మికుల్ని నియమించడం, కనీస ట్రేడ్ యూనియన్ హక్కులను హరించడం వంటి పలు దాడులకు కార్మికవర్గం గురవుతున్నది. అత్యధిక రైతాంగం నేటికీ భూస్వామ్య దోపిడీ కాడి కింద మగ్గిపోతున్నది. వాళ్లు చాలా దుర్భర పరిస్థితిలో జీవించాల్సి వస్తున్నది. విత్తనాలకూ, ఎరువులకూ, వ్యవసాయ యంత్రాలకూ వ్యవసాయ రంగం పూర్తిగా సామ్రాజ్యవాదుల, దళారీ నిరంకుశ బూర్జువా వర్గాల దయాదాక్షిణ్యాలపైనే ఆధారపడాల్సి వస్తున్నది. ఒకవైపు వ్యవసాయ కారకాల ధరలు పెరుగుతుండడం, మరోవైపు పండించిన పంటలకు నామమాత్రమైన ధరలు లభిస్తుండడంతో పేద రైతాంగం మొత్తంగా, మధ్య తరగతి రైతుల్లో గణనీయమైన భాగం తమ భూముల్ని భూస్వాములకు వదులుకోవల్సి వస్తోంది. విద్య ప్రైవేటీకరణ, వ్యాపారీకరణల మూలంగా సమాజంలోని బడుగు వర్గాలు విద్యకు దూరమైపోతున్నాయి. దేశవాళీ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు పెద్ద సంఖ్యలో మూత పడుతున్నాయి. దళితులపై కులతత్వ శక్తుల దాడులు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. ఆదివాసులు తమ జీవనాన్నీ, సంస్కృతినీ కోల్పోతున్నారు. ఇటీవలి సంవత్సరాల్లో, ముఖ్యంగా సామ్రాజ్యవాద ప్రపంచీకరణ, వినిమయవాద సంస్కృతి ఫలితంగా లైంగిక వేధింపులు, ఇతర అత్యాచారాలు పెరిగిపోయాయి. భారత పాలకవర్గాలు, వాళ్ల సామ్రాజ్యవాద ప్రభువుల ప్రయోజనాలకు అనుగుణంగా హిందూ ఫాసిస్టు శక్తులు మైనారిటీ మతస్తులపై, ముఖ్యంగా ముస్లింలపై మతతత్వ మారణకాండ సాగిస్తున్నాయి. జాతీయ విముక్తి పోరాటాల్ని అణచడానికి వేలాది మంది సాయుధ బలగాల్ని పంపిస్తున్నారు.

చివరగా, పాలక వర్గాలూ, సామ్రాజ్యవాద బందిపోట్లూ అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా, వీరోచిత పోరాట, త్యాగ సాంప్రదాయాల్ని కలిగిన భారత ప్రజలు సమరశీలంగా పోరాడుతున్నారు. ప్రజా ఉద్యమాలు, ప్రత్యేకించి మావోయిస్టు శక్తుల నాయకత్వంలో సాగుతున్న ప్రజాయుద్ధం ఆంధ్ర, ఝార్ఖండ్, బీహార్, దండకారణ్యం, వాటిని ఆనుకొని ఉన్న ఇతర ప్రాంతాలలో పురోగమిస్తోంది. రెండు మావోయిస్టు పార్టీలైన ఎంసీసీఐ, సీపీఐ (ఎం-ఎల్) [పీపుల్స్‌వార్]లు ఐక్యమవడం భారత కమ్యూనిస్టు ఉద్యమంలో ఒక పెద్ద గెంతు. ఇది దక్షిణాసియాలోనూ, అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలోనూ సానుకూల ప్రభావాన్ని కలిగిస్తుంది. సామ్రాజ్యవాదానికి దాసోహమనే పాలకవర్గాలు సాగిస్తున్న బహుముఖ దాడిని ఎదుర్కొంటూ, స్థావర ప్రాంతాల్ని నిర్మిస్తూ, పీఎల్‌జీఏను పీఎల్ఏగా రూపాంతరం చెందించే దిశగా విప్లవోద్యమం ముందుకు సాగుతోంది. ఈ క్రమంలో, నూతన ప్రజాస్వామిక విప్లవం, సోషలిజం, కమ్యూనిజం కోసం వేలాది మంది అమరులు తమ విలువైన ప్రాణాల్ని అర్పించారు.

**నిబంధనావళి :** సమైక్య పార్టీ కేంద్రీకృత ప్రజాస్వామ్యపు బోల్షివిక్ సూత్రాలపై దృఢంగా ఆధారపడుతూ, వృత్తి విప్లవకారులు ముఖ్య భాగంగా ఉండే నూతన నిబంధనావళిని రూపొందించింది. పార్టీ


ఐక్యతా కమ్యూన్

ప్రైమర్లతో కూడి ఉండే ఒక విస్తృత నిర్మాణం, ప్రజానీకంలో పార్టీ లోతుగా వేళ్లూనుకొని ఉండేలా సహాయపడుతుంది. నూతన ప్రజాస్వామిక విప్లవ దశ మొత్తంగా పార్టీ రహస్యంగా ఉంటుంది. పార్టీ సభ్యులు సమాజంలోని మెరుగైన వాళ్లై ఉండి, సూత్రబద్ధంగా, నిస్వార్థంగా, ధైర్యంగా, అంకితభావంతో, వినయంగా, కష్టపడే తత్వం కలిగి భారత విప్లవ లక్ష్యం కోసం, సోషలిజం, కమ్యూనిజాల కోసం పూర్తిగా అంకితమై ఉంటారు. సభ్యులంతా పార్టీ, ప్రజల ప్రయోజనాలను తమ స్వంత ప్రయోజనాలకన్నా మిన్నగా భావిస్తారు. పార్టీ తననూ, తన సభ్యులనూ నిరంతరాయంగా ఆత్మవిమర్శనా దృష్టితో పరిశీలించుకుంటూ, పార్టీలోకి అనివార్యంగా చొరబడి లోపలి నుండి పార్టీని భ్రష్టు పట్టించే కార్మికవర్గేతర ధోరణులను సరిదిద్దుకుంటూ ఉంటుంది. మార్క్సిజం-లెనినిజం-మావోయిజం పార్టీకి భావజాల పునాదిగా ఉంటుంది. భారత విప్లవానికి రెండు ప్రధాన ఆయుధాలైన ప్రజా సైన్యం, ఐక్య సంఘటనలకు పార్టీ నాయకత్వం వహిస్తుంది. కార్మికవర్గ అంతర్జాతీయతత్వపు సూత్రాలను దృఢంగా అంటిపెట్టుకొని ఉంటుంది. ప్రపంచంలోని మావోయిస్టు శక్తులన్నిటితో సమాన హోదాలో సంబంధాలను కోరుకుంటుంది. పార్టీ లక్ష్యం కమ్యూనిజం. ఆ దిశగా మొదటి దశ భారత నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని సోషలిజంలోకి రూపాంతరం చెందించడం.

ఈ డాక్యుమెంట్ ఇంకా ఇలా చెబుతుంది : "ఈ క్రమమంతటా పార్టీ ఎల్లెడలా ఉన్న కామ్రేడ్లు సాహసంతో ఏటికి ఎదురీదే విప్లవ స్ఫూర్తిని తప్పనిసరిగా తమ గుండెల్లో నింపుకోవాలి; రివిజనిజాన్ని కాక మార్క్సిజాన్ని ఆచరించడం, చీలికల కోసం కాక ఐక్యత కోసం పని చేయడం, కుట్రలకూ, కుహకాలకూ పాల్పడడం కాక ముక్కుసూటిగా, నిజాయితీగా ప్రవర్తించడం అనే సూత్రాలను తప్పనిసరిగా అంటిపెట్టుకొని ఉండాలి; శత్రువుకూ మనకూ మధ్య ఉన్న వైరుధ్యాలకు, ప్రజల నడుమ ఉండే వైరుధ్యాలకు మధ్య తేడాను సరిగా గుర్తించి, తద్వారా వాటిని సరిగా పరిష్కరించడంలో తప్పనిసరిగా సిద్ధహస్తులవాలి. అతివాద, మితవాద అవకాశవాదాల తోనూ, కార్మికవర్గేతర ధోరణులతోనూ పోరాడుతూ, వారు సిద్ధాంతాన్ని ఆచరణతో మేళవించే, ప్రజారాశులతో సన్నిహిత సంబంధాలను కొనసాగించే, విమర్శ-ఆత్మవిమర్శలను ఆచరించే శైలిని తప్పనిసరిగా అభివృద్ధి చేసుకోవాలి."

నిబంధనావళి పార్టీ "ఆశయాలు, లక్ష్యాల"ను వివరిస్తుంది. సభ్యత్వానికి అర్హతలు, పార్టీ సభ్యుల హక్కులూ విధులూ, పార్టీ నిర్మాణ సూత్రాలు, పార్టీ క్రమశిక్షణ, పార్టీ నిర్మాణ స్వరూపం, పార్టీ కాంగ్రెస్, కేంద్ర కమిటీ హక్కులూ విధులూ, పార్టీలో అంతర్గత వాదోపవాదాల పద్ధతి, పార్టీ నిధుల విషయం మొదలైన వాటన్నిటినీ నిబంధనావళి చర్చిస్తుంది.

## ఐక్యతా కమ్యూన్

ఒకానొక గెరిల్లాజోన్‌లో నిర్మించిన కమ్యూన్‌లో దాదాపు ఒకటిన్నర నెలల పాటు చర్చోపచర్చలు కొనసాగాయి. కామ్రేడ్ సీఎం-కేసీ హాల్‌లో రెండు కేంద్రకమిటీ (సీసీ)ల సంయుక్త సమావేశం, ఆ తర్వాత సమైక్య సీసీ సమావేశం జరిగాయి. దట్టమైన అడవిలో నిర్మించిన ఆ విశాలమైన హాల్‌లో స్టేజీపై మార్క్స్, ఏంగెల్స్, లెనిన్, స్టాలిన్, మావోల ఫోటోలూ, ఆ కింది వరుసలో కామ్రేడ్ సీఎం, కేసీల ఫోటోలూ అమర్చారు. పక్కన గోడలను ఇరు పార్టీలకూ చెందిన కొందరు అమర నేతల ఫోటోలతో అలంకరించారు.

రెండు ప్రతినిధివర్గాలు చేరుకున్న తర్వాత జరిగిన ప్రారంభోత్సవ సభలో పార్టీ జెండానెగురవేసి అమరుల స్తూపంపై పూలమాలలు వేశారు. ఈ సమావేశంలో ఇరు పార్టీల ప్రధాన కార్యదర్శులు.. ఎంసీసీఐ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ కిషన్‌జీ, సీపీఐ (ఎం-ఎల్) [పీపుల్స్‌వార్] ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ గణపతి సహా సీనియర్ నాయకులు ప్రసంగించారు. ప్రసంగాల మధ్యలో కవితా పఠనంతో పాటు కేంద్ర కమిటీ సభ్యులు పాటలు కూడా పాడారు. చివరన స్థానిక సాంస్కృతిక దళం ఒక సాంస్కృతిక కార్యక్రమాన్ని నిర్వహించింది. ఆ దళం ఎర్రజెండా పైనా, మావోయిజం పైనా, ప్రజా సైన్యం పైనా పాటలతో పాటు నాట్య ప్రదర్శనను నిర్వహించింది.

మళ్లీ సెప్టెంబర్ 21, 2004 నాడు పార్టీ ఐక్యమైనట్టు ప్రకటించిన వెంటనే ఏర్పాటైన మరో సమావేశంలో సమైక్య సీసీకి చెందిన ముఖ్యమైన నాయకులు ప్రసంగాలు చేశారు.

కొత్తగా ఎన్నికైన సమైక్య పార్టీ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ గణపతి మాట్లాడుతూ దారుణమైన దోపిడీపీడనలకు గురవుతున్న 90 శాతం ప్రజానీకాన్ని ఐక్యం చేసే కృషిలో ఈ విలీనం మొదటి అడుగు మాత్రమేనని అన్నాడు. పిమ్మట ఆయన కొత్త పార్టీ తాలూకు ఐదు డాక్యుమెంట్లను సంక్షిప్తంగా పరిచయం చేస్తూ వాటి సారాన్ని దేశవ్యాప్తంగా విస్తృతంగా, లోతుగా ప్రచారం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నాడు. రెండు పార్టీలు ఉన్నత స్థాయిలో ఐక్యమైనప్పటికీ, కింది స్థాయిల్లో మొత్తం పార్టీనంతా ఐక్యం చేయడం, పీఎల్‌జీఏనూ పీజీఏనూ ఒక సమైక్య ప్రజా సైన్యంగా ఐక్యం చేయడం, దేశవ్యాప్తంగా ప్రజా సంఘాలను ఐక్యం చేయడం ప్రథమ కర్తవ్యంగా ఉంటుందని ఆయన అన్నాడు. యాదృచ్ఛికంగానే అయినా సరిగ్గా ఈ కొత్త పార్టీ ఏర్పడిన రోజునే హైదరాబాద్‌లో నక్సలైటు ఉద్యమాన్ని అణచడానికి అత్యున్నత స్థాయి సమావేశం జరుగుతున్నదని ఆయన గుర్తు చేశాడు. కేంద్ర హోం మంత్రి నిర్వహిస్తున్న ఈ సమావేశంలో తొమ్మిది రాష్ట్రాల ముఖ్యమంత్రులూ, పోలీసు ఉన్నతాధికార్లూ హాజరవుతున్నారు. పార్టీ యావత్తు శత్రువు పట్ల అప్రమత్తంగా ఉండాలనీ, స్థావర ప్రాంతాలను నిర్మించేందుకు సాయుధ పోరాటాన్ని ఉధృతం చేయాలనీ, విశాల ప్రజానీకాన్ని ఒక బ్రహ్మాండమైన ఐక్య సంఘటనలో సమైక్యం చేయాలనీ ఆయన పిలుపునిచ్చాడు.

ఆ తర్వాత సీనియర్ నేత, మునుపటి ఎంసీసీఐ కార్యదర్శి అయిన కామ్రేడ్ కిషన్‌జీ సంక్షిప్త ప్రసంగం చేశాడు. ఈరోజు కేవలం రెండు పార్టీలే కాకుండా, ఇరు పార్టీలకు చెందిన రెండు సైన్యాలు కూడా సమైక్యమయ్యాయనీ, సమైక్య సైన్యాన్ని ఇక నుంచి పీఎల్‌జీఏగా పిలవాలనీ ఆయన పేర్కొన్నాడు. అక్కడ హాజరైన కామ్రేడ్స్‌ను ఉద్దేశిస్తూ ఆయన ప్రతి చోటా పార్టీనీ, పీఎల్‌జీఏనూ నిర్మించి ఉత్తరం నుంచి దక్షిణం దాకా ఒక విస్తారమైన స్థావర ప్రాంతాన్ని నిర్మించాలని పిలుపునిచ్చాడు. కొత్త సీసీ రూపొందించిన కర్తవ్యాలను పరిపూర్తి చేయడానికి పాటు పడాలని ఆయన అందరినీ కోరాడు.

నూతన సీసీ సీనియర్ నేత కామ్రేడ్ బ్రజేష్ నిర్వహించిన ఈ సభ సాంస్కృతిక దళం ఇచ్చిన స్ఫూర్తిదాయకమైన ప్రదర్శనలతో ముగిసింది. సగటున 15 ఏళ్ల వయస్సుండే యువ విప్లవకారులతో కూడిన ఈ సాంస్కృతిక దళానికి ఒక యువ మహిళా కామ్రేడ్ నాయకత్వం వహించింది. ఎర్రజెండాపైనా, మావోయిజంపైనా, ఇంకా ఇలాంటి

రాజకీయ విషయాలపైనా శ్రావ్యంగా పాడిన పాటలూ, ఇరు పార్టీల ఐక్యత పైన కొత్తగా రాసి పాడిన పాటా శ్రోతలను మంత్రముగ్ధులను చేశాయి. చాలా జాగ్రత్తగా రిహార్స్ చేసి ప్రదర్శించిన వాళ్ల నాట్యాల్లో వృత్తి నైపుణ్యం, విప్లవ స్ఫూర్తి తొణికిసలాడేవి. గంట సేపు సాగిన ఆదివాసీ సామూహిక నాట్యంతో కార్యక్రమం ముగిసింది. ఒక రాజకీయ అంశంపై సాగిన ఈ నాట్యంలో అందరూ పాల్గొన్నారు. ఎంతో ఉద్వేగంగా సాగిన ఈ కార్యక్రమంలో దాదాపు ఆరు భాషల్లో రాసిన కవితల్ని కూడా చదివి వినిపించారు. సీసీఎంలూ, పీఎల్‌జీఏ సభ్యులూ, కంప్యూటర్ స్టాఫ్ అందరూ కవితలు రాశారు. ఎలక్ట్రిక్ టీం బాధ్యుడైన ఒక కామ్రేడ్ ఇంగ్లీషులో కూడా ఒక కవిత చదివాడు. ఇవన్నీ చారిత్రాత్మకమైన ఐక్యతా క్రమంలో పుట్టినవే. మర్చిపోవడం కష్టమయ్యే సన్నివేశం అది.

లోతట్టు అడవిలో నిర్మించిన ఆ కమ్యూన్ 150 కామ్రేడ్ల కోసం అన్ని సౌకర్యాలతో నిర్మించిన చిన్న పట్టణాన్ని పోలి ఉండేది. గెరిల్లా యోధులు దాదాపు 15 రోజులు కష్టపడి ప్రధాన హాల్‌ను 60 అడుగుల పొడవుతో, 20 అడుగుల వెడల్పుతో పట్టణాల్లో భవనాలను నిర్మించేంత కచ్చితత్వంతో నిర్మించారు. లోపల నలువైపులా ఎర్ర గుడ్డతో అలంకరించారు. ఇంకా అక్కడ బస చేసే హాల్సనూ, మరుగుదొడ్లనూ, భోజనశాలనూ, వంటశాలనూ, కంప్యూటర్ రూంనూ, టీవీ రూంనూ నిర్మించారు. మొత్తం టౌన్‌షిప్‌కంతా విద్యుత్ సరఫరా జరిగేలా ఏర్పాట్లు చేశారు. దళాల్లోనే శిక్షణ పొందిన ఒక యువ మహిళా డాక్టర్ క్రమం తప్పకుండా ప్రతి సాయంత్రం ప్రతి టెంట్‌లోకీ వెళ్తూ రోగులను పరామర్శించేది. కొన్ని సందర్భాల్లో స్వీట్లూ, వేర్వేరు రకాల తిండి పదార్థాలూ సరఫరా చేశారు.

కమ్యూన్ అంతటా నెలకొన్న నిజాయితీ, క్రమశిక్షణ, ఆత్మీయతాభావం అన్నీ ఉనికిలోకి వస్తున్న ఒక కొత్త సమాజానికి నమూనాగా నిలిచాయి. ప్రతి ఒక్కరూ విప్లవ అంకితభావంతో తమ తమ విధుల్లోకి వెళ్లే వాళ్లు. అందరూ అనుక్షణం ఇతరులకు సహాయపడేందుకు ఉత్సుకత చూపుతూ ముఖంపై చెరగని చిరునవ్వుతో పని చేసే వాళ్లు. ఆ కమ్యూన్‌లోని పిల్లలు అందరినీ ముగ్ధుల్ని చేశారు. ఎంతో ప్రేమగా, జీవంతో కళకళలాడుతూ, ఆటపాటల్తో కదలాడే ఆ పిల్లలు టైం ప్రకారం తమ పనుల్ని పూర్తి చేస్తూ ఎంతో ఆత్మవిశ్వాసంతో కనపడేవాళ్లు. అక్కడ అహం అనేదే లేదు. సాంస్కృతిక కార్యకర్తలూ, డాక్టర్, ఆమె సహాయకులూ భోజన సమయాల్లో అందరికీ వడ్డించేవాళ్లు. శ్రమను అంతా గౌరవించేవాళ్లు. డాక్టర్ పేషెంట్లను బాగా పట్టించుకునేది. "ప్రజలకు సేవ చేయాలి" అనే ఆదర్శంతో చైనా విప్లవంలో పని చేసిన ఒట్టికాళ్ల డాక్టర్లను ఆమె స్ఫురణకు తెచ్చేది. కమ్యూన్‌లో అందరూ ఇదే ఆదర్శంతో పని చేసే వాళ్లు.

ఎంసీసీఐ కమ్యూన్‌లోకి సీపీఐ (ఎం-ఎల్) [పీపుల్స్‌వార్] కామ్రేడ్లు దఫదఫాలుగా రాగా మొత్తం క్యాంపంతా సావధానంగా నిలబడి అందరితో చేతులు కలిపి అభివాదం చేసింది. ఆ తర్వాత ప్రతినిధులకు స్వాగతం పలుకుతూ సాంస్కృతిక బృందం ప్రత్యేకంగా పాట పాడి నాట్య ప్రదర్శన చేసింది. ఆ తర్వాత సంక్షిప్తంగా ఒక సాంస్కృతిక కార్యక్రమం జరిగింది. జీవం ఉట్టిపడేలా జరిగిన ఒక సభతో ఐక్యతా సమావేశం పూర్తయింది. ఇందులో సాంస్కృతిక ప్రదర్శన తర్వాత అంతర్జాతీయ గీతం పాడి ఎర్రజెండాను దించారు. ముగింపు ఉత్సవంలో ప్రధాన కార్యదర్శితో పాటు మరో కామ్రేడ్ అక్టోబర్ విప్లవం గురించి మాట్లాడగా, మిగతా ఉపన్యాసాలన్నీ అక్కడున్న సాధారణ కేడర్లే చేయడం ఒక విశేషం. వాళ్లు కొద్ది ముందుగా పూర్తయిన విలీనం గురించి తమ అనుభూతుల్ని వ్యక్తం చేశారు. ఎస్ఏసీ (స్పెషల్ ఏరియా కమిటీ), రీజనల్ కమిటీ సభ్యులతో పాటు పీఎల్‌జీఏ కమాండర్లూ, సాంస్కృతిక కార్యకర్తలూ, కంప్యూటర్ స్టాఫ్ సభ్యులూ, మహిళా కామ్రేడ్లూ, ఆఖరుకు బాలల సేన నాయకుడు కూడా మాట్లాడారు. వాళ్లు మాటలే కాకుండా ఆ సందర్భంగా రాసిన కవితలు కూడా చదివారు. సాధించిన ఐక్యతను పటిష్టం చేయడానికీ, భారతదేశంలో ప్రజాయుద్ధాన్ని మరింత ఉన్నతమైన ఎత్తుకు పురోగమింపజేయడానికీ అందరూ రెట్టింపు పట్టుదలతో కమ్యూన్ నుండి బైలుదేరారు.

## నిర్దేశించుకున్న ముఖ్యమైన కర్తవ్యాలు

దేశవ్యాప్తంగా ప్రజాయుద్ధాన్ని ఉధృతం చేస్తూ, అభివృద్ధి చేస్తూ నేటి జనతా ప్రజాస్వామిక విప్లవాన్ని ముందుకు తీసుకెళ్లడమే మౌలిక, ప్రధాన, తక్షణ కర్తవ్యంగా కేంద్ర కమిటీ (తాత్కాలిక) రూపొందించింది. అది సాయుధ వ్యవసాయ విప్లవాన్ని పురోగమింపజేస్తూ ప్రజా విముక్తి సైన్యాన్నీ (పీఎల్ఏ), విముక్తి ప్రాంతాల్నీ నిర్మించడం మౌలిక, ప్రధాన కర్తవ్యంగా స్వీకరించింది. కేంద్ర కర్తవ్యాన్ని అమలు పర్చేలా కార్యకలాపాలన్నిటినీ దిశా నిర్దేశనం చేయాలి. పార్టీనీ పీఎల్‌జీఏనూ నిర్మూలించే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న దాడులన్నిటినీ ప్రజాయుద్ధాన్ని కొనసాగిస్తూ తిప్పికొట్టాలి. విముక్తి ప్రాంత లక్ష్యంతో పార్టీనీ, పీఎల్‌జీఏనూ, ఐక్య సంఘటననూ పటిష్టం చేయాలి; గెరిల్లా యుద్ధాన్ని ఉధృతం చేయాలి.

పార్టీని పటిష్టం చేయడం కోసం కార్మికవర్గేతర ధోరణులన్నిటికీ వ్యతిరేకంగా పోరాడుతూ దాన్ని మరింతగా బోల్షివీకరించాలి. కొత్త పార్టీలో ఇంకా భాగం కాని నిజమైన మావోయిస్టులందరినీ సమైక్య పార్టీలో ఐక్యం చేయాలి.

పీఎల్‌జీఏను బలోపేతం చేయడం కోసం విస్తృత పునాదిపై ప్రజా మిలిషియాను నిర్మించాలి. సువ్యవస్థితమైన కమాండ్, కంట్రోల్ కింద ప్లటూన్లనూ, కంపెనీలనూ ఉన్నత ఫార్మేషన్లలోకి ఎదిగించాలి.

ఐక్య సంఘటనను బలోపేతం చేయడం కోసం పార్టీ, దేశంలో దాదాపు 90 కోట్లుండే విశాల ప్రజానీకాన్ని సామ్రాజ్యవాదం, భూస్వామ్యం, దళారీ నిరంకుశ బూర్జువా వర్గాలకు వ్యతిరేకంగా కదిలించాలి. ఈ వ్యూహాత్మక ఐక్య సంఘటనతో పాటు, ప్రధాన రాజకీయ ఎత్తుగడల నినాదాల చుట్టూ ప్రజలను సమీకరించడానికి గాను ఎత్తుగడల ఐక్య సంఘటనల్ని కూడా నిర్మించాలి. ఆ నినాదాలు ఇవి : ప్రజాయుద్ధాన్ని ఉధృతం చేయాలి, పురోగమింపజేయాలి! ప్రజా రాజ్యాధికారాన్ని నిర్మించాలి! సామ్రాజ్యవాద యుద్ధ కాంక్షలకు వ్యతిరేకంగా, సామ్రాజ్యవాదులు శాసిస్తున్న ఉదారీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ విధానాలకు వ్యతిరేకంగా బ్రహ్మాండమైన ప్రజా ఉద్యమాన్ని నిర్మించాలి! అతి ప్రమాదకరమైన హిందూ ఫాసిస్టు శక్తులనూ, ఇతర ఛాందసవాద శక్తులనూ ఎండగట్టాలి, ఒంటరి చేయాలి, ఓడించాలి! పెరుగుతున్న రాజ్య నిర్బంధాన్ని ఎదిరించి ఓడించాలి, నల్లచట్టాల్ని రద్దు చేయాలని పోరాడాలి! సామ్రాజ్యవాద మద్దతు గలిగిన భారత పాలకవర్గాల విస్తరణవాద కాంక్షలకు వ్యతిరేకంగా పోరాడాలి!

చివరగా, కేంద్ర కమిటీ (తాత్కాలిక) తన కార్మికవర్గ అంతర్జాతీయవాద కర్తవ్యాల్లో భాగంగా, భారత విప్లవం ప్రపంచ విప్లవంలో భాగమని గుర్తిస్తూ, ప్రపంచ వ్యాప్తంగా, ముఖ్యంగా దక్షిణాసియాలో ఉన్న నిజమైన మావోయిస్టు శక్తులన్నిటితోనూ మరింత సన్నిహితంగా సమైక్యం కావాలని నిర్ణయించింది. ▲

ఇరు పార్టీల విలీనం, భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) స్థాపన సందర్భంగా...

## మునుపటి సీపీఐ (ఎం-ఎల్) [పీపుల్స్‌వార్], ఎంసీసీఐల ప్రధాన కార్యదర్శులు

# కామ్రేడ్స్ గణపతి, కిషన్‌లతో సంయుక్త ఇంటర్వ్యూ

[ఇరు పార్టీల విలీనానికి, సమైక్య భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) ఆవిర్భావానికి ఉన్న చారిత్రక ప్రాముఖ్యత రీత్యా "పీపుల్స్ మార్చ్" పత్రిక ఈ ప్రక్రియకు ప్రధాన రూపశిల్పులైన మునుపటి ఇరు పార్టీల ప్రధాన కార్యదర్శులను ఇంటర్వ్యూ చేసింది. స్థానిక సమస్యల నుండీ బీహార్-ఝార్ఖండ్‌లో గతంలో జరిగిన ఘర్షణలు, దేశ సమస్యలు, ప్రపంచ విషయాలు వగైరాలపై వాళ్ల అభిప్రాయాల్ని కోరింది. ఈ ఇద్దరు కామ్రేడ్స్ విలీన ప్రక్రియతో ముడిపడిన విషయాలన్నీ తడిమారు. ఈ ఇంటర్వ్యూలో "పీపుల్స్ మార్చ్" ఈ ఇద్దరు నేతలను భారత, ప్రపంచ విప్లవాల గతం గురించీ, వర్తమానం గురించీ, భవిష్యత్తు గురించీ కూడా తమ అభిప్రాయాలు చెప్పండని కోరింది. ప్రపంచంలోనూ భారతదేశంలోనూ ప్రస్తుతం నెలకొని ఉన్న పరిస్థితి పైనా, మార్క్సిజం సంస్కరణవాదాల పైనా, మావోయిస్టు భావజాలం పైనా, కార్మికవర్గేతర ధోరణుల పైనా, సోషలిజం భవిష్యత్తు పైనా, ప్రత్యేకించి సోవియట్ యూనియన్‌లోనూ చైనాలోనూ జరిగిన పెట్టుబడిదారీ పునరుద్ధరణ తర్వాత కమ్యూనిజానికి ఎదురుదెబ్బ తగిలిన నేపథ్యంలో సోషలిజం భవితవ్యం పైనా ఈ ఇంటర్వ్యూలో ప్రధానంగా కేంద్రీకరించారు.

– సంపాదకులు]

*నవంబర్ 7, 2004*

**పీపుల్స్ మార్చ్ :** ఐక్యత గురించి వినగానే విప్లవ శిబిరంలోనూ, పీడిత ప్రజల్లోనూ సహజంగానే సంతోషం వెల్లివిరిసింది. అయితే దీనికి ఎందుకింత సుదీర్ఘ కాలం పట్టింది? మీ పార్టీలు ఉనికిలోకి వచ్చి 35 సంవత్సరాలు దాటింది కదా. ఐక్యతా క్రమం పరిపూర్తి కావడానికి రెండు దశాబ్దాలకు పైగా ఎందుకు పట్టింది?

**గణపతి :** యావత్ విప్లవ శిబిరం, ప్రజాస్వామిక శక్తులూ, భారత పీడిత ప్రజలందరూ చాలా సంతోషిస్తున్నారన్న మాట నిజం. భారత విప్లవ కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలో సమైక్య భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) ఏర్పాటు ఒక నూతన మైలురాయి. మార్క్సిజం-లెనినిజం-మావోయిజంపై ఆధారపడిన ఒక సమైక్య మావోయిస్టు పార్టీ కోసం దేశంలోని విప్లవతత్వం గల పీడిత ప్రజలంతా, అట్లాగే మా శ్రేణులన్నీ, దక్షిణాసియాలోని, ప్రపంచంలోని మావోయిస్టు శక్తులన్నీ ఎంతో కాలంగా వేచి చూస్తూ, దాన్ని బలంగా కోరుకుంటూ ఉన్నారు. ఇప్పుడు ఈ చిరకాల ఆకాంక్ష వాస్తవ రూపం దాల్చింది.

భారత విప్లవం ప్రపంచ విప్లవంలో భాగంగా పురోగమిస్తున్నది. దీని లక్ష్యం దీర్ఘకాల ప్రజాయుద్ధ పంథాను చేపట్టి ప్రస్తుతం ఉనికిలో ఉన్న అర్ధ వలస, అర్ధ భూస్వామ్య వ్యవస్థను కూలదోసి నూతన ప్రజాస్వామిక సమాజాన్ని స్థాపించడం. మా పార్టీ పునాది ప్రజారాశులైన కార్మికుల, కర్షకుల, పెటీ బూర్జువాల పోరాటాలకు నాయకత్వం వహించడంతో పాటుగా సామ్రాజ్యవాదంతోనూ, దళారీ నిరంకుశ బూర్జువాలతోనూ వైషమ్యాన్ని కలిగి ఉన్న జాతీయ బూర్జువాల ప్రయోజనాలను కూడా సమర్థిస్తూ వస్తోంది. అట్లాగే అన్ని రకాల సామాజిక పీడనకూ వ్యతిరేకంగానూ, పీడిత జాతుల, మహిళల, దళితుల, పీడిత కులాల, అల్పసంఖ్యాకుల, తదితరుల హక్కుల కోసం విముక్తి కోసం పోరాడుతున్నది. ఈ విధంగా మేం పీడిత ప్రజారాశుల విశ్వాసాన్ని చూరగొన్నాం. వాళ్ల కష్టాల్లో వెంట ఉంటూ, అన్ని రూపాల పీడన నుండీ, దోపిడీ నుండీ వాళ్లను పూర్తిగా విముక్తి చేయడం కోసం మా పార్టీ దృఢంగా నిలబడిందన్న విషయం వాళ్లకు తెలుసు. సహజంగానే వాళ్లంతా ఈ విలీనంతో చాలా సంతోషపడతారు. ఈ విలీనంతో పార్టీ పోరాట సామర్థ్యం గణనీయంగా పెరుగుతుంది. ఫలితంగా దీని దాడి చేయగల శక్తి అనేక రెట్లు పెరుగుతుంది. ఇది ప్రజలకు ఎంతో మేలు చేస్తుంది. ఈ సుదీర్ఘ కాలంలో అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమం కూడా అనేక చీలికలకూ, ఓటములకూ గురైంది. భారతదేశంలో మావోయిస్టు ఉద్యమం కొంత పురోగతి సాధించింది. అయితే ఈ గొప్ప లక్ష్యం కోసం ఈ ఉద్యమం మెరికల్లాంటి అనేక కార్యకర్తలను కోల్పోవల్సి వచ్చింది. కాబట్టి విప్లవ శిబిరమంతా, మొత్తం ప్రజానీకమంతా మా ఐక్యత పట్ల సహజంగానే హర్షామోదాల్ని వ్యక్తం చేస్తున్నారు.

ఇక ఈ రెండు ప్రవంతులు విలీనం కావడానికి ఇంత సుదీర్ఘ కాలం ఎందుకు పట్టిందన్న ప్రశ్నకు వస్తాను. నిజమే, రెండు పార్టీలు గత ముప్పయ్యేళ్లుగా ఉనికిలో ఉండడం, గత రెండు దశాబ్దాలుగా ఐక్యతా చర్చలు జరుగుతూ ఉండడం చాలా ఎక్కువ సమయమే. అయితే దీన్ని సరిగ్గా అర్థం చేసుకోవడానికి మనం ప్రాథమికంగా చారిత్రక నేపథ్యాన్నీ, ఈ రెండు పార్టీలు ఆవిర్భవించి అభివృద్ధి చెందిన పరిస్థితుల్నీ పరిశీలించాలి.

నక్సల్బరీ తిరుగుబాటు సమయంలో వెంటనే పార్టీని ఏర్పాటు చేసే ఆవశ్యకత విషయంలో ఇరు నాయకత్వాల మధ్య విభేదాలు ఉండినాయి. ఈ విభేదాలు పరిష్కారం కాలేకపోయాయి. కనుక సీపీఐ (ఎం-ఎల్), ఎంసీసీలు వరుసగా ఏప్రిల్ 22, 1969, అక్టోబర్ 20, 1969 తేదీల్లో విడివిడిగా ఉనికిలోకి వచ్చాయి. ఆ తర్వాత, కామ్రేడ్ చారు మజుందార్ (సీఎం) అమరులయ్యాక, ఉద్యమం వెనుకంజ వేసిన తర్వాత సీపీఐ (ఎం-ఎల్)లో అస్తవ్యస్త పరిస్థితి తలెత్తింది. పార్టీ పలు గ్రూపులుగా చీలిపోయింది. పార్టీలో అత్యధికుల విశ్వాసాన్ని పొందిన నాయకత్వమే లేని శూన్య స్థితి ఏర్పడింది. దీనితో పాటు, 1976లో కామ్రేడ్ మావో అమరులయ్యాక చైనాలో పెట్టుబడిదారీ మార్గీయులూ, విప్లవ ప్రతిఘాతుక రెనగేడ్లూ అయిన హువా-డెంగ్ ముఠా అధికారాన్ని చేజిక్కించుకోగా చైనా కమ్యూనిస్టు పార్టీ (సీపీసీ) రివిజనిస్టుగా మారిపోయింది. ఆ విధంగా ఎలాంటి అంతర్జాతీయ కార్మికవర్గ నాయకత్వం గానీ, ఒక విప్లవ స్థావరం గానీ లేకుండా పోయాయి. ఇది ప్రపంచవ్యాప్తంగా మావోయిస్టు

ఉద్యమాలపై ప్రతికూల ప్రభావం వేసింది. అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో మితవాద, రివిజనిస్టు ధోరణి వ్యాపించింది. దీని ప్రభావం భారతదేశంలో కూడా పడింది. అంతర్జాతీయ నాయకత్వం లోపించడం, విప్లవ స్థావరం లేకుండా పోవడం వల్ల భారతదేశంలో విప్లవకారుల ఐక్యతా సమస్యలు మరింత క్లిష్టమయ్యాయి.

1980 వరకు సీపీఐ (ఎం-ఎల్) ప్రవంతికి చెందిన సీపీఐ (ఎం-ఎల్) [పీడబ్ల్యూ], సీపీఐ (ఎం-ఎల్) (పీయూ)లతో పాటు, ఎంసీసీ రైతాంగ ఉద్యమాల్ని నిర్మించి బలపడ్డాయి. సీపీఐ (ఎం-ఎల్) [పీడబ్ల్యూ], సీపీఐ (ఎం-ఎల్) (పీయూ)లు తొలి నుండీ ఎంసీసీతో మంచి సంబంధాల్ని కలిగి ఉన్నాయి. పీడబ్ల్యూ, ఎంసీసీలు 1981లో జరిగిన తమ తొలి సమావేశం నుండే ఐక్యతా చర్చలు ప్రారంభించాయి. అయితే నాయకత్వ కొనసాగింపు లోపించడంతో ఈ ప్రక్రియలో ఆలస్యం చోటు చేసుకుంది. పీడబ్ల్యూ నాయకుడు కామ్రేడ్ కొండపల్లి సీతారామయ్య (కేఎస్) అరెస్టు కావడం, ఆ తర్వాత పీడబ్ల్యూలో అంతర్గత సంక్షోభం ఏర్పడి కేంద్ర కమిటీ (సీసీ)లో చీలిక ఏర్పడడంతో ఐక్యతా ప్రక్రియ అనేక సంవత్సరాలు ఆలస్యమైంది. ఎనబైల ప్రారంభంలో ఎంసీసీ తన అగ్రశ్రేణి నాయకులైన కామ్రేడ్స్ అమూల్య సేన్ (ఏఎస్), కనాయ్ చటర్జీ (కేసీ)లను కోల్పోవడం వల్ల కూడా ప్రతికూల ప్రభావం పడింది. ఫలితంగా ఐక్యతా ప్రక్రియలో మరింత ఆలస్యం జరిగింది. ముఖ్య విషయాల్లో చాలా వాటిల్లో ఇరు పార్టీల మధ్య మౌలికమైన ఐక్యత ఉన్నప్పటికీ కొన్ని ముఖ్య సమస్యలపై తీవ్రమైన రాజకీయ విభేదాలు ఉండేవి. అట్లాగే నాయకత్వాలకు పరిపక్వత లోపించడం వల్ల కూడా ఐక్యత ఫలించలేదు. అయినప్పటికీ, ఈ సుదీర్ఘ కాలంలో విప్లవోద్యమం అభివృద్ధి చెందింది, విస్తరించింది. ప్రజా గెరిల్లా సైన్యం/ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం (పీజీఏ/పీఎల్‌జీఏ) ఆవిర్భవించింది. విముక్తి ప్రాంతాల నిర్మాణం లక్ష్యంతో గెరిల్లాజోన్లు ఏర్పడ్డాయి. ఇప్పుడు రెండు నాయకత్వాలకు మరింత ఎక్కువ అనుభవం లభించింది. సమస్యలనూ, విభేదాలనూ పరిష్కరించుకోవడం లోనూ, తమ తప్పుల్ని గుర్తించడం లోనూ చాలా పరిపక్వత వచ్చింది. ఐక్యతా ప్రక్రియలో ఒక పెద్ద గెంతు వేయడానికి పరిస్థితి పరిపక్వమైంది. ఆ విధంగా, ఐక్యతను సాధించడంలో జరిగిన ఆలస్యానికి భౌతిక, స్వీయాత్మక కారణాలను విశ్లేషిస్తూ మేం ఈ అనుభవం నుండి పాఠాలు నేర్చుకుంటాం. ఇప్పుడు సాధించిన ఐక్యతను భవిష్యత్తులో సుదృఢం చేయడానికి మేం కట్టుబడి ఉంటాం. ఈ పాఠాల్ని దృష్టిలో ఉంచుకుంటూ మేం ఇప్పటికీ సీపీఐ (మావోయిస్టు)కు బయట ఉండిపోయిన విప్లవ శక్తుల్ని ఐక్యం చేయడానికి ప్రయత్నం చేస్తాం.

**పీపుల్స్ మార్చ్ :** భారతదేశంలో ఎం-ఎల్ ఉద్యమానికి సుదీర్ఘమైన చీలికల చరిత్ర ఉంది. ఈ ఐక్యత తర్వాత చీలిక రాదని గ్యారంటీ ఏమిటి? మీరు ప్రజలకు ఏమైనా హామీ ఇవ్వగలరా?

**గణపతి :** ఔను, గతంలో ఎం-ఎల్ ఉద్యమంలో అనేక చీలికలు వచ్చాయి. అయితే చీలికలు నాణానికి ఒక వైపు మాత్రమే. గొప్ప విషయం ఏమిటంటే విప్లవకారులను సమైక్యం చేయడానికి ప్రయత్నాలూ నిరంతరాయంగా జరుగుతూ వచ్చాయి. సీపీఐ (ఎం-ఎల్) (పీయూ)కు మూలాలు బెంగాల్‌లో ఉన్నప్పటికీ అది అనేక విప్లవ గ్రూపులతో సమైక్యం కావడం ద్వారా విస్తరిస్తూ బలపడింది. సీపీఐ (ఎం-ఎల్) [పీపుల్స్‌వార్] మూలాలు ఆంధ్రప్రదేశ్, తమిళనాడులలో ఉన్నప్పటికీ అది దాదాపు తాను పని చేస్తున్న ప్రతి రాష్ట్రంలోనూ విప్లవకారులతో సమైక్యమైంది. ఎంసీసీ కూడా బెంగాల్‌లో పుట్టినప్పటికీ అనేక రాష్ట్రాల్లో పలు విప్లవ గ్రూపుల్ని సమైక్యం చేసి అది ఎంసీసీఐగా రూపొందింది.

గతాన్ని మూడు దశలుగా విభజించవచ్చు. 1972లో వెనుకంజ తర్వాత చీలికలు ప్రధాన ధోరణిగా ఉండింది. 1980లలో నిజమైన విప్లవ పార్టీలనూ, విప్లవోద్యమాలనూ పటిష్టం చేయడం, అతి, మితవాద అవకాశవాద పార్టీలు పతనం కావడం, ఐక్యత దిశగా ప్రయత్నాలు ముమ్మరం చేయడం ప్రధాన ధోరణిగా ఉండింది. 1990 దశాబ్దంలో ప్రజాయుద్ధం అభివృద్ధి, నిజమైన విప్లవ పార్టీల, శక్తుల ఐక్యతలదే ప్రధాన ధోరణి. ఈ ప్రయత్నాలే ఈ సంవత్సరం అంతిమంగా సమైక్య సీపీఐ (మావోయిస్టు) ఏర్పాటుకు దారి తీసాయి.

మొదట ఇరు పార్టీల ఉన్నత స్థాయి ప్రతినిధివర్గాల మధ్య లోతైన చర్చలు సాగించిన తర్వాత రెండు పార్టీల కేంద్ర కమిటీల సంయుక్త సమావేశం వాటికి తుది రూపాన్నిచ్చిన తర్వాత సమైక్య పార్టీ ఏర్పాటు జరిగింది. లోతుగా, నిర్మాణాత్మకంగా, సమాన హోదాలో జరిగిన చర్చల ద్వారా ఐదు వేరు వేరు డాక్యుమెంట్లను రూపొందించి వాటికి తుది రూపాన్నిచ్చాం. ఆ డాక్యుమెంట్లు ఇవి – 1.మార్క్సిజం-లెనినిజం-మావోయిజపు ఉజ్వలమైన అరుణ పతాకాన్ని సమున్నతంగా ఎత్తిపడదాం 2. పార్టీ కార్యక్రమం 3. భారత విప్లవ వ్యూహం-ఎత్తుగడలు 4. అంతర్జాతీయ, దేశీయ పరిస్థితిపై రాజకీయ తీర్మానం 5. పార్టీ నిబంధనావళి.

ఈ డాక్యుమెంట్లతో పాటు, మా ఇరు పార్టీల ప్రియతమ నేతలూ, ఉపాధ్యాయులూ అమరులు కామ్రేడ్ సీఎం, కామ్రేడ్ కేసీలను సమైక్య పార్టీ సంస్థాపక నేతలుగా గుర్తించాలనీ, ఎత్తిపట్టాలనీ మేం నిర్ణయించాం. 1960ల కల్లోల దశాబ్దంలోనే, ప్రత్యేకించి మహత్తర నక్సల్బరీ తిరుగుబాటులో ఊపిర్లు పోసుకున్న ఈ రెండు పార్టీలు భారత కమ్యూనిస్టు ఉద్యమ సుదీర్ఘ చరిత్రలో విప్లవకరమైన భాగానికంతటికీ వారసులని కూడా మేం నిర్ణయించాం. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, భారత విప్లవాన్ని పురోగమింపజేయాలనే లక్ష్యానికి కట్టుబడి ఉన్న ఈ రెండు పార్టీలూ గత 35 ఏళ్లుగా విప్లవ కమ్యూనిస్టు ఉద్యమంలో రెండు వేర్వేరు ప్రవంతులుగా కొనసాగాయి. ఉమ్మడిగా చేపట్టిన ఈ చర్యలన్నీ పంథాకు సంబంధించిన దాదాపు భావజాల, రాజకీయ అంశాలన్నిటి పైనా సమైక్య అవగాహనను స్పష్టంగా వెల్లడి చేశాయి. ఈ రెండు పార్టీలూ సాధించిన ఐక్యతకు సూత్రబద్ధమైన ప్రాతిపదికను అవి నెలకొల్పిన పంథా ఏర్పర్చింది. ఈ ఐక్యతపై ఆధారపడుతూ సంయుక్త కేంద్ర కమిటీ సమావేశం ఆఖరుకు ఈ రెండు పార్టీలూ ఒకే ఒక సమైక్య పార్టీలో విలీనం కావాలని తీర్మానించింది.

మనం చరిత్రను పరిశీలిస్తే, ఆ కాలంలో తీవ్రమైన, బాధాకరమైన చీలికలు చోటు చేసుకున్నదీ, ప్రత్యేకించి 1972లో వెనుకంజ తర్వాత అదొక విచారకరమైన లక్షణంగా ఉండిందీ నిజమే. కానీ 1980లో సీపీఐ (ఎం-ఎల్) [పీడబ్ల్యూ], సీపీఐ (ఎం-ఎల్) (పీయూ)లు ఏర్పడిన తర్వాత ఈ పార్టీలు నిలువునా చీలడమన్నది ఎప్పుడూ జరగలేదు. మితవాద అవకాశవాద, అతివాద దుస్సాహసికవాద పార్టీలలో వచ్చిన చీలికలకూ, పతనానికీ దీనికీ స్పష్టమైన తేడా ఉంది. ఎంసీసీలో కూడా పెద్ద చీలిక ఏదీ రాలేదు. ఈ ఐక్యతకు ప్రాతిపదిక సూత్రబద్ధమైంది. క్షుణ్ణమైన చర్చల తర్వాతనే దీన్ని సాధించాం

కనుక దీని పునాది బలంగా ఉంది.

పార్టీ లోపల విభేదాలు ఉంటాయి. అట్లాగే సమాజంలో సాగే వర్గ పోరాటానికి ప్రతిబింబంగా పార్టీలో కార్మికవర్గేతర ధోరణులు చోటు చేసుకుంటాయి. పార్టీ లోపల మంచికీ, చెడుకూ మధ్య పోరాటం సాగుతుంది. అంతర్గత విభేదాలన్నిటినీ ఎం-ఎల్-ఎం ప్రాతిపదికపై, సరైన పద్ధతుల్లో పరిష్కరించుకుంటాం. ఆత్మవిమర్శ-విమర్శ అనే మార్క్సిస్టు పద్ధతి ద్వారా, పార్టీ లోపల పోరాటాల్నీ, దిద్దుబాటు ఉద్యమాల్నీ నిర్వహించడం ద్వారా కార్మికవర్గేతర ధోరణుల్ని పెకిలించివేయడం సాధ్యమవుతుంది. ఇది బలమైన పార్టీ ఐక్యతకు హామీ ఇవ్వడంతో పాటు ఎలాంటి చీలికనైనా నివారిస్తుంది. గతంలో కూడా మేం మౌలికంగా ఇదే పద్ధతిని అనుసరిస్తూ ప్రధాన అంతర్గత సమస్యలన్నిటినీ పరిష్కరించుకున్నామని చరిత్ర నిరూపిస్తోంది.

**పీపుల్స్ మార్చ్ :** రాజ్యం మీ రెండు పార్టీల పైనా పెంచిన నిర్బంధాన్ని ఎదుర్కోవల్సిన అనివార్యతపై మీ ఐక్యత ఆధారపడిందా? లేక నిజమైన భావ సమైక్యత పైననా?

**కిషన్ :** నా అభిప్రాయం ప్రకారం ఎంసీసీఐ, అంటే భారత మావోయిస్టు కమ్యూనిస్టు కేంద్రం, సీపీఐ (ఎం-ఎల్) [పీడబ్ల్యూ], అంటే భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు) [పీపుల్స్‌వార్]ల మధ్య జరిగిన ఈ విలీనం, భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) ఆవిర్భావం ఏ విధంగా చూసినా చారిత్రక ప్రాధాన్యత కలిగిన సంఘటన. సీపీఐ (మావోయిస్టు) ఆవిర్భావం భారత విప్లవ పోరాటాల, అంటే వ్యవసాయ విప్లవ గెరిల్లా యుద్ధం అభివృద్ధికీ, ప్రజాయుద్ధం అభివృద్ధికీ, భారత కమ్యూనిస్టు ఉద్యమంలో ఒక నూతన విప్లవకర వెల్లువ సృష్టికీ హామీనిస్తుంది. అంతే కాకుండా అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో కూడా ఒక సానుకూల, మహత్తర ప్రభావాన్ని పడవేస్తుంది.

కొత్తగా నిర్మించిన పార్టీ ఒక గట్టి రాజకీయ, భావజాల, సైద్ధాంతిక పునాదిపై నిలబడ్డప్పుడే పైన చెప్పిన మాటలు ఫలప్రదమవుతాయి. ఈ రెండు పార్టీలకూ 35-40 సంవత్సరాల సుదీర్ఘమైన రాజకీయ, సైద్ధాంతిక, విప్లవ పోరాటాల్ని నడపడంలో ఆచరణాయుతమైన అనుభవం ఉంది. అయినప్పటికీ ఇవి రెండూ వేరు వేరు స్రవంతులుగా (అంటే ఎం-ఎల్ స్రవంతీ, ఎంసీసీ స్రవంతీ) కొనసాగుతూ వచ్చాయి. ఇలాంటి పార్టీలు విధానంపై ఆధారపడి ఐక్యతను సాధించకుండా, కేవలం రాజ్య నిర్బంధాన్ని ప్రతిఘటించే దృష్టితోనే విలీనం వంటి చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంటాయని ఎవరైనా భావిస్తే అది బహుశా స్వీయాత్మకతే అవుతుంది.

మీరు గత నలభై సంవత్సరాల చరిత్రపై దృష్టి సారిస్తే... (i) 1969లో కామ్రేడ్ సీఎం నాయకత్వంలో ఏర్పడిన సీపీఐ (ఎం-ఎల్)లో అప్పటి "దక్షిణ దేశ్" గ్రూపు, అంటే ఎంసీసీ చేరలేదు; (ii) 1969 తర్వాత ముప్పై ఐదేళ్లు గడిచిపోయినప్పటికీ, మధ్యలో కొన్ని దఫాలుగా ఐక్యతా చర్చలు జరిగినప్పటికీ చివరకు ఐక్యతా క్రమం పరిపూర్తి కాలేకపోయిందనే వాస్తవాల్ని మీరు గమనించవచ్చు. అట్లా ఎందుకు జరిగిందన్నదే అసలు ప్రశ్న. ఈ రెండింటి మధ్య కొన్ని మౌలికమైన విభేదాలు ఉన్న మాట నిజం.

అయితే ఏ రాజకీయ, ఆచరణ సంబంధమైన భిన్నాభిప్రాయాల మూలంగానైతే గత ముప్పై ఐదేళ్లుగా ఈ రెండు స్రవంతులూ రాజ్యం సాగిస్తున్న తీవ్రమైన దాడినీ, చుట్టివేత-అణచివేత క్యాంపెయిన్లనూ ఎదిరిస్తూ వేరు వేరుగా ముందుకు సాగుతూ వచ్చాయో, అవి నేడు కేవలం రాజ్య నిర్బంధాన్ని ఎదిరించే దృష్టితోనే ఇంతటి గొప్ప విలీన నిర్ణయాన్ని తీసుకుంటాయా? మీరే ఆలోచించి చూడండి, అది ఏ మేరకు సరైందవుతుందో.

ఇప్పుడు నేను మీ ప్రశ్నకు వేరే కోణంలోంచి జవాబు చెబుతాను. 1981 నుండే ఎంసీసీ సంస్థాపక నేత కామ్రేడ్ కేసీ చొరవతో కామ్రేడ్ కేఎస్ నాయకత్వంలోని అప్పటి సీపీఐ (ఎం-ఎల్) [పీడబ్ల్యూ]తో మొదలై సాగుతూ వచ్చిన ఐక్యతా చర్చలు 1995లో విఫలమయ్యాయన్న సంగతి మీకూ తెల్సిందే. ఆ తర్వాత మళ్లీ 2003 ఫిబ్రవరి నుండి మేం ఐక్యతా చర్చలను ప్రారంభించగలిగాం. అదే సమావేశంలో ఇరు పక్షాల మధ్య విభిన్న మౌలిక రాజకీయ, ఆచరణాయుత అంశాలపై సుదీర్ఘమైన చర్చలూ, వాదవివాదాలూ జరగడం ద్వారా ఒక అడ్డంకిని అధిగమించినట్టయింది. ఈ సానుకూల ఫలితంపై ఆధారపడి ఐక్యతా చర్చలను నిరంతరాయంగా కొనసాగించాలనే గొప్ప నిర్ణయం తీసుకున్నాం. అట్లాగే కొన్ని మౌలిక డాక్యుమెంట్లు రూపొందించాలనీ, వాటిపై ఆధారపడి ఐక్యతా ప్రక్రియను పరిపూర్తి చేయాలని కూడా నిర్ణయించాం. ఆ డాక్యుమెంట్లు ఇవి – మార్క్సిజం-లెనినిజం-మావోయిపు ఉజ్వలమైన అరుణ పతాకాన్ని సమున్నతంగా ఎత్తిపడదాం, పార్టీ కార్యక్రమం, భారత విప్లవ వ్యూహం-ఎత్తుగడలు, రాజకీయ తీర్మానం (అంతర్జాతీయ పరిస్థితీ, దేశీయ పరిస్థితీ), పార్టీ నిబంధనావళి.

ఒకవేళ మా ఈ విలీనానికి కారణం రాజ్య నిర్బంధాన్ని ఎదుర్కోవడమే అయితే డాక్యుమెంట్లు రూపొందించాలనే నిర్ణయం చేసి ఉండే వాళ్లం కాదు. రాజ్య నిర్బంధాన్ని ప్రతిఘటించడానికి గాను ఇరు పక్షాల మధ్య సంబంధాలను ఎట్లా మరింత పటిష్టం చేయాలో, ఏయే పద్ధతులు అవలంబించాలో నిర్ణయించుకునే వాళ్లం.

కానీ అట్లా జరుగలేదు. గత ఇరవై నెలల పాటు నాలుగు దఫాలుగా ద్వైపాక్షిక చర్చలు జరిగాయి. ఈ క్రమంలో ఈ డాక్యుమెంట్ల ముసాయిదాల్ని తయారు చేసుకున్నాం. అట్లాగే సంబంధిత మౌలిక సమస్యలన్నిటి పైనా విస్తృతంగా చర్చలు జరిపి ఒక సాధారణ అంగీకారానికొచ్చాం. ఆ తర్వాతనే విలీనం గురించిన ఈ చారిత్రాత్మక నిర్ణయానికొచ్చాం.

కాబట్టి, మౌలిక రాజకీయ, నిర్మాణ అంశాలపై అంగీకారం ప్రాతిపదికనే ఈ చారిత్రాత్మక విలీన ప్రక్రియను పరిపూర్తి చేయగలిగామని స్పష్టంగా చెప్పొచ్చు. ఒక గట్టి రాజకీయ, సైద్ధాంతిక, నిర్మాణ పంథా పునాదిపైనే భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) ఏర్పాటు జరిగింది.

ఇప్పుడు మీ ప్రశ్నలోని చివరి భాగానికొస్తాను. ఈ ఐక్యతను భావజాలంపై ఆధారపడిన ఒక నిజమైన ఐక్యత అని అనవచ్చానని మీరడిగారు. అననూ వచ్చు, అనకపోనూ వచ్చునేదే నా జవాబు. ఎందుకంటే భావజాలంపై ఆధారపడిన నిజమైన ఐక్యతను సంపూర్ణ అర్థంలో తీసుకోగూడదు. దీన్ని సాపేక్షికంగానే చూడాల్సిన అవసరం ఉంది. అంటే ఈ ఐక్యత మౌలికంగా, ముఖ్యంగా సిద్ధాంతంపైన ఆధారపడిన నిజమైన ఐక్యత. అయితే దీనికి ఒక అప్రధానమైన పార్శ్వం కూడా ఉంది. అంటే దీనిని ఇంకా సిద్ధాంతంపై ఆధారపడిన నిజమైన ఐక్యతగా అభివృద్ధి చేయడం కోసం పోరాడాల్సిన అవసరం ఉంది. ఇక్కడ ప్రధానమైన పార్శ్వం ఐక్యత కాగా అప్రధానమైన పార్శ్వం పోరాటం. అట్లాగే, గతితార్కిక భౌతికవాదం మనకు

చెప్పేదేమిటంటే, సిద్ధాంతంపై ఆధారపడిన నిజమైన ఐక్యతను సాధించడం ఒక గతితార్కిక క్రమం ద్వారానే, అంటే ఐక్యత-పోరాటం-ఐక్యత అనేక క్రమం ద్వారానే సాధ్యం కాగలదు. "ఒకటి రెండుగా విభజితమవుతుంది" అనే మావోయిస్టు దృక్పథంతో మనం ఈ అంశాలన్నిటినీ పరిశీలిస్తే... ప్రతికూల అంశాల్ని నిరాకరిస్తూ, సానుకూల అంశాల్ని పటిష్టం చేసుకుంటూ పోయే క్రమంలోనే సిద్ధాంతంపై ఆధారపడిన నిజమైన ఐక్యతను సాధించే ప్రక్రియను సరైన పద్ధతిలో ముందుకు తీసుకెళ్ళగల్గుతాం.

మీ ప్రశ్నకు జవాబుగా చివరగా చెప్పేది ఏంటంటే, ఒక గట్టి రాజకీయ-సైద్ధాంతిక పునాదిపై నిలబడకుండా, ఒక సరైన మార్క్సిస్టు సైనిక పంథా లేకుండా రాజ్య నిర్బంధాన్ని ప్రతిఘటించడం ఏ మాత్రం సాధ్యం కాదు. కాబట్టి రాజకీయంగా, సైద్ధాంతికంగా గట్టిదైన ఒక పార్టీ లేకుండా మనం ఏమీ చేయలేం.

**పీపుల్స్ మార్చ్ :** ఇప్పటి దాకా మీ రెండు పార్టీల మధ్య సంబంధాల్లో ఒక చెడు అధ్యాయం కూడా చోటు చేసుకుంది కదా! ఆ సందర్భంగా ఒకరినొకరు చంపుకున్నారు కూడా. ఇలాంటి తీవ్రమైన విభేదాలను పరిష్కరించుకొని మీరు ఇంత వేగంగా ఐక్యత దిశగా ఎలా పురోగమించగలిగారు?

**కిషన్ :** మా ఇరు పక్షాల మధ్య సంబంధాల విషయంలో గడచిన ఒక చెడు అధ్యాయం, లేదా చీకటి అధ్యాయం గురించి సరైన అవగాహనకు రాగలగడమే అన్నిటికన్నా ముఖ్యమైన విషయం. పరస్పర సంబంధాల్లో ఈ ఉద్రిక్తపూరిత అధ్యాయాన్ని మేమొక చీకటి అధ్యాయంగా గుర్తించే దాకా ఈ సమస్యకు పరిష్కారం సాధ్యం కాలేదు. రెండోది, ఈ చీకటి అధ్యాయానికి స్వయంగా మేమే కారణమన్న అవగాహనకు రావడం చాలా ఆవశ్యకమైంది. మూడోది, మనం హృదయపూర్వకంగా ఆత్మవిమర్శ చేసుకోవాల్సిన అవసరం ఉందనీ, అది కూడా సాధారణ కార్యకర్తల ఎదుటా, విప్లవ ప్రజానీకం ఎదుటా చేసుకోవాలనే అవగాహనకు రావడం కూడా అవసరంగా ఉండింది.

ఎప్పుడైతే మనం మన తప్పుల్ని స్వయంగా అర్థం చేసుకుంటామో అప్పుడిక కఠినాతికఠినమైన సమస్యను కూడా పరిష్కరించుకోవడంలో ఏ ఇబ్బందీ రాదు. మనం ఈ భావాన్ని గ్రహిస్తే, లేదా ఈ భావాన్ని గ్రహించిన తర్వాతనే ఒక నిజమైన, వాస్తవికమైన ఆత్మవిమర్శ చేసుకోవడంలో ఎలాంటి మొహమాటం ఉండదు. చీకటి అధ్యాయానికి సంబంధించిన పై సమస్యను పరిష్కరించుకునే విషయంలో కూడా సరిగ్గా ఇదే జరిగింది. నేడు మేం ఇరువురం ఈ సమస్యకు సంబంధించిన సరైన అంశాలపై హృదయపూర్వకంగా ఆత్మవిమర్శ చేసుకున్నాం, ఇక ముందు కూడా చేసుకుంటాం. మేం ఇరువురం విప్లవ శ్రేణుల ఎదుటా, ప్రజల ఎదుటా మా ఆత్మవిమర్శల్ని రాతపూర్వకంగా, బాహాటంగా ప్రవేశపెట్టాం. భవిష్యత్తులో కూడా మేం ఇదే పద్ధతిని అనుసరిస్తాం.

ఈ ప్రక్రియ ద్వారా మేం ఈ చీకటి అధ్యాయాన్ని ఒక నూతన ఉజ్వల అధ్యాయంగా విజయవంతంగా మలచడంలో సఫలమయ్యాం. ఈ ప్రక్రియ ద్వారానే, అంటే నిజమైన ఆత్మవిమర్శనా క్రమం ద్వారానే మేం ఈ చెడు అంశాన్ని మంచి అంశంగా మల్చడంలో జయప్రదమయ్యాం.

ఈ సమస్య సరిగ్గా పరిష్కారమయ్యాక ఇక ఐక్యతా ప్రక్రియ ముందుకు సాగాల్సిందే. జరిగింది కూడా సరిగ్గా ఇదే.

ఇంత వేగంగా ఐక్యత వైపు ముందుకు సాగడం ఎలా సాధ్యపడిందని మీరడిగారు కదా! నిజమే, చీకటి అధ్యాయం ఉనికిలో ఉండిందన్న వాస్తవాన్ని దృష్టిలో ఉంచుకున్నప్పుడు ఇలాంటి ప్రశ్న తలెత్తడం చాలా సహజమని నేననుకుంటాను. అయితే, గతంలో ఎంసీసీఐ, సీపీఐ (ఎం-ఎల్) [పీడబ్ల్యూ]ల మధ్య కొనసాగిన సుదీర్ఘమైన సౌహార్ద సంబంధాలలో హృదయపూర్వకమైన, బలమైన, సౌహార్దమైన సంబంధాల అంశం ప్రధానమైంది కాగా చీకటి అధ్యాయపు అంశం అప్రధానమైందన్న విషయాన్ని ఎప్పుడూ మరవకూడదు. ఈ రెండు సంస్థల మధ్య గత ఇరవై నాలుగు సంవత్సరాల పాటు కొనసాగిన స్నేహ సంబంధాల పైనా, రాజకీయ సమస్యలనూ సంయుక్త కార్యక్రమాలనూ చేపడుతూ నిర్వహించిన అనేకానేక ద్వైపాక్షిక సమావేశాల పైనా చూపు సారిస్తే గనుక నేటి ఈ ఐక్యత వెనుక ఒక సుదీర్ఘమైన రాజకీయ చర్చల చరిత్ర ఉందన్న విషయాన్ని అర్థం చేసుకోవచ్చు. కాబట్టి, సమగ్రంగా ఆలోచిస్తే ఈ తుది ఐక్యత చాలా వేగంగా కూడా ఏమీ ఏర్పడలేదు. నిజానికి సరైన మార్క్సిస్టు-లెనినిస్టు పద్ధతుల ద్వారానే, ఎంతో వేడిగా సాగిన రాజకీయ చర్చల క్రమం ద్వారానే ఈ తుది ఐక్యతా ప్రక్రియ జయప్రదమైంది.

**పీపుల్స్ మార్చ్ :** దేశంలో ఇంకా కొన్ని విప్లవకర గ్రూపులున్నాయి. వాటి పట్ల మీ సమైక్య పార్టీ వైఖరి ఏమిటి?

**గణపతి :** దేశంలో ఇంకా కొన్ని విప్లవకర గ్రూపులున్న మాట నిజమే. అట్లాగే ఎన్నో నిజమైన విప్లవకర శక్తులు విప్లవ శిబిరంలోని మితవాద అవకాశవాద పార్టీల్లో ఉన్నాయి. వీరితో పాటు, ప్రస్తుతం ఏ పార్టీలోనూ లేని అనేక మంది కామ్రేడ్స్ విడిగా ఉన్నారు. అయితే వాళ్ళంతా ఏదో ఒక సమయంలో ఏదో ఒక ఎం-ఎల్ గ్రూపులో ఉన్న వారే. వాళ్ళు కూడా దేశంలోని విప్లవ క్యాంపులో భాగమే. మా సమైక్య పార్టీకి వెలుపల ఉన్న నిజమైన విప్లవ గ్రూపులతోనూ, శక్తులతోనూ, వ్యక్తులతోనూ ఐక్యం కావాలని మేం కోరుకుంటున్నాం. కాబట్టి ఈ శక్తులన్నిటితో ఐక్యత సాధించడం మా పార్టీ నిర్మాణంలో ఒక ముఖ్యమైన కర్తవ్యంగా ఉంది. ఈ కర్తవ్యాన్ని సూత్రబద్ధంగా నెరవేర్చడానికి మేం తీవ్రంగా కృషి చేస్తాం. ఇందు కోసం మేం రివిజనిజానికీ, విప్లవ క్యాంపులో నెలకొని ఉన్న సంస్కరణవాదం, ఆర్థికవాదం, పార్లమెంటరిజం, ఆధునికానంతరవాదం వగైరా కార్మికవర్గేతర ధోరణులకూ వ్యతిరేకంగా లోతుగానూ, నిలకడగానూ పోరాడుతాం. ఈ పెడ ధోరణులు ప్రజల్ని విప్లవ మార్గం నుండి పక్కదారి పట్టిస్తాయి. దీని కోసం మేం రాజకీయ, భావజాల సమస్యలపైనా, ఎత్తుగడల పైనా వాదవివాదాల్ని నిర్వహిస్తాం.

**పీపుల్స్ మార్చ్ :** దేశ ప్రజలపై ఈ ఐక్యత ప్రభావం ఎలా ఉండబోతోంది?

**కిషన్ :** ఈ ఐక్యతా, సీపీఐ (మావోయిస్టు) ఆవిర్భావం భారత కార్మికుల పైనా, కర్షకుల పైనా, ఇంకా కష్టజీవులైన ప్రజలందరి పైనా ఒక అపూర్వమైన సానుకూల ప్రభావాన్ని కలుగజేస్తుంది. ఇవాళ పరిస్థితి ఏంటంటే, ప్రజల పక్షమని చెప్పుకునే గాంధీవాద, ఓట్ల కోసం కొట్లాడే, నకిలీ కమ్యూనిస్టు పార్టీల ముసుగు చాలా వరకు తొలగిపోయింది. ప్రజలు విముక్తి పోరాటంలో తమకు సరిగ్గా నాయకత్వం వహించే సామర్థ్యం గల ఒక పార్టీ కోసం చాలా కాలంగా వేచి చూస్తున్నారు. ఇలాంటి పరిస్థితిలో విప్లవకర వర్గ

పోరాటంలోనూ, వ్యవసాయ విప్లవ గెరిల్లా యుద్ధ నిర్వహణలోనూ అనుభవాలను గడించిన సీపీఐ (మావోయిస్టు) ఆవిర్భవించడం ప్రజల దృష్టిలో చాలా ప్రాధాన్యత గలిగిన సంఘటన. కాబట్టి ఈ ఐక్యత ప్రజలలో చాలా విస్తృతమైన సానుకూల ప్రభావాన్ని కలుగజేస్తుందని కచ్చితంగా చెప్పొచ్చు.

నూతన పార్టీ ఆవిర్భావానికి సంబంధించిన అంశాల్లో ఇదొకటి. ఇక మిగతా అంశాలను చూసినట్టయితే... ఈ పార్టీ ఏర్పాటైందన్న ప్రకటన వెలువడగానే శత్రువులూ, రివిజనిస్టులూ అంతా కోపంతో వెర్రెత్తి పోవడం ఖాయం. పై రెండు ఘటనలూ తప్పక జరుగుతాయని చెప్పొచ్చు.

**పీపుల్స్ మార్చ్ :** ఇక ఇతర ప్రశ్నలు కొన్ని. గత 35 ఏళ్ల సుదీర్ఘ చరిత్రలో మీ రెండు పార్టీలు సాధించిందేమిటి? భారత విప్లవ రాజకీయ, భావజాల పంథాను అభివృద్ధి చేయడంలో మీ రెండు పార్టీలూ నిర్వహించిన పాత్ర ఏమిటి?

**గణపతి :** మా గత చరిత్రలో గడచిన 35 ఏళ్లను పరిశీలిస్తే... భారత విప్లవోద్యమంలోనూ, అనేక దేశాల్లోనూ వెల్లువెత్తిన అన్ని గందరగోళాల మధ్యా, అపజయాల మధ్యా మేం భారత విప్లవ నిర్దిష్ట పరిస్థితులకు ఎం-ఎల్-ఎంను అన్వయించడంలో చాలా మేరకు, మౌలికంగా సఫలమయ్యాం. ఎన్నో మహత్తర విజయాలను సాధించాం.

ఒక సమిష్టి నాయకత్వాన్ని కలిగి ఉన్న ఈ సమైక్య పార్టీ ఏర్పాటుతో భావజాలపరంగానూ, రాజకీయంగానూ పరిపక్వత గల పార్టీ, ఒక కొత్త తరహా పార్టీ అవతరించింది. ఇది దశాబ్దాల పాటు తీక్షణమైన వర్గ పోరాటంలోనూ, గెరిల్లా యుద్ధాన్ని పురోగమింపజేసే క్రమంలోనూ పదును దేరి అభివృద్ధి చెందిన పార్టీ. ఈ క్రమంలో మేం భారత విప్లవ నిర్దిష్ట పరిస్థితుల్లో పార్టీ పంథాను కూడా అభివృద్ధి చేశాం. దీన్ని విజయవంతంగా అమలు చేయడం ద్వారానే నేడు మేమున్న తరహా శక్తిగా ఎదగగలిగాం. ప్రస్తుత ఐక్యత ద్వారా మేం భారతదేశంలోని విప్లవకర శక్తులలో అత్యధికుల మధ్య ఐక్యతను సాధించాం. దీనికిదే ఒక బ్రహ్మాండమైన విజయం. డజనుకు పైగా రాష్ట్రాల్లో వ్యాపించిన మా పార్టీ ఇప్పుడు అఖిల భారత స్వభావాన్ని సంతరించుకుంది. ఆంధ్ర, బీహార్, ఝార్ఖండ్, ఛత్తీస్‌గఢ్ వంటి కొన్ని రాష్ట్రాల్లో మేమొక గణనీయమైన శక్తిగా ఉన్నాం. ఈ సమైక్య పార్టీ భారతదేశంలోని విప్లవకారుల్ని సమైక్యం చేయడంతో పాటు, దక్షిణాసియా మావోయిస్టు పార్టీల, సంస్థల సమన్వయ సమితి (సీకంపోసా) ఏర్పాటులో పాల్గొనడం ద్వారా దక్షిణాసియాలో చెప్పుకోదగ్గ సౌహార్ద సంబంధాలను నెలకొల్పుకుంది. అట్లాగే విదేశాల్లోని విప్లవ పార్టీలతో, ప్రత్యేకించి దీర్ఘకాల ప్రజాయుద్ధాన్ని నిర్వహిస్తున్న పార్టీలతో కూడా సంబంధాల్ని కలిగి ఉంది.

దేశంలో మొట్టమొదటిసారిగా, మా రెండు పార్టీలు ప్రజా విముక్తి గెరిల్లా సైన్యాన్ని ఏర్పాటు చేసి గెరిల్లాజోన్లను అభివృద్ధి చేశాయి. విముక్తి ప్రాంతాల స్థాపన దిశగా పురోగమించే దృష్టితో గెరిల్లా యుద్ధాన్ని తీవ్రతరం చేశాయి. ఈ గెరిల్లాజోన్లలో కొన్నిటిలో మేం విప్లవ ప్రజా రాజకీయ అధికారాన్ని బీజరూపంలో స్థాపించగలిగాం. శత్రువు అమలు చేస్తున్న అనేక ఫాసిస్టు చుట్టివేత-అణచివేత క్యాంపెయిన్లను ఎదుర్కొంటూ మేం సాధించిన చెప్పుకోదగిన విజయం ఇది. అనేక ఏళ్లుగా పీఎల్‌జీఏ క్రమంగా బలపడుతూ చిన్న శక్తి నుండి పెద్ద శక్తిగా ఎదిగింది. శత్రువుతో చిన్న చిన్న ఘర్షణల స్థాయి నుండి పెద్ద పెద్ద పోరాటాలు చేసే స్థాయికి ఎదగడం; చిన్న ఫార్మేషన్ల నుండి పెద్ద ఫార్మేషన్లకు ఎదగడం; స్వల్ప సంఖ్య నుండి పెద్ద సంఖ్యకు పెరగడం; కమాండ్ల, కమిషన్ల రూపంలో మరింత క్రమబద్ధమైన నిర్మాణం అభివృద్ధి కావడం; శత్రువు నుండి ఆయుధాల్ని స్వాధీనం చేసుకొని తనకు తాను సాయుధం కావడంలో అది సాధించిన గొప్ప సామర్థ్యం – వీటన్నిటిలోనూ ఇది ప్రతిబింబిస్తుంది. పీఎల్‌జీఏ ఇప్పటికీ చిన్నదే అయినప్పటికీ తన వీరోచిత చర్యలతోనూ, రాష్ట్ర పోలీసు బలగాలకూ, వివిధ ప్రత్యేక బలగాలకూ, వివిధ పారా మిలిటరీ బలగాలకూ వ్యతిరేకంగా అది నిరంతరాయంగా, నిలకడగా సాగించిన ఎత్తుగడలపరమైన సాయుధ ఎదురుదాడులతోనూ ప్రజల కంటి వెలుగయ్యింది. పాలక వర్గాలకు సింహస్వప్నమైంది.

పార్టీ సంక్షోభాల సందర్భంగా జరిగిన లోతైన చర్చలూ, తర్కవితర్కాల నుండి మేం పాఠాలు నేర్చుకున్నాం. ఈ పార్టీ అంతర్గత పోరాటాలు మాకు మరింత ఉన్నత స్థాయిని సాధించే లక్ష్యంతోనూ, తప్పుడు పంథాను ఓడించి తప్పుడు ధోరణులను సరిదిద్దే లక్ష్యంతోనూ కేంద్రీకృత ప్రజాస్వామ్యం ప్రాతిపదికపై రెండు పంథాల పోరాటాన్ని ఎలా నిర్వహించాలనే విషయంలో మెరుగైన అవగాహనను అందించాయి. రెండు పంథాల మధ్య పోరాటాల క్రమం ద్వారా పార్టీ నాయకత్వం, మొత్తం పార్టీ పదును దేరింది. ఒక సమిష్టి నాయకత్వం ఎదిగి వచ్చింది. ఇది మేం సాధించిన చెప్పుకోదగ్గ విజయాల్లో ఒకటి.

మేం జాతులు, దళితులు, ఇతర పీడిత కులాలు, మహిళలు, అల్పసంఖ్యాకులు వగైరా వివిధ పీడిత సెక్షన్ల ప్రజల కోసం కార్మికవర్గ దృక్పథంతో ప్రత్యేకమైన విధానాల్ని రూపొందించాం. ఈ సమస్యలపై అనేక పోరాటాలు నడిపాం.

మేమొక లెక్కించదగిన శక్తిగా ఉన్న ప్రాంతాల్లో రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక పీడనకు సంబంధించిన సమస్యలను బలంగా లేవనెత్తాం. ప్రజలు చెప్పుకోదగ్గ విజయాలు సాధించారు. వీటిలో నిర్మాణపరమైన, అభివృద్ధికి సంబంధించిన కార్యకలాపాలు ఉన్నాయి. ప్రజల రాజకీయాధికారాన్ని స్థాపిస్తున్న ప్రాంతాల్లో శత్రు వర్గాల రాజకీయ అధికారాన్ని పరిమితం చేస్తున్నాం. ఈ ప్రాంతాల్లో ప్రజలు సాపేక్షికంగా ఎక్కువ రాజకీయ చైతన్యం కలిగి ఉన్నారు. బాగా సంఘటితపడి, ఇతర ప్రాంతాలతో పోల్చినపుడు మంచి పని పరిస్థితుల, జీవన పరిస్థితుల ఫలితంగా మెరుగ్గా ఉన్నారు. వాళ్లిప్పుడు మరింత ఆత్మవిశ్వాసంతో ఉన్నారు. చదువూ, జ్ఞానం పెంపొందాయి. వాళ్లిప్పుడు అన్ని ఆధిపత్యాలకూ వ్యతిరేకంగా ఆత్మగౌరవంతో దృఢంగా నిలబడగలరు. భూస్వామ్య వర్గాలు, ప్రభుత్వాధికార్లు వగైరా చెలాయించే నియంతృత్వం, భీభత్సాల నుండి వాళ్లిప్పుడు విముక్తిని పొందారు.

రాజకీయ, భావజాల పంథా అభివృద్ధి విషయానికొస్తే... ఈ సమైక్య పార్టీ కచ్చితంగా పార్టీ పంథాను సుసంపన్నం చేసింది. ఇరు పార్టీలూ తమ గత కాలపు మౌలిక డాక్యుమెంట్లలో రూపొందించిన మౌలిక పంథాకు మేం దృఢంగా కట్టుబడి ఉంటూనే, ఆ తర్వాత ఇన్నేళ్లుగా ప్రజాయుద్ధాన్ని ముందుకు తీసుకెళ్లే క్రమంలో సాధించిన సంపన్నమైన అనుభవాలపై ఆధారపడుతూ, గత మూడున్నర దశాబ్దాల రాజకీయ పరిణామాల్ని పరిగణనలోకి తీసుకుంటూ చాలా భావనల్ని సుసంపన్నం చేశాం. విప్లవానికి అవసరమైన మూడు మంత్రదండాలైన పార్టీ, సైన్యం, ఐక్య సంఘటనలను నిర్మించడంలోనూ, ఎత్తుగడలను రూపొందించడంలోనూ తలెత్తిన "మిత", "అతి"వాద పెడధోరణులు

రెంటికీ వ్యతిరేకంగా మేం పోరాడాం. ప్రజా సైన్యం, గెరిల్లాజోన్లు, బేస్ ఏరియాలు, విప్లవకర ఐక్య సంఘటన; దీర్ఘకాల ప్రజాయుద్ధ పంథాకు దృఢంగా కట్టుబడి ఉండడం; భారతదేశ నిర్దిష్ట పరిస్థితులకు మావోయిస్టు వ్యూహాన్ని సృజనాత్మకంగా అన్వయిస్తూ భారత నిర్దిష్ట పరిస్థితుల్లో పార్లమెంటరీ పోరాట రూపాన్ని పూర్తిగా నిరాకరించడం; రహస్య నిర్మాణ స్వరూపం కలిగి ఉండి వృత్తి విప్లవకారులు (పీఆర్‌లు) ముఖ్య భాగంగా ఉండే ఒక రహస్య పార్టీని నిర్మించడం; విప్లవకర ప్రజాపంథాకు నిలకడగా కట్టుబడి ఉంటూ దీర్ఘకాల ప్రజాయుద్ధ పంథాకు జోడిస్తూ శక్తివంతమైన ప్రజా ఉద్యమాల్ని నిర్మించడం; వగైరా అంశాలపై ఈ పార్టీ ఉన్నత స్థాయి అవగాహనను సాధించింది.

నేడు అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమం ముందున్న కార్మికవర్గ మార్గదర్శక భావజాలం, పెట్టుబడిదారీ విధానపు సాధారణ సంక్షోభం - ప్రపంచ విప్లవంపై దాని ప్రభావం, ప్రధాన వైరుధ్యపు సమస్య, ప్రపంచ యుద్ధ ప్రమాదం, ప్రస్తుత యుగ స్వభావంపై అవగాహన, జాతీయ విముక్తి పోరాటాల ప్రాముఖ్యత – ప్రపంచ సోషలిస్టు విప్లవపు ఈ రెండు ప్రవంతుల్నీ సమైక్యం చేయాల్సిన అవసరం, చివరగా, అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమం (ఐసీఎం)లో రివిజనిజం ప్రమాదం తదితర భావజాల, రాజకీయ అంశాలను మా ఈ సమైక్య పార్టీ చేపట్టింది. ఈ విధంగా ప్రస్తుత ప్రపంచ పరిస్థితికీ, అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమానికీ సంబంధించిన పై అంశాలపై అవగాహనను సంపన్నం చేసింది. వాటి పట్ల స్పష్టమైన కార్మికవర్గ వైఖరిని చేపట్టింది.

సంక్షిప్తంగా చెప్పాలంటే, మునుపటి ఈ రెండు పార్టీలూ నక్సల్బరీ భావజాల, రాజకీయ వారసత్వాన్ని కొనసాగించాయని మేం చెప్పగలం. దాని సానుకూల అంశాలన్నిటినీ స్వీకరిస్తూ పంథాను మరింతగా అభివృద్ధి చేశాం. నిర్దిష్ట పరిస్థితులకు తగిన విధంగా పంథాలో చేసిన మార్పు నూతనంగా రూపొందించిన మార్క్సిజం-లెనినిజం-మావోయిజం, పార్టీ కార్యక్రమం, పార్టీ నిబంధనావళి, వ్యూహం-ఎత్తుగడలు, ప్రస్తుత పరిస్థితిపై రాజకీయ తీర్మానం డాక్యుమెంట్లలో వ్యక్తమవుతుంది.

**పీపుల్స్ మార్చ్ :** ఎంసీసీ 1996 కాన్ఫరెన్సు తర్వాత దాని రాజకీయ, నిర్మాణ, మిలిటరీ పంథాలో వచ్చిన అభివృద్ధి ఏమిటి?

**కిషన్ :** అంతర్జాతీయ స్థాయిలో సామ్రాజ్యవాదంతో పీడిత జాతులకూ, ప్రజలకూ ఉన్న వైరుధ్యమే నేటికీ ప్రధానమైన, నిర్ణయాత్మకమైన వైరుధ్యం. నిరంతరం లోతుగా పెంపొందుతున్న సామ్రాజ్యవాద సంక్షోభం మూలంగా సామ్రాజ్యవాదుల మధ్య వైరుధ్యం కూడా క్రమంగా తీవ్రతరమవుతోంది. ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికాలు విప్లవానికి తుఫాను కేంద్రాలుగా నిల్చి ఉన్నాయి. విప్లవమే నేటి ప్రధానమైన ధోరణి. రివిజనిజమే నేటి యుగపు ముఖ్య ప్రమాదం. పైన పేర్కొన్న కారణాల మూలంగా అంతర్జాతీయ పరిస్థితి రోజురోజుకూ విప్లవానికి మరింత అనుకూలంగా మారుతున్నది. మా 1996 కాన్ఫరెన్సు ఈ విధంగానే పైన పేర్కొన్న నిర్ధారణ చేసింది. మేం దీన్నే అనుసరిస్తూ వచ్చాం. నవంబర్ 2002లో జరిగిన కేంద్ర కమిటీ సమావేశంలో సమాలోచన-విశ్లేషణ చేసిన తర్వాత మేం “రష్యా ఒక బలహీనమైన అగ్రరాజ్యం” అని గతంలో చేసిన విశ్లేషణను తప్పుగా గుర్తించి వెనక్కి తీసుకున్నాం. అమెరికా సామ్రాజ్యవాదాన్ని ఒక అగ్రరాజ్యంగా గుర్తిస్తూ దాన్ని ప్రపంచ ప్రజల నెంబర్ వన్ శత్రువుగా నిర్ధారించాం.

దేశీయ పరిస్థితిని విశ్లేషిస్తూ... అమెరికా సామ్రాజ్యవాద పెత్తనం కింద వివిధ సామ్రాజ్యవాద శక్తులు ఇక్కడ తమ తమ ప్రభావాన్ని పెంచుకునేందుకు పోటీ పడుతున్నాయని మేం భావించాం. బీజేపీ కూటమి నుండి కాంగ్రెస్ కూటమి వరకూ వివిధ ప్రభుత్వాలు దీనికి లోబడే రాజకీయ, ఆర్థిక తదితర విధానాలన్నిటినీ చేపడుతున్నాయి. అదే సమయంలో భారత పాలక ముఠాల మధ్య వైరుధ్యం కూడా క్రమంగా తీవ్రతరమవుతోంది. ఈనాడున్నటువంటి అత్యంత అనుకూలమైన, ఉజ్వలమైన విప్లవ పరిస్థితి నిజానికి ఇంతకు మునుపు చాలా అరుదుగానే కనిపించింది. ఇదే విశ్లేషణపై ఆధారపడి మేం మా మౌలిక, ప్రధాన, కేంద్ర, తక్షణ కర్తవ్యమైన ఎర్ర సైన్యం, విముక్తి ప్రాంతాల నిర్మాణం దిశగా వేగంగా పురోగమించాలనీ, వ్యూహాత్మక ప్రాంతాలను ఎంపిక చేసి అక్కడ పనిని క్రమబద్ధంగా నిర్వహించాలనీ నిర్ణయించాం. ఈ మధ్యనే 2000 జనవరిలో జరిగిన మా కేంద్ర కమిటీ సమావేశంలో తీవ్రంగా చర్చించి, వాదవివాదాలు చేసి మావో ఆలోచనను మావోయిజంగా స్వీకరించాలనీ, మార్క్సిజపు పురోగమన చరిత్రలో మావోయిజాన్ని మూడో, ఉన్నత స్థాయి, గుణాత్మకమైన అభివృద్ధిగానూ, సంపూర్ణంగా నూతన స్థాయిగానూ గుర్తించాలనీ నిర్ణయించాం. దీనితో పాటు, ఇంతే తీవ్రమైన అంతర్గత పోరాటాల ద్వారా మేం మునుపటి పీడబ్ల్యూతో సాగుతున్న సంఘర్షణలను ఏకపక్షంగా నిలుపు చేయాలనే ఒక అత్యంత ప్రాముఖ్యత గల నిర్ణయం కూడా తీసుకున్నాం. అట్లాగే, స్టాలిన్ విషయంలో మేం చాలా రోజులుగా కలిగి ఉన్న వైఖరిపై, అంటే గ్రేట్ డిబేట్ సందర్భంగా కామ్రేడ్ మావో ఆయనను అంచనా వేస్తూ తీసుకున్న వైఖరిపై దృఢంగా నిలబడాలని నిర్ణయం తీసుకున్నాం.

జనవరి 2000లో మేం మావో ఆలోచనను మావోయిజంగా నిర్వచించాలనే నిర్ణయాన్ని తీసుకున్నాం. ఆ తర్వాత మా సంస్థలో ఈ నిర్ణయాన్ని వ్యతిరేకించే, సైన్య నిర్మాణాన్నీ విముక్తి ప్రాంతాల నిర్మాణాన్నీ ఆటంకపర్చే ఒక అవకాశవాద, పార్టీ వ్యతిరేక గ్రూపు తలెత్తింది. దానికి వ్యతిరేకంగా మేం తీవ్రమైన పోరాటం చేసి దాన్ని నిర్మూలించాం. అట్లాగే మేం అంతర్జాతీయ స్థాయిలో నిజమైన మావోయిస్టులతో సమైక్యమవడానికి చొరవ తీసుకున్నాం. ఈ క్రమంలోనే రిమ్ (ఆర్ఐఎం – విప్లవకర అంతర్జాతీయవాద ఉద్యమం)లో సభ్యత్వం తీసుకున్నాం. దీనితో పాటు దేశ స్థాయిలో కూడా నిజమైన మావోయిస్టులతో ఐక్యత సాధించడానికి మేం అత్యున్నత ప్రాథమ్యతనిచ్చాం, ఇందులో సఫలమయ్యాం కూడా. దీనికి తోడు, మునుపటి ఎంసీసీఐ ప్రతి రంగంలోనూ పెద్ద ఎత్తున అభివృద్ధిని సాధించింది. కేంద్ర కమిటీ మొదలుకొని అన్ని కమిటీలనూ సంఖ్యా రీత్యా, గుణం రీత్యా శక్తివంతంగా తయారు చేయడంలోనూ, ఒక మావోయిస్టు సైనిక పంథానూ, సైన్య నిర్మాణాన్నీ క్రమబద్ధీకరించే దిశను నిర్ధారించడంలోనూ మేమొక పెద్ద గెంతు వేశాం. మేం కేంద్ర మిలిటరీ కమిషన్ వంటి ఒక అత్యంత ముఖ్యమైన విభాగాన్ని ఏర్పాటు చేసాం. ఏప్రిల్ 22, 2003 నాడు మేం ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం (పీఎల్‌జీఏ) ఏర్పడినట్టుగా లాంఛనంగా ప్రకటించాం. మా ఈ సాహసిక సైన్యం గత అనేక సంవత్సరాలుగా పలు ఉజ్వలమైన, వీరోచితమైన పోరాటాలు చేసింది. టేకారీ, ప్రేత్‌శిలా, తోప్‌చాంచీ, చుర్చూ, చంద్రపురా, సిమర్థానీ, సారండా పోరాటాలు గెరిల్లా దాడులకు కొన్ని మంచి ఉదాహరణలు. సంక్షిప్తంగా చెప్పాలంటే, మునుపటి ఎంసీసీఐ 1996లో జరిగిన రెండో కేంద్ర మహాసభ తర్వాత, ప్రత్యేకించి

2000 తర్వాత పార్టీలో ఒక తీవ్రమైన రెండు పంథాల పోరాటాన్ని నిర్వహించి తప్పుడు పంథాను సిద్ధాంతంలోనూ, ఆచరణలోనూ ఓడించింది. ముందటితో పోల్చినపుడు అన్ని రంగాల్లోనూ మేమొక గుణాత్మక గెంతు వేయడంలో సఫలమయ్యాం.

**పీపుల్స్ మార్చ్ :** మీ రెండు పార్టీలూ ప్రధానంగా దేశంలో బాగా వెనుకబడిన అటవీ ప్రాంతాలకే పరిమితమై ఉన్నాయి. అత్యధిక జనాభా నివసించే మైదాన, పట్టణ ప్రాంతాలపై ఈ 35 ఏళ్ల కాలంలో మీరెందుకు ఎక్కువగా ప్రభావం చూపలేకపోయారు?

**గణపతి :** మేం అటవీ ప్రాంతాలకు మాత్రమే పరిమితమయ్యామని మీరంటున్నది నిజం కాదు. అయితే మా ఉద్యమం మైదానాలతోనూ, పట్టణ ప్రాంతాలతోనూ పోలిస్తే అటవీ ప్రాంతాల్లో బలంగా ఉందన్నది నిజం. ఈ కేంద్రీకరణ మా పంథాకు అనుగుణమైందే. భారత విప్లవ ప్రత్యేక లక్షణాలపై ఆధారపడుతూ మేం దీర్ఘకాల ప్రజాయుద్ధాన్ని విప్లవ పంథాగా నిర్ణయించాం. మొట్టమొదట వెనుకబడిన ప్రాంతాల్లో విముక్తి ప్రాంతాలను ఏర్పర్చి వాటిని ఇతర ప్రాంతాలకు వ్యాపింపజేసి, అంతిమంగా గ్రామీణ ప్రాంతం నుండి నగరాలను చుట్టుముట్టడం ఇందులో కీలకమైంది. కాబట్టి ఈ వ్యూహాత్మక అవగాహనకు అనుగుణంగానే ఎక్కడైనా, అంటే అటవీ ప్రాంతంలోనైనా కావచ్చు లేదా మైదానాల్లో, పట్టణాల్లో కావచ్చు, పనిని ప్రారంభించాల్సి ఉంటుంది. అటవీ ప్రాంతాలూ, పర్వత ప్రాంతాలూ సహజంగానే ప్రాధాన్యతను సంతరించుకుంటాయి. ఎందుకంటే విముక్తి ప్రాంతాలను నెలకొల్పేందుకు ఇవి వ్యూహాత్మక ప్రాంతాలు కాబట్టి. అయితే మేం మైదాన ప్రాంతాలను నిర్లక్ష్యం చేశామనడం సరైంది కాదు. మేం ఆంధ్రలోనూ, బీహార్‌లోనూ మైదాన ప్రాంతాల్లో విస్తృతమైన భూస్వామ్య వ్యతిరేక, సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాల్ని నిర్మించాం. కొన్ని రాష్ట్రాల్లో ఇప్పటికీ మా పార్టీ మైదాన ప్రాంతాల్లో పని చేస్తోంది. వాస్తవానికి, ఆంధ్రలోనూ, బీహార్-ఝార్ఖండ్‌లలోనూ మైదాన ప్రాంతాల్లో విప్లవోద్యమాన్ని అభివృద్ధి చేయడం ద్వారానే చాలా మంది కేడర్లు, నాయకత్వం లభించడంతో పాటు, ఉద్యమానికి పేరు ప్రతిష్ఠలు కూడా లభించాయి. మేం మా స్వీయాత్మక శక్తుల కోసం, వస్తు సహాయం కోసం, నిర్దిష్ట అనుభవం కోసం మైదాన ప్రాంతాలపై ఆధారపడుతూనే, అక్కడి నుండి ప్రారంభమవుతూనే అటవీ ప్రాంతాల్లో బలమైన ఉద్యమాలను నిర్మించాం.

ఈ క్రమంలో, శత్రువు సాగించిన అత్యంత క్రూరమైన, ఫాసిస్టు అణచివేత క్యాంపెయిన్ల మూలంగా మేం నాయకత్వాన్నీ, కేడర్లనూ పెద్ద సంఖ్యలో కోల్పోయాం. దీనికి అనుగుణంగా మా ఎత్తుగడల్ని మార్చుకొని కొత్తగా ఎత్తుగడల్ని రూపొందించడానికి ప్రయత్నిస్తున్నాం. మైదాన ప్రాంతాల్లో అనుసరించాల్సిన పోరాట, నిర్మాణ రూపాలనూ, పని పద్ధతులనూ మార్చుకుంటున్నాం. దీర్ఘకాల ప్రజాయుద్ధ పంథాను అనుసరిస్తూ మైదాన ప్రాంతాల్లో విప్లవోద్యమాన్ని నిర్మించే వ్యూహాత్మక పథకానికి అనుగుణంగా నడుచుకుంటూ, వేలాది మంది అమరులు చిందించిన రక్తంతో ఎరుపెక్కిన మా ఆచరణ ద్వారా మేం విలువైన అనుభవాన్ని గడించాం. అట్లాగే భారత ఉపఖండంలోని పీడిత జాతులు చేస్తున్న సాయుధ పోరాటాల అనుభవం నుండి కూడా మేం నేర్చుకున్నాం. మా విప్లవ పంథాను, అంటే దీర్ఘకాల ప్రజాయుద్ధాన్ని ముందు నిలబెడుతూ మేం మైదానాల్లో, నగరాల్లో, గ్రామాల్లో పని చేస్తున్నాం. వ్యూహాత్మక ప్రాంతాల్లో మా శక్తుల్ని పటిష్టం చేసుకుంటున్నాం. నక్సల్బరీ, శ్రీకాకుళం, బీర్భూం వగైరా మొదటి దఫా పోరాటాల అనుభవాలు మా ముందున్నాయి. ఆ తర్వాత 1970ల చివరి నుండి మేం ప్రత్యక్షంగా సంపాదించిన సాయుధ పోరాట అనుభవం మాకుంది. ఈ అనుభవమే స్వతహాగా దీర్ఘకాల ప్రజాయుద్ధ పంథా సాధికారతను నిరూపించింది. కాబట్టి, వ్యూహాత్మక ప్రాంతాల్లో కేంద్రీకరిస్తూనే మేం మైదానాలలోనూ, పట్టణాలలోనూ పని చేశాం. ఈ పనిని వ్యూహాత్మక ప్రాంతాల్లో పనితో సమన్వయించాం. ఈ దృష్టి లోపించినట్టయితే మేం కూడా పలు ఇతర ఎం-ఎల్ పార్టీల్లా, గ్రూపుల్లా మితవాద పెడధోరణులకు లోనయ్యే వాళ్లం.

విప్లవం ఒకరి సొంత కోర్కెలకు అనుగుణంగా అభివృద్ధి చెందదు. భారత సమాజ స్వభావాన్ని బట్టి, విప్లవ దశను బట్టి నిర్ణయమైన కొన్ని నియమాలను అది అనుసరిస్తుంది. దీర్ఘకాల ప్రజాయుద్ధ సాధారణ నియమాలను భారత విప్లవ నిర్దిష్ట లక్షణాలకు అన్వయించాల్సి ఉంటుంది. విప్లవ క్రమంలో మనం సొంతంగా ఈ నియమాలు కనుగొని వాటికి అనుగుణంగా అత్యంత సమర్థవంతమైన పద్ధతిలో ఈ పని చేయాల్సి ఉంటుంది.

మేం మొదలు పెట్టింది మైదాన ప్రాంతాల్లోనే అయినప్పటికీ ఇవాళ మేం అటవీ ప్రాంతాల్లో బలంగా ఉన్నాం. ఎందుకంటే ఇవి విముక్తి ప్రాంతాల్ని నిర్మించడానికి పర్‌స్పెక్టివ్ ప్రాంతాలు గనుక. ఈ ప్రాంతాలలో మేం రాజకీయాధికారాన్ని చేజిక్కించుకోవడం కోసం వర్గ పోరాటాన్ని ఉధృతం చేస్తూ విస్తరిస్తున్నాం.

ఒక బలమైన ప్రజా సైన్యాన్ని నిర్మించేందుకూ, విశాల ప్రజానీకాన్ని రాజకీయంగా కూడగట్టి శత్రు వర్గాల రాజకీయాధికారాన్ని కూలగొట్టి ప్రజల రాజకీయాధికారాన్ని స్థాపించేందుకూ వ్యూహాత్మక ఆవశ్యకతగా కూడా మేం అటవీ ప్రాంతాలపై కేంద్రీకరిస్తున్నాం. మేం దీర్ఘకాల ప్రజాయుద్ధ సూత్రాలకు అనుగుణంగా (విశాలంగా) మూడు రకాల ఉద్యమాల్నీ – అటవీ, మైదాన, పట్టణ – పరస్పరం సమన్వయిస్తున్నాం.

భారత విప్లవ క్రమంలో నిర్దిష్టత ఏంటంటే, నక్సల్బరీ, శ్రీకాకుళం తదితర చారిత్రాత్మక విప్లవోద్యమాల తర్వాత ఎం-ఎల్ ఉద్యమం తీవ్రమైన వెనుకంజకూ, చీలికలకూ గురైంది. ఈ నిర్దిష్టతకు మరో పార్శ్వం ఏంటంటే దేశంలో రెండు స్వతంత్రమైన మావోయిస్టు స్రవంతులైన ఎం-ఎల్ స్రవంతీ, ఎంసీసీ స్రవంతీ ఉనికిలో ఉండడం, కొనసాగడం. ఈ ఎగుడుదిగుళ్లన్నీ ఉన్నప్పటికీ కూడా మేం ఓటమి నుండి కోలుకొని విప్లవోద్యమాన్ని పునర్నిర్మించాం. క్రమక్రమంగా దేశంలోని విప్లవ శక్తులను ఐక్యం చేశాం. ఈ క్రమంలో మా రెండు మావోయిస్టు స్రవంతులు ఐక్యమవడం అత్యంత సానుకూలమైన అంశం.

ఈ సానుకూల పరిణామాలు ఇలా ఉన్నప్పటికీ పట్టణ ప్రాంతాల్లో విప్లవకర శక్తులు ఇప్పటికీ బలహీనంగా ఉన్నాయి. రివిజనిస్టు నాయకత్వం ఇప్పటికీ ఎన్నో ప్రాంతాలపై పట్టు కలిగి ఉంది. కార్మిక సంఘాలపై దేశవ్యాప్త పట్టు కలిగిన రివిజనిజం ప్రమాదకరంగా ఉంది. అది పట్టణ ప్రాంతాల్లో విస్తృతమైన ప్రభావాన్ని కలిగి ఉంది. దేశంలోని కొన్ని ప్రాంతాల్లో రైతుల్లో అది తన పట్టును కోల్పోతున్నప్పటికీ ఇప్పటికీ ప్రభావాన్ని కలిగి ఉంది. ఇది ప్రభుత్వంలో కూడా ఉనికిలో ఉండి మూడు రాష్ట్రాల్లో విస్తృత ప్రభావాన్ని కలిగి ఉంది. ఎర్రజెండా ముసుగులో రివిజనిస్టులు బూర్జువా భావజాలాన్నీ, రాజకీయాలనూ ప్రచారం చేస్తారు. సంస్కరణవాద రాజకీయాలను చేపడతారు. దేశంలో తిరోగమనవాద పాలక వర్గాల పాలనకు ముఖ్యమైన ప్రాపుగా

ఉంటారు. పీడిత ప్రజల రాజకీయాల్లోకి పార్లమెంటరీవాదాన్నీ, ఆర్థికవాదాన్నీ, సంస్కరణవాదాన్నీ చొప్పించడంలో రివిజనిజం ఒక ముఖ్యమైన వనరుగా ఉంది. కార్మికవర్గ ఉద్యమాల్నీ, పట్టణోద్యమాల్నీ నిర్మించడంలో ఇది ప్రధాన అడ్డంకిగా తయారైంది. కొన్ని ప్రాంతాల్లో రివిజనిస్టు రాజకీయాలూ, ఆచరణల సుదీర్ఘ ప్రభావం ఉంది కనుక అక్కడ దాన్ని బద్దలు కొట్టడం కోసం మరింత ఓపికా, నిలకడతత్వం, సృజనాత్మకమైన విప్లవకర చొరవా అవసరమవుతాయి.

నగరాలూ, పట్టణాలూ సామ్రాజ్యవాదులకూ, భారత పాలక వర్గాలకూ కోటలుగా ఉన్నాయి. అయినప్పటికీ కొన్ని పట్టణాల్లోనూ, నగరాల్లోనూ గతంలో మేం శక్తివంతమైన కార్మికవర్గ ఉద్యమాల్ని నిర్మించి సామ్రాజ్యవాదులలో, పాలక వర్గాలలో భయాందోళనల్ని వ్యాపింపజేశాం. మరోవైపు ప్రజలపై, ప్రత్యేకించి కార్మిక వర్గం పైనా, విద్యార్థుల పైనా, మేధావుల పైనా ఒక సానుకూల ప్రభావాన్ని పడవేశాం. అయితే ఆ ఉద్యమాలు అనేక నష్టాలకు గురయ్యాయి. ఈరోజు మేం పట్టణ ప్రాంతాల్లో ఒక బలహీనమైన శక్తిగానే ఉన్నప్పటికీ చాలా రాష్ట్రాల్లోని అనేక నగరాల్లోనూ, పట్టణాల్లోనూ మేం ఉన్నాం. కార్మిక వర్గ ఉద్యమాల్నీ, పట్టణోద్యమాన్నీ అభివృద్ధి చేయడానికి ప్రయత్నిస్తున్నాం. గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి చెందుతున్న సాయుధ పోరాటాల ప్రభావం కూడా పట్టణ ప్రాంతాల్లో బాగా ఉంది.

ఆఖరుగా, ఈ విషయాన్ని ముగించే ముందు... వ్యూహాత్మక ప్రాంతాల్లో విముక్తి ప్రాంతాల్ని నిర్మించే లక్ష్యంతో గెరిల్లా యుద్ధాన్ని పురోగమింపజేయడానికీ, విస్తృతం చేయడానికీ మేం గొప్ప పట్టుదలతో శక్తి వంచన లేకుండా కృషి చేస్తాం. భారతదేశంలోని విశాల మైదానాల్లో విప్లవోద్యమాన్ని పునర్నిర్మించడానికీ, సంఘటితం చేయడానికీ, విస్తృతం చేయడానికీ మా ఎత్తుగడల్ని మెరుగుపర్చుకుంటాం, అభివృద్ధి చేస్తాం. విశాల ప్రజారాశుల వర్గ పోరాటాల మహా సముద్రంలో శత్రువును ముంచెయ్యడానికి ప్రజాయుద్ధాన్ని పురోగమింపజేస్తాం. వ్యూహాత్మక దిశనూ, మన దేశంలో మార్పు చెందుతున్న సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితుల్నీ దృష్టిలో ఉంచుకుంటూ కార్మికవర్గ పోరాటాల్నీ, పట్టణోద్యమాల్నీ పునర్నిర్మిస్తాం, సంఘటితం చేస్తాం, విస్తృతపరుస్తాం.

భారతదేశం బాగా భిన్నత్వం కలిగిన, సంక్లిష్టమైన సామాజిక వ్యవస్థ కలిగిన విశాలమైన దేశం. ఇక్కడ శత్రువు బాగా బలంగా ఉన్నాడు. దీని భూ-రాజకీయ, ఆర్థిక పరిస్థితి దృష్ట్యా ఇక్కడ సామ్రాజ్యవాదులకు ఎన్నో ప్రయోజనాలున్నాయి. కాబట్టి ప్రతికూలాంశాలు ఎక్కువగా ఉన్నాయి. అందుకని దీనికి, ప్రత్యేకించి మైదానాల్లోనూ, పట్టణ ప్రాంతాల్లోనూ ఎక్కువ సమయం పడుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. అయితే మైదానాల్లోనూ, పట్టణ ప్రాంతాల్లోనూ పని చేసే విషయంలో మేం మా అనుభవాల నుండి పాఠాలు తీసుకుంటున్నాం. ప్రజా సైన్యాన్ని అభివృద్ధి చేయడానికి మేం వ్యూహాత్మక ప్రాంతాల్లో మా పనిని కేంద్రీకరిస్తాం. సాయుధ వ్యవసాయ విప్లవ యుద్ధాన్ని ఉధృతం చేసి విముక్తి ప్రాంతాల్ని నెలకొల్పుతాం. ఈ మూడు రకాల ప్రాంతాల మధ్య ఉండే గతితార్కిక సంబంధాన్ని దృష్టిలో ఉంచుకుంటూ, వ్యూహాత్మక దృష్టితో ఈ పనిని మైదానాల్లో, పట్టణ ప్రాంతాల్లో పనితో ఒక పథకం ప్రకారం సమన్వయిస్తాం. మైదానాల్లోనూ, పట్టణ ప్రాంతాల్లోనూ శక్తివంతమైన ఉద్యమాల్ని నిర్మించడంలో మేమొక పెను మార్పు తీసుకొస్తాం. కాబట్టి మా పురోగమనం అనివార్యమని నేను దృఢంగా చెబుతున్నాను.

**పీపుల్స్ మార్చ్ :** దేశంలో గెరిల్లా యుద్ధం అభివృద్ధిపై మీ ఐక్యత ఏ విధంగా ప్రభావం కలుగజేయనున్నది? భారత రాజ్యం చేసే భారీ దాడులను మీరెలా ఎదుర్కొంటారు? విముక్తి ప్రాంతాల నిర్మాణం కోసం మీరు ఏయే నిర్దిష్ట కర్తవ్యాలను రూపొందించారు?

**కిషన్ :** దేశంలో సాగుతున్న గెరిల్లా యుద్ధంపై మా ఐక్యత ప్రత్యక్ష ప్రభావం చాలా ఎక్కువగా ఉంటుందని మేం భావిస్తున్నాం. దీని వల్ల కొనసాగుతున్న వ్యవసాయ విప్లవ గెరిల్లా యుద్ధం ఒక నూతన ప్రేరణతో, నూతన శక్తితో, నూతన ఉత్సాహంతో, నూతన వెల్లువతో దేశమంతటా వ్యాపిస్తూ, విస్తృతమవుతూ, తీవ్రమవుతుంది. ముఖ్యంగా మా రెండు మునుపటి సైన్య సంస్థలైన పీజీఏ, పీఎల్‌జీఏలు సమైక్యమై నూతన పీఎల్‌జీఏగా అవతరిస్తున్నందున ఈ మాటను మరింత కచ్చితంగా చెప్పొచ్చు.

భారత రాజ్యయంత్రం కొనసాగిస్తున్న భారీ దాడుల్ని ఎదుర్కొనే విషయానికొస్తే... మేం వీటిని దృఢంగా ఎదిరించగలం. అంతే కాదు, దీర్ఘకాల ప్రజాయుద్ధ వ్యూహం-ఎత్తుగడలను నిర్దిష్టంగానూ, సృజనాత్మకంగానూ అమలు చేస్తూ దాన్ని పూర్తిగా నేలమట్టం చేసే సామర్థ్యాన్ని కూడా సంతరించుకోగలం. వాస్తవానికి దీర్ఘకాలిక ప్రజాయుద్ధ వ్యూహం-ఎత్తుగడల్ని నిర్ణయించే విశిష్ట లక్షణాలలో శత్రువు బలవంతుడిగా ఉండడం, ప్రజలు బలహీనంగా ఉండడమనేది ఒకటి. కానీ శత్రువుకున్న ఈ ఆధిక్యత, ప్రజల బలహీనత అనేవి సాపేక్షికమైనవి. గత కొన్ని సంవత్సరాలుగా సాగుతున్న పోరాటాల ద్వారా ఈ వాస్తవం నిజమని తేలుతున్నది. మేం మునుపటితో పోలిస్తే కొంత ఎక్కువ శక్తిని సంతరించుకున్నాం. శత్రు ఆధిక్యత పరిమాణం రీత్యా తప్పక తగ్గింది. అట్లాగే భారతదేశం లాంటి ఒక విశాల దేశంలో అన్ని ప్రాంతాల్లో, ప్రత్యేకించి, లోతట్టులో ఉన్న విస్తారమైన గ్రామీణ ప్రాంతాల్లో శత్రువుకు తన సైన్యాలను మోహరించడం సాధ్యం కాదు. అట్లాగే, మేం ఇబ్బందులన్నిటినీ, అడ్డంకులన్నిటినీ అధిగమిస్తూ భారత రాజ్యయంత్రం సాగించే క్రూరమైన దాడుల్ని ఎదుర్కొంటూ దాన్ని తుత్తునియలు చేయగల్గుతాం. అయితే మేం ఒక వైపు గ్రామీణ ప్రాంతాలను మా పనికి మూల కేంద్రాలుగా చేసుకొని ఉంటూనే రెండో వైపు పట్టణాల్లోని కార్మికుల్లో, కష్టజీవులైన విస్తృత ప్రజానీకంలో తీవ్రంగా కృషి చేసినప్పుడే, ఈ రెండు పనుల మధ్య సరైన సమన్వయాన్ని సాధించే పద్ధతిని అనుసరించినప్పుడే ఇది సాధ్యమవుతుంది. అట్లాగే సైనిక పోరాటాల్లో లక్షలాది, కోట్లాది ప్రజల్ని భాగం చేస్తూ విప్లవకర ప్రజా ఉద్యమాల్ని నిర్వహించాల్సి ఉంటుంది. ఈ రెంటి మధ్య సరైన సమన్వయాన్ని సాధించాలి.

కాబట్టి, మా ముందున్న అతి ముఖ్యమైన కర్తవ్యం ఏంటంటే.. సాయుధ పోరాటానికీ, విశాల ప్రజల కార్యకలాపాలకూ, ప్రజా ఉద్యమాలకూ మధ్య సరైన విధంగా సమన్వయాన్ని సాధిస్తూ వాటిని అభివృద్ధి చేయాలి, విస్తృతం చేయాలి.

విముక్తి ప్రాంతాలను నిర్మించడం కోసం మేం కొన్ని కర్తవ్యాలను రూపొందించుకున్నాం. అంటే... మేం గెరిల్లాజోన్లను గెరిల్లా స్థావరాల దశ గుండా అభివృద్ధిపరుస్తూ విముక్తి ప్రాంతాల స్థాపన వైపు వెళ్లాల్సి ఉంటుంది. దీనితో పాటు, పీఎల్‌జీఏ సైన్య ఫార్మేషన్లనూ, దాని మూడు బలగాలైన పునాది, ద్వితీయ, ప్రధాన బలగాలనూ అన్ని విధాలా శక్తివంతంగా తయారు చేయాలి. కమాండ్ల ద్వారా మూడింటి మధ్య సరైన సమన్వయాన్ని సాధించాల్సి ఉంది. నిర్ణీత వ్యవధిలో సైనిక ఫార్మేషన్లను కంపెనీ నుండి బెటాలియన్ స్థాయికి అభివృద్ధి

చేయాల్సి ఉంది. ఈ విధంగా గుణంలోనూ, పరిమాణంలోనూ వాటిని అభివృద్ధి చేసుకుంటూ పీఎల్‌జీఏను పీఎల్ఏగా మార్చాల్సి ఉంది. మేం ఈ కర్తవ్యాలను సరైన విధంగా పూర్తి చేయగల్గితే, అత్యధిక ప్రజానీకాన్ని గెరిల్లా యుద్ధం సహా ఇతర అనేక రూపాల పోరాటాల్లోకి సమీకరించగల్గితే దీర్ఘకాల ప్రజాయుద్ధంలో తప్పక విజయం సాధిస్తాం – ఈ ప్రక్రియ ఎంత కష్టభరితమైనదీ, వంకరటింకరైనదీ, జటిలమైనదీ, సుదీర్ఘమైనదీ అయినప్పటికీ ఇది జరిగి తీరుతుంది.

**పీపుల్స్ మార్చ్ :** ఇప్పుడు మీ ఉద్యమ రాజకీయ ప్రభావానికి సంబంధించిన ప్రశ్నకు వద్దాం. దేశంలో పెరుగుతున్న సామ్రాజ్యవాద చొరబాటుకు వ్యతిరేకంగా మీ పార్టీ అంత ప్రభావయుతంగా పోరాడుతున్నట్టు కనిపించడం లేదు, కారణమేంటి? అట్లాగే హిందూ ఫాసిజం వంటి దానికి వ్యతిరేకంగా పోరాటంపై మీరు చాలా తక్కువ కేంద్రీకరిస్తున్నట్టు కనిపిస్తోంది, ఎందుకిలా జరుగుతున్నది?

**కిషన్ :** చూడండీ! ఒక దృష్టితో చూసినపుడు సామ్రాజ్యవాద చొరబాటుకు వ్యతిరేకంగా పోరాటంపై విప్లవ పోరాటాల ప్రభావం ప్రత్యేకించి ఏమీ కనిపించదు. ఒక మేరకు ఈ మాట నిజం కూడా. ఒకటి, మా స్వీయాత్మక శక్తి ఇప్పటికీ అవసరాలతో పోల్చినపుడు చాలా తక్కువగా ఉంది. అందులోనూ గ్రామీణ ప్రాంతాల్లో మాకున్న శక్తితో పోల్చినపుడు పట్టణ, పారిశ్రామిక ప్రాంతాల్లో చాలా తక్కువగా ఉంది. అందుకే పట్టణ ప్రాంతాల్లో కార్మికోద్యమాలు సహా అనేక విధాల ఉద్యమాల్ని నిర్మించాల్సిన, అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైతే ఉందో, అంతగా మేం చేయలేకపోయాం. కనుక సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాటాన్ని ఎంతగానైతే తీవ్రం చేయాల్సి ఉండెనో అంత చేయలేకపోయాం. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా అని చెబుతూ వేరే వాళ్లు లేదా ఎన్నికల పార్టీలూ, రివిజనిస్టు పార్టీలూ, ప్రభుత్వేతర సంస్థలూ చేస్తున్నదంతా నిజానికి మోసం, నాటకం తప్ప వేరే ఏమీ కాదు.

వాస్తవానికి సామ్రాజ్యవాదాన్ని నిజమైన అర్థంలో వ్యతిరేకించడానికి సరైన ప్రాతిపదిక నిజమైన మావోయిస్టు పార్టీల, విప్లవకారుల చేతుల్లోనే ఉంది. కాబట్టి ప్రస్తుతం సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటం బలహీనంగానే ఉన్నప్పటికీ మేం ఈ రంగంలో మా బలహీనతల్ని పోగొట్టుకొని సామ్రాజ్యవాద చొరబాటుకు వ్యతిరేకంగా సరైన దిశ కలిగిన ఒక బ్రహ్మాండమైన ఉద్యమాన్ని నిర్మించగల్గుతాం, దాన్ని ముందుకు తీసుకెళ్లగల్గుతాం. ఈ విషయంలో కొంత ఆలస్యం జరుగుతున్నప్పటికీ మేం ఈ పని తప్పకుండా సమర్థవంతంగా చేసి తీరుతాం.

ఇక హిందూ ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాటం విషయానికొస్తే... ఈ రంగంలో కూడా నకిలీ మతతత్వ వ్యతిరేక శక్తులు కోకొల్లలుగా ఉన్నాయి. ఇలాంటి పరిస్థితిలో ఒకవైపు వాళ్లతో స్పష్టంగా తెగతెంపులు చేసుకోవడం, మరో వైపు హిందూ ఫాసిజానికి వ్యతిరేకంగా నిజమైన ఉద్యమాన్ని నిర్మించడం, అభివృద్ధి చేయడం సులువైన పనేమీ కాదు. నిజానికి మతతత్వం, హిందూ ఫాసిజం వంటి సమస్యలకు పరిష్కారం వర్గ పోరాటం అభివృద్ధీ, విస్తరణలలోనే ఉంది. ఈ కారణం వల్లనే భారతదేశంలో మావోయిస్టు విప్లవకారుల ప్రభావం ఉన్న ప్రాంతాలన్నిటిలో మతతత్వ అల్లర్ల సమస్య సాపేక్షికంగా తక్కువగా కనబడుతుంది.

కాబట్టి మనం కార్మిక-కర్షక మైత్రిపై కేంద్రీకరిస్తూ విప్లవ ప్రజా పునాదిని ఓపికగా గట్టిపర్చుకోవడంలో సఫలమైతే మనం మతతత్వానికీ, మతోన్మాదానికీ, హిందూ ఫాసిజానికీ వ్యతిరేకంగా నిజమైన ఉద్యమాన్ని నిర్మించి దాన్ని సరైన మార్గంలో, సరైన దిశతో నడిపించగల్గుతాం.

కాబట్టి, మతతత్వానికీ, హిందూ ఫాసిజానికీ వ్యతిరేకంగా విప్లవోద్యమ ప్రభావం చాలా తక్కువగా ఉందనడం పూర్తిగా నిజం కాదు. అయితే నేడు భారతదేశంలో మతతత్వ శక్తుల్నీ, అల్లర్లనూ యదేచ్ఛగా రెచ్చగొడుతున్న సంఘ ముఠాను ఎదుర్కోవడంలో మా చొరవ అవసరాలతో పోల్చినప్పుడు చాలా తక్కువన్నది కూడా కాదనలేని వాస్తవం. అయితే ఈ లోటును పూడ్చుకోవడానికి మేం చొరవ తీసుకున్నాం. దీనికి సంబంధించిన ప్రక్రియ కూడా మొదలైంది. దీని ఫలితాలు త్వరలోనే కనిపిస్తాయని మేం నమ్ముతున్నాం.

**పీపుల్స్ మార్చ్ :** భారతదేశంలో అమెరికా/ప్రపంచీకరణ విధానాలను మీరే విధంగా చూస్తున్నారు?

**కిషన్ :** సామ్రాజ్యవాదం, ప్రత్యేకించి అమెరికన్ సామ్రాజ్యవాదం నిర్దేశిస్తున్న ప్రపంచీకరణ విధానాలు మన ప్రజా జీవనం పైనా, జాతీయ జీవనం పైనా బాగా దుష్ప్రభావం చూపుతున్నాయని నేను భావిస్తున్నాను. ఈ విధానాలు అన్ని సెక్షన్ల ప్రజల జీవన పరిస్థితుల్నీ ఘోర వినాశన స్థితిలోకి నెట్టేశాయి. వీటిని అడ్డుకోనట్టయితే రాబోయే కొన్ని సంవత్సరాల్లో అత్యంత భయంకరమైన ఫలితాలు ముందుకొస్తాయి. దేశంలో పురోగమిస్తున్న వ్యవసాయ విప్లవ గెరిల్లా యుద్ధాన్నీ, భారీ ఎత్తున సాగే సమరశీల ప్రజా ఉద్యమాలనూ బ్రహ్మాండంగా అభివృద్ధి చేస్తూ, విస్తరింపజేస్తూ ఒక నిజమైన ప్రజా విప్లవాన్ని విజయవంతంగా పరిపూర్తి చేయడం ద్వారానే ప్రమాదకరమైన ప్రపంచీకరణ ప్రభావం నుండి దేశాన్ని విముక్తం చేయగలమని మేం భావిస్తున్నాం.

**పీపుల్స్ మార్చ్ :** భారతదేశం జాతులూ, దళితులూ, విభిన్న కులాలూ, అల్పసంఖ్యాక వర్గాలూ, భాషాపరమైన సెక్షన్లు వగైరాలతో కూడుకొని ఉన్న వైవిధ్యభరితమైన దేశం. ఒక్క వర్గ పీడననే కాకుండా విభిన్న రూపాల సామాజిక పీడనను కూడా ఎదుర్కొంటున్న ఇలాంటి విభిన్న శక్తులను ఎలా ఐక్యం చేస్తారు?

**గణపతి :** భారతదేశంలో నెలకొని ఉన్న నిర్దిష్ట పరిస్థితుల్లో విప్లవానికి నాయకత్వం వహిస్తున్న కార్మికవర్గ పార్టీ తప్పక గుర్తించాల్సిన అత్యంత ప్రాముఖ్యత గలిగిన సామాజిక సెక్షన్లుగా మహిళలూ, దళితులూ, పీడిత జాతులూ, మైనారిటీ మతస్తులూ ఉన్నారు. ఈ సెక్షన్లన్నీ వర్గ పీడనతో పాటు తమ సొంత, విశిష్ట తరహాల ఆర్థికేతర పీడనను కూడా ఎదుర్కొంటున్నాయి. పితృస్వామ్యం, అంటరానితనం, ఇతర కులపీడనా రూపాలూ, అల్పసంఖ్యాకుల పైనా పీడిత జాతుల పైనా దాడులు వగైరా వీళ్ల ప్రత్యేక సమస్యల్ని పరిష్కరించడానికి మనం తగిన శ్రద్ధ పెట్టాల్సి ఉంటుంది. అట్లాగే ఈ సమస్యలను వర్గ దృక్పథంతో చేపట్టాలి. ఈ కర్తవ్యాల్ని మనం ప్రస్తుతం కొనసాగుతున్న విప్లవోద్యమంతో జోడించాలి కూడా. ఈ దిశలో, మనం ఈ సెక్షన్లను ఇతర పీడిత ప్రజానీకంతో పాటు వర్గ సంఘాల్లోకి తేవాలి. అదే సమయంలో ఈ సెక్షన్లను తమ ప్రత్యేక సమస్యలపై తక్షణ, దీర్ఘకాల ప్రాతిపదికపై విస్తృతంగా సమీకరించడం కోసం మనం అవసరమైన నిర్మాణ, పోరాట రూపాల్ని అభివృద్ధి చేయాలి. ప్రత్యేక ఇక్కట్లను దూరం చేయడం కోసం అవసరమైనప్పుడు విశాల సంయుక్త వేదికలను ఏర్పాటు చేయాలి.

అయితే, ఈ సెక్షన్లకు సంబంధించిన ప్రత్యేక సమస్యలపై నిర్దిష్టమైన ఎత్తుగడల్ని చేపడుతున్నప్పుడు అవి ఎల్లప్పుడూ మన వ్యూహాత్మక

పంథాకు ఉపయోగపడాలనే విషయం మన దృష్టిలో ఉండాలి. మొత్తంగా చూసినపుడు దేశంలో సాగుతున్న ప్రజాయుద్ధానికి లోబడే, దాని సంబంధంలోనే వాళ్ల ప్రత్యేక సమస్యల్ని పరిష్కరించడం కోసం మనం ప్రత్యేక కార్యక్రమాల్ని ముందుకు తేవాలి. ఈ సెక్షన్లకు తమ సమస్యలన్నీ వర్గ సమస్యల్లో భాగమేని మనం తప్పక బోధించాలి. వర్గ దోపిడీ నుండి తమను తాము విముక్తం చేసుకోవడంలోనే ఏ విధంగా తమ సమస్యల అంతిమ పరిష్కారానికి వస్తుగత ప్రాతిపదిక ఉందో చెప్పాలి. కాబట్టి, దేశంలోని విశాల పీడిత ప్రజానీకాన్ని దోపిడీపీడనలకు గురి చేస్తున్న ఉమ్మడి శత్రువులైన భూస్వామ్య విధానానికీ, సామ్రాజ్యవాదానికీ, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేకంగా కార్మికవర్గ నాయకత్వంలో ఇతర పీడిత ప్రజలందరితోనూ కలిసి సమైక్యంగా పోరాడాల్సిన అనివార్యమైన అవసరాన్ని కూడా వాళ్లకు వివరించాలి.

కొనసాగుతున్న ఈ ప్రజాయుద్ధం, వర్గ పోరాటం రోజురోజూ మరింతగా ఈ సెక్షన్లను ఏ విధంగా ప్రధాన రంగం మీదకు తెస్తున్నాయో మనం ఆచరణ ద్వారా చూపించాలి. ప్రజాయుద్ధ క్రమం, లోతుగా పెంపొందుతున్న వర్గ పోరాటం ఈ పీడిత సెక్షన్లలో ఇంత కాలం దాగి ఉన్న సామర్థ్యాన్నీ సృజనాత్మక శక్తుల్నీ, విప్లవకర చొరవనూ, సామర్థ్యాలనూ ఏ విధంగా విడుదల చేస్తున్నాయో ఆచరణలో చూపాలి. పార్టీ నాయకత్వం నిర్దిష్టంగా పథకం వేసి, ఈ పీడిత సెక్షన్‌లను అభివృద్ధి చెయ్యడానికి ప్రత్యేకంగా శ్రద్ధ వహించడం ద్వారానూ, చైతన్యయుతమైన కృషి చెయ్యడం ద్వారానూ మాత్రమే పార్టీలో వాళ్ల హోదాలోనూ, విప్లవోద్యమంలో వాళ్ల స్థానంలోనూ ఒక గుణాత్మక మార్పు తీసుకురాగలుగుతాం.

ఈ సాధారణ పంథానూ, వైఖరినీ ముందుకు తీసుకువెళ్లడం ద్వారా మాత్రమే మనం బూర్జువా పార్లమెంటరీ రివిజనిస్టు పార్టీలతోనూ, సంస్కరణవాద ప్రభుత్వేతర సంస్థలతోనూ, ఇతర పెటీ బూర్జువా సంస్థలతోనూ, అలాగే దేశంలో కమ్యూనిస్టు విప్లవ సంస్థలుగా చెప్పుకుంటున్న వాటితోనూ ఈ ప్రత్యేక సామాజిక సెక్షన్‌ల విషయంలో స్పష్టమైన విభజన రేఖ గీసుకోగలుగుతాం. ఈ విషయాలలో తప్పుడు వైఖరులను కార్మికవర్గ వైఖరితో చూసి అర్థం చేసుకోవడం ద్వారా ఈ పని చెయ్యవచ్చు. ఇదే సమయంలో ఈ సామాజిక అంశాలను నిర్లక్ష్యం చేస్తూ, పరోక్షంగా ఈ సామాజిక దురాచారాలను ప్రోత్సహిస్తున్న యాంత్రిక వైఖరికి వ్యతిరేకంగా మనం పోరాటం చెయ్యాలి. పురుషులలోనూ, పీడితులలోని అగ్ర కులాలలోనూ తమ పితృస్వామిక, కులపరమైన దృష్టిని విడనాడే విధంగా బోధన గరపడానికి చైతన్యవంతమైన కృషి చెయ్యాలి. అలాగే ఈ సెక్షన్‌ల ఉద్యమాలలో ఉన్న వివిధ బూర్జువా రివిజనిస్టు, సంస్కరణవాద ధోరణులను రాజకీయంగా ఎండగట్టడానికి నిరంతరం కృషి చెయ్యాలి.

తనలో అంతర్లీనంగా ఉన్న పితృస్వామ్యం, కులతత్వం, కులవివక్ష, మేధోతత్వం మొదలయిన కార్మికవర్గేతర విలువలకూ, పీడిత సెక్షన్ల హక్కుల పట్ల నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా కూడా పార్టీ పోరాటం చెయ్యాలి. మరో పక్క వివిధ ఆధునికానంతరవాద ధోరణులు, బూర్జువా స్త్రీవాదం, దళితవాదం, సంకుచిత జాతీయవాదం మొదలయిన ధోరణులకు ప్రభావితులు కాకుండా కామ్రేడ్లకు బోధన గరపాలి.

కార్మికవర్గ రాజకీయాలకూ, మార్క్సిజం-లెనినిజం-మావోయిజానికీ విధేయంగా ఉండడం ద్వారానే, తనకంటూ రాజకీయ, నిర్మాణ స్వాతంత్రాన్ని నిలుపుకోవడం ద్వారానే కార్మికవర్గం ప్రజలకు నాయకత్వం అందించి, వారిని ఈ సామాజిక దురాచారాల పట్ల ఒంటెత్తు వైఖరి నుంచీ బయటపడవెయ్య గలుగుతుంది. ప్రజలను చైతన్యవంతులను చేసి వారిని నిజమైన అర్థంలో విప్లవకర ప్రజాస్వామిక పోరాటంలోకి తీసుకురాగలుగుతుంది (నూతన ప్రజాస్వామిక విప్లవంలో అంతర్భాగంగా). అయితే నూతన ప్రజాస్వామిక విప్లవంతో ఈ సామాజిక దురాచారాలన్నీ రూపుమాసిపోతాయని అనుకోలేం. దోపిడీ సామాజిక వ్యవస్థకు వస్తుగత పునాది పోయినప్పటికీ ఉపరితలంలో, ప్రజల ఆలోచనలో, సామాజిక సాంస్కృతిక నమ్మకాలలో, విలువలలో అది కొనసాగుతుంది.

**పీపుల్స్ మార్చ్ :** ఇవాళ పాలకవర్గాల మధ్య కుక్కల కొట్లాటలు తీవ్రతరమవుతున్నాయి. దీనిని మీరు ఎలా వినియోగించుకోవాలని అనుకుంటున్నారు?

**కిషన్ :** విప్లవకారులు ఎప్పుడూ కూడా పాలకవర్గాల మధ్య పెరుగుతున్న వైరుధ్యాలను విప్లవాన్ని ముందుకు తీసుకువెళ్లడానికి ఉపయోగించుకుంటారు. అయితే గుర్తుంచుకోవల్సిన విషయం ఏమంటే భారతదేశంలో ఈ వైరుధ్యాల వల్ల ఇంకా ఒక స్పష్టమైన ధ్రువీకరణ జరగలేదు. ఈ వైరుధ్యాలేవీ కూడా ఇంకా ఒక యుద్ధ స్థాయికి చేరుకోలేదు. మరొక విషయం ఏమంటే, అధికారం కోసం కుక్కల మాదిరిగా కొట్లాడుకునే వాళ్లు విప్లవ పోరాటాలను అణిచివేసే విషయంలో ఐక్యమవుతారు. అయితే వారిలో కూడా, విప్లవకారుల పట్ల మెత్తగా ఉండాలా, లేక గట్టిగా ఉండాలా అన్న విషయంలో వైరుధ్యాలున్న మాట నిజమే.

అందుకనే ఈ వైరుధ్యాన్ని విప్లవ ప్రయోజనాల కోసం ఎలా వినియోగించుకోవచ్చుననేది తీవ్రంగా ఆలోచించవలసిన అంశం. విప్లవ పోరాటాన్ని ముందుకు తీసుకువెళ్లడానికి పాలకవర్గాల మధ్య ఉన్న ఈ వైరుధ్యాన్ని సమర్థవంతంగా ఉపయోగించుకోవాలంటే ఈ విషయాలను విశ్లేషించి పరిగణించడం అవసరం. అవి ఏమంటే, విప్లవ సాయుధ పోరాటం నిర్దిష్ట పరిస్థితి, దేశ వ్యాప్తంగా దాని ప్రభావం, మన స్వీయాత్మక శక్తుల, ముఖ్యంగా పార్టీ, ప్రజా సైన్యం, ఐక్యసంఘటనల పరిస్థితి, దేశవ్యాప్తంగా దాని ప్రభావం, అలాగే చొరవ మన చేతులలో ఉంచుకునే సామర్థ్యం, జరుగుతున్న సమకాలీన రాజకీయ విషయాలలో సమర్థవంతంగా జోక్యం చేసుకోవడానికి మన సామర్థ్యం.

ఈ విషయంలో నేను మరో అంశం చెప్పాలనుకుంటున్నాను. ప్రస్తుత పరిస్థితిలో పాలకవర్గాల మధ్య వైరుధ్యాలను వినియోగించుకుని వారిలో ఒక సెక్షన్‌తో మైత్రి కట్టడం సరైనదని నేననుకోను.

**పీపుల్స్ మార్చ్ :** ఇక అంతర్జాతీయ విషయాల గురించి. ప్రస్తుత ప్రపంచంలో మావోయిజం ప్రాధాన్యత ఏమిటి? అది ప్రస్తుత సందర్భంలో జరుగుతున్న పెను మార్పులను విశ్లేషించడంలో సహాయపడుతుందా? భవిష్యత్తుకు ఒక దృక్పథాన్ని ఇవ్వగలుగుతుందా?

**కిషన్ :** మావోయిజాన్ని నేటి మార్క్సిజం-లెనినిజంగా ఆమోదించాం. మార్క్సిజం-లెనినిజం-మావోయిజం స్వతహాగానే ఒక సమగ్రమైన అంశం. ఇది ఎంత చలనశీల శాస్త్రం అంటే, దీని సహాయంతో ఎవరైనా మిగిలిన అన్ని శాస్త్ర విభాగాలనూ మరింత బాగా విశ్లేషించగలుగుతారు. దీని సహాయంతో దేనినైనా, ఎటువంటి ఘటననైనా సరిగ్గా విశ్లేషించి నిర్ధారణలు చెయ్యగలుగుతాం.

మార్క్సిజం కేవలం ఈ ప్రపంచాన్ని వ్యాఖ్యానించి ఊరుకోదనీ, దాని మార్పుకు నియమాలను నిర్ణయిస్తుందనీ మనకు తెలుసు. ఆ ప్రకారం, నేటి ప్రపంచంలో ఏ మార్పులు జరిగినా, లేక సామ్రాజ్యవాద యుగం ప్రారంభమైన నాటి నుంచీ ఈనాటి వరకూ జరిగిన అన్ని

మార్పులనూ మార్క్సిజం లెనినిజం మావోయిజం సిద్ధాంతం వెలుగులో సరిగా విశ్లేషించవచ్చు. ఇదే భవిష్యత్తుకు కూడా వర్తిస్తుంది. దీంతో పాటు మన అన్ని కార్యకలాపాలకూ మార్క్సిజం లెనినిజం మావోయిజం మార్గదర్శి. అందుకని ఎటువంటి నూతన పరిస్థితులలోనైనా జరిగే పెద్ద మార్పులను అర్థం చేసుకోవడానికి ఇది ఒక సైద్ధాంతిక మార్గదర్శిగా ఉపయోగపడుతుంది. పిడివాద పద్ధతిలో కాక, మన పనిని సృజనాత్మకంగా అన్వయించాలి.

దీనికి తోడు, ప్రస్తుత చక్రంలో భవిష్యత్తును అర్థం చేసుకోవడం మార్క్సిజం-లెనినిజం-మావోయిజం వెలుగులో మాత్రమే సాధ్యం. ప్రపంచ పరిస్థితి ఎగుడుదిగుళ్లలో నుంచీ, జిగ్‌జాగ్ మార్గం గుండా, విజయాలూ వైఫల్యాలలో నుంచీ మాత్రమే పురోగమిస్తుంది. ప్రపంచంలో అన్ని పురోగమనాలూ, సామాజిక వ్యవస్థా కూడా ఇదే పద్ధతిలో సాగుతున్నాయి. ఇలాగే కొనసాగుతాయి కూడా.

అందుకని, నేటి ప్రపంచాన్ని అర్థం చేసుకుని వివిధ సమస్యలకు పరిష్కారాలు కనుగొలంటే మావోయిజాన్ని ఉపయోగించుకోవడం చారిత్రక, అంతర్జాతీయ ప్రాధాన్యత కలిగినదని నేను గట్టిగా అభిప్రాయపడుతున్నాను.

**పీపుల్స్ మార్చ్ :** ప్రపంచంలో ఇతర విప్లవకర శక్తులతో సంబంధాలను ఎలా పెంపొందించుకోవాలనుకుంటున్నారు? అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమం మీద ఈ ఐక్యత ఎటువంటి ప్రభావం వేస్తుంది?

**కిషన్ :** కమ్యూనిస్టులం అంతర్జాతీయవాదులం. ఈ అంతర్జాతీయతత్వం "ప్రపంచ కార్మికులారా ఏకం కండి!" అన్న మా నినాదంలో చక్కగా ప్రతిబింబిస్తుంది. ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమం పురోగమించాలంటే, వలస, అర్ధ వలస, అర్ధ భూస్వామ్య దేశాల విప్లవ పోరాటాలతోనూ, పెట్టుబడిదారీ సామ్రాజ్యవాద దేశాల కార్మికవర్గ ఉద్యమాలతోనూ బలమైన సౌహార్ద సంబంధాలు నెలకొల్పుకోవడం అవసరం. ఈ వైఖరితో ప్రపంచంలోని అన్ని నిజమైన మావోయిస్టు పార్టీలతోనూ బలమైన సంబంధాలు నెలకొల్పుకోవడం మా ముందున్న ఒక ముఖ్యమైన కర్తవ్యం. ముందు నుంచీ కూడా మునుపటి ఎంసీసీఐ, మునుపటి సీపీఐ (ఎం-ఎల్) [పీడబ్ల్యూ] నేపాల్, పెరూ, ఫిలిప్పైన్స్, టర్కీ, వగైరా దేశాలతో అంతర్జాతీయ స్థాయిలో ద్వైపాక్షిక సంబంధాలు కొనసాగిస్తూ ఉన్నాయి. మునుపటి ఎంసీసీఐ రిమ్ (రివల్యూషనరీ ఇంటర్నేషనలిస్టు మూవ్మెంట్)లో కూడా చేరింది. మునుపటి పీడబ్ల్యూ రిమ్‌తో సంబంధాలను మరింత పెంచుకోవాలని నిర్ణయించుకుంది.

ఇప్పుడు ఈ కొత్త పార్టీ సీపీఐ (మావోయిస్టు) పుట్టిన తరువాత, విప్లవ సంప్రదాయాలను అనుసరించి, రిమ్‌తోనూ, ఇతర నిజమైన మావోయిస్టులతోనూ లోతైన సంబంధాలను కొనసాగించాలని నిర్ణయించింది.

భారతదేశం విశాల జనాభా కలిగినది. ఇక్కడ రెండు ముఖ్యమైన విప్లవ సంస్థలైన మునుపటి ఎంసీసీఐ, పీడబ్ల్యూలు ఐక్యం కావడం వల్ల తప్పనిసరిగా అంతర్జాతీయ స్థాయిలో చాలా సానుకూల ప్రభావం ఉంటుంది. ఇవాళ ప్రపంచంలో సోషలిస్టు దేశం అన్నది లేదు. మార్క్సిజం, కమ్యూనిజం ఓడిపోయాయని తిరోగమనవాదులు ఇళ్ల కప్పుల మీద ఎక్కి మరీ అరుస్తున్న ఈ తరుణంలో మునుపటి ఎంసీసీఐ, పీడబ్ల్యూలు విలీనమై ఒక నిజమైన మార్క్సిస్టు లెనినిస్టు-మావోయిస్టు పార్టీ ఏర్పాటు కావడం, పైగా వంద కోట్లకు పైగా జనాభా ఉన్న విశాల దేశంలో ఏర్పాటు కావడం అన్నది ఒక గొప్ప ఘటన. ఇది అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమానికి నూతన జీవాన్ని ఇస్తుంది. ఆ మేరకు నూతన పార్టీ నాయకత్వంలో విప్లవ గెరిల్లా వ్యవసాయ యుద్ధాన్ని, అంటే దీర్ఘకాలిక ప్రజాయుద్ధాన్ని తీవ్రం చెయ్యగలుగుతాం. ఈ మేరకు అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో నూతన శక్తి సమకూరుతుంది.

**పీపుల్స్ మార్చ్ :** గడచిన ముప్పై ఐదు సంవత్సరాలుగా ప్రపంచ పరిస్థితి విప్లవానికి అద్భుతంగా ఉన్నదని అంటూ ఉన్నారు. మరి ప్రపంచంలో మావోయిస్టు శక్తులు ఎందుకింత బలహీనంగా ఉన్నాయి?

**గణపతి :** అవును. సాధారణ అర్థంలో భౌతిక పరిస్థితి అద్భుతంగా ఉన్నది. మూడో ప్రపంచం, లేదా వెనుకబడిన దేశాలు, లేదా పీడిత దేశాలు, అర్ధ వలసలు, వలసలలో భౌతిక పరిస్థితి చాలా అద్భుతంగా ఉన్నది. సామ్రాజ్యవాద దేశాలలో విప్లవ భౌతిక పరిస్థితి పెంపొందుతున్నది. కానీ మీరు ప్రస్తావించిన ఈ వైరుధ్యం ఎందుకుంది? దీన్ని మనం ఎలా అర్థం చేసుకోవాలి?

వస్తుగత, స్వీయాత్మక అంశాల మధ్య ఒక గతితార్కిక సంబంధం ఉన్నదని మనం అర్థం చేసుకోవాలి. ఇది యాంత్రికంగా ముడిపడి ఉన్న పరస్పర సంబంధం కాదు. ఒకవేళ ఇటువంటి యాంత్రిక సంబంధం ఉండి ఉంటే అన్నీ ముందుగా నిర్ణయమయిపోయేవి. వెనుకబడిన దేశాలలో విప్లవం ముందుగా వచ్చేది. విప్లవ పరిస్థితి పరిపక్వం కావాలంటే వస్తుగత, స్వీయాత్మక అంశాలు రెండూ అభివృద్ధి చెందాలనీ, అప్పుడు మాత్రమే విప్లవం బలహీనమైన లింకులో బద్దలవుతుందనీ లెనిన్ అంటాడు. ఇవాళ వెనుకబడిన దేశాలు ప్రపంచ విప్లవానికి తుఫాను కేంద్రాలు. అక్కడ పరిస్థితులు తీవ్రంగా ఉన్నాయి. వీటిల్లో ఏ దేశాలలో విప్లవం జరుగుతుందన్నది అనేక అంశాల మీద ఆధారపడి ఉంటుంది. అలాగే నిజమైన కార్మికవర్గ పార్టీలు (మావోయిస్టు పార్టీలు) పెంపొంది, బలపడాలంటే అది పేదరికపు తీవ్రతపై మాత్రమే ఆధారపడి ఉండదు. ఆ దేశంలో సాధారణ ప్రజాస్వామిక ఉద్యమపు రాజకీయ సారంపైనా, అందులో నిజమైన కార్మికవర్గ శక్తుల పెరుగుదల మీదా అది ఆధారపడి ఉంటుంది.

సామ్రాజ్యవాద ఆవిర్భావంతో పెట్టుబడిదారీ వ్యవస్థ సంక్షోభం సాధారణ సంక్షోభం రూపాన్ని తీసుకుంది. సామాజిక విప్లవానికి భౌతిక పరిస్థితి పరిపక్వం అయ్యింది. సామ్రాజ్యవాద యుగంలో పెట్టుబడిదారీ విధానపు సాధారణ సంక్షోభంలో ఒక ముఖ్య లక్షణం ఏమంటే పెట్టుబడిదారీ విధానం మొత్తంగానే, సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించుకోలేకపోవడం, భారీ నిరుద్యోగం, ద్రవ్యోల్బణంలలో కూరుకుపోవడం. ప్రపంచ యుద్ధాల ద్వారా, ప్రచ్ఛన్న యుద్ధాల ద్వారా, లక్షలాది ప్రజల ఉత్పత్తి సామర్థ్యాల్ని వినియోగించుకోకపోవడం ద్వారా నిరంతరాయంగా ఉత్పత్తి శక్తులను ధ్వంసం చేయడం, ఒక పక్క లక్షలాది ప్రజలు దుర్భర దారిద్ర్యంలో కొట్టుమిట్టాడుతుంటే అదనపు మారకపు వస్తువుల్ని ధ్వంసం చేయడం... ఇవన్నీ సామ్రాజ్యవాదం లక్షణాలు.

పెట్టుబడిదారీ వ్యవస్థలో సాధారణ సంక్షోభం సమాజంలో మౌలిక వైరుధ్యాలన్నింటినీ బద్దలయ్యే స్థితికి తీసుకువచ్చింది – పెట్టుబడికీ, శ్రమకీ మధ్యనూ, సామ్రాజ్యవాదానికీ, పీడిత జాతులకూ ప్రజలకూ మధ్యనూ, వివిధ సామ్రాజ్యవాద శక్తుల గుత్త పెట్టుబడి గ్రూపుల మధ్యనూ. సామ్రాజ్యవాదం ఆవిర్భావంతో ఉత్పత్తి శక్తులకు ప్రస్తుత

ఉత్పత్తి సంబంధాలతో ఉన్న ఘర్షణ బద్దలయ్యే రూపం తీసుకుంది. ఇది ఫాసిజానికీ, ప్రపంచ యుద్ధాలకీ, సామాజిక విప్లవాలకీ దారి తీసింది. ప్రపంచ సోషలిస్టు విప్లవం ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ మీద తుది విజయం సాధించే వరకూ ఇది కొనసాగుతుంది.

ప్రపంచం నేడు, రెండో ప్రపంచ యుద్ధం తరువాత ఎన్నడూ లేనంత అస్తవ్యస్తంగా, కల్లోలంగా, అస్థిరంగా ఉన్నది. సోవియట్ సోషల్ సామ్రాజ్యవాదం కూలిపోవడం, 1990లలో మునుపటి తూర్పు యూరోప్ నిరంకుశ పెట్టుబడిదారీ రాజ్యాలూ, సోవియట్ యూనియన్, ఆ తర్వాత చైనా ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థలో సంపూర్ణంగా కలగలిసిపోవడం ద్వారా కూడా ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ సంక్షోభం తగ్గు ముఖం పట్టలేదు. ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థలో నిరంతరం తీవ్రతరమవుతున్న ఈ సంక్షోభం అస్తవ్యస్తానికీ, కల్లోలానికీ, అస్థిరతకూ పునాది. ఇవే ప్రస్తుత ప్రపంచ పరిస్థితి లక్షణాలయ్యాయి. సెప్టెంబరు 11 సంఘటన తరువాత ఉగ్రవాదం మీద యుద్ధం చేసే పేరుతో అమెరికా సామ్రాజ్యవాదం ప్రపంచవ్యాప్తంగా ప్రజల మీద వరుసగా దురాక్రమణ యుద్ధాలూ, దాడులూ చేస్తున్నది. ఇది ప్రజల నుంచీ వివిధ రూపాలలో బలమైన వ్యతిరేకతకు దారి తీసింది. ఇలా ఒక నూతన పరిస్థితి ముందుకు వచ్చింది. అస్థిరతా, కల్లోలం మరింత తీవ్రతరమయ్యాయి.

ఇవాళ సామ్రాజ్యవాదం ఎన్నడూ ఎరుగనంతగా, ప్రపంచవ్యాప్త సంక్షోభం ఎదుర్కొంటున్నది. రెండో ప్రపంచయుద్ధం ముగిసిన తరువాత ఇంతటి సంక్షోభం ఇదే. మౌలిక వైరుధ్యాలన్నీ మరింతగా పదునెక్కుతున్నాయి. సామ్రాజ్యవాద దురాక్రమణకూ, పీడనకూ, దోపిడీకీ, తిరోగమనవాద పాలక వర్గాలకూ వ్యతిరేకంగా విప్లవ పోరాటాల, జాతి విముక్తి పోరాటాల వివిధ ప్రజా ఉద్యమాల నూతన కెరటం ఒకటి అన్ని చోట్లా వెల్లువెత్తుతున్నది. ఈ అనుకూల పరిస్థితిని వినియోగించుకుని మన దేశంలో జరుగుతున్న ప్రజాయుద్ధాన్ని గొప్ప అంగల్లో ముందుకు తీసుకువెళ్లడం, నూతన ప్రజాస్వామిక రాజ్యాన్ని నెలకొల్పడం, ఆ తరువాత సోషలిజం వైపు సాగడం ఎంతో అవసరం.

ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికాలలో విశాల ప్రాంతాలు ప్రపంచ విప్లవానికి తుఫాను కేంద్రాలుగా కొనసాగుతున్నాయి. ఇరాక్, అఫ్గానిస్తాన్‌లలో అమెరికా దురాక్రమణకు వ్యతిరేకంగా గెరిల్లా యుద్ధం తీవ్రతరం అవుతున్నది. భారతదేశం, నేపాల్, ఫిలిప్పైన్స్, పెరూ, టర్కీలలో మావోయిస్టు పార్టీల నాయకత్వంలో ప్రజాయుద్ధం పురోగమిస్తున్నది. ప్రపంచీకరణకూ, యుద్ధ విధానాలకూ వ్యతిరేకంగా సామ్రాజ్యవాద దేశాలలో కార్మికులూ, ప్రజలలో విశాల సెక్షన్‌లూ సమరశీలంగా పోరాడుతున్నారు. ఎంఎల్ఎం పునాదిగా నిజమైన విప్లవ పార్టీలు అనేక పెట్టుబడిదారీ దేశాలలో ఉద్భవిస్తున్నాయి. ఇవన్నీ సామ్రాజ్యవాదాన్ని బలహీనపరుస్తాయి.

అయినప్పటికీ, 1960లతోనూ, డెబ్బైలతోనూ పోల్చుకుంటే కార్మికవర్గ ఉద్యమం బలహీనంగా ఉంది. ప్రపంచవ్యాప్తంగా రివిజనిస్టు ధోరణులు పెరగడం, అరవైల, డెబ్బైల నాటి జాతి విముక్తి ఉద్యమాల విద్రోహం దీనికి ముఖ్య కారణం. సోవియట్ యూనియన్ (1956)లో, చైనా (1976)లో వెనకడుగులు, సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీ (సీపీఎస్‌యూ), సీపీసీలు రివిజనిస్టు పార్టీలుగా మారడంతో ప్రపంచమంతటా మితవాద, రివిజనిస్టు పార్టీలు పుట్టుకువచ్చాయి. గతంలో సోషలిస్టు సమాజాలుగా ఉన్న ఈ దేశాలలో పెట్టుబడిదారీ విధానం పునరుద్ధరణ జరగడం, సోషలిస్టు శిబిరం దిగజారిపోవడం ప్రపంచ విప్లవ పురోగమనం మీద చాలా ప్రతికూల ప్రభావం వేసింది. ఈ వెనకడుగు పరిస్థితిని వినియోగించుకుని సామ్రాజ్యవాదులు కమ్యూనిజానికి కాలం చెల్లిపోయిందంటూ సైద్ధాంతిక, రాజకీయ దాడికి దిగారు. వివిధ నూతన రూపాలలో భిన్న సిద్ధాంతాలు ముందుకు తీసుకువచ్చారు. మరోపక్క నిజమైన కమ్యూనిస్టు విప్లవకర శక్తులు అనేకం ఒక అంతర్జాతీయ కేంద్రం అంటూ లేకపోవడం వల్ల అస్తవ్యస్తంగా, తీవ్ర సైద్ధాంతిక రాజకీయ గందరగోళంలో ఉన్నాయి. ఈ కారణాల వల్లనే ఇవాళ మావోయిస్టు శక్తులు సాపేక్షికంగా బలహీనపడ్డాయి. దీంతో పాటుగా సమస్త విప్లవ శక్తుల మీదనూ (ఇండోచైనా, లాటిన్ అమెరికా, ఇప్పుడు ఆసియాలలో చూస్తున్నట్టుగా) పెద్ద ఎత్తున ఊచకోత, నిర్బంధం అమలు చేసారు. దీంతో పెరుగుదలకు మరింత ఆటంకం ఏర్పడింది.

కానీ, ఇవాళ ప్రపంచవ్యాప్తంగా పరిస్థితులు మరింత భీభత్సంగా తయారవుతున్నాయి. నిజమైన మావోయిస్టు శక్తులు తిరిగి సమీకృతమవుతున్నాయి. నూతన పార్టీలు పుడుతున్నాయి. విప్లవ పరిస్థితి పురోగమించి తీరుతుంది. నేపాల్‌లో దీర్ఘకాలిక ప్రజాయుద్ధం సాపేక్షికంగా వేగంగా పెరుగుతున్నది. విప్లవ పరిస్థితి అద్భుతంగా ఉన్నదనడానికి ఇది ఒక నిర్దిష్ట ఉదాహరణ. వివిధ దేశాలలో మావోయిస్టు పార్టీలు ఉద్భవించి, సరైన వ్యూహంతో నిర్దిష్ట ఎత్తుగడలు తీసుకుంటే, అవి తప్పక పురోగమిస్తాయి. ఇలా చెయ్యడానికి ఎం-ఎల్-ఎంను సరిగా అర్థం చేసుకోవాలి. సామ్రాజ్యవాద యుగ స్వభావాన్ని తెలుసుకోవాలి. ప్రపంచ కార్మికవర్గం, దాని అగ్రగామి పార్టీల చారిత్రక కర్తవ్యాన్ని అర్థం చేసుకోవాలి. స్వీయాత్మక శక్తులను సిద్ధం చేసుకోవాలి. ప్రజలను వర్గ పోరాటాలలో రాజకీయంగా సమీకరించాలి. విప్లవ యుద్ధాలను విజయం వైపుగా పురోగమింపజెయ్యాలి.

**పీపుల్స్ మార్చ్ :** అంతిమంగా మీ ఐక్య పార్టీ దేశ ప్రజలకు ఇచ్చే సందేశం ఏమిటి?

**గణపతి :** అంతిమంగా, మా ఐక్య పార్టీ భారతదేశ ప్రజలకూ, ప్రపంచ ప్రజలందరికీ ఇచ్చే పిలుపు ఏంటంటే –

**ఐక్యం కండి! ఐక్యం కండి! ఐక్యం కండి! మన దేశంలోని అన్ని విప్లవకర ప్రజాస్వామిక వర్గాలూ, శక్తులూ - కార్మికులు, రైతాంగం, పెటీ బూర్జువా వర్గం జాతీయ బూర్జువా వర్గంతో సహా అన్ని పీడిత సామాజిక సెక్షన్‌లూ భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) కింద ఐక్యం కండి!!**

**సంఘటితం కండి! సంఘటితం కండి! సంఘటితం కండి! భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) కింద విప్లవ ప్రజా సంఘాలలో, ఎర్రసైన్యంలో, నూతన రాజకీయాధికార అంగాలలో సంఘటితం కండి!!**

**పోరాడండి! పోరాడండి! పోరాడండి! విముక్తి కోసం సామ్రాజ్యవాద, భూస్వామ్య, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ శృంఖలాలను బద్దలు కొట్టడానికి పోరాడండి. దేశవ్యాప్తంగా రాజకీయాధికారాన్ని గెల్చుకోవడం కోసం గొప్ప విజయాలు సాధించడం కోసం పోరాడండి! ఎంత పెద్ద శక్తయినా ప్రజా పోరాటాలను శాశ్వతంగా అణిచి వెయ్యలేదు! విప్లవం అంతిమ విజయం అనివార్యం! ఇది వర్గ సమాజ పరిణామ నియమం! అంతిమ ఓటమి శత్రువుదే! అంతిమ విజయం పీడిత ప్రజలదే!!**

అన్ని దేశాల కార్మికవర్గానికీ, పీడిత జాతులకూ ప్రజలకూ కూడా ఇదే పిలుపు ఇస్తున్నాం – **ఐక్యం కండి, సంఘటితం కండి. నిజమైన కార్మికవర్గ పార్టీల నాయకత్వంలో ప్రపంచ సోషలిస్టు విప్లవ పురోగమనం కోసం విజయం సాధించడం కోసం సామ్రాజ్యవాదానికీ, అన్ని రకాల తిరోగమనవాదానికీ వ్యతిరేకంగా పోరాటాన్ని తీవ్రతరం చెయ్యండి!!!**

## భారత విప్లవ మార్గదర్శి

# కామ్రేడ్ చారు మజుందార్ అమర్ రహే !

అది 1962. భారత ప్రభుత్వం సోషలిస్టు చైనాపై దాడి చేసింది. ఎమర్జెన్సీ విధించింది. దురహంకారాన్ని రెచ్చగొట్టడానికి వేలాది మంది మేధావులను నియమించింది. అప్పటి పేరుగాంచిన సీపీఐ నాయకులు ప్రభుత్వం ముందు మోకరిల్లారు. ఆ చీకటి రోజుల్లో కామ్రేడ్ చారు మజుందార్ ఈ దారుణ చర్యలకు వ్యతిరేకంగా గొంతెత్తి నినదించాడు. తమ ఆక్రోశాన్ని వెలిబుచ్చేలా ప్రజలను సమీకరించాడు. ఆయనను అరెస్ట్ చేశారు. జైలు నుండి విడుదలయ్యాక సిలిగురిలో పార్టీ కార్యాలయానికి వెళ్లి అక్కడున్న రివిజనిస్టు డాంగే ఫోటోను ఊడబీకి నేలపై విసిరి కొట్టాడు. ఆధునిక రివిజనిజానికి వ్యతిరేకంగా ద్వేషాన్ని బాహాటంగా వెళ్లగక్కిన ఈ సంఘటనను అప్పుడు అక్కడున్న పార్టీ సభ్యులు నేటికీ మర్చిపోలేరు.

కాలక్రమంలో రివిజనిస్టు వ్యతిరేక పోరాటం ముందుకు సాగింది. ఆయన భారతదేశ విప్లవోద్యమ పంథాను నిర్ధారించాడు. నక్సల్బరీ రైతాంగ వెల్లువ ముందుకొచ్చింది. ఆయన నిర్ధారించిన భావజాల-రాజకీయ పంథాను ఆచరణలో అన్వయించారు. అప్పుడే విప్లవ పతాకాన్ని సమున్నతంగా ఎత్తిపడుతూ భారతదేశంలో వసంతమేఘం గర్జించింది. నక్సల్బరీ తిరుగుబాటు ఉవ్వెత్తున లేచింది. వేలాది మంది విప్లవకారులూ, కార్మికులూ, రైతులూ, మేధావులూ, విద్యార్థులూ, యువజనులూ నక్సల్బరీ తిరుగుబాటు వెనుకా, దాని నాయకుడైన కామ్రేడ్ చారు మజుందార్ వెనుకా సమీకృతులయ్యారు.

కామ్రేడ్ చారు మజుందార్ వర్గ పోరాటంలో పాల్గొనే ఒక సుదీర్ఘ క్రమంలో విప్లవ నాయకుడిగా ఎదిగాడు. ఆయన స్కూలులో చదివే రోజుల్లోనే జాతీయ విప్లవకారులకు చెందిన ఒక పెటీ బూర్జువా సంస్థయైన అనుశీలన్ గ్రూపు నడిపించే అఖిల బెంగాల్ విద్యార్థి సంఘంలో సభ్యుడిగా చేరాడు. కొద్ది సంవత్సరాల్లోనే ఆయన కాలేజీ వదిలేసి బీడీ కార్మికులను సంఘటితం చేయసాగాడు. 1930 దశకం చివర్లో ఆయన సీపీఐ సభ్యుడయ్యాడు. ఆయన రైతాంగాన్ని సంఘటితం చేసే పనిలో దిగాడు. 1942లో జల్‌పాయ్‌గుడి జిల్లా కమిటీ సభ్యుడయ్యాడు. ఆనాడు బెంగాల్‌లో తీవ్రమైన కరువు నెలకొనడంతో ఆయన రైతాంగాన్ని సమీకరించి ధాన్యం స్వాధీనం చేసుకోవడానికై జమీందార్ల పైనా, అక్రమ నిల్వదార్ల పైనా దాడులు చేశాడు. 1946-51 నాటి తెభాగ రైతాంగ ఉద్యమానికి నాయకత్వం వహించిన పేరుగాంచిన, ప్రముఖ నాయకుల్లో, ఆర్గనైజర్లలో ఆయన ఒకరు. ఆయన ఉత్తర బెంగాల్‌లోని దినాజ్‌పూర్ జిల్లా రైతాంగానికి నాయకత్వం వహించాడు. ఆ సాయుధ రైతాంగ ఉద్యమం విప్లవకర రైతాంగ పోరాటపు అనేక అంశాల్ని ముందుకు తెచ్చింది. వీటన్నిటినీ కామ్రేడ్ సీఎం క్రోడీకరించి ఆ తర్వాతి సంవత్సరాల్లో వాటిని అభివృద్ధి చేశాడు. ఆ తెభాగ ఉద్యమాన్ని ప్రభుత్వం క్రూర నిర్బంధాన్ని ప్రయోగించి అణచివేసింది.

ఆ తర్వాత కామ్రేడ్ చారు మజుందార్‌ను దార్జిలింగ్ జిల్లాలో టీతోటల కార్మికులను ఆర్గనైజ్ చేయడం కోసం బదిలీ చేశారు. సీపీఐలో విభజన జరిగాక ఆయన సీపీఐ (ఎం)లో చేరాడు. అయితే పార్టీ విప్లవకర పదాడంబరం మాటున నయా రివిజనిస్టు పంథాను అనుసరిస్తున్నదని ఆయన త్వరలోనే గ్రహించాడు. 1964-65లో ఆయన అనారోగ్యం పాలయ్యాడు. ఆ సమయంలో ఆయన మార్క్సిస్టు సాహిత్యాన్నీ, మావో రచనల్నీ అధ్యయనం చేశాడు. బాగైన తర్వాత ఆయన దార్జిలింగ్ జిల్లాలోని సిలిగుడి సబ్‌డివిజన్ రైతాంగం మధ్య తన కార్యకలాపాల్ని కొనసాగించాడు. ఆయన తన గత కాలపు వర్గ పోరాటాల అనుభవాలపై ఆధారపడుతూ విప్లవకర పంథాను అభివృద్ధి చేశాడు. ఎనిమిది డాక్యుమెంట్లుగా ప్రఖ్యాతి గాంచిన తన వ్యాసాల ద్వారా ఆయన విప్లవకర పంథాను ప్రవేశపెట్టాడు. ఈ పంథాపై ఆధారపడి ఆయన ఒక శక్తివంతమైన విప్లవకర రైతాంగ ఉద్యమాన్ని ఆర్గనైజ్ చేశాడు. ఈ విధంగా ముందుకొచ్చిందే నక్సల్బరీ తిరుగుబాటు. ఇది భారతదేశ విప్లవోద్యమంలో ఒక నూతన యుగానికి నాంది పలికింది. ప్రభుత్వ హెచ్చరికల్ని ఏ మాత్రం లెక్క చేయకుండా రాష్ట్రంలోని కమ్యూనిస్టు విప్లవకారులు "నక్సల్బరీ రైతాంగ పోరాట సహాయ కమిటీ"ని ఏర్పాటు చేసారు. ఈ పంథాపై ఆధారపడి దేశంలోని కమ్యూనిస్టు విప్లవకారులు ఏఐసీసీసీఆర్ (అఖిల భారత కమ్యూనిస్టు విప్లవకారుల సమన్వయ కమిటీ) బ్యానర్ కింద సమైక్యమయ్యారు. ఇదే ఆ తర్వాత కామ్రేడ్ సీఎం నాయకత్వంలో సీపీఐ (ఎం-ఎల్) ఏర్పాటుకు దారి తీసింది.

కామ్రేడ్ చారు మజుందార్ సీపీఐ (ఎం-ఎల్)కు మొట్టమొదటి ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. ఆయన నాయకత్వంలో సీపీఐ (ఎం-ఎల్) రాజ్యాధికారాన్ని చేజిక్కించుకునే లక్ష్యంతో విప్లవకర రైతాంగ పోరాటాల్ని ఆర్గనైజ్ చేసింది. మొత్తం భారత గ్రామీణ ప్రాంతమంతటా పోరాటం వ్యాపించింది. తమ చిరకాల ఆకాంక్షలైన భూమి, భుక్తి, విముక్తి కోసం వేలాది రైతాంగం పురోగమించింది. పార్టీ "దున్నేవారికే భూమి – రైతాంగ కమిటీకే సర్వాధికారాలు" అనే నినాదాన్ని ముందుకు తెచ్చింది. రాజ్యాధికారాన్ని చేజిక్కించుకోవడం ద్వారా ప్రజల ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పాలనే నినాదాన్ని పార్టీ ముందుకు తెచ్చింది. జమీందార్లకూ, నిల్వదార్లకూ, ఇతర దోపిడీ వర్గాల దోపిడీపీడనలకూ వ్యతిరేకంగా నిలిచినప్పుడల్లా ప్రభుత్వం వాళ్లపై విరుచుకుపడింది. నిరాయుధులైన రైతాంగం సాయుధ బలగాల అమానవీయ హింసాదౌర్జన్యాలను ఎదుర్కోవల్సి వచ్చింది. అందుకే పార్టీ "ప్రజా సైన్యాన్ని నిర్మిద్దాం, దీర్ఘకాల ప్రజాయుద్ధ పంథాలో పయనిద్దాం!" అనే నినాదాన్ని ఇచ్చింది. కామ్రేడ్ చారు మజుందార్ నిర్ధారించిన విప్లవకర పంథా ఆధారంగా ప్రజా పోరాటాలు అనేక ఎగుడుదిగుళ్ల గుండా, వంకరటింకర బాటల గుండా ముందుకు సాగాయి. కొత్త కొత్త పోరాట రంగాలు అవతరించసాగాయి. ఈ పురోగమనం పాలక వర్గాల, వాళ్ల సామ్రాజ్యవాద శక్తుల మనుగడకే ముప్పు తెచ్చింది.

రివిజనిజానికి వ్యతిరేకంగా పోరాడడంలోనూ, భారతదేశ నిర్దిష్ట పరిస్థితులకు మా-లె-మాను అన్వయించడంలోనూ కామ్రేడ్ చారు మజుందార్ భావజాలపరంగా ఒక గొప్ప, చెప్పుకోదగ్గ మార్పు తెచ్చాడు. ఆయన ఎనిమిది డాక్యుమెంట్లూ, ఏఐసీసీసీఆర్ డాక్యుమెంట్లూ, కాంగ్రెస్ డాక్యుమెంట్లూ, సీపీఐ (ఎం-ఎల్) అధికార పత్రికలో వెలువడ్డ ఆయన వ్యాసాలూ అన్నీ ఆయన రాజకీయ, సైద్ధాంతిక కృషిలో భాగమే. 1972 జూలై 16న కామ్రేడ్ చారు మజుందార్‌ను కోల్‌కాతలోని ఒక షెల్టర్‌లో పోలీసులు అరెస్ట్ చేశారు. జూలై 28 నాడు లాకప్‌లో ఆయనను హత్య

*( తరువాయి...... 40వ పేజీలో..... )*

# భారత విప్లవ మహా నాయకుడూ, ఉపాధ్యాయుడూ
# కామ్రేడ్ కన్నాయ్ ఛటర్జీ అమర్ రహే !

కామ్రేడ్ కన్నాయ్ ఛటర్జీ 1933లో నేటి బంగ్లాదేశ్‌లో బరిషాల్ జిల్లా బరుఖల్లీ గ్రామంలో ఒక సంపన్న కుటుంబంలో పుట్టాడు. చిన్ననాటి నుంచీ బ్రిటిషు వ్యతిరేక ఉద్యమం ఆయన మీద గొప్ప ప్రభావం వేసింది. బ్రిటిష్ వలస పాలన పట్ల ఎంతో అసహ్యాన్ని పెంచింది.

పదిహేను సంవత్సరాల చిన్న వయసులో కోల్‌కత్తాలో మెట్రిక్‌లో ఉత్తీర్ణుడయ్యాడు. అశుతోష్ కళాశాలలో సైన్సు కోర్సులో చేరాడు. కానీ విద్యార్థి రాజకీయాలలో కార్యకలాపాల వల్ల శ్యాంప్రసాద్ ముఖర్జీ కళాశాలలో కామర్స్ కోర్సుకు మారాడు. ఇంటి నుంచీ డబ్బులు తీసుకోవడం మానేసి తన ఖర్చుల కోసం ట్యూషన్లు చెప్పసాగాడు. బికాంలో ఉత్తీర్ణుడయిన తరువాత విద్యార్థి కార్యకలాపాలలో పాల్గొంటూనే ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీలో చేరాడు.

1953లో కోల్‌కత్తా పట్టణ శివారు ప్రాంతంలో తిల్‌జల్లాలో పని ప్రారంభించాడు. ఈ ప్రాంతంలో విశాల కార్మికవర్గ ప్రజలు మురికిపేటలలో జీవిస్తూ ఉండేవారు. ఆయన అక్కడ పార్టీ పని ప్రారంభించి 'సిటిజన్స్ రైట్స్ కమిటీ' (పౌరుల హక్కుల కమిటీ) అనే ప్రజాసంఘం నిర్మించాడు. దాని ద్వారా ఆ ప్రాంతంలో పీడిత ప్రజలతో లోతైన సంబంధాలు ఏర్పరచుకున్నాడు. కొద్ది కాలంలోనే ఆ ప్రాంతంలో చాలా పేరు సంపాదించాడు. ముఖ్యంగా ముస్లిం ప్రజల సమస్యలతో, ఉద్యమాలతో సన్నిహిత సంబంధాలు ఏర్పరచుకోవడం వల్ల వాళ్లల్లో బాగా పేరు సంపాదించాడు.

1959లో కా. కేసీ ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ బాలిగంజ్ స్థానిక కమిటీ కార్యదర్శి అయ్యాడు. అదే సమయంలో ఆ ప్రాంత పీడిత ప్రజల నాయకుడయ్యాడు. వాళ్లను అనేక పోరాటాలలో చురుకుగా నాయకత్వం వహిస్తూ కదిలించాడు. ఈ రకంగా కా. కేసీ ఆ ప్రాంత పీడిత ప్రజలకు స్నేహితుడిగా నాయకుడిగా ఉద్భవించాడు.

1959లో ఆనాటి కాంగ్రెస్ ముఖ్యమంత్రి విధాన్ రేకు వ్యతిరేకంగా సీపీఐ చేపట్టిన 'ఆహార ఉద్యమం'లో ఆయన పాల్గొన్నాడు. అయితే సీపీఐ వేలాది రైతాంగాన్ని నగరంలో ర్యాలీల కోసం సమీకరిస్తున్న తీరును ఆయన బలంగా వ్యతిరేకించాడు. ఆ ఉద్యమంలో కోల్‌కాత నట్టనడుమ ధరమ్‌తల్లాలో భారీ ర్యాలీ జరుగుతున్నప్పుడు పోలీసులు విచక్షణారహితమైన లాఠీఛార్జికి దిగారు. టియర్ గ్యాస్ వదిలారు. ఫైరింగు చేసారు. ఇందులో 81 మంది అమరులయ్యారు. కా. కేసీకి కాల్లో తూటా తగిలి తీవ్రంగా గాయపడ్డాడు.

1962 భారత్ చైనా యుద్ధంలో చైనా మీద భారతదేశం దురాక్రమణను వ్యతిరేకించినందుకు ఆయనను ఎన్ఎస్ఏ (జాతీయ భద్రతా చట్టం) కింద అరెస్టు చేసారు. జైల్లోనే సీపీఐ అవకాశవాద నాయకత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాటు ప్రారంభించాడు. జైల్లోనే అమూల్య సేన్, చంద్రశేఖర్ దాస్‌లతో సంబంధాలు ఏర్పడ్డాయి. బయటకు వచ్చిన తరువాత వాళ్లు సీపీఎంలో 'చింతా' అనే ఒక రెండో కేంద్రాన్ని ఏర్పరిచారు. దాని ప్రభావాన్ని విస్తరింపచేసి, రివిజనిజాన్ని మరింతగా ఎండగట్టేందుకు 1966 నుంచీ బహిరంగంగా 'దక్షిణ్ దేశ్' అనే పత్రికను ప్రారంభించాడు.

ఈ సమయంలోనే కృశ్చేవ్ రివిజనిజం విజయవంతమయ్యింది. దీని ప్రభావం భారతదేశంలో కూడా ఎక్కువగానే పడింది. భారతదేశంలో మార్క్సిజానికి రివిజనిజానికీ మధ్య పోరాటం తీవ్రం కాసాగింది. కా. కేసీ పార్టీలో రాజకీయ, సైద్ధాంతిక పోరాటాన్ని తీవ్రతరం చేసాడు. 1964 పార్టీ డాక్యుమెంటును రివిజనిస్టుగా ప్రకటించాడు. ఉద్యమం లోపలనే రివిజనిజంతో ఎలా పోరాడాడన్న దానికి ఇది ఒక ఉదాహరణ.

ఈ సమయంలో మావో మహత్తర శ్రామికవర్గ సాంస్కృతిక విప్లవ భావ కెరటాలు భారతదేశ తీరాలు చేరుకున్నాయి. 'తిరగబడడం ఒక హక్కు' అన్న మహత్తర శ్రామికవర్గ సాంస్కృతిక విప్లవ పిలుపును అందుకున్న కా. కేసీ పాత రివిజనిస్టు పార్టీతో సంబంధాలు తెంచుకున్నాడు.

1967లో కా. చారు మజుందార్ నాయకత్వంలో చారిత్రక నక్సల్బరీ తిరుగుబాటు జరిగింది. దేశమంతటా గొప్ప కల్లోలం వ్యాపించింది. రివిజనిజం వ్యతిరేక తిరుగుబాటు కెరటం లాగా ఉప్పొంగింది. కమ్యూనిస్టు విప్లవకారుల సమన్వయ కమిటీ ఏర్పడింది. కానీ పార్టీ ఏర్పాటయిన పద్ధతికి సంబంధించిన విభేధాల వల్ల 1969లో ఏర్పడిన సీపీఐ (ఎం-ఎల్)లో 'దక్షిణ్ దేశ్' గ్రూపు చేరలేకపోయింది. కా. కేసీ నాయకత్వంలో కామ్రేడ్స్ అమూల్యా సేన్, చంద్రశేఖర్ దాస్‌లతో కలిసి 1969 అక్టోబరు 20వ తేదీన ఎంసీసీ ఏర్పడింది.

ఆనాటి నుంచీ కా. కేసీ ఎంసీసీ రాజకీయాలలోనూ, పెరుగుదలలోనూ అంతర్భాగంగా ఉన్నాడు. ఈ క్రమంలో కా. కేసీ అనేక చారిత్రక డాక్యుమెంట్ల రచనకు బాధ్యత వహించాడు. భారతదేశంలో విప్లవోద్యమ పంథా విధానాలు పెంపొందించడానికి ఇవి దోహదం చేసాయి. భారతదేశ సాయుధ వ్యవసాయ విప్లవ వ్యూహం, ఎత్తుగడలు, ఎత్తుగడల పంథాలకు సంబంధించిన ఒక డాక్యుమెంటు, భారతదేశంలో జాతుల సమస్య పట్ల ఒక సరైన వైఖరి, భారతదేశంలో ఎన్నికల సమస్య పట్ల వైఖరి, భారత విప్లవ మౌలిక పంథా నిర్ణయం మొదలయినవి ఆయన అమూల్య కృషిలో కొన్ని. ఆయన కృషి దీనికే పరిమితం కాలేదు. ఈ పంథాను అమలు చెయ్యడానికి ఆయన గొప్ప కృషి చేసాడు. ప్రజాసైన్యం, బేస్ ఏరియాలను నెలకొల్పడం కోసం వ్యూహాత్మక ప్రాంతాలను ఎంపిక చేసాడు. ఎన్నో కష్టాలను ఎదుర్కొంటూ నూతన సంస్థకు విత్తులు చల్లాడు. దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథాలో వ్యవసాయ విప్లవ గెరిల్లా పోరాటాలను ప్రారంభించాడు.

నిజమైన కమ్యూనిస్టు ఎలా ఉండాలో కా. కేసీ కమ్యూనిస్టు జీవిత పద్ధతి ఒక సజీవ ఉదాహరణ. కార్మికుల పట్లా, రైతాంగం పట్లా, పీడిత ప్రజల పట్లా ఆయన సంపూర్ణ, చెక్కుచెదరని అంకితత్వం మనందరికీ ఒక ప్రకాశవంతమైన ఉదాహరణ. దురదృష్టవశాత్తూ ఆయన నలభైతొమ్మిది సంవత్సరాల చిన్న వయసులోనే, 1982 జూలై 18వ తేదీన అనారోగ్యంతో మరణించాడు.

ఇవాళ కా. కేసీ భారత విప్లవ నాయకులలో, ఉపాధ్యాయులలో ఒకడిగా ఆమోదం పొందాడు. నిజమైన కార్మికవర్గ విలువలను అవలంబించడం ద్వారా విప్లవోద్యమానికి సమర్థవంతమైన సైద్ధాంతిక నాయకుడయ్యాడు. దేశంలో పీడిత ప్రజలకు ఆయన ఒక నిజమైన స్నేహితుడు. సాయుధ కామ్రేడ్. నాయకుడు. నాడు ఆయన నాటిన విత్తనాలు నేడొక మహా వృక్షమయ్యాయి. లోతైన వేళ్లతో భారతదేశ విశాల గ్రామీణ ప్రాంతంలో పుష్పిస్తూ చిగురిస్తున్నాయి. ▲

## నేపాల్ కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) కేంద్ర కమిటీ సభ్యురాలు, మహిళా విభాగం బాధ్యురాలు

# కామ్రేడ్ పార్వతితో 'పీపుల్స్ మార్చ్' ఇంటర్వ్యూ

**పీపుల్స్ మార్చ్ :** నేపాల్‌లో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొంటున్నారని చూస్తున్నాం. ఇదొక గొప్ప విషయం. సీపీఎన్ (మావోయిస్టు) దీన్నెలా సాధించింది?

**పార్వతి :** మొట్టమొదటగా మనం చూడాల్సింది ఏమంటే, నేపాల్‌లో వామపక్ష ఉద్యమం బలంగా ఉంటూ వస్తోంది. ఈ కారణంగా, వామపక్షీయులు, వాళ్లు రివిజనిస్టులయినా, విప్లవకారులయినా తమ మహిళలను వీధుల్లోకి తీసుకువచ్చారు. అయితే రివిజనిస్టులు చట్టబద్ధ పోరాటానికి మించి ముందుకు వెళ్లకపోవడం వల్లా, విప్లవ పార్టీ తమ విప్లవ సిద్ధాంతాన్ని ఇంకా ఆచరణలో అమలులోకి తీసుకురాకపోవడం వల్లా ఈ క్రమం ముందుకు సాగలేదు. సిద్ధాంతానికీ, ఆచరణకూ చాలా వ్యత్యాసం ఉండింది. దీని వల్ల, చిన్న వయసులో చాలా చురుకుగా ఉన్న మహిళలు పెళ్లి అయిన తరువాత నాయకుల భార్యలుగా ఉండిపోయారు. లేక మాయమయిపోయారు. ఈ విధంగా, పెళ్లి, మగ కమ్యూనిస్టు నాయకులకు సమర్థవంతమైన మంచి భార్యలను తయారు చేసి ఇచ్చే పితృస్వామిక వామపక్ష సంస్థగా తయారయ్యింది. అయితే కమ్యూనిస్టు ఉద్యమం మహిళా కాడర్‌ను కోల్పోయింది. కానీ, వామపక్ష ఉద్యమం క్రియాశీలంగా ఉండడంతో కొత్త మహిళలు రావడం, మాయమయిపోవడం జరుగుతూ వచ్చింది. 1996లో ప్రజా యుద్ధం ప్రారంభం కావడంతో ఈ దౌర్భాగ్యమైన క్రమానికి తెర పడింది. ఇంతకాలం చట్టబద్ధ, అల్ప పోరాటాల వరకే కుదించుకుపోయిన మహిళల ఆగ్రహాన్ని ఇది వెలికి తెచ్చింది.

నేపాల్ గురించి మీరు ఒక విషయం తెలుసుకోవాలి. ఇక్కడ ప్రధాన ఉత్పత్తి శక్తిగా ఉండే పురుషులు భారతీయ నగరాలకో లేక దేశంలోని పట్టణ ప్రాంతాలకో వలస వెళతారు. వాళ్ల భార్యలు గ్రామీణ ప్రాంతంలో ఒంటరిగా, కఠిన జీవితం గడుపుతుంటారు. ప్రాథమిక సౌకర్యాలు అతి తక్కువ. వాస్తవానికి నేపాల్‌లో కుటుంబాలు మహిళల ఆధిపత్యంలో ఉన్నట్టుగా కనిపిస్తాయి. పెళ్లి అయినప్పటికీ సంవత్సరాల తరబడి ఒంటరిగా పిల్లల్నీ, ముసలి తల్లిదండ్రులనీ చూసుకుంటూ ఉంటారు. కాబట్టి నేపాల్ రైతాంగ ఆర్థిక వ్యవస్థను మహిళలే నడిపిస్తున్నారని చెప్పొచ్చు. కానీ రాజు ఆధ్వర్యంలో నడిచే భూస్వామ్య పితృస్వామ్యం ఆమెకు గుర్తింపునివ్వకపోవడమే కాకుండా, తల్లిదండ్రుల ఆస్తి మీద ఆమెకు హక్కు లేకుండా చేయడం ఆమె శ్రమను దోచుకుంటుంది.

చాలా సార్లు జరిగేదేమంటే, ఎక్కువ కాలం పాటు భార్యలకు దూరంగా ఉండడంతో భర్తలు వేరే భార్యను తెచ్చుకుంటారు. ఇలాంటి కేసుల్లో మహిళలకు చట్టపరమైన రక్షణ లేనట్టే. ఇటువంటి వివాహాలకు (ఫిర్యాదు చేసిన పక్షంలో) చాలా చిన్న శిక్ష వేసి వదిలేస్తారు. అందుకని మహిళలలో అంతులేని ఆగ్రహం గూడుకట్టుకొని ఉంది. ప్రజాయుద్ధం దీన్ని పట్టుకోగలిగింది. పరిస్థితి ఇంత హీనంగా ఉండడంతో వాళ్లను సంఘటితం చెయ్యకుండానే ప్రజాయుద్ధంలోకి వచ్చేసేవాళ్లు.

స్వీయాత్మకంగా చూసుకుంటే... మా పార్టీ ప్రజాయుద్ధం ప్రారంభించక ముందు నుండీ కూడా మహిళలలో చురుకుగా పని చేస్తోంది. 1990లో ఖాట్మండులో జరిగిన మొట్టమొదటి అందాల పోటీలను అందరికన్నా ముందుగా అడ్డుకున్నది మేమే. అలాగే నేపాల్‌లోని వివిధ ప్రాంతాలలో అత్యాచారాలకూ, అన్ని రకాల అశ్లీలతలకూ వ్యతిరేకంగా క్రమం తప్పకుండా నిరసన కార్యక్రమాలు నిర్వహించాం. మేం ప్రతి ఏటా మార్చి 8ని రాజకీయ ప్రకటనలతో జరుపుకునే వాళ్లం. ప్రత్యేకించి, పంచాయతీ వ్యవస్థలో రాజకీయ పార్టీలన్నీ నిషేధానికి గురయినప్పుడు, ప్రతీ ఒక్కరూ తమ రాజకీయ ప్రకటనలు వెలువరించడానికి మార్చి 8 కోసం ఆత్రుతగా ఎదురు చూసేవారు. అంటే ఇక్కడ మహిళా ఉద్యమ సంస్కృతి ముందు నుండీ ఉంది. నేపాల్‌లో నేను గమనించిన ఒక ఆసక్తికరమైన విషయమేమంటే, పశ్చిమ దేశాలలో ఉన్నంతగా, బహుశా భారతదేశంలో ఉన్నంతగా కూడా, నేపాల్‌లో స్త్రీ పురుష విభజన లేదు. మా మార్చి 8 ప్రదర్శనలలో మహిళలతో పాటు నినాదాలిచ్చే పురుషులు అనేక మంది మీకు కనిపిస్తారు. నిజానికి మేము అందాల పోటీలకు వ్యతిరేకంగా పోరాటం చేసినప్పుడు పురుషులు మా వెంట వస్తారు.

మహిళల జీవితాలలో ప్రజాయుద్ధం తీసుకువచ్చిన మౌలిక మార్పు ఏమంటే మహిళల కుటుంబ శృంఖలాలను బద్దలు కొట్టింది. ఇది మహిళల జీవితాల మీద బలమైన ప్రభావం వేసింది. వాళ్లల్లో దాగి ఉన్న శక్తి సామర్థ్యాలను వెలికి తెచ్చింది. ఈ పాత కుటుంబ వ్యవస్థ మీద తిరుగుబాటు అనేక స్పందనలకు దారి తీసింది. మొదటి స్పందన నూతన వివాహ వ్యవస్థపై వచ్చింది. ఆచరణ రంగంపైనా, భావజాల మైత్రిపైనా నిలబడే ప్రేమ రసాయనశాస్త్రం ఈ వ్యవస్థకు పునాదిగా ఉంది. రెండో స్పందన వాళ్లు తమ పునరుత్పత్తి ప్రక్రియను చూస్తున్న పద్ధతిపై వస్తోంది. గతంలో, కమ్యూనిస్టులు కూడా, వాళ్లు ఎన్నోసార్లు మహిళా విముక్తంటూ పిడికిళ్లు బిగించిన వాళ్లే అయినప్పటికీ, పురుషాధిపత్యం మీద ఎంతో అరిచిన వాళ్లే అయినప్పటికీ మగ వంశాంకురాన్నే కోరుకొని తమ భార్యలను మగ సంతానాన్ని కనేలా బలవంత పెట్టారు. గతంలో ముగ్గుర్నో, నలుగుర్నో లేక అబ్బాయి పుట్టేవరకూనో పిల్లల్ని కనేవాళ్లు. బాగా చైతన్యం ఉన్న మహిళలు కూడా ప్రజాయుద్ధం ప్రారంభానికి ముందు కనీసం ఇద్దరు పిల్లల్ని కనేవాళ్లు. ప్రజాయుద్ధం ప్రారంభంతో ఇది ఎంతో మారింది. ఈ సంఖ్య ఒకటికి తగ్గింది. ఇద్దర్ని కనడం చాలా అరుదయ్యింది. అలాగే కొడుకు కోసం ఎదురు చూడడం లేదిప్పుడు. కాబట్టి, నేపాల్‌కు సంబంధించి ఇదొక పెద్ద గెంతు!

మాకు బాగా పట్టున్న గ్రామీణ ప్రాంతాల్లోని విముక్తి ప్రాంతాలలో తల్లిదండ్రుల ఆస్తులపై సమాన హక్కుల్ని ఆచరణాత్మకంగా అమలు చేయగల్గుతున్నాం. అట్లాగే, మహిళలకు సమాన హోదా ఇవ్వగలుగుతున్నాం. నిజానికి, చాలా సందర్భాల్లో, మహిళలకు మొదటి ప్రాథమ్యతనిస్తూ మేం చెప్పేదాన్ని చేసి చూపించ గలుగుతున్నాం. ప్రజా అధికారంలో ప్రత్యేక ప్రాతినిధ్య హక్కులను మేం ఖాయపర్చాం. 'మహిళా నమూనా గ్రామాలు' అని పిలిచే నమూనా గ్రామాలలో మహిళలకు తల్లిదండ్రుల ఆస్తి మీద హక్కు ఉంటుంది. వాళ్లు తమ పొలాలలో సహకార పద్ధతిలో వ్యవసాయం చేస్తారు. సమిష్టిగా పశువుల దాణా జమ చేసే పనిలో పాల్గొంటారు. ఇంకా ఈ నమూనా గ్రామాల్లో మహిళలు ప్రయాణీకులకు విశ్రాంతి గృహాల నిర్మాణ పనిలో పాల్గొంటారు. తమ సమిష్టి డబ్బును చిన్నపాటి ఉత్పత్తులలో మదుపు చేస్తారు. మహిళా సమస్యల పట్ల మాకున్న శ్రద్ధను ఈ నమూనాలను చూసి అర్థం చేసుకోవచ్చు.

మహిళలు ప్రజాయుద్ధం మీద మరింత విశ్వాసం పెంచుకోవడానికి

ప్రజా కోర్టులు కూడా కీలకంగా పని చేస్తున్నాయి. ఈ ప్రజాకోర్టులలో సాధారణ ప్రజలు, ముఖ్యంగా పీడిత జాతులకు సంబంధించిన వాళ్లూ, దళితులూ తమ పీడకులకు వ్యతిరేకంగా త్వరితంగా న్యాయం పొందుతున్నారు. ఈ ప్రజాకోర్టుకు మహిళా మిలిషియా రక్షణ కల్పిస్తుంది. గతంలో మహిళలే కాకుండా పురుషులు కూడా కోర్టులో కేసు కోసం ఎంతో దూరం వెళ్లవలసి వచ్చేది. ఇలా వెళ్లడం అంటే, అంతులేని న్యాయ ప్రక్రియ కోసం డబ్బు ఖర్చు చేస్తూ ఆస్తి కోల్పోవడం. ఇప్పుడు ప్రజాకోర్టు తమ గ్రామాలలోనే తక్షణ న్యాయం అందిస్తూ ఉంది.

ప్రజాసైన్య రంగం మరో ఆకర్షక బిందువు. మిలిషియా, ప్రజా విముక్తి సైన్యం (పిఎల్ఏ) మహిళలకు ఆకర్షక బిందువయ్యాయి. గతంలో మహిళలు సాధారణంగా ముందుగా సాంస్కృతిక రంగం ద్వారానే ఉద్యమంలోకి వచ్చేవాళ్లు. కానీ ఇప్పుడు ప్రజాయుద్ధంలో చేరడానికి సైనిక రంగం వాళ్ళకు మరింత ఆసక్తికరమైన కేంద్రంగా తయారైంది. సైనిక రంగంలో చేరడమే మహిళలలో గొప్ప పరిణామశీలమైన ప్రభావం కలుగజేస్తున్నది. ఎవరికీ తెలియని, అణిగిమణిగి ఉండే మహిళ, ఇప్పుడు ఒక్కసారిగా నమ్మకమైన స్వతంత్ర యోధగా మారింది. చదువుకున్న పట్టణ మహిళకు ఆమె ఎంత మాత్రం తీసిపోవడం లేదు. ఆమె రాజకీయంగా, తాత్వికంగా మరింత ఎదుగుతోంది. నిత్యం జీవన్మరణాలతో వ్యవహరిస్తున్నప్పుడు ఇది జరిగి తీరుతుంది.

ప్రజాయుద్ధ దీర్ఘకాలిక స్వభావం మహిళలు సమాజాన్ని మార్చడంతో పాటు, తమ్ము తాము మార్చుకోవడానికి కూడా ఉపయోగపడుతుంది. నేపాల్ వంటి పెట్టుబడిదారీ పూర్వ దేశంలో, రాజ్యాధికారం పూర్తిగా రాచరికం చేతుల్లో ఉన్న చోట, కమ్యూనిజానికి దారి సుదీర్ఘమైనది. ప్రజాయుద్ధ దీర్ఘకాలిక స్వభావం విప్లవకారులు, ముఖ్యంగా పురుష విప్లవకారులతో పోల్చినప్పుడు సాంస్కృతిక స్థాయి మరింత తక్కువగా ఉన్న మహిళా విప్లవకారులు సుదీర్ఘ కాలం పాటు మార్పు చెందడానికి దోహదం చేస్తుంది.

మహిళలను మౌలిక విప్లవ బలగంగా మా పార్టీ గుర్తిస్తుంది (మొట్టమొదటి పీడితులూ, ఆఖరుగా విముక్తి పొందేవాళ్లూ). వీళ్లు విప్లవం కోసం పోరాడడం మాత్రమే కాకుండా, ప్రతీఘాతక విప్లవానికి వ్యతిరేకంగా కూడా పోరాడుతారు. తద్వారా నిరంతర విప్లవ పతాకాన్ని ఎత్తిపట్టుకుంటారు. ఇలా, సీపీఎన్ (మావోయిస్టు) ప్రజాయుద్ధంలో మహిళల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించే విధానాన్ని అనుసరిస్తోంది.

**పీపుల్స్ మార్చ్ :** సైన్యం, మహిళల గురించిన ఒక ఆసక్తికరమైన విషయం గురించి మీరు మాట్లాడుతున్నారు. గతంలో కానీ, ఇప్పుడు కానీ బూర్జువా వర్గం కూడా మహిళలను ఎప్పుడూ సైన్యంలో భాగం కానివ్వలేదు. కమ్యూనిస్టు ఉద్యమాలు మహిళలను సైన్యంలోకి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నాయి. దీని గురించి మీరు సైద్ధాంతికంగా వివరిస్తారా? మొట్టమొదటి నుంచి మహిళలు శారీరకంగానూ, కండరాల నిర్మాణం రీత్యానూ బలహీనులన్న అభిప్రాయం ఉన్నది. వాళ్లను యోధులుగా మీరెలా చూస్తారు?

**పార్వతి :** మనం బూర్జువా వర్గం మీద పోరాటం చెయ్యాలంటే వాళ్ల అత్యంత బలహీన అంశం మీద దెబ్బ తీయాలి. మహిళలు వాళ్ల అతి పెద్ద బలహీన అంశం. ఎందుకంటే, వాళ్లకు స్వేచ్ఛ, సమానత్వాలు ఇవ్వాలని ఉన్నది వాళ్లంటారు కానీ ఆచరణలో ఎప్పుడూ మహిళలను మోసమే చేస్తున్నారు. ఇచ్చినా, రూపంలోనే తప్ప సారంలో ఇవ్వడం లేదు. బూర్జువా వర్గం మహిళలను సైనిక కార్యక్రమాలలోకి తీసుకురాదని కాదు. కానీ మనం చేస్తున్నట్టుగా వ్యూహాత్మక పద్ధతిలో వాళ్లు చెయ్యరు. వాళ్లు ఆఖరి ప్రయత్నంగా చేస్తారు. అది కూడా పైపైన, మహిళలను అలంకారిక వస్తువులుగా కుదించివేసి సహాయక బలగంగానో, రిజర్వు బలగంగానో ఉపయోగించుకుంటారు తప్ప వాళ్లను వ్యూహాత్మక బలగంగా ఎప్పుడూ తీసుకోరు. టైపిస్టులు, నర్సులు, ఇంటెలిజెన్స్ ఆపరేటర్లు మొదలయిన సైన్యసహాయక పనుల్లోనే తప్ప వాళ్లను యోధులుగా యుద్ధరంగానికి పంపించరు. ఇది వాళ్ల భావజాలానికి అనుగుణమైందేనని నేను భావిస్తాను. ఎందుకంటే యావత్తు బూర్జువా వ్యవస్థా కూడా మహిళల పీడన మీద ఆధారపడి ఉంది. వాళ్లు సైనిక కార్యకలాపాల కోసం మహిళలను వంటింటి నుంచి దూరంగా ఎక్కువ కాలం ఉంచలేరు.

అమెరికీయులనే తీసుకోండి. వాళ్లు మహిళలను సైన్యంలోకి తీసుకుంటున్నారు కానీ యుద్ధ రంగానికి పంపుతున్నది తక్కువే. ఒకటీ రెండూ సందర్భాలలో పంపారేమో. కానీ దీని వల్ల పురుషుల దృష్టి నిజమైన యుద్ధం నుంచి పక్కకు మళ్లింది. యుద్ధంలో పోరాడని మహిళా సైనికులను సంతృప్తి పర్చాల్సిన లైంగిక వస్తువులుగా చూస్తే, యుద్ధంలో పోరాడే మహిళా సైనికుల్ని కఠిన పోరాట జీవితం నుండి రక్షించాల్సిన బలహీనమైన, నాజూకైన మహిళలుగా చూస్తారు. దీని వల్ల ఈ రెండు పరిస్థితులలోనూ మహిళా సైనికుల బలాన్ని తక్కువ అంచనా వేస్తున్నట్టే. ప్రైవేట్ జెస్సికా లించ్ అనే మహిళను ఇరాకీ మిలిషియా నిర్బంధించిన సందర్భంగా, ఆమెను రక్షించడం కోసం చేసే ప్రయత్నాన్ని ఒక వీరోచిత చర్యగా అమెరికా పెద్ద ప్రచారం చేసుకుంది.

**పీపుల్స్ మార్చ్ :** స్త్రీవాద ఉద్యమం వల్లనూ, మహిళా ఉద్యమం వల్లనూ బూర్జువా ప్రపంచం కూడా మహిళలను సైన్యంలోకి తీసుకుందని నేననుకుంటాను. కొన్ని సేవల్లోకి, అదీ లింగపరంగా ఉత్త మూసపోత రకం సేవల్లోకి.

**పార్వతి :** అవును. చాలా స్కాండినేవీయ దేశాలు ఇట్లా చేశాయి. ఎందుకంటే అక్కడ మహిళా ఉద్యమం చాలా బలంగా ఉంది కాబట్టి.

**పీపుల్స్ మార్చ్ :** భౌతిక పరిస్థితుల గురించీ, మహిళలు అనివార్యంగా ప్రజాయుద్ధంలోకి రావడం గురించీ మీరు చెప్పారు. అదే సమయంలో ఇందుకోసం పార్టీ నుంచి జరుగుతున్న చైతన్యపూర్వక కృషి ఏమిటి? అంటే మీరు మహిళలను ప్రజా సంఘాలలోకీ, పార్టీలోకీ తీసుకురావడానికి ప్రజాపంథాను ఎలా అన్వయించారు?

**పార్వతి :** ఒక విషయం ఏమంటే, అవకాశం ఉన్నప్పుడల్లా పార్టీ మహిళలను సమీకరించడానికి ప్రయత్నిస్తూనే ఉంది. నేపాల్‌లో చూస్తే, మహిళలకు సంబంధించిన తీజ్ వంటి వివిధ పండుగలు ఉన్నాయి. ఈ పండుగల సమయంలో మహిళలు బయటకు వచ్చి పాటలు పాడుతూ నృత్యం చేస్తారు. ఇది మతపరమైనదే అయినప్పటికీ, ఈ సందర్భాన్ని మహిళలు కుటుంబ హింస గురించీ, పురుషాధిపత్యం గురించీ, భూస్వామ్య సంస్కృతి చేసే మహిళల పీడన గురించీ పాటలు అల్లడానికి ఉపయోగించుకుంటారు. వాళ్ల నుంచి ఈ అంశాన్ని తీసుకుని, భూస్వామ్య ఆచారాల మీద దాడి చేసేలా వాళ్లకు రాజకీయ బోధన గరపడానికి ఉపయోగించుకున్నాం. గ్రామాలలో, పట్టణ ప్రాంతాలలో, అన్ని చోట్లా ఈ ప్రయత్నాలు జరిగాయి. రెండో విషయం ఏమంటే, సాంస్కృతిక కార్యక్రమాలు జ్ఞానదాయకంగా ఉండి ప్రత్యేకించి మహిళలను ఆకర్షిస్తాయి కనక వాటిని ప్రోత్సహించాం. వాటి ద్వారా వాళ్లకు తమ జీవితం గురించీ, పేదరికం గురించీ, వాళ్ల పీడనకు కారణాల గురించీ వివరించాం. నిజానికి ప్రజాయుద్ధ ప్రారంభానికి ముందు మహిళా రంగం ఒక చురుకైన రంగం. ప్రజలను చేరుకోవడానికి ఇది ఒక పునాది వేసింది. ప్రజాయుద్ధం ప్రారంభించిన తరువాత రెండు రంగాలు అభివృద్ధి చెందాయి. బేస్ ఏరియాలలో మహిళలకు చదువు నేర్పించడం ద్వారా, శాలువా

తయారీ పరిశ్రమా, నిల్వ ఆహార తయారీ పరిశ్రమా, సహకార వ్యవసాయ పనులూ, కాయితం పరిశ్రమా వంటి చిన్నపాటి చేతివృత్తులలో పాల్గొనిపించడం ద్వారా ఆర్థికంగా, సామాజికంగా వాళ్ల ఉత్పాదకతను మరింతగా పెంచుతూ వాళ్ల సామర్థ్యాలను పటిష్టం చేస్తున్నాం. వివిధ స్థాయిలలో ప్రజా సమితులలో వాళ్లను భాగస్వాములను చేయడం ద్వారా వాళ్లను మంచి నాయకులుగా రూపొందిస్తున్నాం. ప్రజా న్యాయస్థానాలలో వాళ్లు పాల్గొనేటట్టు చేస్తున్నాం. తెల్ల ప్రాంతాలలో ప్రజలను సమీకరించడానికీ, శత్రువు నుంచి ప్రజలను రక్షించడానికీ వాళ్లను ఆర్గనైజర్లుగా, యోధులుగా పంపిస్తున్నాం.

మద్యపాన వ్యతిరేక కాంపెయిన్ అనేక సార్లు నిర్వహిస్తూ వస్తున్నాం. అలాగే పట్టణ ప్రాంతాలలో బార్‌లలో మహిళలను లైంగిక వస్తువులుగా వాడడానికి వ్యతిరేకంగా తీసుకున్న కాంపెయిన్ ఇంకా కొనసాగుతున్నది. ఇటీవల, పాత రాజ్యం ప్రోత్సహిస్తున్న అత్యాచారాలకూ, చిత్రహింసలకూ, హత్యలకూ వ్యతిరేకంగా, నేపాల్‌లో అమెరికా జోక్యానికీ వ్యతిరేకంగా 2004 మార్చి 8వ తేదీన దేశ వ్యాప్త బంద్ చెయ్యమంటూ మా మహిళా సంఘం – అఖిల నేపాల్ మహిళా సంఘం (విప్లవ) పిలుపు ఇచ్చింది. నేపాలీ మహిళా చరిత్రలో ఒక మహిళా సంఘం దేశ వ్యాప్త బంద్‌కు పిలుపునివ్వడం ఇదే మొదటిసారి. ఈ బంద్ పూర్తిగా విజయవంతమయ్యింది.

**పీపుల్స్ మార్చ్ :** *వర్కర్ పత్రికలో* ఒకసారి నేపాల్‌లో ప్రజాపంథా కాంపెయిన్ గురించి రాసారు. అది చాలా ఆసక్తికరంగా ఉంది. మహిళా ఉద్యమానికి సంబంధించి ఈ కాంపెయిన్ గురించి వివరంగా చెప్పండి.

**పార్వతి :** బేస్ ఏరియాలలోనూ, ఇతర బలమైన ఏరియాలలోనూ నూతన సంస్కృతిని పెంపొందించడానికి పార్టీ చైతన్యపూర్వకంగా కృషి చేస్తోంది. ప్రజాయుద్ధ ప్రారంభ దినం, అమరుల వారం, మావో పుట్టినరోజూ మొదలయిన నూతన పండుగలను జరుపుకుంటున్నారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున బహుమతులు కూడా ఇచ్చిపుచ్చుకుంటున్నారు. ఈ కార్యకలాపాలలో మహిళలు ఎంతో చురుకుగా ఉంటారు. భోజనశాలలూ, రెస్టారెంట్లూ నడుపుతారు. పార్టీ నిర్వహించే చిన్నపాటి కుటీరంలో తాము తయారు చేసిన ఉత్పత్తులు అమ్ముతారు. ఇవన్నీ ఇటువంటి ఉత్సవాలకు ప్రజా స్వభావాన్ని ఇస్తాయి. నూతన సాంస్కృతిక విలువలపై మరింత మంది ప్రజలు సమీకృతులవ్వడానికి పునాది వేస్తాయి. నాట్లు, కోతలప్పుడు శ్రమను ఇచ్చిపుచ్చుకునే పర్మా వ్యవస్థ అనే చాలా కాలంగా అమలులో ఉన్న పద్ధతిని ప్రోత్సహిస్తూ అడవి నుంచి మేత, వంటచెరకు జమ చెయ్యడం వంటి పనులకు కూడా విస్తరింపజేస్తున్నాం. పాత సాంస్కృతిక కార్యకలాపాల్ని స్వీకరించి వాటిలో నూతన అంశాలు, అభ్యుదయ విలువలూ జోడిస్తున్నాం. ఉదాహరణకు, రుకుం, రోల్పాలలో మయూర్ నృత్యం పురుషుల ప్రత్యేకం. కానీ ఇవాళ మహిళలు కూడా అందులో పాల్గొంటున్నారు. ప్రజలను సైనికీకరించడానికి కూడా కాంపెయిన్ నిర్వహించాం. మా బలమైన ప్రాంతాలలో మహిళా మిలిషియా బలంగా ఉన్నది కనక దీనిని మరింత సమర్థవంతంగా చెయ్యగలుగుతున్నాం. దూర పశ్చిమ ప్రాంతంలో మాకు సాంస్కృతిక కంపెనీ కూడా ఉంది. వీళ్లు ముందుకు సాగుతూ కార్యక్రమాలు ఇస్తారు. తద్వారా సాంస్కృతిక కార్యక్రమాలకు ఒక ప్రజా, సైనిక రూపం కలుగుతుంది. ఈ కాంపెయిన్ ప్రజల్లో ఎంత అభిమానం పొందిందంటే, పాత రాజ్యం దీనిలోనూ, ఇతర మిలిషియా కార్యక్రమాలలోనూ ప్రజలు పాల్గొనడాన్ని మావోయిస్టులు చేస్తున్న కిడ్నాపులుగా ప్రచారం చేస్తున్నది. ఒక ఇల్లూ ఒక సభ్యులూ, ఒక గ్రామం ఒక సంఘం అన్న భావనను పెంపొందించాం. తద్వారా మా ప్రజా సంఘాలలో సభ్యత్వాన్ని పెంచుకుంటున్నాం. ఇవాళ మా మహిళా సంఘాలు చాలా వరకూ స్వయం సమృద్ధం కావడమే కాకుండా ఎక్కువ డబ్బు కూడా కలిగి ఉన్నాయి. ఎందుకంటే మా మహిళలు ఉత్పత్తి పనులలో చురుకుగా పాల్గొనడమే కాకుండా డబ్బుల వివరాలు చక్కగా పొందుపరుస్తారు. అనవసరంగా ఖర్చు పెట్టరు.

పాత రాజ్యపు సైనికుల కుటుంబ సభ్యులను సంఘటితం చెయ్యడానికి కూడా చైతన్యపూర్వక కృషి చేస్తున్నాం. మా మహిళా మిలిషియా ఎప్పటికప్పుడు వాళ్లను కలుస్తూ వాళ్ల అవసరాలు చూస్తుంది. ముమ్మర వ్యవసాయ పనుల కాలంలో వాళ్ల పొలాల వద్దకు సద్ది తీసుకెళ్లి అందివ్వడం వంటి సహాయం చేస్తుంది. మెల్లమెల్లగా వాళ్లకు రాజకీయాలు చెబుతూ తమ భర్తలను పాత సైన్యాన్ని విడిచి, మావోయిస్టు సైన్యంలో చేరమని చెప్పమని వివరిస్తుంది. పిల్లలను బాల సంఘటన్‌లో సమీకరించడానికి చైతన్యపూర్వక కృషి జరుగుతున్నది. తద్వారా ఉద్యమాన్నీ ప్రజా సమీకరణనూ కొనసాగించడానికి పునాది ఏర్పడుతుంది.

**పీపుల్స్ మార్చ్ :** ఎన్నో యుగాలుగా రాజకీయ, భావజాల విద్యకు దూరంగా ఉండిపోయిన ఫలితంగా మహిళలలో ఎటువంటి సమస్యలు వస్తున్నాయి? దీని పరిష్కారానికి మీరు ఎలా ప్రయత్నిస్తున్నారు?

**పార్వతి :** రాజకీయ, భావజాల విద్య లోపించడం వల్ల మహిళలలో ప్రస్ఫుటంగా కనిపించేది వాళ్లు సమావేశాలలో మౌనం వహించడం. రాజకీయ చర్చలలో మహిళలు ఎక్కువగా పాల్గొనరు. చొరవ తీసుకోవడానికి జంకుతారు. తల్లిదండ్రుల ఆస్తిలో వాటా ఇవ్వకపోవడం అన్న దానితో ఇది ముడిపడి ఉంది. చిన్ననాటి నుంచి పురుషులే నాయకులుగా, భూముల మీద తమ హక్కును రక్షించేవాళ్లుగా ఉంటారు. మహిళలకు ఆస్తితో సంబంధం లేదు కాబట్టి వాళ్లకు నాయకత్వ లక్షణం అవసరం లేదు. నాయకత్వ సమస్యనూ, రాజకీయ, భావజాల స్థాయిని పెంపొందించడం అన్న సమస్యనూ రెండు స్థాయిలలో, ఒకటి నిర్మాణ స్థాయి, మరొకటి ఆచరణ స్థాయిలో చేపట్టవచ్చు. విధాన సంబంధిత పనులలో మహిళలకు బాధ్యతనివ్వాలి. దీంతో పాటు వాళ్ల రాజకీయ, భావజాల సామర్థ్యాన్ని పెంపొందించే సౌకర్యాలు కల్పించాలి. ఆచరణ స్థాయిలో, ఆలస్యంగా పెళ్లి చేసుకోవడం, పెళ్లి చేసుకున్నా పిల్లల్ని కనకపోవడం, లేదా దాన్ని వాయిదా వెయ్యడం మొదలయిన విషయాలలో మహిళలు అంతర్గత పోరాటం చెయ్యాలి. చాలా కాలం పాటు భర్తలకు దూరంగా ఉండాల్సి వచ్చినప్పటికీ, తమకంటూ స్వతంత్ర పనిని చేపట్టడానికి వాళ్లు ముందుకు రావాలి. దీన్ని దృష్టిలో పెట్టుకునే మహిళలలో నాయకత్వం పెంపొందించడానికీ, తద్వారా మూడు రంగాలైన పార్టీ, సైన్యం, ఐక్య సంఘటనలలో విధాన నిర్ణయ స్థాయిని చేరుకోగలగడానికీ మహిళా విభాగాన్ని నెలకొల్పారు. ప్రజా స్థాయిలో మహిళలకు తల్లిదండ్రుల ఆస్తిలో సమాన వాటా ఇవ్వడం వల్ల ఇంటి దగ్గర నుంచే నాయకత్వ లక్షణాలను పెంపొందించే వాతావరణం సృష్టించగలుగుతాం. ఆ తరువాత కాలంలో పార్టీ దీనిని వినియోగించుకుని రాజకీయ, భావజాల బోధనను అందించవచ్చు.

ప్రస్తుతం, సైనిక రంగంలో మహిళల నాయకత్వ లక్షణాలు త్వరితంగా అభివృద్ధి చెందుతున్నాయి. తాము కూడా ధైర్యంగా జీవించగలమనీ, ధైర్యంగా మరణించగలమనీ, తాము కూడా పోరాట బలగాన్ని కమాండ్ చెయ్యగలమనీ వాళ్లు విజయవంతంగా నిరూపించుకుంటున్నారు. ఈ నాయకత్వ లక్షణాన్ని రాజకీయ, భావజాల రంగంలో క్రమబద్ధీకరించడం పార్టీ ముందు ఉన్న ముఖ్యమైన సవాలు.

**పీపుల్స్ మార్చ్ :** మహిళలలో ఉన్న రాజకీయ, భావజాల లోపాన్ని ఎలా పరిష్కరిస్తున్నారు?

**పార్వతి :** భావజాల, రాజకీయ లోపాన్ని పరిశీలించడానికి వివిధ

రంగాలలో వాళ్ల ప్రస్తుత అవగాహనా స్థాయిని తప్పక చూడాలి. ఆచరణపర, వ్యూహాత్మక అంశాల గురించి తొమ్మిది శీర్షికలతో మహిళా విభాగం కొన్ని ప్రశ్నావళులు రూపొందించింది. వీటిని పార్టీ, సైన్యం, సంఘాలలో పని చేస్తున్న మహిళా కాడర్‌కు జారీ చేసింది. వీటికి వచ్చిన జవాబులను సంశ్లేషించే పని నడుస్తున్నది. పార్టీ అంతర్గత పోరాటం ఎలా నడుపుతుందన్న దాని మీదనే కాడర్ భావజాల, రాజకీయ స్థాయి ఆధారపడి ఉంటుందని మనం గుర్తించాలి. దీనిని సరైన దృక్పథంతో నడిపిస్తే కాడర్‌లో భావజాలపరంగా, రాజకీయంగా ఆరోగ్యకరమైన అభివృద్ధి కనిపిస్తుంది. తద్వారా మహిళా నాయకత్వ కాడర్ కూడా ఈ రంగంలో అభివృద్ధి చెందుతారు. అలాగే, జాతీయ, అంతర్జాతీయ రంగాలలో ఇటీవలి రాజకీయ పరిణామాల గురించి, ఎంఎల్ఎం సిద్ధాంతంతో జోడిస్తూ ఎప్పటికప్పుడు తరగతులు నిర్వహించడం అవసరం. క్రమబద్ధంగా పత్రికలు, బులెటిన్‌లూ, వార పత్రికలూ ప్రచురించడం, సంబంధిత అంశాల మీద చర్చా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా దీన్ని పరిష్కరించుకోవచ్చు. ఇవన్నీ వివిధ స్థాయిలలో జరుగుతున్నాయి. మహిళలను విధాన నిర్ణాయక అంగాలలోకి తీసుకురావలసిన ప్రాధాన్యతను గురించి పార్టీ చాలా చైతన్యవంతంగా ఉన్నది. ఇటీవల కేంద్ర కమిటీలోకి మరింత మంది మహిళలను తీసుకోవడం ఆహ్వానించదగిన పరిణామం. పొలిట్‌బ్యూరో స్థాయిలో కూడా మహిళా కామ్రేడ్‌లను తీసుకున్నారు. ఇవాళ సీపీఎన్ (మావోయిస్టు)లో కేంద్ర కమిటీ, పొలిట్‌బ్యూరోలలో పది శాతం మహిళా కామ్రేడ్లున్నారు. ఇప్పుడు తమను తాము భావజాల, రాజకీయ నాయకులుగా నిరూపించుకోవడం మహిళల చేతుల్లో ఉన్నది.

**పీపుల్స్ మార్చ్ :** నేపాల్‌లో నాయకత్వ సమస్య గురించి మీరు రాసిన వ్యాసంలో వర్గ పోరాటం, పార్టీ అంతర్గత పోరాటం, అంతర్గత పోరాటాల గురించి రాసారు. వర్గ పోరాటం గురించి అర్థం చేసుకోగలం కానీ పార్టీలో అంతర్గత పోరాటం, అంతర్గత పోరాటం గురించి తెలుసుకోవాలన్న ఆసక్తి కలుగుతున్నది. దీని గురించి వివరిస్తారా?

**పార్వతి :** ప్రతీ ఆరోగ్యకరమైన పార్టీలోనూ అంతర్గత పోరాటం ఉంటుందన్నది ముందు మనం చాలా స్పష్టంగా తెలుసుకోవాలి. ఇటువంటి పోరాటాలను మహిళా రంగంలోనూ, లింగపరమైన సంబంధాల రంగాలలో ఎలా గుర్తించాలన్నది చర్చనీయాంశం. కమ్యూనిస్టు ఉద్యమంలో మహిళల పట్ల కమ్యూనిస్టుల వైఖరిని అర్థం చేసుకోవడానికి ఒక ఉదాహరణ చెబుతాను. మహిళల పాత్రకు వ్యూహాత్మక ప్రాధాన్యత ఉన్నదనీ ఇది మౌలిక విప్లవకర వర్గమనీ ఒక సెక్షన్ భావిస్తుంది. మహిళలకు ప్రత్యేక హక్కులను ఆమోదించడానికీ, హామీ ఇవ్వడానికీ వాళ్లు సిద్ధంగా ఉన్నారు. అందుకని ఈ సూత్రం మీద ఆధారపడి పార్టీ స్వరూపాన్నీ, మహిళలనూ, లింగ సంబంధాలనూ మార్చడానికి కృషి చేస్తుంది. మరొక సెక్షన్ దీనిని సూత్రప్రాయంగా అంగీకరిస్తుంది, కానీ ఆచరణలో మహిళలను అప్రధాన బలగంగా చూస్తుంది. ప్రజలను సమీకరించడానికి ఆచరణలో అవసరం అని మాత్రమే భావిస్తుంది. ఇటువంటి వాళ్లకు నిర్మాణ స్వరూపంలో కానీ, మహిళలలో కానీ, లింగ సంబంధాలలో కానీ తీసుకువచ్చే మార్పు అలంకారికంగానూ, లాంఛనంగానూ, పైపై విషయంగానూ ఉంటుంది. ఉదాహరణకు పునర్వివాహం విషయం తీసుకుందాం. ప్రతీ ఒక్కళ్లూ దీనిని అంగీకరిస్తారు. కానీ నిర్దిష్ట విషయాలు వచ్చేసరికి దృక్పథంలో తేడాలు కనిపిస్తాయి. అమరుల కుటుంబానికి నిర్వచనం విషయమే తీసుకుందాం. నేపాల్‌లో అమరుల వార కార్యక్రమానికి ఎంతో విలువనిస్తాం. ఉపన్యాసాలు ఇవ్వమని అమరుల కుటుంబాలను ఆహ్వానిస్తాం. వాళ్లకు బహుమతులు ఇస్తాం. అమరుల కుటుంబ సభ్యులు మళ్లీ వివాహం చేసుకుంటే (పార్టీకి తెలియజేసే) అమరుల వారం కార్యక్రమంలో వాళ్లకు అమరుల కుటుంబంగా ప్రాతినిధ్యం వహించే హక్కు ఉన్నదా లేదా అన్న చర్చ వచ్చింది. సంకుచిత దృష్టి ఉన్నవాళ్లు వీళ్లను అమరుల కుటుంబంగా గుర్తించడానికి చాలా సమయం పట్టింది.

అలాగే మహిళా నాయకత్వాన్ని లాంఛనమైందిగా, పార్టీ రుద్దినదిగా భావించే ధోరణి ఉన్నది. ఇటువంటి సందర్భాలలో, తాము నాయకత్వం వహించే సంస్థలో మహిళలు తమ నాయకత్వాన్ని అమలు చేసేందుకు పై కమిటీ వాళ్లు (ప్రత్యేకించి పురుషులు) ఎలాంటి సహాయం చెయ్యరు. దీని ఫలితంగా తమ నాయకత్వాన్ని నెలకొల్పుకోవడానికి మహిళలు రెట్టింపు కష్టపడవలసి వస్తుంది. మొట్టమొదటిది గుర్తింపు సంపాదించడం. రెండోది, నాయకత్వం అమలు చేయడం. కానీ మహిళల పాత్రను వ్యూహాత్మకంగా చూసే వాళ్లు మాత్రం మహిళలలో నాయకత్వ లక్షణాలు పెంపొందడానికి చాలా సానుభూతితో, సంసిద్ధతతో ఎదురుచూడడం కనిపిస్తుంది.

**పీపుల్స్ మార్చ్ :** మీరు చెబుతున్న అంతర్గత పోరాటం సంగతి ఏమిటి? తమతో తాము పోరాటం చెయ్యాలనా?

**పార్వతి :** అది విప్లవ జీవితమైనా, పరిణామశీల జీవితమైనా ప్రతీ ఒక్కరూ తమ మీద తాము పోరాటం చేసుకోవలసిందే. అంతర్గత పోరాటం గురించి మరోసారి నిర్దిష్టంగా చెబుతాను. ఈ కష్టమైన ఏకధ్రువ ప్రపంచంలో ప్రజాయుద్ధాన్ని చేపట్టే పార్టీలు చాలా వాటిల్లో ఉన్న ప్రధాన ధోరణి మితవాద ధోరణి. మితవాదులు ధైర్యంగా తమ అభిప్రాయం చెప్పరు. (ఎందుకంటే వాళ్లు సులభంగా బట్టబయలవుతారు.) పిడివాద రివిజనిస్టు ధోరణి రూపాన్ని ధరిస్తారు. విప్లవ జీవితంలో పునరుత్పత్తి గురించే చూద్దాం. తమకు పిల్లల్ని కనాలని ఉంది కాబట్టి విప్లవ జీవితం నుంచి కొంతకాలం విరామం తీసుకోదలిచామని మితవాదులు అంటారు. ఇటువంటి కఠోర ప్రకటన వల్ల కాడర్ వాళ్లను మితవాదులుగా, ఉద్యమం నుంచి పారిపోడానికి సాకులు వెతికేవాళ్లుగా అర్థం చేసుకుంటారు. కాబట్టి దీనిని ఎలా దాస్తారు? పిడివాద రివిజనిస్టు ధోరణితో. మహిళలు వర్గ పోరాటంలో తమ శక్తిని నిరూపించుకోవడానికి పిల్లల్ని కనడం మరో రంగమని ఈ ధోరణి కలిగిన వాళ్లు అద్భుతంగా చిత్రీకరిస్తారు. కానీ ఆచరణలో, తీవ్ర వర్గ పోరాటం మధ్య పిల్లల్ని పెంచడం కాడర్ల పోరాట జీవితానికి ఆటంకంగా తయారై, ఆచరణాత్మక సమస్యలు వచ్చినప్పుడు ఈ విప్లవకర భావుకతంతా ఆవిరైపోతుంది. దీని ఫలితంగా మహిళలు విప్లవోద్యమంలో వెనకడుగు వెయ్యవలసిన పరిస్థితి వస్తుంది. ఈ విషయంలో ఉద్యమం కోసం ప్రాణం ఇవ్వడం ఎటువంటిదో పిల్లల్ని త్యాగం చెయ్యడం కూడా అటువంటిదేనంటూ విప్లవకర పంథా పునరుత్పత్తి కార్యక్రమాలను నిరుత్సాహపరచాలి. అయితే ఇటువంటి సున్నితమైన ఉద్వేగపూరిత విషయాలను జంటల మీద రుద్దలేం. రాజకీయ చైతన్యం, ప్రజాయుద్ధ అభివృద్ధీ మాత్రమే ఇటువంటి స్వయం స్వచ్ఛందత్వాన్ని పెంపొందిస్తుంది. కాబట్టి ఈ సమస్యతో గతితార్కిక పద్ధతిలో వ్యవహరించాలి. జంటల (ముఖ్యంగా మహిళా కేడర్ల) రాజకీయ అవగాహనా స్థాయిని బట్టీ, సంస్థలో వాళ్ల స్థానాన్ని బట్టీ, వాళ్లు పని చేస్తున్న చోటుకు ఉన్న భద్రతా మొదలయిన వాటిని బట్టీ పిల్లల్ని కనకపోవడమో, లేక ఆలస్యంగా కనడమో చెయ్యాలి. .

**పీపుల్స్ మార్చ్ :** ఈ సమాజంలో పితృస్వామిక భావజాలం చాలా లోతుగా దిగబడిపోయింది. కాబట్టి ఇది మహిళలలో కూడా ఉంటుంది. ఈ పితృస్వామ్య భావజాలం మూలంగా, చొరవ లేకపోవడం, ఆత్మవిశ్వాసం లేకపోవడం, మహిళలు ఆలోచించే అల్ప విషయాలు మొదలయినవి ఉంటాయి. సాధారణీకరించలేనప్పటికీ, మహిళలు పురుషుల నాయకత్వాన్ని తేలికగా ఆమోదిస్తారు. కానీ తోటి మహిళల నాయకత్వాన్ని

అంగీకరించడంలో సమస్య ఉంటుంది.

**పార్వతి :** అవును. దీని ప్రభావం వల్ల మహిళలు తమ్ము తాము తక్కువ అంచనా వేసుకుంటారు. పురుషులను ఎక్కువ అంచనా వేస్తారు.

**పీపుల్స్ మార్చ్ :** అటువంటి విషయాలను నేను అంతర్గత పోరాటంగా పరిగణిస్తాను. అంటే తమలో ఉన్న పితృస్వామిక భావజాలంతో పోరాటం చెయ్యడం.

**పార్వతి :** అవును. మహిళలు చాలాసార్లు తమలో పాతుకుపోయిన పితృస్వామిక భావజాలానికి తామే బాధితులవుతారు. ఎవరైనా మహిళల పీడన గురించి మాట్లాడితే, స్త్రీవాదులుగా ముద్ర వేస్తే భయపడిన మహిళలను నేను చూసాను. వర్గ పీడనకు వ్యతిరేకంగా పోరాడే పేరుతో తరచూ మహిళలపై పీడనకు వ్యతిరేకంగా పోరాటం చెయ్యడాన్ని నొక్కిపట్టడానికి ప్రయత్నిస్తారు. ఇది పిడివాద రివిజనిజానికి మరో రూపం. లింగ పీడన, మానసిక శ్రమ, నైపుణ్యాలను వదిలేసి వర్గం, శారీరక శ్రమ, విప్లవతత్వాలను నొక్కి చెప్పడం, వీటి మధ్య గతితార్కిక సంబంధాలను చూడకపోవడం అనే రూపంలో ఇది కనిపిస్తుంది.

**పీపుల్స్ మార్చ్ :** వర్గ దోపిడీ పక్షం వహించడం వీరోచితం. కానీ దానితో పోలిస్తే, మహిళల దోపిడీ పక్షం వహించడం తక్కువ విషయంగా భావిస్తారు.

**పార్వతి :** మహిళా పీడన గురించి మాట్లాడేటప్పుడు తక్కువ భావంతో ఉండనవసరం లేదని నేననుకుంటాను. ఎందుకంటే మనం ప్రజాయుద్ధం చేస్తున్నాం. అది వర్గ పోరాటంపై శ్రద్ధ పెడుతుంది. నిజానికి, ఇలాంటి పరిస్థితిలో వర్గ సమస్యను పరిష్కరించే పేరుతో మహిళా పీడనను గురించి మాట్లాడకపోతే మనం అతివాద దుందుడుకువాదులమై, మహిళా ఉద్యమానికి దూరమవుతాం.

**పీపుల్స్ మార్చ్ :** ఇది చాలా ముఖ్యమైన విషయం. మనం అదే వర్గంలో ఉండి మాట్లాడుతున్నాం. దాని నుంచి బయటకు పోవడం లేదు. ఎవరినైనా స్త్రీవాదిగా ముద్ర వేస్తే అది తప్పు.

**పార్వతి :** ప్రజాయుద్ధ ఉద్యమం లోపల పితృస్వామిక పీడనకు సంబంధించిన విషయాలను గురించి మాట్లాడే వాళ్లను స్త్రీవాదులుగా ముద్ర వెయ్యడం తప్పు. వర్గ పీడన గురించి ప్రాథమికంగా మాట్లాడకుండా, పితృస్వామ్య పీడన గురించి మాట్లాడితే మాత్రం ఇలా ముద్ర వెయ్యడం సరైనదే అవుతుంది.

**పీపుల్స్ మార్చ్ :** ఇది మహిళల అభివృద్ధిని ఆటంకపరుస్తుంది కూడా.

**పార్వతి :** పార్టీలో అనారోగ్యకరమైన అంతర్గత పోరాటం ఉన్నప్పుడు లింగపరమైన సున్నితత్వం ఒక ఆటంకంగా తయారవుతుంది. ఇటువంటి పరిస్థితిలో ఇది మహిళల మీద చాలా ప్రతికూల ప్రభావం వేస్తుంది. భావజాలం పునాదిగా కాక, అల్ప వ్యక్తిగత విభేధాల ఆధారంగా, మహిళలను ఒకరి మీదకు ఒకరిని ఉపయోగిస్తారు. సాధారణంగా మహిళలలో ఉండే తక్కువ స్థాయి సాంస్కృతిక విలువలను నిరుత్సాహపరచకుండా కాడర్‌నూ, ప్రజలనూ సమీకరించడానికి వాటిని ఉపయోగించుకుంటారు. తమ పక్షం వహించాలంటూ భర్తలు భార్యలను బలవంత పెడతారు. పక్షాలు మారడానికి భర్తలను ఒప్పించమంటూ భార్యలను పదవులతో ప్రలోభపెడతారు. అనారోగ్యకరమైన అంతర్గత పోరాటాలను తీసుకురావడానికి వివాహమే సాధనంగా మారవచ్చు. భావజాల ఐక్యత పునాదిగా కాక, బలాన్ని పెంచుకోవడమో, అధికారం సంపాదించడమో పునాదిగా వివాహాలు చేసుకునే విధంగా మహిళలను ప్రలోభపెడతారు.

**పీపుల్స్ మార్చ్ :** కేవలం కోఆప్ట్ చేసుకోవడానికి బలవంతంగా చేసుకోవడానికి.

**పార్వతి :** అవును.

**పీపుల్స్ మార్చ్ :** రాజ్యం దీనికి ఎలా స్పందిస్తున్నది? మహిళలను దీర్ఘకాలిక ప్రజాయుద్ధంలో చేరకుండా చేయడానికి ఉద్యమంపై భౌతికంగా, సైనికంగా దాడి చేస్తున్నదా?

**పార్వతి :** పాత రాజ్యానికి ఉద్యమాన్ని రాజకీయంగా ఎదుర్కోవడం చాలా కష్టమయ్యింది. అందుకని వాళ్లు క్రూరమైన పద్ధతులు అవలంబిస్తున్నారు. మహిళలను అరెస్టు చేస్తున్నారు. అత్యాచారం చేస్తున్నారు. హత్య చేస్తున్నారు. యువతులు పోరాడటాన్నీ, తిరుగుబాటు చెయ్యడాన్నీ ఆర్ఎన్ఏ సహించలేదు. నిజానికి మహిళలు ఆయుధాలు పట్టుకోవడం చూసి వాళ్లు తమ మగతనం కోల్పోతున్నామని భావిస్తారు. ఆయుధాలు పురుషులు పట్టుకోవడానికి ఉద్దేశించినవేననీ, మహిళలను కాపాడడం పురుషుల పనేననీ వాళ్ల గట్టి నమ్మకం. కాబట్టి ప్రారంభంలో, వాళ్లు పురుష మావోయిస్టు యోధులు అసమర్థులని నిరూపించడం కోసం మహిళలపై అత్యాచారం చేసారు. కానీ యుద్ధరంగంలో స్త్రీలు ధైర్యంగా పోరాడడం చూసి వాళ్లను కూడా తీవ్రంగా తీసుకోసాగారు. ఫలితంగా, వాళ్లు యుద్ధంలో పురుష యోధులతో సమానంగా మహిళా యోధలను కూడా హత్య చేస్తున్నారు (అదనంగా వాళ్లపై అత్యాచారం కూడా జరుపుతున్నారు).

ఆర్ఎన్ఏ దృష్టిలో లింగ భేధం చాలా ఉంది. మావోయిస్టు పురుషులు తమను అత్యాచారం చేసారనీ, లైంగిక వస్తువులుగా వాడుకున్నారనీ చెప్పమంటూ వాళ్లు లొంగిపోయిన మహిళలను బలవంతం చేస్తున్నారు. ఈ విధంగా మావోయిస్టు ఉద్యమాన్ని బద్‌నాం చేయడం కోసం అత్యాచారాన్ని ఒక సాధనంగా వాడుకోవడంలో వాళ్ల లైంగిక దృష్టి తేటతెల్లమవుతున్నది. ఇదే పురుష మావోయిస్టులు లొంగిపోయినప్పుడు ఇటువంటి షరతు ఎప్పుడూ పెట్టలేదు. అంటే ఇలా మహిళలను మావోయిస్టు ఉద్యమానికి దూరం చెయ్యడానికి వాళ్లు అత్యాచారాన్ని ఒక సాధనంగా వాడుకుంటున్నారు.

**పీపుల్స్ మార్చ్ :** ఎన్‌జీఓలతో ఎలా వ్యవహరిస్తున్నారు? సమాజంలో వారికి చాలా ప్రభావం ఉన్నది. నేపాల్‌లో దీనితో ఎలా వ్యవహరిస్తున్నారు?

**పార్వతి :** గతంలో ఎన్‌జీఓలతో సమస్యలుండేవి. కానీ ఇప్పుడు ఎక్కువగా లేవు. ప్రజలు సైనికీకరణ చెందారు. ప్రజాకోర్టులలో తక్షణం తీర్పులు ఇస్తున్నారు. దాంతో ప్రజలు ఇక ఎంత మాత్రం ఎన్‌జీఓల పరిణామాత్మక, సంస్కరణవాద పద్ధతితో ప్రభావితులు కావడం లేదు. వీటన్నింటికీ మించి, పాత రాజ్య యంత్రాంగం అమలు చేస్తున్న క్రూర నిర్బంధం వల్ల వాళ్ల తరహా పద్ధతిలో పని చేయడానికి అవకాశమే ఉండదు. ఎటువంటి సమస్యకైనా వర్గ సామరస్య వైఖరిని అవలంబించే ఎన్‌జీఓలు, ప్రతీ దానిలోనూ వర్గ దృక్పథాన్ని అవలంబించే మావోయిస్టుల ముందు బట్టబయలవుతారు.

**పీపుల్స్ మార్చ్ :** మద్యం, భారతదేశానికి మహిళలను అమ్మడం మొదలయిన సామాజిక సమస్యలను ఎలా పరిష్కరిస్తున్నారు?

**పార్వతి :** మా దేశంలో బాడీ అనే జాతి ఉన్నది. వాళ్లు మౌలికంగా దళిత వర్గం. దళితులలో కూడా ఇంకా ఎక్కువ పీడనకు గురయ్యే జాతి ఇది. వాళ్లు సంప్రదాయంగా భూస్వామ్య సమాజంలో వినోదకులు. కానీ ఇప్పుడు భూస్వామ్యం అంతరించి పోతుండడంతో వాళ్లు వేశ్యావృత్తిలోకి దిగారు. ఇప్పుడు చాలా మంది ప్రజాయుద్ధంలో చేరారు. అలాగే ఖాట్మండూ లోయ దగ్గర కాబ్రే జిల్లాలో తమంగ్ అనే జాతి ఉన్నది. పాత రోజులలో వీళ్లు రాణాలకు వేశ్యలను అందించేవాళ్లు. ఇప్పుడు భారత మార్కెట్‌కు అందిస్తున్నారు. కానీ ప్రజాయుద్ధ వ్యాప్తీ, తమంగ్ ముక్తి మోర్చా ఏర్పాటులతో వాళ్లల్లో తమ వృత్తికి ఉన్న చెడు ప్రభావాల

గురించి ఒక అవగాహన ఏర్పడింది. ఇప్పుడు ఇదే జాతి ప్రజాయుద్ధానికి మంచి యోధులను అందిస్తున్నది. ఈ ఉదాహరణలతో నేను వివరించదలచినది ఏమంటే, ఈ వృత్తిలో ఉన్నవాళ్లకు, వాళ్లకు ఏది మంచి చేస్తుందో ఏది చెడు చేస్తుందో బాగా తెలుసు. కానీ తప్పనిసరై బలవంతంగా ఈ వృత్తిలోకి దిగబడుతున్నారు. ప్రజాయుద్ధం వాళ్లకు జీవించడానికి శక్తివంతమైన ప్రత్యామ్నాయం అందించింది. ప్రతీ రాత్రీ తమను తాము చంపుకోవడం కంటే, తాము కూడా సామాజికంగా ఉపయోగపడతామనీ, బాధ్యతాయుతంగా ఉండగలమనీ నిరూపించుకునే అవకాశం వచ్చింది. తాము కూడా గర్వంగా జీవించగలమనీ, గర్వంగా మరణించగలమనీ రుజువు చేసుకునే అవకాశం వచ్చింది. ప్రజాయుద్ధం ప్రారంభించే ముందు మేం ఈ సమస్యను కొంచెం కొంచెంగా పరిష్కరించేవాళ్లం. కానీ దాంతో అంత ఫలితం వచ్చేది కాదు. ఈరోజున మేం స్త్రీల శరీరాలతో వ్యాపారం చేసే వాళ్లను గుర్తించి, శిక్షించడంలో పాత రాజ్యంకన్నా ఎంతో ముందున్నాం. మద్యం సమస్యకు సంబంధించి, ఒకసారి దేశీయ స్థాయిలో మద్యపానానికి వ్యతిరేకంగా ఉద్యమం నడిచింది. దీంతో ప్రభుత్వం మా డిమాండులలో కొన్నింటిని అంగీకరించక తప్పలేదు. ఆనాటి నుంచి స్థానిక స్థాయిలో ఇటువంటి కార్యక్రమాలు తీసుకుంటున్నాం. మేం మద్యాన్ని నిషేధించలేదు కానీ నియంత్రణా చర్యలు చేపడుతున్నాం. మద్యం అమ్మిన వాళ్లను శిక్షించడం, బహిరంగ ప్రదేశాలలో తాగిన వాళ్లను, లేదా తాగిన మైకంలో శాంతికి విఘాతం కలిగించిన వాళ్లను శిక్షించడం చేస్తున్నాం.

**పీపుల్స్ మార్చ్ :** సమస్యలనూ, లింగ వివక్షనూ పరిష్కరించడానికి సంస్థాపరంగా ఇంకా ఏ విధంగా కృషి చేస్తున్నారు? పార్టీలో మీరు మహిళా విభాగం ఏర్పాటు చేశారు. అయితే మహిళా విభాగం నిర్మాణ స్వరూపం ఏమిటి? అది ఎలా పని చేస్తుంది?

**పార్వతి :** మహిళా పని రెండు స్థాయిలలో ఉన్నది. ప్రజా స్థాయిలో అఖిల నేపాలీ మహిళా సంఘం (విప్లవకర) ఉన్నది. వేర్వేరు స్థాయిలలో దేశమంతటా ఇది ఉన్నది. మరో పక్క ప్రత్యక్షంగా కేంద్ర కమిటీ ఆధ్వర్యంలో మహిళా విభాగం ఉన్నది. ఇది ప్రధానంగా విధాన నిర్ణాయక నిర్మాణం. పార్టీ, సైన్యం, ఐక్య సంఘటన అనే మూడు రంగాలలో మహిళల నాయకత్వాన్ని అభివృద్ధి చెయ్యడం దీని ఉద్దేశ్యం. అంటే ఈ విభాగం మౌలికంగా ఒక ఆలోచనా సముదాయం. ఇతర రంగాలలో మాదిరిగా అంతస్తుల వారీగా ఉపవిభాగాలు కలిగి ఉండే నిర్మాణ రూపం కాదు ఇది. అయితే పార్టీ అవసరం అని భావించడంతో పిఎల్ఏలోనూ, విద్యార్థి రంగంలోనూ మహిళా విభాగాలు ఏర్పాటయ్యాయి. మహిళా విభాగం సిద్ధాంతానికి ప్రాతినిధ్యం వహిస్తే మహిళా రంగం ఆచరణకు ప్రాతినిధ్యం వహిస్తుందనవచ్చు. ఇది ఈ రంగానికీ, పార్టీకీ వారధిలా పని చేస్తుంది. ఇందాక చెప్పినట్టుగా, మహిళా విభాగం వ్యూహాత్మక, ఆచరణాత్మక సమస్యలకు సంబంధించి ప్రశ్నావళులు జారీ చేసింది. దీని మీద ఆధారపడి ఒక విధాన పత్రం తయారుచెయ్యవచ్చు. అలాగే మహిళల కోసం ఒక స్టడీ కోర్సు తయారు చేస్తోంది. మహిళల గురించి సీనియర్ కామ్రేడ్‌లు రాసిన వ్యాసాల సంకలనం తీసుకువస్తున్నాం. మూడు రంగాలలోనూ వివిధ స్థాయిలలో పని చేసే మహిళలకు విభాగం తరగతులు నిర్వహిస్తుంది.

**పీపుల్స్ మార్చ్ :** మహిళల కోసం ప్రత్యేకంగా సిలబస్ ఎలా ఉంటుంది? సాధారణ కాడర్‌కు, సాధారణ ప్రజలకూ సాధారణ రాజకీయ, ఆర్థిక, తాత్విక మొదలయిన విషయాలు ఉంటున్నాయి. నా అభిప్రాయం ప్రకారం మహిళలకు, ప్రత్యేకించి మహిళా సంఘాల్లో పని చేసే మహిళలకు పితృస్వామ్యం మూలాల గురించీ, వ్యక్తిగత ఆస్తీ, భూమీ, తదితర విషయాలన్నిటి గురించీ చెప్పాల్సి ఉంటుంది. కాబట్టి అది నిర్దిష్ట సిలబస్ అవుతుంది. ఇంకా సాధారణ మహిళకూ, అన్ని రంగాల్లోనూ పని చేసే మహిళలకూ ప్రత్యేకంగా ఏమైనా ఉందా?

**పార్వతి :** మాకు స్కూలు విభాగం ఉన్నది. ఇది తత్వశాస్త్రం, శాస్త్రీయ సోషలిజం, రాజకీయ అర్థశాస్త్రం మొదలయిన సాధారణ కోర్సులు తయారు చేస్తుంది. ఇది కాక, మహిళల కోసం, పీడిత జాతుల కోసం ప్రత్యేక సిలబస్‌లు రూపొందిస్తున్నాం. మా కృషి ఎప్పుడూ మహిళలకు సంబంధించిన విషయాలను మేం ఆమోదించిన రాజకీయ పంథాతో జోడించడంగా ఉంటోంది. ఉదాహరణకు ఇరవై ఒకటో శతాబ్దంలో ప్రజాస్వామ్యాన్ని పెంపొందించడం గురించి తీసుకుందాం. మా కేంద్ర కమిటీ దీనిని ఆమోదించింది. దీనిని మహిళల స్థితి సమస్యతో ఎలా జోడించగలమో చూడాలి.

**పీపుల్స్ మార్చ్ :** మహిళా సమస్యకు సంబంధించిన అధ్యయన సామగ్రి సేకరిస్తున్నారా?

**పార్వతి :** అవును. మీ పార్టీ ఇచ్చిన సాహిత్యాన్ని ఇప్పటికే మేం అనువాదం చేసాం. అలాగే పెరూ వాళ్ల సాహిత్యం కూడా అనువాదం చేసాం. మరింత సాహిత్యం అనువాదం చెయ్యాలని చూస్తున్నాం.

**పీపుల్స్ మార్చ్ :** లాంఛనంగానూ, సాధారణంగానూ సాంస్కృతిక రంగం పాత్ర ఏంటి? సాంస్కృతిక స్థాయిలో చైతన్యం ఎలా పెంచుతున్నారు?

**పార్వతి :** ఇందాక చెప్పాను కదా, కొన్ని గ్రామాలను మహిళా నమూనా గ్రామాలుగా పెంపొందించాలని ప్రయత్నిస్తున్నాం. ఇక్కడ నూతన సాంస్కృతిక విలువలను ప్రవేశపెడుతున్నాం. పిల్లల్ని సమిష్టిగా పెంచడం, సమిష్టిగా పశువుల దాణా జమ చెయ్యడం మొదలయినవి చేస్తున్నాం. అలాగే అమరుల వారం, ప్రజాయుద్ధ ప్రారంభ దినం, మావో పుట్టినరోజు మొదలయిన దినాలను సామాజికంగా, రాజకీయంగా ప్రాముఖ్యత గల దినాలుగా జరుపుకుంటూ ఒక కొత్త సంస్కృతిని నిర్మిస్తున్నాం. వివాహంలో మేం కులం, మతం, జాతి భేధాలను బద్దలుగొట్టాం. ఇవాళ బ్రాహ్మణ కాడర్లు దళితులను పెళ్లి చేసుకుంటున్నారు. హిమాలయా నుంచి వచ్చిన వాళ్లు తెరాయ్ ప్రాంతం వాళ్లను చేసుకుంటున్నారు. ఈరోజు పునర్వివాహం నిషిద్ధం కాదు. బహిష్టును అపవిత్రంగా చూసే భావన ఇప్పుడు లేదు. దీని పట్ల సానుభూతి ఉన్నది. స్థానిక ఎఫ్ఎం రేడియో కేంద్రాలు పని చేస్తుండడంతో కొత్త పాటలూ, కవితలూ, కథలూ ప్రసారం చేస్తూ, అట్లాగే వ్యవసాయం, మొక్కల పెంపకం మొదలయిన విషయాలలో నూతన పరిణామాలను ప్రసారం చేస్తూ స్థానిక కాడర్లా, ప్రజలా సృజనాత్మకతను పెంచుతున్నాం.

**పీపుల్స్ మార్చ్ :** అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమం, మహిళా విముక్తిల ప్రస్తుత పరిస్థితి గురించి మీరు ఏమనుకుంటున్నారు?

**పార్వతి :** ప్రస్తుతం అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమం పరిస్థితి, ముఖ్యంగా స్థిరమైన రాజకీయ భావజాలం పునాదిగా కలిసి వస్తున్న వాళ్ల పరిస్థితి బాగుందని నేను అనుకుంటున్నాను. పరిపక్వమైన అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమం దన్నుతో ప్రజాయుద్ధం నడుస్తున్న ప్రతి చోటా మహిళా సమస్యలకు తగిన ప్రాధాన్యత ఇస్తున్నారు. నేపాల్ ఇందుకు ఒక మంచి ఉదాహరణ అని నేను భావిస్తున్నాను. అట్లాగే, ప్రజాయుద్ధం సాగిస్తున్న దేశాలలో మహిళల అనుభవాలు అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమాన్ని సుసంపన్నం చేస్తున్నాయి. అందుకని అది ఇరువురికీ ఉపయోగపడింది.

**పీపుల్స్ మార్చ్ :** నేపాలీ ప్రజలకూ, సీపీఎన్ (మావోయిస్టు)కూ పీపుల్స్ మార్చ్ తరఫున అభినందనలు ! ⅄

# భూపరిశోధనా ఉద్యమంలో ప్రజా కృషి

**జూన్ 1933**

– మావో సేటుంగ్

భూపరిశోధనా ఉద్యమం హింసాత్మకంగానూ, నిర్దాక్షిణ్యంగానూ సాగే వర్గ పోరాటం. మన ఈ పోరాటంలోకి విశాల ప్రాతిపదికపై ప్రజలను కదిలించనట్టయితే, దీనిని ఒక ప్రజా ఉద్యమంగా మలచనట్టయితే వర్గపంథాను సరిగ్గా అమలు చేయడం గానీ, భూస్వామ్య శక్తుల అవశేషాలను తుడిచిపెట్టే లక్ష్యాన్ని చేరుకోవడం గానీ సాధ్యం కాదు. మనల్ని ప్రజల నుండి వేరు చేసే పెత్తందారీ పని పద్ధతులన్నీ భూపరిశోధనా ఉద్యమ క్రమంలో ముఖ్యమైన శత్రువులవుతాయి. వర్గం గురించి చర్చ, వర్గ హోదాను ఆమోదించడం, [ఆస్తులను] స్వాధీనం చేసుకోవడం, పునః పంపిణీ చేయడం, కూలీల సంఘంపైనా పేద రైతుల సంఘం పైనా సరైన నాయకత్వం – ఇవన్నీ భూపరిశోధనా ఉద్యమంలో ప్రజా కృషికి కేంద్రంగా ఉంటాయి.

## 1. వర్గం గురించి చర్చించడం (ప్రచారం చేయడం)

ఏ) కూలీలను నాయకత్వ స్థానంలో ఉంచడం, పేద రైతులపై ఆధారపడడం, మధ్య రైతులతో సమైక్యం కావడం, ధనిక రైతులను బలహీనపర్చడం, భూస్వాములను తుడిచిపెట్టడం భూపరిశోధనా ఉద్యమంలో ఎత్తుగడలుగా ఉంటాయి.

బీ) ఈ ఎత్తుగడలను వివరించాలంటే భూస్వామి, ధనిక రైతు, మధ్య రైతు, పేద రైతు, కార్మికుడు వంటి పదాల అర్థాలను సరిగ్గా నిర్వచించడం అవసరం. ఈ వివరణ ద్వారా మనం భూస్వామి అంటే ఫ్యూడల్ దోపిడీదారు అనీ, ధనిక రైతు అంటే అర్ధ ఫ్యూడల్ దోపిడీదారు అనీ అర్థం చేయించాలి. ఆ తర్వాత భూస్వాముల్ని నిర్మూలిస్తూ, ధనిక రైతులను బలహీనపర్చే విధానాన్ని అనుసరించడం ద్వారానే మనం వ్యవసాయ విప్లవ ఫలాలు పూర్తిగా మధ్య రైతులకూ, పేద రైతులకూ, కార్మికులకూ దక్కేలా చేయగలం.



సీ) అయితే ధనిక రైతులకూ భూస్వాములకూ తేడా ఉంది. ధనిక రైతులు శ్రమలో పాల్గొంటారు కానీ భూస్వాములు పాల్గొనరు. అందుకే మన విధానం భూస్వాములను నిర్మూలించడం కాగా, ధనిక రైతులను మాత్రం బలహీనపర్చడంగానే ఉంటుంది. కాబట్టి ధనిక రైతులను తుడిచిపెట్టే ధోరణి తప్పు. ధనిక రైతుల వర్గ హోదాను భూస్వాముల హోదాతో సమానం చేసి చూడగూడదు.

డీ) మధ్య రైతుల పట్ల ఎత్తుగడ – మధ్య రైతులతో ఐక్యం కావడం వ్యవసాయ విప్లవంలో అత్యంత కీలకమైన ఎత్తుగడ. వ్యవసాయ విప్లవం విజయాన్ని లేదా అపజయాన్ని పొందడమనేది దానిని మధ్య రైతులు సమర్థిస్తున్నారా లేక వ్యతిరేకిస్తున్నారా అనే విషయంపై ఆధారపడి ఉంటుంది. అందువల్ల ఈ ఎత్తుగడను ప్రజలకు పదే పదే వివరించడం తప్పనిసరి. మధ్య రైతుల ప్రయోజనాలకు భంగం వాటిల్లచేయడాన్ని ఎట్టి పరిస్థితిలోనూ అనుమతించగూడదని స్పష్టం చేయాలి. మధ్య రైతులతో ఐక్యం కావడం కోసం, వాళ్ల ప్రయోజనాలను ఉల్లంఘించకుండా ఉండడం కోసం మనం "కలిగిన మధ్య రైతు" అనే పదాన్ని వాడాలి. ధనిక రైతుకూ, మధ్య రైతుకూ మధ్య తేడా గల అంశాల్ని తేటతెల్లంగా, బలంగా వివరించడం కోసం ఈ పదాన్ని వాడాలి. ఆ విధంగా కలిగిన మధ్య రైతుల్ని తిరిగి విశ్వాసంలోకి తేవాలి. ముఖ్యమైన విషయం ఏంటంటే, భూస్వాములూ, ధనిక రైతులూ మధ్య రైతుల పట్ల అనుసరిస్తున్న మోసకారితనాన్ని ఎండగట్టాలి. ఆ విధంగా వాళ్ల భూస్వాముల, ధనిక రైతుల దుష్ప్రభావం నుండి బైటపడి పేద రైతులతో సమైక్యమై భూస్వాములకు వ్యతిరేకంగా ఉమ్మడి పోరాటంలో కదిలేలా సహాయపడాలి.

ఈ) భూస్వాములూ, ధనిక రైతులూ ఇచ్చే మోసకారి నినాదాలన్నిటినీ ప్రజల్లో విస్తృతంగా బట్టబయలు చేస్తూ వివరించాలి. భూస్వాములూ, ధనిక రైతులూ వెనుకబడిన స్థానికతత్వ తెగ భావనలను ఉపయోగిస్తూ మధ్య రైతుల్నీ, పేద రైతుల్నీ వంచించే, విచ్ఛిన్నం చేసే ప్రయత్నాల పట్ల మనం తప్పక అప్రమత్తతతో ఉండాలి.

ఎఫ్) భూపరిశోధనా ఉద్యమం శత్రు "చుట్టివేత అణచివేత"ను ఓడించే ఆయుధమనే విషయాన్ని తప్పక వివరించాలి. ఎందుకంటే ఒకసారి మిగిలిపోయిన భూస్వామ్య శక్తుల్ని తుడిచిపెట్టి, సోవియట్ ప్రాంతాల్లో దాక్కున్న శత్రు ఏజెంట్లను పెకిలించివేస్తే విశాల ప్రజల విప్లవోత్సాహం ఇనుమడిస్తుంది. అప్పుడిక ఎర్రసైన్యాన్ని విస్తరించడం, ఆర్థిక నిర్మాణం వంటి పనుల్ని కొనసాగించడం మనకు చాలా తేలికవుతుంది.

జీ) ఒక ప్రత్యేక ప్రాంతంలోని వాస్తవ పరిస్థితులపై ఆధారపడి నిర్దిష్ట నినాదాలను తప్పక రూపొందించాలి. ఉదాహరణకు, ఒక వెనుకబడిన గ్రామంలో దాని వెనుకబాటుతనానికి కారణాన్ని మనం కనుగొని ప్రజానీకాన్ని మేలుకొల్పడానికి నిర్దిష్టమైన నినాదాన్ని ముందుకు తెచ్చి తీరాలి. ఒకానొక ప్రాంతంలో ఒక తిరోగమనవాద భూస్వామి ప్రజల్ని భయపెడుతూ ఉన్నాడనుకోండి. అప్పుడు వాళ్లు పోరాటంలో క్రియాశీలంగా నిలబడ సాహసించరు. ఇలాంటి కేసులో ఆ భూస్వామిని పట్టుకోవాలనే నినాదాన్ని మనం తప్పక ముందుకు తేవాలి. అట్లాగే, ఇంకో ప్రాంతంలో స్థానిక ప్రభుత్వ సిబ్బంది ప్రజల నుండి వేరుపడి పోయి ఒక తీవ్రమైన తప్పు చేసినందువల్ల ప్రజల్లో అసంతృప్తి ఏర్పడిందనుకోండి. ఇలాంటి కేసులో, ప్రజల్ని పోరాటంలోకి దించడానికి గాను అలాంటి వాళ్ల తప్పుల్ని బైటపెడుతూ ప్రచారాన్ని నిర్వహించి తీరాలి.

హెచ్) పైన పేర్కొన్నది ప్రచారపు సారం. ఇప్పుడు ప్రచారపు పద్ధతిని గురించి చెప్పుకుందాం. భూపరిశోధన గురించిన ప్రచారాన్ని బస్తీ (township) స్థాయి కేడర్లందరి వరకూ (బస్తీ సోవియట్ ప్రతినిధులూ, అన్ని ప్రజా సంఘాల నాయకులూ) తీసుకెళ్లి ముందుగా వాళ్లు అర్థం చేసుకునేలా చేయాలి. తర్వాత వాళ్ల ద్వారా ప్రజల్లో ప్రచారం చేయాలి. రెండోది, కూలీ సంఘ, పేద రైతు సంఘ సభ్యులందరికీ ఈ విషయం గురించి స్పష్టంగా వివరించాలి. మూడోది, ప్రజలందరూ కూడా దీన్ని అర్థం చేసుకోగల్గేలా గ్రామంలో ఒక సభ ఏర్పాటు చేసి ఒక ఉపన్యాసం ద్వారా దీని గురించి వివరించాలి.

ఐ) ప్రచారకుల్ని ముఖ్యంగా బస్తీ స్థాయిలో క్రియాశీల కేడర్లలోంచి ఎన్నుకోవాలి. వాళ్లు ప్రజా సభలలో హాజరై ఉపన్యాసాలు ఇవ్వడం కోసం తగిన ఏర్పాటు చేసుకోవాలి. దీనితో పాటు ప్రచార బృందాల్ని ఆర్గనైజ్ చేయడం కూడా అవసరం. శిక్షణ తర్వాత వాళ్లను ప్రచారం కోసం ప్రజల వద్దకు పంపించవచ్చు.

జే) ప్రచార పద్ధతులు : (1) ఉపన్యాసాలు ఇవ్వడం, (2) నోటీసులు అంటించడం, (3) నినాదాలు రాయడం, (4) కరపత్రాలు పంచడం, (5) కొత్త నాటకాలు ప్రదర్శించడం, (6) గోడ పత్రికలపై వ్యాసాలు రాయడం వగైరా.

## 2. వర్గాల్ని పరిశోధించడం

ఏ) భూపరిశోధనా ఉద్యమమనేది వాస్తవానికి వర్గాల పరిశోధనే తప్ప భూమిని మౌ వెనుక మౌ లెక్కన పరిశోధించడం కాదు. భూమిని మౌ వెనుక మౌగా పరిశోధించడమనే పద్ధతి ప్రజల్లో తప్పనిసరిగా భయాందోళనలు కలుగజేస్తుంది. ఇది పూర్తిగా తప్పు.

బీ) వర్గ పరిశోధన అంటే భూస్వామ్య, ధనిక రైతు వర్గాల్ని పరిశోధించడమనీ, దోపిడీదార్లను పరిశోధించడమనీ అర్థం. వాస్తవానికి రైతులు కానప్పటికీ రైతులుగా నటిస్తూ దాక్కొని ఉన్న వాళ్లను పరిశోధించడం. పరిశోధించాల్సింది ఈ కొద్ది మందినే తప్ప మధ్య రైతుల్నీ, పేద రైతుల్నీ, కూలీల్నీ కాదు. కాబట్టి మనం మన పరిశోధనను ఒక ఇంటి తర్వాత మరో ఇల్లుగా చేయగూడదు. ఇలాంటి పద్ధతి ప్రజల్లో భయాందోళనను కలిగిస్తుంది, ఇది పూర్తిగా తప్పు.

సీ) వర్గ పరిశోధనను ప్రారంభించే ముందు వర్గం గురించిన భావనను చర్చించే ఒక ప్రచార దశను తప్పక అనుసరించాలి. వర్గం గురించి బాహాటంగానూ, విస్తృతంగానూ చర్చించకుండా పరిశోధనను ప్రారంభించడం ద్వారా ప్రజల్లో భయాందోళనలు వ్యాపిస్తాయి. ఇది పూర్తిగా తప్పు.

డీ) కూలీ సంఘం, పేద రైతు సంఘాల సభ్యులనూ, అట్లాగే ఇతర ప్రజల్లోని అత్యధికులనూ వర్గ పరిశోధనలో పాల్గొని తమ పరిశోధనా ఫలితాలను పేద రైతు సంఘానికీ, భూపరిశోధనా కమిటీకీ యదాతథంగా రిపోర్టు చేయాలని తప్పనిసరిగా కోరాలి. పరిశోధనలో కొద్ది మందే పాల్గొనాలని చెప్పడం సరైంది కాదు, ఎందుకంటే కొద్ది మందే పరిశోధనను నిర్వహించడం ద్వారా ప్రజల్లో భయాందోళనలు వ్యాపిస్తాయి. ఇది పూర్తిగా తప్పు.

ఈ) ఒక స్పష్టమైన ఫలితం వచ్చే దాకా వర్గ పరిశోధనను కొనసాగించాలి. ఒక భూస్వామిని గానీ, ధనిక రైతును గానీ పరిశోధించేటప్పుడు గతంలో అతడి దోపిడీ గురించీ, వ్యక్తిగత జీవితం గురించీ వివరాలన్నిటినీ స్పష్టంగా వెల్లడించాలి. అప్పుడే అతడితో తప్పులు ఒప్పించగలుగుతాం, ప్రజలు కూడా సంతృప్తి చెందుతారు. పరిశోధనను అసమగ్రంగా నిర్వహించి తొందరపాటుతో నిర్ధారణలు చేసిన పక్షంలో మనం తప్పులు చేయడానికి చాలా అవకాశాలుంటాయి. అనుమానితుడు తన తప్పుల్ని ఒప్పుకోడు. ప్రజలు సంతృప్తి చెందరు. దీని మూలంగా భూపరిశోధనా ఉద్యమానికి ఆటంకం కలుగుతుంది. ముఖ్యంగా మధ్య రైతుల వర్గ హోదాను పరిశోధించేటప్పుడు మరింత జాగ్రత్తగా వ్యవహరించాల్సి ఉంటుంది. ఏ ఒక్క మధ్య రైతునూ ధనిక రైతుగా గానీ, భూస్వామిగా గానీ నిర్ధారణ చేయకుండా జాగ్రత్త పడాలి.

ఎఫ్) ఒక కుటుంబపు వర్గ పరిశోధన ద్వారా వెల్లడైన వివరాలన్నీ ''వర్గ హోదా పరిశోధనా పత్రం'' కాపీపై రాసుకోవాలి. ప్రతి ఒక్కరూ దాన్ని పరిశీలించి వ్యాఖ్యానాలు చేయగల్గేలా అందరికీ అందుబాటులో ఉంచాలి. దాన్ని భవిష్యత్తులో పరీక్షించడానికి వీలుగా భద్రపర్చాలి. ఫలితాన్ని మౌఖికంగా చెప్పడం, మనసులోనే గుర్తు పెట్టుకోవడం, నోట్‌బుక్‌లో ఓ రెండు లైన్లలో రాసుకోవడం – ఇవేవీ సరైన పద్ధతులు కావు. ఎందుకంటే ఇవి సులభంగా రూపుమాసిపోగలవు.

## 3. వర్గ హోదాను ఆమోదించడం

ఏ) వర్గ హోదాను ఆమోదించడమంటే వర్గ హోదాను నిర్ధారించడం. ఇది ఒక వ్యక్తికి సంబంధించి జీవన్మరణ నిర్ణయం కాబట్టి ఈ విషయంలో మనం చాలా చాలా జాగ్రత్తగా ఉండాలి. ఆమోదం కోసం ప్రవేశపెట్టే ముందు ప్రతీ కేసునూ క్షుణ్ణంగా పరిశోధించాలి.

బీ) ఆమోదించే ప్రక్రియ మొదటి దశలో పేద రైతు సంఘం ఒక సమావేశాన్ని ఏర్పాటు చేస్తుంది. ఒక సాధారణ చర్చ నిర్వహించాక అత్యధికులు చేతుల్ని పైకెత్తడం ద్వారా ఓట్లు వేసిన తర్వాతనే పేద రైతు సంఘం ఆమోదించినట్టు అవుతుంది. అప్పటికీ ఏమైనా అసమ్మతి ఉంటే ఈ విషయాన్ని వాయిదా వేసి మరుసటి సమావేశంలో చర్చించాలే తప్ప మొట్టమొదటి సమావేశంలోనే ఆమోదించ కూడదు.

సీ) రెండో దశను బస్తీ భూపరిశోధనా కమిటీ నిర్వహించాలి. అది పేద రైతు సంఘం అభిప్రాయాల్ని విధిగా పరీక్షించిన తర్వాతనే అది సరిగా ఉంటే ఆమోదించాలి, తప్పుగా ఉంటే సవరించాలి. అప్పటికీ కమిటీకి ఇంకా ఏవైనా అనుమానాలు ఉంటే అది విధిగా మరోసారి పరిశోధన నిర్వహించాలి.

డీ) మూడో దశలో జిల్లా భూమి విభాగం పాల్గొంటుంది. ఒకవేళ ఈ విభాగం ఒక నిర్ణయానికి రాలేకపోతే అది దీన్ని జిల్లా భూపరిశోధనా కమిటీ ముందుకు తీసుకుపోతుంది. ఆ కమిటీ కూడా నిర్ణయానికి రాలేకపోతే ఆ విషయాన్ని అది క్సియాన్ భూమి విభాగానికి నివేదిస్తుంది.

ఈ) నాల్గో దశలో గ్రామంలో ఒక బహిరంగ సభను నిర్వహించాలి. సంబంధిత వ్యక్తి ఊళ్లోనే ఆ సభ జరగాలి. అక్కడ ప్రజలందరికీ అతడి దోపిడీ గురించీ, జీవితాన్ని గురించీ వివరంగా తెలపాలి. అప్పుడు ప్రజలు అంగీకరిస్తున్నారా లేదా అని కచ్చితంగా నిర్ధారణ చేసుకోవాలి. ప్రజలు ఒప్పుకుంటే ఆ ప్రతిపాదనను ఆమోదించినట్టు. ప్రజలు ఒప్పుకోకపోతే ఆ కేసును మళ్లీ పరిశోధించాలి. అయితే ప్రజలను బలవంతపెట్టి ఆమోదాన్ని పొందకూడదు. అలా చేస్తే ప్రజలు అసంతృప్తి చెందుతారు. అది అధికారతత్వం (కమాండిజం) అవుతుంది. దాన్ని కచ్చితంగా వ్యతిరేకించాలి.

ఎఫ్) పైన పేర్కొన్న నాలుగు దశలలో దేన్నీ కూడా వదిలివేయకూడదు. ప్రత్యేకించి బహిరంగసభలో ఆమోదం పొందే దశను తప్పక అనుసరించాలి. ఇది చాలా ముఖ్యమైంది. చాలా ప్రాంతాల్లో నిర్ణయాన్ని ప్రజలింకా

ఆమోదించకముందే స్వాధీనం మొదలవుతుంది. ఇది తప్పు.

జీ) ఒకవేళ గతంలో ఒక మధ్య రైతును ధనిక రైతుగా గుర్తిస్తూ, లేదా ఒక ధనిక రైతును భూస్వామిగా గుర్తిస్తూ, లేదా ఒక భూస్వామిని ధనిక రైతుగా గుర్తిస్తూ తప్పుడు నిర్ణయం జరిగినట్టయితే ఆ మొదటి నిర్ణయాన్ని తప్పక మార్చాలి. బహిరంగ సభలో మొదటి తప్పు గురించీ, దాన్ని సరిదిద్దాల్సిన కారణాల గురించీ ప్రజలు సంతృప్తి చెందే వరకూ వివరించి చెప్పాలి.

హెచ్) ఒక తప్పుడు నిర్ణయాన్ని మార్చి వేస్తున్నప్పుడు, సంబంధిత వ్యక్తి మధ్య రైతు అయినట్టయితే, అతని నుండి తీసుకున్న భూమికీ, ఆస్తులకూ నష్టపరిహారాన్ని తప్పక చెల్లించాలి. ఒకవేళ భూమిని ఇతరులకు పంచినప్పటికీ కూడా దాన్ని అతనికి తిరిగి అప్పజెప్పాలి. ఒకవేళ సంబంధిత వ్యక్తి ధనిక రైతు అయినట్టయితే అప్పుడు మన దగ్గర ఉన్నవాటిని తిరిగి ఇచ్చేయాలి. ఒకవేళ అప్పటికప్పుడు అతనికి ఇవ్వడానికి మన వద్ద ఏమీ లేనట్టయితే భవిష్యత్తులో అతనికి కలిగిన నష్టాన్ని పూడ్చడానికి మార్గం వెదకాలి. ప్రజల్ని గెల్చుకోవడానికి ఇలాంటి నష్టపరిహార విధానం చాలా ప్రభావవంతంగా ఉంటుంది. తప్పును సరిదిద్దకుండా, సరిదిద్దడానికి ఎలాంటి ప్రయత్నం చేయకుండా అలాగే వదిలేయడమనేది చాలా తీవ్రమైన తప్పు.

## 4. స్వాధీనం, పంపిణీ

ఏ) ప్రత్యేకించి గమనించాల్సిన విషయం ఏమిటంటే, గ్రామంలో బహిరంగ సభ నిర్వహించి ప్రజల ఆమోదం పొందిన తర్వాతనే భూస్వాముల నుండి భూమినీ, ఆస్తినీ, ధనిక రైతుల నుండి భూమినీ, అదనంగా ఉన్న బరువులు మోసే పశువుల్నీ, వ్యవసాయ పరికరాల్నీ, ఇళ్లనూ స్వాధీనం చేసుకోవాలి. అలాంటి ఆమోదం లేకుండా స్వాధీనం చేసుకోవడం లేదా రాత్రి పూట స్వాధీనాన్ని కొనసాగించడం పూర్తిగా నిషిద్ధం.

బీ) భూస్వాముల నుండి స్వాధీనపర్చుకున్న ఆస్తులన్నిటినీ ప్రజలకు పంచాలి. అయితే నగదునూ, విలువైన వస్తువుల్నీ మాత్రం ప్రభుత్వ ఆర్థిక విభాగానికి అప్పజెప్పాలి. పోరాటంలో ప్రజల ఉత్సాహాన్ని పెంపొందింపజేయడానికి ఇదొక మంచి పద్ధతి.

సీ) వర్గ హోదాను ఆమోదించడం కోసం గ్రామంలో ఏర్పాటు చేసే బహిరంగ సభ సందర్భాన్ని ఉపయోగించుకొని ఒక తాత్కాలిక స్వాధీన, పంపిణీ కమిటీని కూడా ఎన్నుకోవాలి. స్వాధీనం వెంటనే నిర్వహించాలి. పంపిణీ అక్కడికక్కడే చేయాలి. స్వాధీనంలోనూ, పంపిణీలోనూ ఎలాంటి ఆలస్యం ఉండకూడదు. వస్తువుల్ని మొదట ప్రభుత్వం దగ్గర పోగు చేసి ఆ తర్వాత పంపిణీ గురించి చర్చించే పద్ధతిని అనుమతించగూడదు.

డీ) ఒక గ్రామంలో స్వాధీనం చేసుకున్న వస్తువుల్ని అదే గ్రామంలో పంపిణీ చేయాలి. బస్తీ అంతటికీ వాటిని సమానంగా పంపిణీ చేయగూడదు (పెద్ద భూస్వాములు ఇందుకు మినహాయింపు).

ఈ) వస్తువుల్ని మొట్టమొదట ఎర్ర సైనికుల సంబంధీకులకూ, వ్యవసాయ కూలీలకూ, కార్మికులకూ, కడు పేదరికంలో ఉన్న ఇతర ప్రజలకూ పంచాలి. సామాజిక ప్రాతిపదికను పట్టించుకోకుండా వస్తువుల్ని సమానంగా పంపిణీ చేయగూడదు.

ఎఫ్) స్వాధీనపర్చుకున్న పందుల్నీ, కోళ్లనూ బహిరంగ సభ దగ్గరే వండి అందరికీ వడ్డించాలి. కొంత మంది ప్రభుత్వాధికారులు మాత్రమే తినడాన్ని అనుమతించగూడదు.

జీ) ప్రభుత్వాధికారులు తమకు వస్తువుల్ని పంచాలని కోరుకోకుండా ఉండి ఆదర్శాన్ని నెలకొల్పాలి. ఎవరికైనా, ఏదైనా వస్తువు నిజంగా అక్కర పడితే అతడు బహిరంగ సభలో ప్రజల ఆమోదాన్ని తప్పక పొందాలి. ప్రభుత్వాధికార్లు తమ ఇష్టం వచ్చినట్టుగా వస్తువుల్ని తీసుకోకుండా నిరోధించాలి.

హెచ్) స్వాధీనం ద్వారా వచ్చిన బరువులు మోసే పశువుల్నీ, పెద్ద వ్యవసాయ పనిముట్లనూ ప్రజల ఆమోదంతో భూమి పొందిన వాళ్ల అదుపులో ఉంచవచ్చు. వాళ్లు వ్యవసాయ పశువుల సహకార సంఘాన్ని ఏర్పాటు చేసి పశువుల్నీ, పనిముట్లనూ వంతుల వారీగా ఉపయోగించుకుంటారు.

ఐ) భూమిని స్వాధీనం చేసుకున్న తర్వాత దాన్ని పంచడంలో ఆలస్యం చేయడం తప్పు. భూమిలో కొంత భాగాన్ని ఎర్ర సైన్యం కోసం, సామాజిక సంక్షేమం కోసం ప్రభుత్వ (public) భూమిగా పక్కకు తీసిన వెంటనే మిగిలిన భూమినంతా పంచాలి. మొట్టమొదట, గతంలో తగినంత భూమిని పొందని లేదా ఎలాంటి భూమినీ పొందని వాళ్లకు పంచాలి. ఆ తర్వాత ఏమైనా మిగిలితే గ్రామంలో అందరికీ సమానంగా పంచాలి. గుట్టల్నీ, అడవుల్నీ, చేపల చెరువుల్నీ, ఇళ్లనూ, మరుగుదొడ్లనూ కూడా ప్రజలకు వెంటనే పంచి ఇవ్వాలి.

జె) వస్తువుల్ని పంచే సందర్భంగా, ప్రజల్లో పోరాటం పట్ల ఉత్సాహం అత్యున్నతంగా నెలకొనే ప్రతి సమయంలోనూ మనం దాన్ని వినియోగించుకుంటూ ఎర్ర సైన్య విస్తరణ, సహకార సంఘాల్ని అభివృద్ధి చేయడం వంటి నినాదాల్ని ముందుకు తేవాలి. ప్రజలు ఉత్సాహంతో విప్లవ యుద్ధంలోనూ, సోవియట్ల నిర్మాణంలోనూ చేరేలా పాటు పడాలి.

## 5. కూలీ సంఘం, పేద రైతు సంఘం

ఏ) వర్గాలపై చర్చ, వర్గాల్ని పరిశోధించడం, వర్గ హోదాను ఆమోదించడం, స్వాధీనం, పంపిణీ వంటి మన ప్రధాన కర్తవ్యాలన్నీ కూలీ సంఘాన్నీ, పేద రైతు సంఘాన్నీ సమీకరించడం ద్వారానే బ్రహ్మాండమైన విజయంతో పరిపూర్తి చెందుతాయి. గ్రామీణ ప్రాంతంలో వర్గ పోరాటంలో కూలీ సంఘమే నాయకత్వ స్థానంలో ఉంటుంది. అదే సమయంలో పేద రైతు సంఘం ఆ పోరాటానికి స్తంభంగా ఉంటుంది.

బీ) కూలీ సంఘంపై ఆధారపడుతూ భూపరిశోధనా ఉద్యమాన్ని సరిగా అభివృద్ధి చేయాలి. దాని సభ్యులు పేద రైతు సంఘంలో చేరి, దాంట్లో ఉంటూ ఒక సానుకూల పాత్రను పోషించేలా చూడాలి.

సీ) పేద రైతు సంఘాన్ని విస్తరింపజేయడం, దాన్ని పేద రైతుల్లోని విశాల జన బాహుళ్యం ఇష్టంతో చేరే సంఘంగా మల్చడం చాలా అవసరం.

డీ) పేద రైతు సంఘంలో దాక్కొని ఉన్న దుర్మార్గులను తప్పక తొలగించాలి.

ఈ) భూపరిశోధనా ఉద్యమం సందర్భంగా పేద రైతు సంఘం బాధ్యతగా సభల్ని నిర్వహించాలి. అది ఈ ఉద్యమాన్ని తన కేంద్ర కర్తవ్యంగా స్వీకరించి పూర్తి శ్రద్ధ వహించాలి.

ఎఫ్) పేద రైతు సంఘం చుట్టూ మధ్య రైతుల్ని సమీకరించాలి. సంఘం సమావేశాలకు వాళ్లను ఆహ్వానించాలి.

జీ) భూపరిశోధనా ఉద్యమ క్రమంలో పైన పేర్కొన్న సూత్రాల్ని కూలీ సంఘం గానీ, పేద రైతు సంఘం గానీ ఉల్లంఘించకూడదు. ▲

# 'ప్రగతిశీలత' పేరుతో ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న యూపీఏ ప్రభుత్వం

సమానత్వం, సామాజిక న్యాయం, బహుళవాదం, లౌకికవాదం, విదేశీ వ్యవహారాలతో స్వతంత్ర విధానం వగైరా-వగైరా మాటలు చెబుతూ 'ప్రగతిశీలత' పేరుతో పీడిత ప్రజలకు అనుకూలంగా కనీస ఉమ్మడి కార్యక్రమాన్ని రూపొందించినట్లుగా యూపీఏ (సమైక్య ప్రగతిశీల కూటమి) ప్రభుత్వం చెప్పుకుంది. ఇందులో సామాజిక రంగానికీ, ఉపాధి గ్యారంటీకీ, ఆహార భద్రతకూ, వైద్య సదుపాయాలకూ అత్యధిక ప్రాధాన్యతనిచ్చి నిధులు పెద్ద ఎత్తున కేటాయించనున్నట్టుగా అది ప్రకటించింది.

కానీ యూపీఏ ప్రభుత్వం తన కనీస ఉమ్మడి కార్యక్రమంలో హామీ ఇచ్చినట్టుగా ఏమీ అమలు జరగడం లేదు. ఉదాహరణకు సామాజిక రంగానికి 10 వేల కోట్ల రూపాయలు కేటాయించినట్టుగా గొప్పలు చెప్పుకుంటున్నది. కానీ ఇది స్థూల జాతీయోత్పత్తిలో కేవలం 0.4 శాతం మాత్రమే. దీన్ని ఏ మంత్రిత్వ శాఖ కిందికి గానీ, ఏ పద్దులో గానీ ఖర్చు పెట్టడానికి కేటాయించలేదు. అదీ గాక అప్పటికే ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి తమ తమ ఖర్చుల పథకాలు అన్నీ తయారు చేసుకున్నాయి. కాబట్టి ఖర్చు పెట్టే అవకాశం కూడా లేదు. ఇది ప్రజల్ని మోసం చేయడానికి పన్నిన పన్నాగం తప్పితే ఇంకేమీ కాదు. ప్రపంచ బ్యాంకు తొత్తు మోంటెక్ సింగ్ అహ్లూవాలియా చేతిలో ఉన్న ప్లానింగ్ కమిషన్‌కు గుడ్డిగా కేటాయించిన 10 వేల కోట్ల రూపాయలు పేద ప్రజల అవసరాల్ని తీర్చవని అంచనా వేయడం కష్టమేమీ కాదు.

### *ఇక లౌకికవాదం విషయానికొస్తే...*

సామాజిక శాంతి భద్రతలకు భంగం కలిగించే మత ఛాందసవాదులకు వ్యతిరేకంగా యుద్ధం చేపడతామనీ, లౌకికవాదాన్ని రక్షిస్తాననీ కనీస ఉమ్మడి కార్యక్రమంలో గొప్పలు చెప్పుకున్నారు. కానీ గుజరాత్ మారణకాండకు కారకులైన వారిని శిక్షించడానికి ఇప్పటి వరకూ ఏ చర్యా చేపట్టలేదు. ఇంకో పక్క హంతకులు సాక్షుల్ని లొంగదీసుకోవడానికి అన్ని రకాల పద్ధతులు అవలంబిస్తూ దర్జాగా తిరుగుతున్నారు. జాహిరా షేక్‌పై 'సంఘ్ ముఠా' గూండాలు ఒత్తిడి చేయడం, హత్య చేస్తామని బెదిరింపులు చేయడం, లంచాలతో ప్రలోభపెట్టడంతో ఆమె తాను మొదట ఇచ్చిన సాక్ష్యం ఎన్జీవోల ఒత్తిడికి లొంగి ఇచ్చిందని ప్రకటించింది. సాక్షుల్ని కోర్టులో సాక్ష్యం ఇవ్వకుండా, ఇచ్చినా తప్పుడు సాక్ష్యం ఇచ్చేలా వత్తిడి చేస్తున్నారు. ఇలాంటివి గుజరాత్‌లో ఇప్పటికీ ఎన్నో జరుగుతున్నప్పటికీ జాహిరా షేక్ వంటి సాక్ష్యులకు, ఇంకా ముస్లిం ప్రజలందరికీ సంఘ్ ముఠా హంతకుల నుండి కేంద్ర ప్రభుత్వం ఎలాంటి రక్షణా కల్పించడం లేదు. పైగా జాహిరా మాటి మాటికీ తన ప్రకటనలు మారుస్తున్నందున ఆమె న్యాయవ్యవస్థతో ఆడుకుంటున్నదని సుప్రీంకోర్టు న్యాయమూర్తులు ఘోరమైన వ్యాఖ్యానాలు చేస్తున్నారు. ఇప్పటికీ గుజరాత్‌లో ముస్లిం ప్రజానీకం అభద్రతా వాతావరణంలో జీవిస్తున్నారు.

గుజరాత్‌లో ఇప్పటి వరకు హిందూ మతోన్మాదానికి బలైన ముస్లిం ప్రజానీకం దాదాపు లక్షకు పైగానే ఉన్నారు. ఇప్పటి వరకు వారికి సహాయ సహకారాలు నామమాత్రంగానే అందాయి. ఎంతో మందికి పునరావాసాన్ని కల్పించాల్సి ఉంది. గుజరాత్ నరమేధ బాధితులకు ఆహారం, సహాయం, పునరావాసం, విద్య, వైద్యం వంటి సదుపాయాల్ని అందించడంలో యూపీఏ ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. కాబట్టి యూపీఏ తన కనీస కార్యక్రమంలో రాసుకున్న లౌకికవాదం ఉత్త బూటకమే తప్ప మరేం కాదు.

లౌకికవాదాన్ని రక్షిస్తానని తన కనీస ఉమ్మడి కార్యక్రమంలో యూపీఏ ఎన్ని హామీలు ఇచ్చినప్పటికీ, అది 'మెతక హిందూత్వ' వైఖరిని అనుసరిస్తూ వాస్తవానికి హిందూ మతోన్మాదులకు అనుకూలంగానూ, మైనారిటీ మతస్తులకు వ్యతిరేకంగానూ ఉండే అవకాశవాద వైఖరిని అవలంబిస్తున్నది. యూపీఏలో భాగస్వాములుగా ఉన్న పార్టీలలో తమ తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం హిందూత్వానికి మద్దతునిచ్చేవీ, హిందూత్వతో వైరం కోరుకోనివీ, హిందూత్వతో సర్దుబాటు ఉన్నవే అధికం. బాబ్రీ మసీదు కూల్చివేత కేసులో ఎల్‌కే అద్వానీపై దాఖలు చేసిన చార్జ్‌షీట్‌ను ఎన్డీఏ ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడి ఎత్తివేయించగా, యూపీఏ అధికారంలోకొచ్చి ఆరు నెలలు గడిచిపోయినప్పటికీ మళ్లీ చార్జ్‌షీట్‌ను దాఖలు చేయించలేదు.

యూపీఏ లౌకికవాదాన్ని రక్షించలేదనీ, తన స్వార్థ రాజకీయ ప్రయోజనాలతో హిందూ మతోన్మాదులకు అనుకూలంగా వ్యవహరిస్తుందనీ ఆరు నెలల పరిపాలన తేల్చివేసింది. అందుకే మైనారిటీ మతస్తులతో సహా, నిజమైన లౌకికవాదులందరూ యూపీఏ అనుసరిస్తున్న అవకాశవాద వైఖరికి వ్యతిరేకంగా పోరాడాలి. మైనారిటీ మతస్తులు హిందూ మతోన్మాదుల నుండి రక్షణ కోసం యూపీఏ ప్రభుత్వం మీద గానీ, న్యాయవ్యవస్థ మీద గానీ అధారపడకుండా మిగతా పీడిత సెక్షన్లతో సమైక్యమై, మిలిటెంట్‌గా నిలబడి, సంఘటితపడి హిందూ మతోన్మాదుల్ని ఎదిరించాలి.

### *ఇక జాతీయ ఉపాధి బిల్లు గురించి చూద్దాం.*

ప్రభుత్వాలు అవలంబించే నూతన ఆర్థిక విధానాల వలన రోజురోజుకూ నిరుద్యోగం విపరీతంగా పెరుగుతున్నది. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేయడంతోనూ చిన్న, మధ్య తరహా పరిశ్రమలు మూతబడడంతోనూ కార్మికులు ఉపాధి కోల్పోయి నిరుద్యోగులుగా మారుతున్నారు. అలాగే డబ్ల్యూటీవో ఆదేశాలకు తలొగ్గి సామ్రాజ్యవాద ఆర్థిక విధానాల్ని వ్యవసాయం మీద రుద్దడంతో వ్యవసాయ రంగం రోజురోజుకూ మార్కెట్‌పై ఆధారపడడం ఎక్కువయింది. ఒక పక్కన వ్యవసాయ కారకాల ధరలు నిరంతరాయంగా పెరుగుతుండడం, పండిన పంటకు గిట్టుబాటు ధరలు రాక వ్యవసాయంపై పెట్టిన పెట్టుబడి రాక, తెచ్చిన అప్పులు తీర్చలేక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. భూములు అమ్ముకొని నిరుద్యోగులుగా మారుతున్నారు.

ఇంకో పక్క చేనేత రంగంపై నూతన ఆర్థిక విధానం దెబ్బ పడి రోజురోజుకూ చితికిపోయే పరిస్థితిలో ఉంది. నూలు రంగుల ధరలు విపరీతంగా పెరిగిపోయి, తయారయిన సరుకుకు సరైన ధరలు లేక, ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీలపై కోత విధించడం, ఇంకో పక్క మిల్లు ఉత్పత్తుల పోటీకి తట్టుకునేటట్టు ప్రభుత్వం చర్యలు చేపట్టకపోవడంతో అనేక ఇబ్బందులకు గురవుతూ ఉపాధి కోల్పోతున్నారు. ఇంకో పక్క ప్రభుత్వం ఆప్కో లాంటి సంస్థలతో కొనుగోలు చేయాల్సిన సరుకు

కొనుగోలు చేయక, కొనుగోలు చేసిన దానికి డబ్బు చెల్లించక దోపిడీ చేస్తోంది. ఒక ఆంధ్రలోనే 20,000 మగ్గాలు పనులు లేక నిలిచిపోయాయి. ప్రభుత్వం అవలంబిస్తున్న సామ్రాజ్యవాద అనుకూల విధానాల వలన, భారత పరిశ్రమ వికృతాభివృద్ధి ఫలితంగా అటు గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం, చేనేత పరిశ్రమా, ఇటు పట్టణాల్లో చిన్న, మధ్య తరహా పరిశ్రమలూ దెబ్బ తిని నిరుద్యోగం విలయతాండవం చేస్తున్నది. ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే రైతుల ఆత్మహత్యలు గత ఆరు నెలల నుండి 1,860 జరుగగా, చేనేత కార్మికుల ఆకలిచావులు 200 జరిగాయి. ఇంకా కేరళ, కర్నాటక, మహారాష్ట్రలలో వరుసగా 419, 467, 350 మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఇంకా దేశం మొత్తం మీద చూస్తే ఈ సంఖ్య ఎన్ని రెట్లు ఉంటుందో అంచనా వేసుకోవచ్చు. మహారాష్ట్రలో గత ఐదేళ్లుగా అధికారం వెలగబెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే కేవలం విదర్భలోనే 400 మంది పత్తి రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. భారతదేశంలో 69 శాతం ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. దాదాపు 70 శాతం మంది ప్రజలు గ్రామాల్లో నివసిస్తున్నారు. అయినప్పటికీ బూటకపు స్వాతంత్ర్యం లభించే నాటికి స్థూల జాతీయోత్పత్తిలో 61 శాతంగా ఉండిన వ్యవసాయం వాటా ఇప్పుడు 24 శాతంకన్నా తక్కువకు పడిపోయింది. ప్రస్తుత కాంగ్రెస్ నాయకత్వంలోని యూపీఏ ప్రభుత్వం సహా దీనికి ముందు దేశాన్ని ఏలిన ప్రభుత్వాలన్నీ ఈ దుస్థితికి బాధ్యులే.

గత ఆరు నెలల్లో పెరిగిన ధరలతో అందరికన్నా ఎక్కువ దెబ్బ తిన్నది కూడా రైతాంగమే. డీజిల్, ఎరువులు, క్రిమిసంహారక మందుల ధరలు 30-40 శాతం పెరిగాయి. వీటితో పోల్చినపుడు వ్యవసాయోత్పత్తుల ధరలు ఎప్పటి లాగానే ఉండిపోయాయి లేదా పడిపోయాయి. పెట్రోలు, డీజిల్, వంట గ్యాస్ ధరలను విపరీతంగా పెంచి యూపీఏ ప్రభుత్వం పేద, మధ్య తరగతి ప్రజానీకం నడుం విరిచింది.

ఇంతే కాకుండా బతకడానికి వేరే గత్యంతరం లేక కుటుంబాన్ని పోషించుకోవడానికి రైతాంగం, చేనేత కార్మికులు కిడ్నీలు తదితర శరీర భాగాల్ని కూడా అమ్ముకుంటున్నారు. కార్పొరేట్ ఆసుపత్రుల దోపిడీకి గురవుతున్నారు. రక్తహీనత, తీవ్ర అనారోగ్యం, ఆకలితో చనిపోతున్నారు.

పత్తి పండించిన రైతుకు గిట్టుబాటు ధర లేదు. ఇంకో పక్క పత్తితో తయారైన నూలు ఎక్కువ ధరతో చేనేత కార్మికునికి అందుతుంది. చేనేత కార్మికుడు తయారు చేసిన బట్టకు సరైన ధర లేక దివాళా తీస్తాడు. ఇదీ సామ్రాజ్యవాదం, దళారీ బూర్జువా, భూస్వామ్య వర్గాలు సంఘటితంగా భారత ప్రజానీకాన్ని దోపిడీ చేస్తూ పీడిస్తున్న విధానం.

వాస్తవంగా వాళ్లు తమ వృత్తుల్ని కోల్పోయి నిరుద్యోగులుగా మారడమే దోపిడీ వర్గానికి కావల్సింది. ఎందుకంటే నిరుద్యోగుల సంఖ్య ఎంత ఎక్కువైతే అంత కారుచౌకగా వాళ్ల శ్రమశక్తిని కొనేయవచ్చునని అది భావిస్తుంది. అయితే ప్రజలను ఉద్యమాల నుండి పక్కదారి పట్టించడానికి కొన్ని ఉపాధి కార్యక్రమాలు కూడా కంటితుడుపుగా చేపడుతుంది. దీనిలో భాగంగానే ఉపాధి హామీ బిల్లు. దీని ప్రకారం ప్రతి కుటుంబంలో ఒకరికి 100 పని దినాలు కల్పిస్తుందట. వాస్తవానికి దీనికోసం బడ్జెట్‌లో నిధుల్ని ముందు ఉన్న 9,640 కోట్ల రూపాయల నుండి 4,530 కోట్ల రూపాయలకు తగ్గించివేసింది. దీన్ని బట్టి ఈ పథకంపై ప్రభుత్వానికున్న నిజాయితీ ఏమిటో అర్థం చేసుకోవచ్చు. అసలు ప్రజలకు ఉపాధి కల్పించాలి అనే చిత్తశుద్ధి ఉంటే నిరుద్యోగమే తలెత్తదు కదా!

ఇక ఒక పక్క పేద వర్గాలకు ఉపాధి కల్పించే పథకాల గురించి మాట్లాడుతూనే ఇంకో పక్క ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్ (ఈపీఎఫ్)పై వడ్డీ రేటు 9.5 శాతం నుండి 8.5 శాతానికి తగ్గించింది. దీని వలన నాలుగు కోట్ల మంది కార్మికులు నష్టపోతున్నారు. వాళ్ల కుటుంబాలను కూడా కలుపుకుంటే 12 కోట్ల మందికి ఇది నష్టాన్ని కలిగిస్తోంది. దీని ద్వారా అనేక కోట్ల రూపాయలు కార్మికుల ఈపీఎఫ్ నుండి దోచుకుంటోంది. వాస్తవంగా ప్రతి సంవత్సరం పోగుపడే ఈపీఎఫ్ నుండి 9.5 శాతం కంటే ఇంకా ఎక్కువ వడ్డీనే ప్రభుత్వం చెల్లించవచ్చు కానీ మార్కెట్ రేటు అనే పేరు మీద 8.5 శాతానికి తగ్గించింది. ఈ విధంగా యూపీఏ కార్మిక వ్యతిరేక విధానాలనే అనుసరిస్తున్నది.

మహిళలూ, పిల్లలూ, ఆదివాసీలూ, విద్యుచ్ఛక్తీ, తాగునీరూ, చట్టం, న్యాయం తదితర అంశాలెన్నిటినో తన ఉమ్మడి కార్యక్రమంలో పేర్కొన్న యూపీఏ ప్రభుత్వం గత ఆరు నెలల కాలంలో వాటిని ఏ మాత్రం పట్టించుకోకుండా గాలికొదిలేసింది. ప్రజలకు అవసరం లేని, ప్రాధాన్యత లేని విషయాలైన సావర్కర్ వివాదం, బీజేపీ నాయకురాలు ఉమాభారతి అరెస్టు తదితర విషయాల మీద మాత్రం మల్లాగుల్లాలు పడ్డారు. పైగా ప్రధానమంత్రి కనీస ఉమ్మడి కార్యక్రమం డాక్యుమెంటు అమలు కాలం ఐదేళ్లు కాబట్టి ఇంకా సమయం ఉంది అంటూ సాధారణ ప్రజల నిజమైన సమస్యల్ని పక్కకు పెడుతున్నాడు. అంటే ప్రధానమంత్రి దృష్టిలో ప్రజల సమస్యలైన నిరుద్యోగం, అనారోగ్యం, కరువు, ఆకలిచావులు, ఆత్మహత్యలు తక్షణం ప్రాధాన్యతనిచ్చి పరిష్కరించాల్సిన సమస్యలు కావన్న మాట!

### *ప్రణాళికా సంఘం గురించి*

ఇప్పటి వరకు బీజేపీ సహా ఏ ప్రభుత్వం కూడా ప్రణాళికా సంఘం సంప్రదింపుల కమిటీలలో సామ్రాజ్యవాద సంస్థల ప్రతినిధులను ప్రత్యక్షంగా నియమించలేదు. అయితే వాళ్ల విధానాలను మాత్రం ప్రణాళికా సంఘంలో చర్చించి అమలుకు పథకాన్ని సిద్ధం చేసేవాళ్లు. కానీ యూపీఏ నాయకత్వంలో ప్రభుత్వం ప్రణాళికా సంఘం డిప్యూటీ ఛైర్మన్, ప్రపంచబ్యాంకు తొత్తు అయిన మోంటెక్‌సింగ్ అహ్లువాలియా సామ్రాజ్యవాదులకు మరింత సేవ చేయడానికి బరితెగించి ప్రణాళికా సంఘం సంప్రదింపుల కమిటీలోకి ప్రపంచబ్యాంకు డైరెక్టర్‌నూ, ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఏడీబీ) ప్రతినిధినీ, మెక్‌కెన్సీ అనే విదేశీ సంస్థకు చెందిన ముగ్గురు ప్రతినిధులనూ నియమించాలని ప్రతిపాదన చేయగా యూపీఏ ప్రభుత్వం దీన్ని ఆమోదించింది. దీని ద్వారా ప్రపంచబ్యాంకు తన ఎజెండాను నేరుగా ప్రణాళికా సంఘంలో పెట్టి అమోదింపజేసి అమలు చేయించగలుగుతుంది. దీనితో భారత ఆర్థికవ్యవస్థలో ప్రత్యక్షంగా జోక్యం చేసుకోవడానికి ప్రపంచబ్యాంకుకు వీలు కలగడంతో పాటు సాధికారత కూడా ఒనగూరుతుంది. మొత్తం భారత సంపదనూ, ప్రజలనూ సామ్రాజ్యవాదులు అడ్డూ ఆపూ లేకుండా దోచుకునేలా యూపీఏ ప్రభుత్వం తలుపులన్నిటినీ బార్లా తెరుస్తున్నదన్న వాస్తవాన్ని ఈ పరిణామాల నుండి గ్రహించవచ్చు.

నామమాత్రంగానే అయినప్పటికీ రివిజనిస్టు పార్టీల నుండీ, ఇతరుల నుండీ వచ్చిన వ్యతిరేకతను ఏ మాత్రం లెక్క చేయకుండా అహ్లువాలియా దీన్ని సమర్థించుకుంటూ, "ప్రపంచబ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకులు ఆర్థిక, ద్రవ్య సంబంధిత కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నప్పుడు ఎందుకు ఈ కమిటీల్లోనే ఉండి విధానాల మీదా, కార్యక్రమాల మీదా తమ అభిప్రాయాలు చెప్పగూడదు? ఒకవేళ అదే మీటింగులో ఆయా విషయాల మీద భిన్నాభిప్రాయాలు ఉంటే ఎవరైనా మాట్లాడవచ్చు కదా" అంటూ దబాయించాడు. వాస్తవానికి ఇలాంటి సామ్రాజ్యవాద ప్రతినిధులు ప్రణాళికా సంఘ కమిటీల్లో ఉండడమంటే మన దేశ

సార్వభౌమత్వానికే కళంకం. ఇంత కాలం భారత రాజ్యాన్ని తెరచాటున కంట్రోలు చేస్తున్న సామ్రాజ్యవాదులు ఇప్పుడు ప్రత్యక్షంగా, తమ ప్రతినిధుల ద్వారా చేయగలుగుతారు. దీన్నే యూపీఏ ప్రభుత్వం కోరుకుంటున్నది. స్వయంగా ప్రపంచబ్యాంకు మాజీ అధికారి అయిన మన్మోహన్ సింగ్ తన ప్రభుత్వ దళారీ స్వభావాన్ని ఇలా నగ్నంగా చాటుకుంటున్నాడు.

ఇక ఆంధ్ర ముఖ్యమంత్రి మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వం చంద్రబాబు నాయకత్వంలో ప్రపంచబ్యాంకు పాలసీలను అమలు చేయడంతో ఏర్పడిన వ్యవసాయ సంక్షోభం ప్రజల్ని కష్టాలకు గురి చేసిందనీ, ఎంతో మంది రైతుల ఆత్మహత్యలకు కారణమైందనీ అంటూ టీడీపీ వైఫల్యాల్ని ఏకరువు పెట్టాడు. అయితే ఆయన ప్రభుత్వం కూడా ఇప్పటి సంక్షోభం నుండి బైటపడడానికి గాను ప్రపంచబ్యాంకు సలహాలనే తీసుకోవాలని భావిస్తోంది!!

ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం ప్రభుత్వం ప్రపంచబ్యాంకు ఆదేశాలను తుచ తప్పకుండా అమలు జరిపింది కాబట్టి ప్రజా వ్యతిరేకతకు గురై కొట్టుకుపోయింది. కేంద్రంలో అయినా, రాష్ట్రంలోనైనా ఎన్‌డీఏ అయినా, యూపీఏ అయినా సామ్రాజ్యవాదులు నిర్దేశించిన సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ (ఎల్‌పీజీ) విధానాలనే అమలు చేస్తాయని గత ఆరు నెలల పాలనలో యూపీఏ ప్రభుత్వం అమలు చేసిన విధానాల ద్వారా స్పష్టమవుతోంది. రివిజనిస్టు పార్టీలు సహా పార్లమెంటరీ పార్టీలన్నీ సామ్రాజ్యవాద అనుకూల విధానాలను అమలు చేయడంలో ఒకే బాటన నడిచేవే.

ఆర్థిక వ్యవస్థలోని టెలికాం, విమానాశ్రయాలు, భీమా వంటి సేవా రంగాలను కూడా సామ్రాజ్యవాద దోపిడీకి బార్లా తెరిచిన కాంగ్రెస్ ప్రభుత్వం బీజేపీ కూడా చేయని సాహసానికి ఒడిగట్టింది. అధికారంలోకి రావడంతోనే అది పౌరవిమానయాన రంగంలో విదేశీ పెట్టుబడికి తలుపులు తెరిచింది. ఈ రంగంలో విదేశీ పెట్టుబడిని 40 శాతం నుండి 49 శాతానికి పెంచింది. పైగా ముంబాయి, ఢిల్లీ విమానాశ్రయాలను ప్రైవేటు సంస్థలకు లీజుకు ఇవ్వాలని కూడా ఆలోచిస్తోంది.

టెలి కమ్యూనికేషన్ రంగంలో విదేశీ పెట్టుబడిని 49 శాతం నుండి 74 శాతానికి పెంచింది. దీనికి తోడు విదేశీ సంస్థాగత పెట్టుబడి (ఎఫ్ఐఐ)కి భారీ ఎత్తున రాయితీలు ప్రకటించింది. రుణ నిధులతో ఎఫ్ఐఐపై ఉన్న సీలింగ్‌ను ఒక బిలియన్ నుండి 1.75 బిలియన్ డాలర్లకు పెంచింది. గతంలో దేశంలోకి ఎఫ్ఐఐ ప్రవేశంపై ఉన్న ఆంక్షలలో చాలా భాగం ఎత్తివేసింది.

భారతదేశంలో 43 మిలియన్ల ల్యాండ్‌లైన్ కనెక్షన్లు, 40 మిలియన్ల మొబైల్‌ఫోన్ వినియోగదార్లు ఉన్నారు. ఇవి రాబోయే రెండు సంవత్సరాల్లో రెట్టింపు కాగలవని అంచనా. అంటే ప్రతి 8 మందికి ఒక ఫోన్ వినియోగంలోకి వస్తుంది. దీనికి 20 బిలియన్ల డాలర్లు అవసరమవుతాయని అంచనా. ఈ అవసరాలను తీర్చాలనే సాకుతో టెలికాం రంగంలో విదేశీ పెట్టుబడుల్ని ఆహ్వానిస్తున్నాం అంటోంది ప్రభుత్వం. అందుకే విదేశీ పెట్టుబడిని 49 శాతం నుండి 74 శాతానికి పెంచింది. సామ్రాజ్యవాద బందిపోట్లు తమ పెట్టుబడిని మరింతగా పెంచే ప్రతి అవకాశం కోసం చాలా ఏళ్లుగా డిమాండ్ చేస్తున్నారు. ఇప్పుడు కాంగ్రెస్ నాయకత్వంలోని యూపీఏ తన మొట్టమొదటి బడ్జెట్‌లోనే వాళ్ల కోరికను ఈ విధంగా తీర్చింది.

విమానయానం, టెలికాం రంగాలలో ప్రైవేటు పెట్టుబడులు పెంచడం ద్వారా విమానాశ్రయాల్ని ప్రైవేటు సంస్థలకు లీజుకు ఇవ్వడం ద్వారా వీటిపై ప్రభుత్వ నియంత్రణ లేకుండా పోతుంది. దేశ భద్రతను సామ్రాజ్యవాదుల చేతిలో పెట్టినట్టు అవుతుంది. అలాగే వీటిలో పని చేస్తున్న ఉద్యోగులకు ఉద్యోగ భద్రత లేకుండా పోతుంది.

యూపీఏ తన ఉమ్మడి కార్యక్రమంలో పోటాను రద్దు చేస్తానని కూడా హామీ ఇచ్చింది. అయితే ఇప్పుడు అంతే క్రూరమైన ఆర్డినెన్సు యూఏపీఏ (చట్టవ్యతిరేక కార్యకలాపాల నియంత్రణ చట్టం)ను ప్రజలపై రుద్దుతోంది. అంటే పోటాలో ఉన్న దుర్మార్గమైన ప్రావిజన్స్‌ను అలాగే ఉంచుతోంది. టెర్రరిజం నిర్వచనం, టెర్రరిస్టు సంస్థల వివరణ, టెర్రరిస్టు సంస్థలకు ఆర్థిక సహాయం చేసినట్టు రుజువైతే, టెర్రరిస్టు అనుకూల ఉపన్యాసాలు చేస్తే కఠిన శిక్షలు మొదలైన పోటాలోని అంశాలన్నీ అలాగే ఉంచి బిల్లు తయారు చేసింది. పోటా కింద గతంలో నిషేధానికి గురైన 32 సంస్థల్ని యూఏపీఏ కింద కూడా నిషేధించింది. ఎన్డీఏ అధికారంలో ఉన్నప్పుడు ఎండీఎంకే నాయకుడిని పోటా కింద అరెస్టు అయినప్పుడు ఇది మానవ హక్కుల్ని హరించే చట్టమని పోటాకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున క్యాంపెయిన్ చేపట్టిన కాంగ్రెస్ ఇప్పుడు పేరు వేరే అయినప్పటికీ అంతే క్రూరమైన మరో చట్టాన్ని అమలు చేస్తున్నది.

ఒక వైపు పోటాను రద్దు చేయడం ద్వారా తన్ను తాను పెద్ద ప్రజాస్వామికవాదిగా చాటుకుంటున్న యూపీఏ ప్రభుత్వం ఈశాన్య ప్రాంతంలో దాదాపు గత యాభై ఏళ్లుగా అమలులో ఉన్న భద్రతా బలగాల ప్రత్యేక అధికారాల చట్టాన్ని ఎత్తేయాలంటూ మణిపూర్ ప్రజలు చేసిన సమరశీల ఉద్యమాన్ని నెత్తుటి ఏరుల్లో ముంచివేసింది. ఒక వైపు ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్షలనూ, డిమాండ్లనూ కాలరాచివేస్తూనే శాంతి, ప్రజాస్వామ్యం, లౌకికవాదం అంటూ వల్లించడం యూపీఏకే చెల్లింది. విప్లవోద్యమ అణచివేత విషయంలో కూడా దాని ద్వంద్వ నీతిని చూడొచ్చు. ఆంధ్రప్రదేశ్‌లో గత అనేక ఏళ్లుగా ప్రజలు చేస్తున్న డిమాండ్‌కు తలొగ్గి విప్లవ కమ్యూనిస్టు పార్టీలతో చర్చలు ప్రారంభించిన కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద శాంతి కాముకురాలిగా పోజు పెట్టింది. కానీ లక్షల సంఖ్యలో ప్రజలు వీధుల్లోకి వచ్చి తాము విప్లవోద్యమం పక్షానే ఉన్నామని నినదించగానే బెదిరిపోయిన కాంగ్రెస్ తన అసలు రూపాన్ని ప్రదర్శిస్తూ అణచివేత చర్యలను ప్రారంభించింది. నక్సలైట్లు ఆయుధాలు కలిగి ఉండడాన్ని ఆమోదించబోమనే మొండి షరతుతో చర్చల ప్రక్రియను పక్కదారి పట్టించడానికి వీలైనన్ని ప్రయత్నాలు చేసింది. ఇక ఇప్పుడు అరెస్టులు, ఎదురుకాల్పులు వగైరా నిర్బంధ చర్యలు మళ్లీ ప్రారంభమయ్యాయి. ఇక ఆంధ్రప్రదేశ్‌లో తమ ప్రభుత్వం నక్సలైట్లతో చర్చలు జరపడం సమంజసమైందేనని అంటూనే వామపక్ష తీవ్రవాదమే దేశ భద్రతకు పెనుముప్పు అంటూ అణచివేత చర్యలను తీవ్రం చేస్తున్నది. విప్లవోద్యమ బలంగా ఉన్న రాష్ట్రాల్లో ఏ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ అడిగిందే తడవుగా అన్ని విధాలా సహాయాన్ని అందిస్తూ విప్లవోద్యమాన్ని సమూలంగా నిర్మూలించే పథకానికి మెరుగులు దిద్దుతోంది. మునుపటి పీపుల్స్‌వార్, ఎంసీసీఐ పార్టీలు విలీనమై సీపీఐ (మావోయిస్టు) ఏర్పాటు జరగడంతో యూపీఏ ప్రభుత్వం మరింత బాహాటంగానే అణచివేత చర్యలను చేపడుతోంది. ఢిల్లీ, పాట్నా నగరాల్లో పలు ప్రజాస్వామిక సంఘాలూ, వ్యక్తులూ కలిసి నూతన సమైక్య విప్లవ పార్టీ ఏర్పాటు సందర్భంగా సభలు నిర్వహించాలని ప్రయత్నించగా యూపీఏ ప్రభుత్వం తన

*( తరువాయి...... 44వ పేజీలో..... )*



# ఉత్తరప్రదేశ్‌లో పీఎల్‌జీఏ ఆంబుష్ 17 మంది పీఏసీ జవాన్లు హతం

సెప్టెంబర్ 21, 2004 నాడు భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) దేశంలో సమైక్య విప్లవకర పార్టీగా అవతరించిన వార్త విని పాలకవర్గాలు ఎంతగా హడలిపోయారో అందరికీ తెల్సిన విషయమే. ఇప్పుడు భారతదేశంలోనే అతి పెద్ద రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్‌లో మన పార్టీ నాయకత్వంలో ప్రజాయుద్ధం పురోగమిస్తుండడం వాళ్లను ఇంకా వణికిస్తున్నది. ముఖ్యంగా గత నవంబర్ 20న పీఎల్‌జీఏ ఎర్రయోధులు పోలీసుల బలగాలను పెద్ద ఎత్తున మట్టుబెట్టిన ఘటన దేశవ్యాప్తంగా పీడిత ప్రజలకు ఉత్సాహాన్ని కలిగించగా, దోపిడీ పాలకులనూ, వాళ్ల కిరాయిబంట్లయిన పోలీసు బలగాలనూ హడలెత్తించింది. బాగా వెనుకబడ్డ తూర్పు ఉత్తరప్రదేశ్‌లోని మిర్జాపూర్, సోన్‌భద్ర్, చందౌలీ జిల్లాలలో గత కొన్నేళ్లుగా విప్లవోద్యమం కొనసాగుతున్నది. ఈ ప్రాంతం పాలకుల తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతూ వస్తున్నది. ఆకలి, దారిద్ర్యం, నిరుద్యోగం, కరువు విలయతాండవం చేస్తుంటాయిక్కడ. ముఖ్యంగా అడవిపై హక్కును కోల్పోయి, భూములు కోల్పోయి, నిలువ నీడ లేకుండా పోయిన ఆదివాసుల పరిస్థితి మరీ ఘోరంగా ఉంది. దళిత నేతనని చెప్పుకునే మాయావతి, వెనుకబడ్డ కులాల హీరోగా పేరుగాంచిన ములాయం సింగ్ వంటి ముఖ్యమంత్రులెందరు మారినా ఇక్కడి దళిత, ఆదివాసీ, ఇతర పేద వర్గాల, కులాల ప్రజల జీవన పరిస్థితులు మాత్రం రోజురోజుకూ దిగజారుతూనే ఉన్నాయి. క్రూరమైన భూస్వామ్య దోపిడీ ఒకవైపు, ప్రభుత్వాధికార్ల దోపిడీదౌర్జన్యాలు మరోవైపు ప్రజలకు పెనుభారంగా తయారయ్యాయి. ఇంకోవైపు ప్రభుత్వాలు అనుసరిస్తున్న సామ్రాజ్యవాద అనుకూల దోపిడీ విధానాలు ప్రజలను బతుకుల్ని మరింతగా దిగజారుస్తున్నాయి.

ఇలా ఈ వైరుధ్యాలన్నీ తీవ్రమైన నేపథ్యంలో ఇక్కడ విప్లవోద్యమం వేళ్లూనుకుంది. మునుపటి ఎంసీసీఐ నాయకత్వంలో ఈ ప్రాంతంలో 1990 దశకం చివర్లో విప్లవోద్యమానికి బీజాలు పడ్డాయి. అయితే పెంపొందుతున్న విప్లవోద్యమాన్ని మొగ్గలోనే తుంచివేయడానికి శత్రు వర్గాలు తీవ్ర నిర్బంధకాండను ప్రయోగిస్తున్నాయి. మతతత్వవాదులుగా, క్రూరులుగా పేరుమోసిన పీఏసీ (ప్రావిన్షియల్ ఆర్మ్‌డ్ కాన్‌స్టేబులరీ) బలగాలు అనేక అణచివేత క్యాంపెయిన్లను కొనసాగించి చాలా మంది కార్యకర్తలను హతమార్చారు. వాటిలో మార్చ్ 2001లో మిర్జాపూర్ జిల్లాలో జరిగిన ఒక ఘటనను ప్రత్యేకంగా పేర్కొనాలి. విప్లవకారులకు ఆశ్రయం ఇస్తున్నారన్న కారణంతో ఒక ఊళ్లో పీఏసీ దాడి చేసి ఒకేసారి 16 మంది గ్రామస్తులను కాల్చిచంపింది. వీళ్లంతా పేద ఆదివాసీ, దళిత ప్రజలే. దీన్ని ఎన్‌కౌంటర్‌గా చిత్రీకరించి ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేసింది. నవంబర్ 20న చందౌలీ జిల్లాలోని నౌగఢ్ వద్ద 17 మంది పీఏసీ జవాన్లను మట్టుబెట్టిన పీఎల్‌జీఏ ఆ అమరులందరి త్యాగానికి సరైన ప్రతీకారం తీర్చుకుంది. విప్లవోద్యమ అణచివేతలో భాగంగా గాలింపు చర్యల కోసం బైలుదేరిన పీఏసీ జవాన్ల ట్రక్కును పీఎల్‌జీఏ గెరిల్లాలు మందుపాతరతో పేల్చివేశారు. ఇందులో 17 మంది జవాన్లు చావగా మరి కొందరు గాయపడ్డారు. శత్రు బలగాల నుండి మూడు ఏకే-47 రైఫిళ్లనూ, ఎనిమిది ఎస్సెల్లార్లనూ, మరి కొన్ని ఇతర ఆయుధాలనూ, తూటాలనూ పీఎల్‌జీఏ గెరిల్లాలు స్వాధీనం చేసుకున్నారు. ఉత్తరప్రదేశ్‌లో తొలిసారిగా ఇంత పెద్ద ఎత్తున శత్రు బలగాలను మట్టుబెట్టి పీడిత ప్రజలలో ఆత్మవిశ్వాసాన్ని నింపిన పీఎల్‌జీఏ యోధులు అభినందనీయులు. ▲

## 2005 జనవరి 26న 'దండకారణ్యా బంద్' ప్రకటన

దండకారణ్యా ఉద్యమంపైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బహుముఖ దాడిని తీవ్రతరం చేస్తూ, ఎల్‌పిసి పాలసీలో భాగంగా బూటకపు సంస్కరణలనూ, క్రూరమైన దమనకాండనూ అమలు జరుపుతున్నాయి. మరోవైపు జేటీసీ నాయకత్వంలో సిఆర్‌పిఎఫ్ బలగాలను దించి ఆదివాసీ ప్రజానీకంపై అణచివేత చర్యలను ముమ్మరం చేస్తూ ఉన్నాయి. ఈ అన్ని రకాల ప్రభుత్వ కిరాయి మూకలు గ్రామాలపై మూకుమ్మడి దాడులు చేస్తూ అమాయక ప్రజానీకాన్ని అరెస్టు చేయడం, తీవ్రంగా చిత్రహింసలు పెట్టడం, విచ్చలవిడిగా కాల్పులు జరపడం, బూటకపు ఎన్‌కౌంటర్ హత్యలకు పాల్పడడం, మహిళలపై అత్యాచారాలు చేయడం, ప్రజల ఆస్తులను కొల్లగొట్టడం వంటి రకరకాల పాశవిక రూపాల్లో చుట్టివేత, అణచివేత చర్యలను అమలు జరుపుతున్నారు. పోటా స్థానంలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రభుత్వం ఛత్తీస్‌గఢ్ విశేష్ సురక్షా విధేయక్ పేరుతో మరో నల్ల చట్టాన్ని ముందుకు తెస్తోంది. పెరుగుతున్న శత్రు దాడికీ, రాజ్యహింసకూ వ్యతిరేకంగా **2005 జనవరి 26న 'దండకారణ్యా బంద్'**కు పిలుపునిస్తున్నాం. పెద్ద ఎత్తున కదిలి ఈ బంద్‌ను విజయవంతం చేయాలని అన్ని వర్గాల ప్రజలకూ విజ్ఞప్తి చేస్తున్నాం. ఈ సందర్భంగా ఈ కింది డిమాండ్లు చేయాలని ప్రజలనూ, ప్రజాస్వామికవాదులనూ కోరుతున్నాం.

1. *ఛత్తీస్‌గఢ్ విశేష్ సురక్షా విధేయక్ ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలి.*
2. *బస్తర్, సర్గుజా ప్రాంతాల నుండి పారా మిలటరీ బలగాలను వెనక్కి పంపాలి. కేంద్రం నుండి పారా మిలటరీ బలగాలను రప్పించకూడదు.*
3. *ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర ప్రభుత్వాలు జెబిసి నుండి వైదొలగాలి.*
4. *నక్సలైట్ల పేరుతో అమాయక రైతాంగంపై మోపిన అక్రమ కేసులన్నింటిని ఉపసంహరించాలి.*
5. *జీరంతరాయి, పల్లి, కొత్త చెరువు గ్రామాల్లో నక్సలైట్ల పేరుతో అమాయక ఆదివాసీ రైతుల్ని హత్యచేసిన పోలీసులను శిక్షించాలి.*
6. *గడ్‌చిరోలిలో సంఘ కార్యకర్తలకు విధించిన యావజ్జీవ శిక్షలను రద్దుచేయాలి.*

దండకారణ్యా స్పెషల్ జోనల్ కమిటీ,
భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)

*అక్టోబర్ 2004*

శ్రద్ధాంజలి

# పోరుబాటలో నేలకొరిగిన కామ్రేడ్ కల్పన (బుర్కా పొజ్జె)కు జోహార్లు !

పశ్చిమ బస్తర్ డివిజన్‌లో మద్దేడ్ ఏరియాలో బండారుపల్లి గ్రామంలో ఆదివాసీ దొర్ల తెగ బుర్కా కుటుంబంలో ఇరవై సంవత్సరాల క్రితం కా. కల్పన జన్మించింది. కుటుంబంలో పెద్ద బిడ్డ కా. కల్పన. తల్లిదండ్రులు ఆమెకు పెట్టిన పేరు పొజ్జె. చిన్ననాటి నుంచీ చురుకుగా, సన్నగా ఉండే తమ కూతురిని చూసి తల్లిదండ్రులు ఎంతో మురిసిపోయేవారు. తమ కూతురి భవిష్యత్తు గురించి ఎన్నో కలలు కనేవారు.

పోరుదారిలో శత్రువుతో పోరాడి అమరులైన కా. లక్ష్మయ్య, కా. రామ్మూర్తి, కా. బాబు వంటి ఎర్రమల్లెల్ని కన్న పల్లె బండారుపల్లి. అలాంటి అమరయోధుల త్యాగాలను ఆదర్శాలను బాల్య దశలోనే ఆటలు ఆడుతూ, పశువులు కాస్తూ పాటల రూపంగా పాడేది. వారి ఆదర్శాలను పుణికి పుచ్చుకుని పోరాట దారిలో నడవటానికి ఉవ్విళ్లూరుతలూగేది. ఎప్పుడు పెద్దదాన్నవుతానా, దళంలో భర్తీ అవుతానా అని కలలు కనేది. తోటి పిల్లల్ని ఉత్సాహపరిచేది.



కా. పొజ్జె వయసు పెరగడంతోనే కేఏఎంఎస్ సంఘ సభ్యురాలయ్యింది. కట్టుబాట్లకు వ్యతిరేకంగా మహిళా సంఘం పోరాడడంలో వారిని సంఘటితపరచడంలో చురుగ్గా పని చేసేది. పార్టీ పిలుపునందుకుని ఎన్నో ఆర్థిక, రాజకీయ పోరాటాల్లో, ప్రదర్శనల్లో, ర్యాలీల్లో పాల్గొనేది. తన తోటి మహిళలను పోరాటాల్లో పాల్గొనడానికి ప్రేరేపించేది. గ్రామం పై ఒకసారి పోలీసులు దాడి చేసి డీఏకేఎంఎస్ సంఘ సభ్యుల్ని అరెస్టు చేసి తీసుకువెళుతున్నప్పుడు గ్రామ మహిళలంతా సంఘటితంగా రోకళ్లు, గొడ్డళ్లు, కొడవళ్లతో ఎదిరించి పోలీసులను ఉరికించి సంఘం వాళ్లను విడిపించుకున్న ఘటనను మహిళలకు స్ఫూర్తిగా బోధించి ప్రేరేపించేది. చూడడానికి బక్కగా ఉన్నా ఆమెలో ఎల్లప్పుడూ పోరాట స్ఫూర్తి తొణికిసలాడేది. గ్రామంలో మహిళా సంఘంలో చురుగ్గా పని చెయ్యడం పోరాటాల్లో ముందుండడం చూసిన పార్టీ కా. పొజ్జెకు గ్రామంలోనే కేండిడేట్ సభ్యత్వం ఇచ్చి తన చైతన్యాన్ని విప్లవ రాజకీయాలతో తీర్చిదిద్దేందుకు కృషి చేసింది. ఆ కృషిని అందుకుని పోరాట యోధురాలిగా ఎదగడానికి ప్రయత్నించింది. దళం గ్రామానికి వచ్చినప్పుడల్లా, నన్నెప్పుడు దళంలోకి భర్తీ చేసుకుంటారని అడిగేది. పీజీఏ యోధురాలిగా పూర్తి కాలం పని చెయ్యడానికి తహతహలాడేది.

కా. కల్పన 2001జనవరిలో పీజీఏలో భర్తీ అయ్యి మద్దేడ్ ఎల్‌జీఎస్‌లో సభ్యురాలిగా పోరాట పథంలో కదం తొక్కింది. దళంలో ప్రతీ పనిలో పాలు పంచుకునేది, బలహీనంగా ఉన్నప్పటికీ బరువులు మోయడంలో వాటిని సర్దడంలో ముందుండేది.

దళం సమిష్టి పనులకు అధిక ప్రాధాన్యత ఇచ్చేది. దళ సమిష్టి జీవితానికి క్రమశిక్షణకు కట్టుబడి ఉండేది. గెరిల్లా జీవితంలో వచ్చే కష్టాలను ఇబ్బందులనూ చిరునవ్వుతో స్వీకరించి, పోరాటంలో కష్టాలను ఎదిరించడానికి అమరుల త్యాగాలను ఆదర్శంగా స్మరించుకుంటూ పోరాటంలో ముందుకే వెళ్లడానికి ఉత్తేజంగా ఉండేది. ఇతరులకు కష్టాలను అధిగమించడానికి తోడ్పడేది. సహకరించేది. తన రాజకీయ అవగాహనను పెంచుకోవడానికి, దళంలో భర్తీ అయిన వెంటనే చదువు నేర్చుకునేందుకు ఎంతగానో కృషి చేసేది. చదువు నేర్చుకుని చిన్న చిన్న పుస్తకాలు, మన పత్రికలు చదువుతూ తెలువని ఎన్నో విషయాలు తెలుసుకుని, పోరాట వార్తలు చదివి స్ఫూర్తి పొంది చైతన్యాన్ని గట్టిపరచుకొనేది. దళంలో రోజువారీ పీటీ డ్రిల్ చేయడంలో ఎప్పుడూ వెనకడుగు వేసేది కాదు. ఓ మహిళా మిలటరీ శిక్షణా కాంపులో జరిగిన పోటీలో తన శక్తినీ ప్రతిభనూ చాటి ప్రథమంగా గెలిచింది. శత్రు నిర్బంధాన్ని చూసి భయపడేది కాదు. కొందరు శత్రువు నిర్బంధానికి వెన్ను చూపడాన్ని నిరసించేది. ప్రజల కొరకు పోరాటంలో నేలకొరగడం అత్యుత్తమమని యువతకు బోధించేది. గెరిల్లా పోరాటంలో అనేక ఆంబుష్‌లు, దాడులలో ధైర్యంగా పాల్గొంది. నిర్బంధంలో సైతం ప్రజల్ని సంఘటితం చెయ్యడంలో, శత్రువుతో పోరాటంలో, కొత్త మెళకువల గురించి ఉత్సాహంగా తెలుసుకునేది. 2002 మేలో లోదేడ్‌లో కిరాయి పోలీసులతో జరిగిన ఫైరింగ్‌లో ధైర్యంగా పాల్గొంది. 2003 డిసెంబరులో జరిగిన చత్తీస్‌గఢ్ విధానసభ ఎన్నికల సమయంలో మోదుగుపల్లి వద్ద ఆరుగురు పోలీసుల్ని చంపి ఆయుధాలు స్వాధీనం చేసుకున్న ఆంబుష్ పార్టీలో సభ్యురాలిగా గెరిల్లా యుద్ధంలో పాల్గొని తన పోరాట పటిమను చాటింది.

ఎల్లవేళలా పోరాటం, ప్రజలు, గెరిల్లా యుద్ధం దండకారణ్యాన్ని విముక్తం చెయ్యడానికి పార్టీ చేపట్టిన తక్షణ కర్తవ్యాలు పరిపూర్తి చెయ్యడానికి విప్లవ స్ఫూర్తితో తన వంతు కృషి చేస్తూ పోరుబాటలో పయనిస్తున్న ఈ ఆదర్శ మహిళ అమరురాలయ్యే నాటికి కోవెల ఎల్‌జీఎస్‌లో పార్టీ సభ్యురాలిగా పని చేస్తోంది. అమరవీరుల వారం విజయవంతం చెయ్యడానికి దళం ఒక గ్రామం నుండీ మరో గ్రామానికి తీవ్రమైన వర్షాల నడుమ చింతవాగు దాటుతున్న సమయంలో కొట్టుకుపోయింది. ఆగస్టు పన్నెండో తేదీ ఉదయం పొంగి పారుతున్న నదిలో ఈత కొడుతూ ఇవతలి ఒడ్డుకు రాబోయి తట్టుకోలేక నదీ ప్రవాహంలో పడిపోయి అమరురాలయ్యింది. పోరాట తరంగాలను చూసి తన్మయత్వం పొందిన పోరాట యోధురాలు నదీ తరంగాలలోతరంగమై రాబోయే తరాలకు పోరాట ప్రేరణగా కేతనంగా నిలిచింది.

ఇలా పోరాటంలో ప్రమాదవశాత్తు అమరురాలైన కా. కల్పన జీవితం భావితరాలకు యోధులకు ఎంతో ప్రేరణదాయకం. అమరవీరుల త్యాగాలను నిజం చెయ్యడానికి గెరిల్లా యుద్ధాన్ని తీవ్రతరం చేద్దాం !

★ *శత్రు బహుముఖ దాడిని ఓడిద్దాం ! దండకారణ్యాన్ని విముక్తి చేసే పోరులో ప్రాణాలొడ్డి పోరాడుదాం !*

★ *భారత నూతన ప్రజాస్వామిక విప్లవ పథంలో ముందుకే సాగుదాం !*

★ *కా. కల్పన (పొజ్జె) అమర్ రహే !*

# కామ్రేడ్ నామ్‌దేవ్ పొర్తేటి (పూసు) అమర్ రహే !

గడ్చిరోలి జిల్లా, అహిరి తాలూకాలో భవిష్యత్తు పోరాట చరిత్రలో భాగంగా నిలవనున్న లక్కమేడల గుట్టల వరుసలు. ఆ గుట్టల పాదన నిల్చి అలసిన పోరాటకారులు సేద దీర్చుకోవడానికి చల్లని నీడనిచ్చే గ్రామాల్లో ఒక గ్రామం గొల్లకర్జ. ఎనభయ్యవ దశకంలో మొదలైన విప్లవోద్యమ ఒడిలో కన్నుదెరిచిన బిడ్డ నామ్‌దేవ్. ఆ బిడ్డ తల్లి జోలపాటలు వినలేదు, పోరు పాటలే విన్నాడు. నిర్బంధం బూచి ఆ బాల్యాన్ని కేరింతలు కొట్టనివ్వలేదు. ఉగ్గుపాలతో జీర్ణమైన విప్లవ ఆకాంక్షకు ఆ బిడ్డ యవ్వనం ఊపునిచ్చింది. ఆ ఆకాంక్షను సఫలం చేసుకునే సంకల్పంతో ఆ యువకుడు ఏప్రిల్ 7, 2004 నుండి ప్రత్యక్ష విప్లవ కార్యాచరణకు పూనుకున్నాడు. దోపిడీ రాజ్యమన్నా, దానికి కావలి కాసే పోలీసు కుక్కలన్నా అసహ్యం ఆయనకు.

లోక్‌సభ ఎన్నికల సందర్భంగా జరిగిన ప్రతిఘటనా క్యాంపెయిన్‌లో చురుగ్గా పాల్గొన్నాడు. తన సహచరుల, నాయకత్వ కమిటీల విశ్వాసాన్ని చూరగొన్నాడు. తనకు తెలియని ప్రాంతమైనా, తనకు తెలియని పని అయినా వెనుకాముందాడకుండా ఏ బాధ్యతనైనా ఉత్సాహంగా స్వీకరించేవాడు. జూలై నెలలో మసాడ్ గ్రామం వద్ద పోలీసుల వలలో చిక్కుకున్న టీంకు కవర్ ఫైరింగ్ ఇస్తూ సురక్షితంగా రిట్రీట్ చేయించి తన మిలిటరీ సామర్థ్యాన్ని ప్రదర్శించాడు. తనను మిలిటరీ రంగానికి బదిలీ చేయమని పై కమిటీ ముందు ప్రతిపాదన పెట్టాడు. తన విప్లవాచరణతో తన చిన్ననాటి నేస్తాలనూ, తన సహచరినీ, బంధుమిత్రులనూ ప్రభావితం చేశాడు.

అక్టోబర్ 25 నాడు జరిగిన ఎన్‌కౌంటర్‌లో శత్రువును ప్రతిఘటిస్తూ అమరుడైనాడు. గడ్చిరోలి విప్లవోద్యమం చురుగ్గా ఎదిగివస్తున్న ఒక పోరాటయోధుడిని కోల్పోయింది. ఆ అమరుడికి జోహార్లు అర్పిద్దాం.

# మానెవార అమరులకు జోహార్లు !

విధానసభ ఎన్నికల సందర్భంగా ప్రతిఘటనలో పాల్గొని ఏటపల్లి ఏరియాలో శత్రువుని ముప్పుతిప్పలు పెట్టిన పీఎల్‌జీఏ సైనికులు రాబోయే శత్రు దాడిని ఎదుర్కొనేందుకు సన్నాహాలు చేసుకుంటున్న సమయంలో ఇన్ఫార్మరు నెట్‌వర్క్ నుండీ సమాచారం అందుకున్న శత్రువు గెరిల్లాల డేరాను చుట్టుముట్టాడు. 2004 నవంబరు ఒకటో తేదీన మానెవార గ్రామం వద్ద సుమారు గంట సేపు శత్రువుతో జరిగిన ముఖాముఖి పోరులో వీరోచితంగా ప్రతిఘటిస్తూ అమరులయిన యోధులు కామ్రేడ్స్ భూమన్న (వసంత్ పొర్తేటి) , సరిత (లిమ్మి తిమ్మా)లకు తలవంచి జోహార్లు అర్పిస్తున్నాం

## ప్లటూన్ సెక్షన్ కమాండర్ కామ్రేడ్ భూమన్న (వసంత్ చంద్ర పొర్తేటి)

నవంబర్ ఒకటో తారీఖు నాడు గడ్చిరోలి జిల్లా మానెవార గ్రామం వద్ద శత్రువుతో జరిగిన హోరాహోరీ పోరులో కామ్రేడ్ భూమన్న వీరోచితంగా పోరాడుతూ నేలకొరిగాడు. గడ్చిరోలి విప్లవోద్యమ చరిత్రలో అహిరి ప్రాంతానికి, అందులో జిమ్మలగట్ట రేంజ్‌కు ప్రత్యేక స్థానం ఉంది. కోలమర్క, లక్కమేడల గుట్టల నడుమ ఉండే గ్రామం లింగంపల్లి. ఆ గ్రామానికీ విప్లవోద్యమానికీ విడదీయలేని అనుబంధం.



కామ్రేడ్ భూమన్న సుమారు 25 సంవత్సరాల క్రితం లింగంపల్లి గ్రామంలో పుట్టాడు. తల్లిదండ్రులు ఆయనకు పెట్టుకున్న పేరు వసంత్. ఆటపాటల వయస్సు నుండే పోరు పాటలతో పరిచయమయ్యాడు. పేద రాజగోండు కుటుంబంలో పుట్టిన వసంత్‌కి బూర్జువా స్కూలుకు పోయే అవకాశమే లేదు. ఆయన చిన్నతనం నుండే పోరు పుస్తకంలో ఓనమాలు దిద్దటం మొదలుపెట్టాడు. బాలల సంఘంలో చేరి ఆ సంఘానికి అధ్యక్షుడయ్యాడు. ఉత్సాహానికి మారుపేరుగా ఉండే వసంత్ తన బాలసైన్యాన్ని వెంటేసుకొని దళానికి అన్నం, నీళ్లూ అందించేవాడు. విప్లవం గురించి కలలు కంటూ ఆయన యవ్వనంలో అడుగుబెట్టాడు. తుపాకీ పట్టి కొట్లాడాలనే కోరికతో గ్రామరక్షక దళం సభ్యుడయ్యాడు. గురి చూసి కొట్టడంతో పాటు లడాయి మెళకువలెన్నో నేర్చుకుని గ్రామరక్షక దళం కమాండరుగా పోలీసులను చికాకు పెట్టే చర్యలకు నాయకత్వం వహించేవాడు. దండకారణ్య ఆదివాసీ కిసాన్ మజ్దూర్ సంఘం సభ్యుడి నుండి రేంజ్ కమిటీ సభ్యుని స్థాయికి ఎదిగాడు. ఆటా, మాటా, పాటా అన్నిటిపై నిర్బంధం నిప్పులు కక్కుతున్న కాలంలో రహస్యంగా తిరుగుతూ సంఘాలను సజీవంగా నిలబెట్టాడు. ఇలా పని చేస్తున్న క్రమంలో ఆయన అరెస్టయ్యాడు. లాఠీ దెబ్బలతో ఒళ్లంతా పచ్చి పుండుగా మారినా ధైర్యాన్ని కోల్పోలేదు. పోలీసు దెబ్బలతో జీవితకాలం బాధించే కాళ్లనొప్పులు, నడుంనొప్పితో జైలు నుండి బైటికొచ్చాడు. విప్లవం పట్ల ఆయనకున్న విశ్వాసాన్నీ, విప్లవాచరణలో ఆయన పట్టుదలనూ చూసి ఆయనకు పార్టీ సభ్యత్వం ఇవ్వాలని స్థానిక కమిటీ తీర్మానం చేసింది. పార్ట్‌టైమర్‌గా తప్పించుకుని తిరుగుతూ శత్రు కేంద్రీకరణ పెరిగి అక్కడ పని చేయ వీలు కాని పరిస్థితుల్లో 2001లో ఆయన దళంలో భర్తీ అయి ప్రజల్లో భూమన్నగా మారాడు. గెరిల్లా క్రమశిక్షణను నేర్చుకుంటూ, శారీరక ఇబ్బందుల్ని అధిగమించుతూ రాజకీయాలు నేర్చుకోవడంపై శ్రద్ధ పెట్టాడు. 1992 జనవరిలో డివిజన్ స్థాయి మిలిటరీ క్యాంపులో పాల్గొన్నాడు. నిర్బంధం వల్ల కుదించుకుపోయిన ఉద్యమ ప్రాంతాన్ని తిరిగి విస్తరించుకునే కృషిలో భాగంగా సిరొంచ దళం వెయ్యాలని డివిజనల్ కమిటీ తీర్మానించింది. ఆ దళానికి సభ్యుల ఎంపికలో అందరికన్నా ముందు ప్రతిపాదనగా కామ్రేడ్ భూమన్న పేరే

వచ్చింది. తన మాతృభాష గోండి అయినా తెలుగు మాట్లాడడమన్నా, తెలుగు పాటలన్నా ఆయనకు ఎంతో ఇష్టం. అహిరి, సిరొంచ ఏరియా ప్రజల అభిమానాన్ని చూరగొన్నాడు. దళంలో అందరితో కలిసిమెలిసి ఉంటూ, తన హాస్యంతో అందరినీ నవ్విస్తూ కలుపుగోలుగా ఉండేవాడు. ఎప్పుడూ చిరునవ్వుతో సాదాసీదాగా కనిపించే భూమన్న వర్గ శత్రువంటే మండిపడేవాడు. వర్గ కసి ఆయన నరనరానా జీర్ణించుకున్నది. వర్గ శత్రువులను శిక్షించే సమయంలో ఆయన సెంట్రీ డ్యూటీలో ఉన్నా కూడా ఆవేశం ఆగక ఉరికొచ్చేవాడు. తర్వాత అలా సెంట్రీ వదిలి రావడం తప్పని ఆత్మవిమర్శ చేసుకునేవాడు.

కోరెపల్లి, మరిపల్లి, కిష్టాపూర్, జినగనూర్ గ్రామాల వద్ద శత్రువుతో జరిగిన ఎదురుకాల్పుల సందర్భంగా ఎంతో ధైర్యంగా ప్రతిఘటించాడు. ఫైరింగులలో ఎలాంటి గాభరాకు లోను కాకుండా ఆయన చూపే నిబ్బరం గెరిల్లాలందరికీ ఆదర్శంగా ఉంటుంది. మిలిటరీ రంగంలో ఆయనకున్న అభిరుచినీ, సామర్థ్యాన్నీ గుర్తించిన పార్టీ కమిటీ ఆయనను ప్లటూన్‌కు మార్చింది. ఆ తీర్మానం విన్న భూమన్న ఎంతో సంబరపడుతూ జూలై 2004లో ప్లటూన్‌లో చేరాడు. మహారాష్ట్ర 11వ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తీసుకున్న ప్రతిఘటనా కార్యక్రమంలో చురుగ్గా పాల్గొన్నాడు.

సెప్టెంబర్ 25 నాడు మానెవార వద్ద నదిని దాటుతున్న కసంసూర్ పోలీసులపై అపార్చునిటీ అంబుష్ చేసి సుమారు గంటన్నర సేపు పోలీసులను ముప్పుతిప్పలు పెట్టిన ఘటనలో కామ్రేడ్ భూమన్న పాల్గొన్నాడు. కోయందూడ్ పోలింగ్ బూత్‌పై దాడి చేసి రక్షణగా వచ్చిన పోలీసులపై క్లైమోర్ పేల్చి ఫైరింగ్ జరిపిన ఘటనలో కూడా కామ్రేడ్ భూమన్న పాల్గొన్నాడు. ఈ దాడిలో ఒక పోలీసు చనిపోగా, మరొకడు గాయపడ్డాడు. అక్టోబర్ 14 నాడు పోలింగ్ పెట్టెలను తరలించుకుపోతున్న పోలీసులపై మంగడండి రోడ్డుపై చేసిన అపార్చునిటీ అంబుష్‌లో ఒక సీఆర్‌పీఎఫ్ జవాను చనిపోగా మరొకడు గాయపడ్డాడు. ఈ మూడు ఘటనల్లో కూడా కామ్రేడ్ భూమన్న ప్లటూన్ సెక్షన్ కమాండర్‌గా తన బాధ్యతను చక్కగా నిర్వర్తించాడు.

నవంబర్ ఒకటో తారీఖు నాడు ప్లటూన్, స్థానిక గెరిల్లా దళంతో కలిసి ఉదయం మానెవారకు వచ్చింది. తన ఇన్‌ఫార్మర్ నెట్‌వర్క్ ద్వారా సమాచారాన్ని సేకరించిన శత్రువు పథకం ప్రకారం డేరాను చుట్టుముట్టి అంబుష్‌లు ఏర్పాటు చేసుకున్నాడు. డేరా మీదకు వచ్చిన శత్రువును నిలవరించమని కమాండర్ నుండి ఆదేశం అందుకున్న భూమన్న అక్కడే నిలబడి ఫైరింగ్ చేస్తుండగా ఫ్లాంక్‌లో వచ్చిన పోలీసుల ఫైరింగ్‌లో కాలికి తూటా తగిలి పడిపోయాడు. తనని తీసుకెళ్లడానికి తన సహచరులు ప్రయత్నం చేస్తుండగా శత్రువు రాపిడ్ ఫైరింగ్‌ను గమనించిన భూమన్న తన కోసం మిగతా వారు నష్టపోగూడదని రిట్రీటు కమ్మని ఆదేశం ఇచ్చాడు. తన తుపాకిని సహచరులకిచ్చాడు. తను ప్రాణాల్తో శత్రువుకు దొరకొద్దని నిర్ణయించుకున్నాడు. తన వద్దనున్న గ్రెనేడ్‌తో శత్రువును నష్టపర్చడానికి ప్రయత్నం చేస్తున్న క్రమంలో గ్రెనేడ్ పేలి కామ్రేడ్ భూమన్న అమరత్వం పొందాడు. పీఎల్‌జీఏ ఎదిగి వస్తున్న ఒక యువ కమాండర్‌ను, ఒక సాహస యోధుణ్ని కోల్పోయింది. ప్రజాయుద్ధాన్ని తీవ్రతరం చేస్తూ సమ సమాజం కోసం ఆయన కన్న కలల్ని నిజం చేస్తామని ప్రతిన బూనుతూ ఆ సాహసయోధునికి తలవంచి వినమ్రంగా జోహార్లు అర్పిద్దాం.

# కామ్రేడ్ లిమ్మి తిమ్మా

గడ్‌చిరోలి జిల్లా ఏటపల్లి తహసీల్ కసంసూర్ రేంజి గడ్డేర్ గ్రామంలో తల్లిదండ్రులకు ఆఖరి బిడ్డగా ఇరవై ఎనిమిది సంవత్సరాల క్రితం జన్మించింది కా. లిమ్మి తిమ్మా. కా. సరితగా ప్రజల్లో పేరుగాంచిన లిమ్మి జీవిత చరిత్రను రాయటం అంటే 1984 నుండీ విప్లవోద్యమంతో గడ్డేర్ గ్రామ అనుబంధాన్ని స్మరించుకోవడమే అవుతుంది. 1984లో దళానికి గడ్డేర్ గ్రామం పరిచయం అయింది. 1985లో సరిత తండ్రి సంఘంలో చేరాడు. 1990 అన్న సంగ నాయకుడయ్యాడు. 1991 నిర్బంధంలో కుటుంబం ఎన్నో కష్టాలు పడింది. తండ్రీ, కొడుకులు జైలు పాలయ్యారు. కుటుంబం ఆర్థికంగా చితికిపోయింది. కానీ పార్టీ మీద విశ్వాసం కోల్పోలేదు. సంఘ కార్యకలాపాలను ముందటి లాగే కొనసాగించారు. పార్టీతో ఆ కుటుంబానికి ఉన్న అనుబంధాన్ని మరింత పటిష్టం చేస్తూ కా. సరిత పూర్తి కాలం విప్లవకారిణి అయింది.

1995 నుండి కా. సరిత దళంతో పరిచయం పెంచుకుంది. దళాన్ని కాపాడుకోవాలనే చైతన్యంతో అన్నం, నీళ్లు అందిస్తూ పాటల ద్వారా రాజకీయాలు నేర్చుకోవడం ప్రారంభించింది. తాను నేర్చుకున్న పాటలను రాజకీయాలను తన నేస్తాలకు నేర్పుతూ వారిని సంఘటితం చెయ్యసాగింది. ఆమె కృషి ఫలితంగా 1997లో గ్రామ మహిళా సంఘం ఏర్పడింది. ఆ సంఘానికి కా. సరిత అధ్యక్షురాలయ్యింది. సంఘాన్ని నడిపిస్తూ పార్టీ విశ్వాసాన్ని చూరగొని 2001లో పార్టీ సభ్యురాలయింది. కొటిమి జనతన సర్కారు సభ్యురాలిగా ఎన్నికయింది. పార్ట్ టైం పార్టీ సభ్యురాలిగా ఉంటూనే ఇంటి పనులకన్నా పార్టీ పనులకే ఎక్కువ కాలం వెచ్చించేది.

2004 ఫిబ్రవరి నుండీ కుటుంబం మీద మరో విడత నిర్బంధం మొదలయింది. అన్నా చెల్లెళ్లు తప్పించుకుని తిరగసాగారు. కసంసూర్ పోలీసులు సరితను పట్టుకోవడం కోసం ఇంటి మీద దాడి చేస్తే ఆ దాడి నుంచీ తప్పించుకుని ఆగస్టు ఆరో తేదీన పూర్తికాలం విప్లవకారిణిగా దళంలో భర్తీ అయింది. ఇంటి వద్ద మిలిటరీ అనుభవం లేని సరిత శత్రువుతో ముఖాముఖి పోరులో మిలిటరీ విషయాలను నేర్చుకునే ప్రయత్నం చేసింది. మహారాష్ట్ర విధానసభ ఎన్నికల సందర్భంగా ప్రతిఘటన కాంపెయిన్‌లో చురుకుగా పాల్గొన్నది.

నవంబరు ఒకటో తేదీన మానెవార వద్ద దళ మకాం మీద శత్రువు చేసిన దాడిలో ప్రతిఘటిస్తూ రిట్రీటవుతున్న క్రమంలో పొట్టలో తూటా తగిలింది. గాయమయినప్పటికీ తన కిట్టునీ, తుపాకినీ వదలలేదు. తాను ధైర్యంగా ఉంటూ తోటి కామ్రేడ్స్‌కు తన గురించి బాధపడవద్దని ధైర్యం చెప్పింది. తాను నమ్మిన ఆశయం కోసం చిరునవ్వుతో ప్రాణాలను అర్పించిన కా. సరిత త్యాగం మనందరికీ ఆదర్శం.

*( ...... 23వ పేజీ తరువాయి )*

చేశారు. ఇది భారత విప్లవానికి ఒక భారీ నష్టం. ఆయన అమరత్వం తర్వాత సీపీఐ (ఎం-ఎల్) కేంద్ర కమిటీ విచ్ఛిన్నమైంది. అయితే సీపీఐ (ఎం-ఎల్) స్రవంతికి చెందిన పీపుల్స్‌వార్, పార్టీ యూనిటీ వంటి పార్టీలకు చెందిన నిజమైన విప్లవకారులు కామ్రేడ్ చారు మజుందార్ విప్లవకర వారసత్వాన్ని కొనసాగించారు. ఆగస్టు 1998లో ఈ రెండు పార్టీలూ ఒకే పార్టీగా విలీనమయ్యాయి. కామ్రేడ్ సీఎం వెలిగించిన మార్గంతో ప్రేరణ పొందిన భారత విప్లవ ప్రజానీకం జనతా ప్రజాస్వామ్య విప్లవ పతాకాన్ని సమున్నతంగా ఎత్తిపడుతూ, ఆయన చూపిన బాటలో ముందడుగు వేస్తారు. భారతదేశమంతా ఈ నినాదం ప్రతిధ్వనిస్తూ ఉంటుంది – **"ఏక్ హీ రాస్తా నక్సల్బరీ."**

# విప్లవ స్ఫూర్తితో ముగిసిన అమరవీరుల వారం

*డౌలా ఏరియాలో...*

జూలై 28 నుండి ఆగస్టు 3 వరకు అమరవీరుల వారాన్ని పాటించాలన్న పార్టీ పిలుపునందుకున్న మాడ్ డివిజన్ డౌలా ఏరియా ప్రజలు 15 రోజుల ముందు నుండే ఏర్పాట్లు ప్రారంభించారు. సమిష్టిగా శ్రమించి 11 చోట్ల అమరుల స్తూపాలు నిర్మించారు. ప్రజల విముక్తి కోసం తమ జీవితాలనర్పించి ప్రాణత్యాగం చేసిన అమరులందరినీ స్మరించుకుంటూ ఆ వారం రోజుల్లో అనేక చోట్ల జరిగిన సభల్లో ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. అట్లాగే గ్రామాల్లో గోడలపై నినాదాలు రాశారు. పోస్టర్లు అంటించారు. కరపత్రాలు పంచారు. జూలై 28 నాడు ప్రతి గ్రామంలోనూ ప్రజలు ఎర్రజెండాలూ, బ్యానర్లూ పట్టుకొని నినాదాలు చేస్తూ ఊరేగింపులు నిర్వహించారు. మొత్తం ఏరియాలో 50 చోట్ల సభలు జరుగగా ఇందులో ఎక్కువ గ్రామాల ప్రజలను సమీకరించి జరిపిన సభలు 10 వరకూ ఉంటాయి. డీఏకేఎంఎస్, కేఏఎంఎస్‌ల నాయకత్వ కమిటీలు ఈ సభల్ని నడిపాయి. కొన్ని చోట్ల స్థానిక గెరిల్లా దళాలు కూడా సభల్లో పాల్గొన్నాయి. ప్రజా మిలిషియా దళాలు సభల రక్షణ బాధ్యతను నిర్వహించాయి. ఈ ఏరియా మొత్తంగా 17 వేల మంది ప్రజలు సభలలో పాల్గొని అమరులకు జోహార్లు అర్పించారు.

*రావ్‌ఘాట్ ఏరియాలో...*

ఉత్తర బస్తర్ డివిజన్ హుర్తాయి గ్రామంలో ప్రజలు అమరవీరుల సంస్మరణ సభ జరుపుకున్నారు. రేంజ్ కమిటీ కార్యదర్శి కామ్రేడ్ బాబూరావ్ జెండా ఎగురవేసిన తర్వాత ప్రజలంతా అమరవీరులకు నివాళులర్పించారు. ఆ తర్వాత రావ్‌ఘాట్ దళ సభ్యురాలు కామ్రేడ్ పార్వతి మాట్లాడింది. స్థానిక సీఎన్‌ఎం కామ్రేడ్లు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. ఈ సభలో 1,600 మంది ప్రజలు పాల్గొన్నారు. సురేవాయి రేంజ్ బైసాసూర్ గ్రామంలో అమరవీరుల స్తూపాన్ని నిర్మించారు. ఈ గ్రామంలో ప్రజలు జూలై 30న సంస్మరణ సభ జరుపుకున్నారు. డీఏకేఎంఎస్ అధ్యక్షుడు కామ్రేడ్ రాము జెండా ఎగురవేసి సభను ప్రారంభించారు. ఏరియా సీఎన్మెం సాంస్కృతిక ప్రదర్శనలిచ్చింది. ఈ సభలో 1,500 మంది ప్రజలు పాల్గొన్నారు. ఈ ప్రాంతంలో విప్లవోద్యమం కొత్తగా విస్తరించింది కనుక ప్రజలు ఈ కార్యక్రమాలతో చాలా ప్రభావితులయ్యారు. అంజ్రేలి అనే గ్రామంలో జరిగిన అమరవీరుల సంస్మరణ సభలో 300 మంది ప్రజలు పాల్గొన్నారు. ఈ గ్రామంలో ప్రజలు అమరుడు కామ్రేడ్ రాజు స్మృతిలో స్తూపాన్ని నిర్మించారు. ఈ సభలో డీఏకేఎంఎస్ అధ్యక్షుడు సంతోష్, కేఏఎంఎస్ అధ్యక్షురాలు శనివారీ మాట్లాడారు. వీరిరువురు కామ్రేడ్లూ కామ్రేడ్ రాజు అమరత్వాన్ని కొనియాడుతూ అమరుల ఆశయాల్ని కొనసాగించాల్సిందిగా ప్రజలకు పిలుపునిచ్చారు. పానిడోబ్రి అనే గ్రామంలో జూలై 28 నాడు అమరవీరుల సంస్మరణ సభ జరిగింది. డీఏకేఎంఎస్ రేంజ్ కమిటీ అధ్యక్షుడు కామ్రేడ్ ప్రదీప్ జెండా ఎగురవేసి ఉపన్యసించాడు. ఈ సభలో 1,000 మంది ప్రజలు పాల్గొన్నారు. జీరంతరాయి గ్రామంలో కూడా సభ జరిగింది. ఈ గ్రామంలో ఇద్దరు రైతులను గత సంవత్సరం పోలీసులు దారుణంగా హత్య చేసిన విషయం పాఠకులకు తెల్సిందే. చుట్టుపక్కల గ్రామాల నుండి పెద్ద సంఖ్యలో ప్రజలు ఈ సభకు వచ్చారు. అమరుడైన బుధ్‌రాం సోదరుడు సుధ్‌రాం జెండా ఎగురవేసి చనిపోయిన అమరులు బుధ్‌రాం, సుఖ్‌రాంల జీవితం గురించి మాట్లాడాడు. పోలీసులు వాళ్లిద్దరినీ నిష్కారణంగా చంపడాన్ని ప్రజలంతా ఖండించారు. స్థానిక సీఎన్మెం కళాకారులు పాటలు పాడి ప్రజలను ఉత్సాహపర్చారు. ఈ సభలో మొత్తం 800 మంది పాల్గొన్నారు. భారీ వర్షాల మధ్యనే ఈ కార్యక్రమాలన్నీ జరగడం విశేషం. వాగులూ, నదులూ దాటుకుంటూనే ప్రజలు ఈ సభలలో హాజరై అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని మునుముందుకు తీసుకెళ్లడమే అమరులకు నిజమైన గౌరవమనే స్ఫూర్తితో ఈ కార్యక్రమాలు ముగిసాయి.

*కాక్‌నార్ ఏరియాలో...*

ఉత్తర బస్తర్ డివిజన్ కాక్‌నార్ ఏరియాలో డీఏకేఎంఎస్, కేఏఎంఎస్ ప్రచార దళాలు గ్రామగ్రామం తిరిగి అమరుల వారం గురించి ప్రచారం చేశాయి. మూడు చోట్ల అమరుల సభలు నిర్వహించారు. ఆల్‌దండి గ్రామంలో అమరుడు కామ్రేడ్ రాందాస్ స్మృతిలో స్తూపాన్ని నిర్మించారు. ఈ గ్రామంలో జరిగిన సభకు 20 గ్రామాల నుండి 650 మంది స్త్రీపురుషులు వచ్చారు. సభకు ముందు ప్రజలంతా ప్లేకార్డులూ, బ్యానర్లూ, ఎర్రజెండాలూ పట్టుకొని ఊరేగింపు తీశారు. అమరుల ఆశయాన్ని కొనసాగిస్తామని నినాదాలు చేశారు. ఊరేగింపుకు స్థానిక సీఎన్మెం కళాకారులు ముందు నిలిచి నాయకత్వం వహించారు. ఆ తర్వాత కామ్రేడ్ జమున జెండా ఎగురవేసి సభను ప్రారంభించింది. అమరుల రక్తంతో ఎరుపెక్కినదీ జెండా అని కామ్రేడ్ జమున మాట్లాడింది. ఈ జెండాను నిలబెడుతూ పోరాటాన్ని ముందుకు తీసుకెళ్లడమే అమరులకు మనమిచ్చే నిజమైన శ్రద్ధాంజలి అని అంది. కామ్రేడ్ సజొంతి స్తూపావిష్కరణ చేసింది. పీడిత ప్రజల చేతిలోకి రాజ్యాధికారం రాకుండా ప్రజల మౌలిక సమస్యలేవీ పరిష్కారం కావని ఆమె తన ప్రసంగంలో పేర్కొంది. ఈ లక్ష్యంతోనే అమరులు పోరాడి ప్రాణత్యాగం చేశారని ఆమె చెప్పింది. చివరన సాంస్కృతిక ప్రదర్శనలతో సభ ముగిసింది.

హీంద్‌హూర్ రేంజ్ కిరింగేల్‌మెస్పి గ్రామంలో అమరురాలు కామ్రేడ్ సజొంతి స్మృతిలో స్తూపాన్ని నిర్మించారు. ఈ గ్రామంలో జరిగిన అమరుల సంస్మరణ సభకు ఏడు గ్రామాల నుండి 280 మంది స్త్రీపురుషులు హాజరయ్యారు. కామ్రేడ్ సజొంతి తల్లి జెండా ఎగురవేసి సభను ప్రారంభించింది. స్థానిక సీఎన్మెం దళ నాయకురాలు కామ్రేడ్ జానకి స్తూపావిష్కరణ జరిపింది. సజొంతి తల్లి కన్నీటిని తుడుచుకుంటూ సభనుద్దేశించి మాట్లాడింది. తనకిప్పుడు ఒక బిడ్డే లేదనీ, పోరాటంలో ఉన్నవాళ్లంతా తన బిడ్డలేనని అంది. కామ్రేడ్ జానకి తన ప్రసంగంలో అమరుల త్యాగాన్ని కొనియాడింది. సీఎన్మెం కళాకారుల పాటలతో, నాట్యాలతో అమరుల ఆశయాలను కొనసాగించాలన్న స్ఫూర్తితో సభ ముగిసింది.

హీంద్‌హూర్ రేంజ్ కట్‌నార్ గ్రామంలో ప్రజలు వెదురు కర్రలతో అమరుల స్తూపాన్ని నిర్మించారు. దానిపై ఎర్రని కాగితాలు అంటించి అందంగా అలంకరించారు. అమరులు కామ్రేడ్స్ సుఖ్‌దేవ్, రాజు, రాందాస్‌ల స్మృతిలో ఈ స్తూపాన్ని అప్పటికప్పుడు తయారు చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో నాలుగు గ్రామాల నుండి 350 మంది ప్రజలు పాల్గొన్నారు. కామ్రేడ్ ఫగ్ని జెండా ఎగురవేయగా, స్థానిక సీఎన్మెం కళాకారుడు కామ్రేడ్ ఉమేష్ స్తూపావిష్కరణ చేశాడు. వక్తల ప్రసంగాలతో, పాటలతో, నినాదాలతో సభ విజయవంతంగా ముగిసింది. ▲

# దండకారణ్యంలో పోలీసుల పాశవిక నిర్బంధం

## గడ్చిరోలి డివిజన్

లోకసభ ఎన్నికల సందర్భంగా పోలీసులు అహిరి ఏరియాలో 17 గ్రామాల నుండి 106 మందిని అరెస్టు చేశారు. ప్రజలను బలవంతంగా క్యాంపుల్లో పడుకోబెట్టుకోవడం, బ్యాచీల వారీగా పోలీసు క్యాంపుల వద్దకు హాజరీకి పిలవడం, జైలుకు పంపడం వంటి పలు రూపాల్లో నిర్బంధకాండ కొనసాగించారు. అరెస్టు చేసిన వాళ్లలో 11 మందిని జైలుకు పంపారు. ఎన్నికల తర్వాత జామీను మీద విడుదల చేశారు.

మరిపెల్లి దరోగ కేసులు లేకుండా చేస్తానని మభ్యపెట్టి గతంలో కేసుల పాలై ఉన్న ప్రజల నుండి 2,500 చొప్పున లంచాలు వసూలు చేశాడు. ఎన్నికల ముందు అరెస్టు చేస్తానని బెదిరించి చాలా మంది నుండి 500 రూపాయల చొప్పున లంచాలు గుంజాడు. లంచగొండి, మహిళలతో అసభ్యంగా ప్రవర్తించే పోలీసు అధికారులపై చర్య తీసుకోవాలనీ, మరిపల్లి పోలీసు క్యాంపు ఎత్తివేయాలనీ డిసెంబర్ 2002లో 900 మంది ప్రజలు ధర్నా చేశారు. అయినా వీరి ఆగడాలు ఆగలేదు సరికదా, మితిమీరి పోతున్నాయి. ఈ పరిస్థితులు ప్రజలను తమ పోరాటాన్ని మరింత తీవ్రం చేసేలా వత్తిడి చేస్తున్నాయి.

## రసపల్లి మేడావ్ – సరెండర్ నాటకం

మార్చ్ 2004లో రసపల్లిలో మేడావ్ (మేళా) జరిగింది. జిమ్మలగట్ట దరోగా పాటిల్ తన కార్యశూరత్వాన్ని ప్రదర్శించుకోవడానికి ఇదే మంచి అవకాశం అనుకున్నాడు. ఎదిరెంగ గ్రామానికి చెందిన ముగ్గురు పాత సంఘ నాయకులను సరెండర్ చేయించే ప్రోగ్రాం ఏర్పాటు చేశాడు. వీరిలో మడావి ఎల్ల, ఎంక అనే మాజీ సంఘ నాయకులున్నారు. వీరి చేతికి మూడు భర్మార్లు ఇచ్చి వాటిని ఎస్పీకి అందజేయమని చెప్పాడు. ఇలా చేస్తే వారికి 7 వేల రూపాయలూ, ఇందిరా ఆవాస్ ఇల్లూ, ఒక క్వింటాల్ విత్తనాల వడ్లూ ఇస్తామని పాటిల్ ముందుగానే ఒప్పందం చేసుకొని వారిని ఒప్పించాడు. మేడావ్ రోజు వేదిక ఏర్పాటయింది. ఎస్పీ రాజవర్ధన్, ఏఎస్పీ శిరీష్‌కుమార్ జైన్, ఇతర పెద్దలు వేదిక మీద ఆసీనులైనారు. మైకులో పేర్లు ప్రకటించగానే ముగ్గురు మాజీలూ లేచి వెళ్లి తమ వద్దనున్న భర్మార్లు ఎస్పీ చేతిలో పెట్టారు. ఏమైనా మాట్లాడమని ఎస్పీ వారిని కోరాడు. ఏం మాట్లాడాలి అని మడావి ఎల్ల ప్రశ్నించగా, నీ మనసులోని మాట చెప్పు అని అందరూ ప్రోత్సహించారు. ఆయన మైకు వద్దకు వచ్చి, "నా ఆత్మసాక్షిగా ఉన్న మాట ఉన్నట్టుగా చెబుతాను" అంటూ కోయ భాషలో మొదలు పెట్టాడు. తనకు చాలా కాలంగా ఏ సంఘంతోనూ సంబంధం లేదనీ, 12-13 సంవత్సరాల క్రితమే తాను పోలీసుల ముందు లొంగిపోయి వ్యవసాయం చేసుకొని బతుకుతున్నాననీ, ఇప్పుడు ఎస్పీకి అందించిన భర్మారు కూడా స్వంతానిది కాదనీ, పాటిల్ సాయబు తన చేతికిచ్చి దీన్ని ఎస్పీ చేతికి అందించమన్నాడనీ, ఇలా చేసినందుకు డబ్బూ ధాన్యం ఇల్లూ దొరుకుతాయని పాటిల్ ప్రలోభ పెట్టాడనీ చెప్పుకుంటూ పోతున్నాడు. కోయ అర్థమైన వాళ్లంతా చప్పట్లు కొట్టారు. పాటిల్ ముఖం నల్లబడింది. ఎస్పీ తన పక్కన కూర్చున్న వారిని అడిగి విషయం తెల్సుకున్నాడు. దరోగకు చివాట్లు పెట్టాడు. సభ ముగిసిన తర్వాత ఎల్లని మీద దరోగ నిప్పులు గక్కుతూ చెంపపై కొట్టాడు. ఈ వార్త పేపరుకు ఎక్కింది. ఈ ఘటన జరిగిన తర్వాత జిమ్మలగట్ట దరోగ ఎదిరెంగ గ్రామస్తులను సతాయించడం తగ్గింది.

గట్ట ఏరియాలోని 12 గ్రామాల నుండి 23 మందిని తప్పుడు కేసులు పెట్టి అరెస్టు చేసి జైలుకి పంపారు. వీరిలో మైనారిటీ తీరని 14 సంవత్సరాల పిల్లవాడు కూడా ఉన్నాడు. జారవాడ గ్రామంలో దుకాణం నడుపుకొని బతికే ఒక మహిళ కూడా వీరిలో ఉంది.

## దేవ్‌పాడి గ్రామస్తుడు బండు తుమ్రేటిని చంపింది పోలీసులే !

జూలై 2, 2004 రోజు పెట్రోలింగ్ కోసం వచ్చిన గట్ట పోలీసుల మీద పీఎల్‌జీఏ ప్రధాన బలగాలు చేసిన ఫైరింగ్‌లో ఇద్దరు పోలీసులు చనిపోయారు. ఈ ఘటన పూస్‌కోటి-దేవ్‌పాడి గ్రామాల నడుమ, దేవ్‌పాడి గ్రామానికి దగ్గరలో జరిగింది. జూలై 5 నాడు దేవ్‌పాడి గ్రామస్తులను గట్టకు పిలిచారు. నక్సలైట్లకు అన్నం పెట్టి సహకరించి మా మీద ఫైరింగ్ చేయించింది మీరేనంటూ వారిని బాధించారు. అప్పటికే బండు తీవ్రమైన మలేరియా జ్వరంతో బాధపడుతున్నాడు. గ్రామస్తులు ఆయన అనారోగ్యంగా ఉన్నాడని చెప్పినా వినిపించుకోకుండా పోలీసు స్టేషన్‌కు పిలిపించుకున్నారు. జ్వరంతో వణుకుతున్న బండును వీపు మీద బలంగా గుద్దారు. ఈ దెబ్బకు అక్కడే స్పృహ తప్పిన బండును హాస్పిటల్‌కి తీసుకెళ్లనీయకుండా గ్రామస్తులను అడ్డుకొని ఇంటికి పంపించేశారు. మందులు లేక, వైద్యం అందక బండు తుమ్రేటి చనిపోయాడు. ఆయన వయస్సు 35 సంవత్సరాలు. భార్యాపిల్లలున్నారు.

న్యాయమైన ప్రజాయుద్ధంలో ప్రజల సహకారం, భాగస్వామ్యం లేకుండా ఆపాలని పోలీసులు ఎంత నిర్బంధాన్ని ప్రయోగించినా దానిని ఆపటం అసాధ్యం అనే విషయం గర్వంతో విర్రవీగుతున్న గడ్చిరోలి పోలీసులకు అర్థం కాదు. నిర్బంధం పెరిగే కొద్దీ ప్రజలు మరింతగా పోరాట మార్గాన్ని ఎంచుకోక తప్పదన్న సత్యం వాళ్లకు అర్థం కాదు.

దేవ్‌పాడి సంఘటనతో పిచ్చెత్తిన పోలీసులు జూలై 15న దేవ్‌పాడికి సమీప గ్రామమైన మర్దకుయిలో నక్సలైట్లు అనే అనుమానంతో గ్రామస్తులపై జరిపిన విచ్చలవిడి కాల్పుల్లో ఒక ఎద్దు చనిపోయింది. పోలీసుల ఈ మతిలేని చర్యను గ్రామ ప్రజలంతా వ్యతిరేకించారు.

## మాడ్ డివిజన్

## ప్రజల ప్రజాస్వామిక హక్కుల్ని హరించి వేస్తున్న ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం

సెప్టెంబర్ 26న బస్తర్ జిల్లా నారాయణపూర్‌లో బస్తర్ సంఘర్ష్ సమితి నాయకత్వంలో ప్రజలు ఒక ర్యాలీ తీయడానికి ప్రభుత్వ అనుమతిని కోరారు. అయితే ప్రజల ప్రజాస్వామిక హక్కులను ఏ మాత్రం లెక్కచేయని రమన్‌సింగ్ ప్రభుత్వం రెండు రోజుల ముందు

## సర్గూజ ప్రాంతంలో బూటకపు ఎన్‌కౌంటర్

*ఛత్తీస్‌గఢ్‌లోని సర్గూజ ప్రాంతంలో మహుడాండ్ అనే గ్రామంలో అక్టోబర్ 22 నాడు పోలీసులు ముగ్గురు నిరాయుధులైన కామ్రేడ్లను కాల్చి చంపి ఎన్‌కౌంటర్ కథ అల్లారు. సీపీఐ (మావోయిస్టు) సర్గూజ-కొరియా సరిహద్దు కమిటీ కార్యదర్శి పత్రికలకు విడుదల చేసిన ఒక ప్రకటనలో ఈ సంఘటనను తీవ్రంగా ఖండించారు. ఎన్‌కౌంటర్‌గా చెబుతున్న ఈ పాశవిక హత్యాకాండలో ప్రాణాలు కోల్పోయిన ముగ్గురు కామ్రేడ్స్ – మంగల్(35), జీతూ (15), రాజారాం (14)లు. 14, 15 ఏళ్ల పిల్లల్ని కూడా కాల్చి చంపి నక్సలైట్లుగా ప్రకటించడం ఛత్తీస్‌గఢ్ పోలీసులకే చెల్లింది. ఒక ఇంట్లో నిద్రిస్తున్న ఈ ముగ్గురిని పట్టుకొని కాల్చి చంపారు. ఈ ముగ్గురు కామ్రేడ్స్‌కూ విప్లవ జోహార్లర్పిద్దాం. బూటకపు ఎన్‌కౌంటర్లతో విప్లవోద్యమాన్ని అడ్డుకోగలమని భ్రమ పడుతున్న దోపిడీ పాలకవర్గాలకు ప్రజాయుద్ధం ద్వారానే జవాబు చెబుదాం.*

నుండే నారాయణపూర్ పట్టణంలో 144 సెక్షన్ కింద నిషేధాజ్ఞలు విధించి ర్యాలీని భగ్నం చేసింది. అయితే ఈ ర్యాలీ కోసం దాదాపు 40 వేల మంది ప్రజలు కదిలి అనుమతి లేకుండా మూంజ్‌మెట్ట నుండి గడ్‌బెంగాల్ దాకా వెళ్లారు. అయితే పెద్ద ఎత్తున దిగిన వందలాది పోలీసు, పారా మిలిటరీ బలగాలు ప్రజలను గడ్‌బెంగాల్ వద్ద ఆపి వేసి బలవంతంగా వెనక్కి పంపారు. ఇది జరిగుంటే నిజానికి ఒక చారిత్రాత్మక ర్యాలీ అయి ఉండేది. ఎందుకంటే నారాయణపూర్ ప్రాంత చరిత్రలో 40 వేల మంది ప్రజలు కదలడం ఇదే మొదటి సారి.

*ఈ సందర్భంగా ప్రజలు లేవనెత్తిన ప్రజాస్వామిక డిమాండ్లు ఇవి.*

1) సెప్టెంబర్ 20 నాడు మూంజ్‌మెట్ట గ్రామంలో అరెస్ట్ చేసిన శ్రీమతి శ్యాంబతిని బేషరతుగా విడుదల చేయాలి. ఆమెపై మోపిన అబద్ధపు కేసులన్నీ ఉపసంహరించుకోవాలి. నారాయణపూర్‌లో రామకృష్ణ మిషన్ ఆసుపత్రి వైద్య అధికారి వేదాంత చైతన్య స్వామిజీ ఒక ఆదివాసీ బాలికపై అత్యాచార ప్రయత్నం చేయగా ప్రజలకు నాయకత్వం వహించి దీనికి వ్యతిరేకంగా ధర్నా జరపడమే శ్యాంబతి చేసిన నేరం. కావాలని కక్షగట్టి పోలీసులు 65 సంవత్సరాల ఈ వృద్ధురాలిని అరెస్ట్ చేశారు. దీని వెనుక రామకృష్ణ మిషన్ స్వామిజీల హస్తం ఉందనేది కూడా స్పష్టం.

2) కేంద్రంలో కొత్తగా అధికారంలోకి వచ్చిన యూపీఏ ప్రభుత్వం పోటా చట్టాన్ని వెనక్కి తీసుకోగా ఛత్తీస్‌గఢ్ రమన్‌సింగ్ ప్రభుత్వం ఛత్తీస్‌గఢ్ భద్రతా చట్టం 2004ను రూపొందించే ప్రయత్నంలో ఉంది. ఇప్పటికే ఆదివాసీ ప్రాంతాలలో పెచ్చరిల్లి పోయిన పోలీసు జులుం ఈ చట్టం వస్తే మరింత బాహాటంగా, మరింత తీవ్రంగా కొనసాగే అవకాశం ఉంది. నల్ల చట్టాల్ని ప్రయోగిస్తూ ప్రజల కనీస నిరసన స్వరాల్ని కూడా అణచివేస్తారనేందుకు గత కాలపు టాడా, పోటా చట్టాల చరిత్రలే సాక్ష్యం. కాబట్టి ఈ చట్టం తెచ్చే ప్రతిపాదనను రమన్‌సింగ్ ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలి.

3) పోలీసు అత్యాచారాల్ని నిలిపివేయాలి. సీఆర్పీ బలగాలను వెనక్కి తీసుకోవాలి. ఇటీవలి కాలంలో ప్రత్యేకించి మహిళలపై పోలీసుల అత్యాచారాలు బాగా పెరిగిపోయాయి. కోహ్కామెట్టలో ఒక మహిళపైనా, ఛోటెడోంగర్‌లో ఇద్దరు మహిళలపైనా సీఆర్పీ జవాన్లు అత్యాచారం జరిపారు. మహిళలను ఛాతీపై రైఫిల్ బట్లతో కొట్టారు. భైరంగఢ్ తాలూకా ధర్మ గ్రామ నివాసి బుధ్రిపై సీఆర్పీ జవాన్లు సామూహిక అత్యాచారం జరిపి చంపేసారు. పల్లి గ్రామవాసియైన చైతును కొట్టి చంపారు. మఢోనార్ గ్రామంలో పోలీసులు మహిళలను వక్షస్థలంలో రైఫిల్ బట్లతో కొట్టి తమ క్రూరత్వాన్ని చాటుకున్నారు. ఆగస్టు 22న ముండపాల్ గ్రామంలో ఇద్దరినీ, సులెంగాలో ముగ్గురినీ తీవ్రంగా కొట్టారు. నిరుడు నారాయణపూర్ పట్టణంలో మేళా జరిగిన సందర్భంగా పోలీసులు చేసిన దౌర్జన్యకాండకు సభ్య సమాజం విస్తు పోవల్సిందే. రాత్రి పూట పడుకున్న వ్యాపారులను తన్నుతూ లేపి బలవంతంగా డబ్బులు వసూలు చేశారు. ఇప్పటికీ ఈ సంఘటనపై ఎలాంటి విచారణా జరిపించలేదు, ఏ చర్యా తీసుకోలేదు.

4) ప్రజల ప్రజాస్వామిక హక్కుల్ని పునరుద్ధరించాలి. ప్రజలు తమ సమస్యలపై ధర్నాలు, ప్రదర్శనలు జరప ప్రయత్నించినప్పుడల్లా పోలీసులు 144 సెక్షన్ విధించి వాటిని భగ్నం చేస్తున్నారు. ప్రజలకు నాయకత్వం వహిస్తున్న వాళ్లను అరెస్టు చేయడం, తప్పుడు కేసుల్లో ఇరికించడం, హింసించడం ఇవన్నీ ప్రజల ప్రజాస్వామిక హక్కుల్ని హరించే ఫాసిస్టు చర్యలే. ఇదంతా ప్రభుత్వ విధానంలో భాగమే. మనది ప్రజాస్వామిక దేశమని వల్లించే ప్రభుత్వం ప్రజల కనీస హక్కుల్ని కూడా ఎందుకు గౌరవించడం లేదో జవాబివ్వాలి.

5) పోలీసు ఇన్‌ఫార్మర్ల ఆగడాలను అరికట్టాలి. ఇటీవలి కాలంలో పోలీసు అధికార్లు అనుసరిస్తున్న తప్పుడు విధానాల ఫలితంగా నారాయణపూర్ పట్టణంలోనూ, చుట్టుపక్కలా పోలీసు ఇన్‌ఫార్మర్లు బాగా పెరిగిపోయారు. వీళ్లు ఎవరిపై బడితే వాళ్లపై ఇష్టమొచ్చినట్టుగా ప్రవర్తిస్తున్నారు. దొంగతనాలు, బలాత్కారాలు వీళ్ల రోజువారీ కార్యక్రమాలయ్యాయి. ఇటీవల జరిగిన మేళా సందర్భంగా పట్టపగలే ఈ ఇన్‌ఫార్మర్లు దుకాణాలపై బడి దోపిడీ చేశారు. పోలీసు థానేదారు, ఎస్‌డీఎం, సీఆర్పీ జవాన్ల సమక్షంలోనే ఇదంతా జరిగింది. ఈ ఇన్‌ఫార్మర్ల మూలంగా పట్టణంలో అరాజకత్వమే రాజ్యమేలుతున్నది. కాబట్టి వీళ్లను అరికట్టి నియంత్రించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. వీళ్లకు విచ్చలవిడి అధికారాలిచ్చి అన్ని విధాలా ప్రోత్సాహాన్నిస్తున్న పోలీసు అధికారులను శిక్షించాలి.

## అమరుల స్తూపాల కూల్చివేత పోలీసుల పాశవికతకు మచ్చుతునక

మాడ్ డివిజన్ డౌల ఏరియా వయనార్ గ్రామంలో ప్రజలు నిర్మించుకున్న అమరుల స్తూపాన్ని సీఆర్‌పీ, సీఎస్‌ఎఫ్ పోలీసులు జూలై 12 నాడు కూల్చివేశారు. ఐదు గ్రామాల ప్రజలు పని చేసి ఈ గ్రామంలో 30 అడుగుల ఎత్తుతో ఈ స్తూపాన్ని నిర్మించారు. ఇది పోలీసులకు కన్నెర్ర అయ్యింది. వీరులు చనిపోయి కూడా పోలీసులకు నిద్ర పట్టనివ్వడం లేదు. అందుకే ప్రజలెవ్వరూ లేని సమయంలో దొంగల్లా గ్రామంలో చొరబడ్డ 40 మంది పోలీసులు ఈ దుశ్చర్యకు పాల్పడ్డారు.

అట్లాగే కల్లెపాడ్ అనే గ్రామంలో కూడా పోలీసులు స్తూపాన్ని కూల్చడానికి విఫల ప్రయత్నం చేశారు. ఈ గ్రామంలో ఏడు గ్రామాల ప్రజలు మూడు రోజులు సమిష్టిగా శ్రమించి అమరుడు కామ్రేడ్ రాందాస్ స్మృతిలో ఈ స్తూపాన్ని నిర్మించుకున్నారు. శత్రు ఎత్తుగడలను విఫలం చేస్తూనే జూలై 28 నాడు ఈ గ్రామ పరిసరాల్లో 4 వేల

మంది ప్రజలు పెద్ద ఎత్తున సభ జరుపుకొని ఈ స్తూపాన్ని ఆవిష్కరించారు.

కడియనార్ రేంజ్‌లో సులుంగ అనే గ్రామంలో ప్రజలు తమ ప్రాంతం వాడైన అమరుడు కామ్రేడ్ విశ్వనాథ్ స్మృతిలో 5 రోజులు పని చేసి స్తూపాన్ని నిర్మించుకున్నారు. ఈ పనిలో మొత్తం 18 గ్రామాల వాళ్లు పాల్గొన్నారు. జూలై 29 నాడు ఈ రేంజ్‌కు చెందిన 18 గ్రామాల నుండి 2,500 మంది ప్రజలు పాల్గొన్న సభలో ఈ స్తూపాన్ని ఆవిష్కరించారు. ఈ సమాచారం తెల్సిన డోంగుర్ పోలీసులు, సీఆర్పీ బలగాలు 80 మంది మరునాడు ఉదయం ఎనిమిది గంటలకు గ్రామంపై దొంగచాటుగా దాడి చేసి స్తూపాన్ని కూల్చారు. అయితే అక్కడి మిలిషియా యువకులు కొద్ది దూరంలో పటాకులు పేల్చడంతో వీళ్ల వీరత్వం అంతా జావగారి పోగా పిరికి పందల్లా నేలపై పొర్లుకుంటూ పారిపోయారు.

## ఉత్తర బస్తర్ డివిజన్

### ఉపాధ్యాయులపై కాల్పులు జరిపిన పంజాబ్ కమాండోలు

కేస్కల్ ఏరియా ధనోరలో ఎన్నికల బందోబస్తు డ్యూటీపై వచ్చిన పంజాబ్ కమాండోలు సాయంత్రం ఏడున్నర గంటలకు మోటారుసైకిళ్లపై వస్తున్న ఉపాధ్యాయులపై కాల్పులు జరిపారు. కారణం అడిగితే నక్సలైట్లు కావచ్చని అనుకున్నామని నిర్లక్ష్యంగా జవాబు చెప్పారు. దీంతో ఉపాధ్యాయులూ, గ్రామ ప్రజలూ కోపోద్రిక్తులయ్యారు. అదృష్టవశాత్తు ఎవరికీ ఏమీ కానప్పటికీ, అనుమానం వచ్చినంత మాత్రాన విచ్చవిడిగా కాల్పులు జరపడాన్ని ప్రజలు తీవ్రంగా ఖండించారు. మరుసటి రోజు ఉదయం కమాండోలు బస చేసిన స్కూలు వద్దకు ప్రజలూ, ఉపాధ్యాయులూ పెద్ద సంఖ్యలో కదిలి వెళ్లి ఈ విషయమై గట్టిగా నిలదీశారు. పొరపాటును ఒప్పుకొని మరోసారి ఇలాంటి పని చేయమని హామీ ఇచ్చిన తర్వాతనే ప్రజలు వెను దిరిగారు.

### కోళ్లదొంగలుగా మారిన పోలీసులు

ఇదే ఏరియాలోని మరో గ్రామం అర్రాలో పోలీసులు ఏప్రిల్ 16వ తేదీన దాదాపు కర్ఫ్యూ విధించినంత పని చేశారు. ఎవరూ ఇళ్లలోంచి బైటికి రాకూడదనీ, ఎటూ వెళ్లగూడదనీ ఆంక్షలు విధించారు. ప్రజలు వీళ్ల భయంతో గ్రామం వదిలి వెళ్లిపోయారు. ఇదే సందనుకొని పోలీసులు మొత్తం 100 కోళ్లను మాయం చేశారు. అట్లాగే నలుగురు రైతుల్ని తీవ్రంగా కొట్టారు.

## దక్షిణ బస్తర్ డివిజన్

### సంతలు బంద్ – దక్షిణ బస్తర్‌లో పోలీసుల కొత్త ఎత్తుగడ

దక్షిణ బస్తర్ డివిజన్ కుంట తాలూకాలో పోలీసులు సంతలను బంద్ చేస్తున్నారు. రమన్‌సింగ్ ప్రభుత్వం సీపీఐ (మావోయిస్టు) పార్టీని అణచివేయడం కోసం తీవ్రంగా ప్రయత్నిస్తూ సామాన్య ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నది. 14వ లోక్‌సభ ఎన్నికల నుండి జూన్ వరకు మొత్తం 120 మంది ఆదివాసీ స్త్రీపురుషులను పోలీసులు అరెస్టు చేశారు. వీళ్లను తీవ్రంగా హింసించి కొందరిని జైల్లో నిర్బంధించారు. అంతే కాకుండా భెజ్జి, డబ్బకుంట, ఎల్మగుండ, దరేలి, పెద్దబోడికెల్, సిలింగేర్, నాగవాం, మెహత గ్రామాల సంతలకు వెళ్లే వ్యాపారులను వెళ్లకుండా ఆపుతున్నారు. దీనికి వ్యతిరేకంగా కుంట ఏరియాలోని 23 గ్రామాలకు చెందిన వెయ్యికి పైగా మంది ప్రజలు కుంట పట్టణంలో ఊరేగింపు తీశారు. బంద్ చేసిన సంతల్ని వెంటనే తెరవాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. ఈ పోరాటంలో వ్యాపారులు కూడా చాలా మంది కల్సి వచ్చారు. సంతలు నడవకపోవడంతో చిన్న వ్యాపారులు తీవ్రంగా నష్టపోతున్నారు. కాబట్టి ప్రజలూ, వ్యాపారులూ కల్సి దీన్ని ఎదిరించాల్సి ఉంది. ఒకవైపు ఛత్తీస్‌గఢ్‌లోని నీటితో సహా అపార సంపదల్ని పెద్ద పెద్ద దళారీ పెట్టుబడిదార్లకూ, సామ్రాజ్యవాదులకూ దోచి పెడుతున్న ప్రభుత్వం చిన్న వ్యాపారుల నోళ్లలో మన్ను కొడుతున్నది. ఆదివాసులకు ఇంటికో బర్రె, పావలా పైసలకే ఉప్పు ఇస్తామని గద్దెక్కిన బీజేపీ ఉప్పు, బర్రెలు ఇవ్వడం సంగతి అటుంచి ప్రజలకు ఉప్పు, మిరపకాయలు దొరక్కుండా సంతలు బంద్ చేస్తోంది. ఈ ప్రజా వ్యతిరేక నిరంకుశ చర్యను అన్ని వర్గాల ప్రజలూ గర్హించారు. ▲

---

*( ...... 36వ పేజీ తరువాయి )*

పశుబలంతో విఫలం చేసింది. ఈ విధంగా అది ప్రజల కనీస హక్కులైన వాక్, సభా స్వాతంత్ర్యాలను కూడా క్రూరంగా నేలరాస్తున్నది.

యూపీఏ ప్రభుత్వం విదేశాంగ విధానం కూడా తన కనీస ఉమ్మడి కార్యక్రమంలో చెప్పుకున్నదానికి భిన్నంగానే ఉంది. పాలస్తీనా ప్రజల మాతృభూమి విషయంలో దశాబ్దాలుగా నిబద్ధతను కలిగి ఉన్నానని చెప్పుకునే భారతదేశం ఇప్పుడు ఇజ్రాయిల్ దురాక్రమణ చర్యలను ఏ మాత్రం ఖండించడం లేదు. పాలస్తీనా భూభాగాన్ని ముక్కలు ముక్కలు చేసి ఫెన్సింగ్ వైర్లతో, గోడలతో నరకకూపంగా మారుస్తుంటే యూపీఏ ప్రభుత్వం కనీసం మాటవరుసకైనా ఖండించలేదు. యాసర్ అరాఫత్‌ను కలిసిన భారత విదేశాంగ మంత్రి కూడా పాలస్తీనా సమస్య పట్ల క్రియాశీల మద్దతు ప్రకటించలేదు. అంతే కాకుండా అదే సమయంలో భారత వైమానిక దళ చీఫ్ పెద్ద ఎత్తున ఆయుధాల కొనుగోలు కోసం, సంయుక్త మిలిటరీ విన్యాసాల ఒప్పందం కోసం ఇజ్రాయిల్ వెళ్లాడు.

అలాగే ఇరాక్ విషయంలో కూడా దీని రెండు నాల్కల ధోరణి కనబడుతోంది. కాంగ్రెస్ అధికారంలోకి రాకముందు ఇరాక్‌కు సైన్యాలను పంపడాన్ని వ్యతిరేకించింది. అమెరికా ఇరాక్‌ను ఆక్రమించడాన్ని నంగిగానైనా వ్యతిరేకించింది. కానీ భారత ప్రధాని మన్‌మోహన్ సింగ్ లండన్‌లో టోనీ బ్లేర్‌ను కలిసిన సందర్భంగా మాట్లాడుతూ, "గతంలో ఇరాక్ విషయంలో వెలిబుచ్చిన విషయాలు, గతానికి సంబంధించినవి ఇప్పుడు మేం భవిష్యత్ గురించి చూస్తున్నాం" అని మాట్లాడాడు. అంతే గాక ఇరాకీ పోలీసులకు ఇండియా ట్రెయినింగ్ ఇస్తుందనీ, ప్రస్తుతం అమెరికా ఆక్రమించిన ఇరాక్‌లో ఎన్నికల నిర్వహణకు ఇండియా మద్దతునిస్తుందనీ చెప్పాడు. ఇలా మన్‌మోహన్ సామ్రాజ్యవాదులకు నిజమైన సేవకుడిగా తన్ను తాను మరోసారి రుజువు చేసుకున్నాడు.

ఏ పార్లమెంటరీ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ ఆర్థిక సంస్కరణలను అమలు చేయడంలో అందరూ ఒక్కటే. వీరంతా తమ సామ్రాజ్యవాద యజమానులకు సేవ చేస్తూ దేశాన్ని నిరాటంకంగా దోచుకోవడంలో సహకరించే వాళ్లే. నిజమైన, సమరశీలమైన సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమమొక్కటే ఈ దేశద్రోహులు అనుసరిస్తున్న సామ్రాజ్యవాద అనుకూల విధానాలను సమర్థవంతంగా ఎదిరించి ఓడించగలుగుతుంది. ▲

# గొల్లపల్లిలో పోలీసుల తూటాలకు ఇద్దరు టీచర్లూ, విద్యార్థీ పోలీసుల బలి

నవంబర్ 5వ తేదీన దక్షిణ బస్తర్ డివిజన్ గొల్లపల్లి గ్రామంలో పోలీసులపై పీఎల్‌జీఏ గెరిల్లాలు క్లేమోర్‌తో దాడి జరిపారు. అయితే ఈ దాడిలో ఎవరూ గాయపడలేదు.



గెరిల్లాలు మైన్ పేల్చిన వెంటనే రిట్రీటయ్యారు. అయితే ఆ తర్వాత పోలీసులు స్టేషన్‌కు వెళ్లి తిరిగి వచ్చి ఒక పథకం ప్రకారం దారుణ హత్యాకాండకు పూనుకున్నారు. గెరిల్లాలు దాడి జరిపిన సమయంలో ఆ పక్కనే స్కూలు టీచర్లూ, విద్యార్థులూ కలిసి క్రికెట్ ఆడుతున్నారు. బాంబు శబ్దం వినగానే వాళ్లు భయంతో తమ గదిలోకి పోయి తలుపులు వేసుకున్నారు. వీళ్ల మద్దతుతోనే గెరిల్లాలు దాడికి పాల్పడి ఉంటారనే అనుమానంతో, అక్కసుతో పోలీసులు వీళ్ల గదిపై దాడి చేసి బైటికి రమ్మని కేకలు వేశారు. తాము టీచర్లమనీ, మాకేమీ తెలియదనీ వాళ్లు మొత్తుకుంటూ కిటికీలలోంచి వివరించడానికి ప్రయత్నించారు. వాళ్ల మాటల్ని పట్టించుకోకుండా బైటికి రాకుంటే కాల్చి చంపుతామని తుపాకులు లోడ్ చేశారు. దాంతో ప్రాణాలు రక్షించుకోవడం కోసం వాళ్లు తలుపులు తెరచుకొని బైటికి రావడానికి ఉద్యుక్తులయ్యారు. వాళ్లు ఇంకా పూర్తిగా బైటికి రాకముందే వాళ్లపై విచ్చలవిడిగా కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో 12 సంవత్సరాల విద్యార్థి నాగేంద్ర, సోడి హిడమ అనే శిక్షాకర్మీ అక్కడికక్కడే మరణించారు. మరో ఇద్దరు శిక్షాకర్మీలు మల్లారాం మర్కాం, సంతోష్‌కుమార్ ఠాకుర్‌లు తీవ్రంగా గాయపడ్డారు. కొద్ది సేపటి తర్వాత మల్లారాం కూడా ప్రాణాలు విడిచాడు. ఇది పోలీసులు కావాలని చేసిన పాశవిక హత్య. కానీ మరుసటి రోజు పత్రికలకు విడుదల చేసిన ప్రకటనలో పోలీసులు తమకూ, నక్సలైట్లకూ మధ్య జరిగిన కాల్పుల్లో నక్సలైట్ల తూటాలు తగిలి వీళ్లు మరణించారని ప్రకటించారు. అయితే గ్రామ ప్రజలు, గాయపడిన బతికిన టీచర్ సంతోష్ ఇది పోలీసులు చేసిన హత్యే అనీ, నక్సలైట్లు కాల్పులు జరపనే లేదని ప్రకటించారు.

ఈ దారుణ హత్యలను బస్తర్ ప్రజలంతా ఖండించారు. అన్ని సెక్షన్ల ప్రజలూ దీనిపై న్యాయవిచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అయితే ప్రభుత్వం నామమాత్రంగా మెజిస్టీరియల్ విచారణకు ఆదేశించింది. నవంబర్ 16న కుంట పట్టణంలో ప్రజలు పెద్ద ఎత్తున ఊరేగింపు తీశారు. ఇందులో విద్యార్థులు, ఉపాధ్యాయులు, రైతులు అన్ని వర్గాల ప్రజలూ పాల్గొన్నారు. ప్రభుత్వం ఈ ర్యాలీకి అనుమతి ఇవ్వకుండా పట్టణంలో నిషేధాజ్ఞలు విధించినప్పటికీ ప్రజలు దాన్ని లెక్క చేయకుండా ఈ ర్యాలీలో పాల్గొనడం విశేషం. దీనిలో 15 వేల మంది ప్రజలు పాల్గొన్నారు. మృతుల కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలనీ, మృతుల కుటుంబాల్లో ఒక్కో వ్యక్తికి ఉద్యోగం ఇవ్వాలనీ, హంతక పోలీసు అధికారులను శిక్షించాలనీ డిమాండ్ చేశారు.

ఈ హత్యాకాండ రమన్‌సింగ్ ప్రభుత్వ నిజరూపాన్ని బట్టబయలు చేసింది. గత కొన్ని నెలలుగా నక్సలైట్లతో చర్చలు జరపడానికి సిద్ధమేనంటూ తమ ప్రభుత్వం ప్రజాస్వామ్యబద్ధంగా నడుచుకుంటుందనీ చెబుతూ వచ్చిన రమన్ ప్రభుత్వం ఈ హత్యల ద్వారా తన ముసుగును తానే చించేసుకుంది. రమన్ ప్రభుత్వ ఫాసిస్టు విధానాలను దండకారణ్యంతో పాటు మొత్తం ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రజలంతా తీవ్రంగా ఖండిస్తున్నారు. సమైక్య ప్రజా ఉద్యమం ద్వారానే రమన్‌సింగ్ ప్రభుత్వ దమనకాండను ఓడించాలని మేం ప్రజలకు పిలుపునిస్తున్నాం. ఈ దారుణ హత్యాకాండలో ప్రాణాలు కోల్పోయిన నాగేంద్ర, సోడి హిడమ, మల్లారాం కుటుంబాలకు మా ప్రగాఢ సానుభూతిని తెలుపుతున్నాం. ప్రజాయుద్ధాన్ని తీవ్రతరం చేయడం ద్వారా ఈ హత్యలకు బదులు తీర్చుకుంటామని శపథం చేస్తున్నాం. ⅄

## ఫిలిప్పైన్స్‌లో న్యూ పీపుల్స్ ఆర్మీ ఆంబుష్ – పది మంది సైనికుల హతం

ఫిలిప్పైన్స్ కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో జరుగుతున్న ప్రజాయుద్ధంలో న్యూ పీపుల్స్ ఆర్మీ ( ఎన్‌పీఏ) శత్రు బలగాలపై దాడుల్ని సాగిస్తూ అనేక ఎత్తుగడలపరమైన విజయాలు సాధిస్తున్నది. ఇటీవల, 2004 నవంబర్ చివరి వారంలో న్యూ పీపుల్స్ ఆర్మీకి చెందిన ఎర్రయోధులు ప్రభుత్వ సైన్యానికి చెందిన ఒక దళంపై దాడి చేసి పది మందిని హతమార్చి మరో ఆరుగురిని గాయపర్చారు. సేన్ రాఫెల్ నగరంలోని బుల్‌కాన్ ప్రాంతంలో రోడ్లనూ, వంతెనలనూ తనిఖీ చేయడానికి బయలుదేరిన సైనికులపై ఎన్‌పీఏ సైనికులు పొంచి ఉండి ఈ దాడి చేశారు. ఈ సంఘటన తర్వాత వాళ్లు శత్రు సైనికుల ఆయుధాలను కూడా వశపర్చుకున్నారు. అయితే ఈ సందర్భంగా ఒక గెరిల్లా కూడా అమరుడైనట్టు పత్రికలలో వచ్చిన వార్తలను బట్టి తెలుస్తోంది. సామ్రాజ్యవాదుల, ప్రత్యేకించి అమెరికన్ సామ్రాజ్యవాదుల దన్ను గలిగిన తిరోగమనవాద ప్రభుత్వ సైన్యంపై ఫిలిప్పైన్స్ కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో ఎన్‌పీఏ మరిన్ని విజయాలు సాధించాలని ఆశిద్దాం. ⅄

# మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికలు

ఏప్రిల్/మే నెలల్లో లోక్‌సభ ఎన్నికలతో పాటుగానే మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు కూడా జరిపించాలని బీజేపీ బాగా ఉబలాటపడింది. కానీ కాంగ్రెస్, నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీల ప్రభుత్వం మాత్రం ఆరు నెలల ముందుగానే ఎన్నికలు ప్రకటించి ఎలాంటి రిస్క్ తీసుకోవడానికి సాహసించలేదు. కేంద్రంలో ఎట్లాగూ తమ కూటమే గెలుస్తుంది కాబట్టి మహారాష్ట్ర అసెంబ్లీలో కూడా విజయం తమనే వరిస్తుందని బీజేపీ-శివసేన కూటమి నమ్మింది. కానీ ఎన్నికల కమిషన్ బీజేపీ డిమాండ్‌ను తిరస్కరించింది. చివరకు పూర్తి గడువు ముగిసిన తర్వాతనే ఎన్నికల కమిషన్ మహారాష్ట్ర అసెంబ్లీకు ఎన్నికలు ప్రకటించి అక్టోబర్ 13న పూర్తి చేసింది. అయితే ఈ మధ్య కాలంలో ఒక పెద్ద మార్పు చోటు చేసుకుంది. బీజేపీ నాయకత్వంలోని ఎన్డీయే కూటమి లోకసభ ఎన్నికల్లో ఘోర పరాజయం పాలై అధికారం కోల్పోయింది. కేంద్రంలో కాంగ్రెస్ నాయకత్వంలో సమైక్య ప్రగతిశీల కూటమి అధికారంలోకి వచ్చింది. ఈ మార్పు మహారాష్ట్ర కాంగ్రెస్‌లో తిరిగి అధికారంలోకి రావాలన్న చిరు ఆశను రేపింది. మరోవైపు బీజేపీ-శివసేన కూటమి బీటలు వారడం మొదలైంది.

దేశంలోనే అత్యధిక విదేశీ పెట్టుబడులు కేంద్రితమై ఉన్న రాష్ట్రం మహారాష్ట్ర. అందుకే అది దేశంలోనే అతి పెద్ద రుణగ్రస్త రాష్ట్రంగా మారింది. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి కుంటు పడింది. ఫలితంగా నిరుద్యోగం ఒక మహమ్మారిలా మారింది. పత్తి పండించే విదర్భ ప్రాంత రైతులు గత 8 నెలల్లో 225 మందికి పైగా మంది ఆత్మహత్యలు చేసుకున్నారు. మన్సాంటో కంపెనీ అమ్ముతున్న నకిలీ విత్తనాలు, నకిలీ పురుగు మందులు, నీటిపారుదల సౌకర్యాల లేమి, పంటలకు మద్దతు ధరలు లేకపోవడం, విద్యుత్ కోత, విద్యుత్ రేట్లలో పెంపుదల, బ్యాంకుల దౌర్జన్యపూరిత వైఖరి... ఇవే రైతుల ఆత్మహత్యలకు కారణాలు. మేల్‌ఘాట్‌లో 72 మంది పసిపిల్లలు పౌష్టికాహార లేమితో చనిపోయారు. మహారాష్ట్రలో ప్రతి ఏటా దాదాపు 9 వేల మంది పిల్లలు పౌష్టికాహార లేమితో ప్రాణాలు విడుస్తున్నారు. రాష్ట్రంలో రాజకీయ నాయకులూ, అధికార్లూ జరిపిన కుంభకోణాలకు లెక్కే లేకుండా పోయింది. గోందియా, గడ్చిరోలి, భండారా, చంద్రపూర్ జిల్లాలలో ఎస్ఆర్‌పీ, పోలీసు, కమాండో బలగాలు విచ్చలవిడి నిర్బంధాన్ని ప్రయోగిస్తూ ఆదివాసీ ప్రజల మనుగడకే ముప్పు తెస్తున్నారు. ప్రజల మౌలిక సమస్యల్లో ఒక్కటి కూడా పరిష్కరించడానికి ప్రభుత్వం చొరవ చూపలేదు.

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల బరిలో దిగిన కాంగ్రెస్, నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ, బీజేపీ, శివసేన, బీఎస్‌పీ, రిపబ్లికన్ పార్టీలతో సహా స్వతంత్ర అభ్యర్థుల వద్ద ప్రజా సమస్యలను పరిష్కరించే స్పష్టమైన విధానమే లేదు. ఎందుకంటే గత ఎన్నికలకు ముందు ప్రకటించినట్టుగా ఈ పార్టీలు ప్రజా సమస్యలను ఏ మాత్రం పరిష్కరించకపోవడంతో అవి ప్రజల ముందు బట్టబయలై పోయాయి. అన్ని పార్టీల పైనా ప్రజలు విశ్వాసం కోల్పోయారు. ఎన్నికలకు ముందూ, తర్వాతా పొత్తులు ఏర్పర్చుకోవడం ద్వారా అధికారంలోకి రావడమే ఈ పార్టీల విధానంగా మారింది. ఎన్నికల పార్టీలన్నీ తమ సిద్ధాంతాలకూ, సూత్రాలకూ తిలోదకాలిచ్చి సూత్రరహిత, సిద్ధాంతరహిత పొత్తులే తమ ప్రవృత్తిగా మార్చుకున్నాయి.

అక్టోబర్ 2004లో జరిగిన మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్-ఎన్‌సీపీ కూటమి, ప్రతిపక్ష బీజేపీ-శివసేన కూటమి ప్రధానంగా పోటీ పడ్డాయి. ఈసారి బీఎస్‌పీ కూడా అన్ని సీట్లకూ తలపడి రెండు కూటముల విజయావకాశాలనూ అనిశ్చితిలోకి నెట్టింది. ఏ పార్టీ ఎన్నికల ప్రణాళికలోనూ ప్రజల సమస్యల్ని పరిష్కరిస్తామన్న స్పష్టమైన హామీ లేదు. అధికార కాంగ్రెస్ కూటమి కేంద్రంలో అధికారంలో ఉన్న తమ కూటమిని చూపిస్తూ రాష్ట్రంలో కూడా తమ కూటమినే గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేయగా, బీజేపీ ఇప్పటికే మతోన్మాద విధానాలతో విసిగిపోయి ఉన్న ప్రజల ముందుకు వీర్ సావర్కర్, తిరంగా జెండా వంటి పేలవమైన వివాదాల్ని ముందుకు తెస్తూ ఎన్నికల ప్రచారానికి దిగింది. మరోవైపు బీఎస్‌పీ 'దళితులకు అధికారం', ప్రత్యేక విదర్భ నినాదాలతో ఎన్నికల రణరంగంలో దూకింది.

288 సీట్లున్న మహారాష్ట్ర అసెంబ్లీకి పోటీ చేసిన వాళ్లలో 200 మంది నేరచరితులు. వీళ్లంతా బీజేపీ, శివసేన, కాంగ్రెస్, ఎన్‌సీపీల తరఫున పోటీ చేశారు. ఈ ఎన్నికల్లో కండబలులు ఎంత డామినేట్ చేశారో దీన్ని బట్టి తెలుస్తుంది. విదర్భలోని గడ్చిరోలి, గోందియా, భండారా, చంద్రపూర్, యవత్‌మాల్ జిల్లాలను ప్రభుత్వం ఈ ఎన్నికల సందర్భంగా సైన్య శిబిరాలుగా మార్చి వేసింది. తుపాకీ మొనలు ఆనించి ప్రజలతో ఓట్లు వేయించింది. పదుల వేల ఎస్ఆర్‌పీ, కమాండో, సీఆర్‌పీ, బీఎస్ఎఫ్, ఇండో-టిబెటన్ సరిహద్దు భద్రతా దళం మొదలైన బలగాలతో పాటు పొరుగు రాష్ట్రాల సాయుధ బలగాలను కూడా ఈ ఆదివాసీ ప్రాంతాల్లో దించి విచ్చలవిడి నిర్బంధాన్ని సాగించారు. రాజకీయ పార్టీలపైనా, నేతల పైనా విశ్వాసం లేని పక్షంలో వోటు వేయకుంటా ఉండే రాజ్యాంగబద్ధమైన అధికారాన్ని ఉపయోగించుకోకుండా ఓటర్లను భయపెట్టడం కోసం ఒక్క గడ్చిరోలి జిల్లాలోనే 6 వేల పోలీసు బలగాల్నీ, 2,800 మంది సీఆర్‌పీ బలగాలనూ, 3,000 మంది సీ-60 కమాండో బలగాల్నీ మోహరించారు. గడ్చిరోలి జిల్లాలోని సిరొంచ, ఆర్మోరీ, గడ్చిరోలి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో మొత్తం 712 పోలింగ్ కేంద్రాలుండగా వీటిలో 254 కేంద్రాలను సున్నితమైనవిగా, 210 కేంద్రాలను అతి సున్నితమైనవిగా ప్రకటించి పెద్ద ఎత్తున బందోబస్తు చేశారు. ఇదంతా మరుగుపరుస్తూ 'నక్సలైట్ల బహిష్కరణ పిలుపును లెక్క చేయకుండా' గ్రామీణ ప్రజలు అత్యధికంగా 73 శాతం ఓట్లు వేశారని ప్రభుత్వం నిర్లజ్జగా ప్రకటించింది. ఈ విధంగా ప్రభుత్వం ప్రజల ముందు ప్రవేశపెట్టిన "ప్రజాస్వామ్య" రూపం ఏంటంటే ఇష్టం ఉన్నా లేకున్నా ఓట్లు వేయక తప్పని అనివార్య నిర్బంధ స్థితి.

సామాన్య ప్రజల్లో ఎన్నికల ప్రక్రియ పట్ల ఉత్సాహం నానాటికీ సన్నగిల్లుతోంది. ప్రతి ఎన్నికల సందర్భంలోనూ ఈ ధోరణి స్పష్టంగా కనిపిస్తోంది. లోక్‌సభ ఎన్నికలలో పోలింగ్ శాతం గత ఎన్నికలతో పోల్చినప్పుడు తక్కువగా ఉంది. మాజీ ఉప ప్రధాని అద్వానీ పోటీ చేసిన గుజరాత్‌లోని గాంధీనగర్ నియోజకవర్గంలో కూడా 40 శాతంకన్నా తక్కువ ఓట్లు పోలయ్యాయి. దేశ మాజీ ప్రధాని వాజ్‌పేయి పోటీ చేసిన లక్నోలో కేవలం 35 శాతం ఓట్లే పోలయ్యాయి. అమేఠీలో 44.5 శాతం ఓట్లే పడ్డాయి. ఇలాంటి పరిస్థితిలో చంద్రపూర్, గడ్చిరోలి జిల్లాల్లోని నియోజకవర్గాల్లో 70 శాతం ఓట్లు పడడం

అనేది ప్రత్యేకించి ఆలోచించాల్సిన విషయం. ఈ జిల్లాల్లోని పోరాట ప్రాంతాలన్నిటిలోనూ నిర్బంధంగా ఓట్లు వేయించడం వల్లా, అట్లాగే పోలింగ్/పోలీసు అధికార్లు రిగ్గింగ్ చేయడం వల్లా పోలింగ్ శాతం కృత్రిమంగా పెరిగిందన్నది స్పష్టం. ఇది నిజానికి ఈ ప్రాంతాలలో ఉదయిస్తున్న ప్రజల నూతన అధికారం చేస్తున్న సవాలును తుంచివేయడానికి ప్రభుత్వం పన్నిన పన్నాగమే ఇది. దండకారణ్యంలో గత డిసెంబర్‌లో జరిగిన ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా, ఆ తర్వాత ఏప్రిల్‌లో జరిగిన లోక్‌సభ ఎన్నికల సందర్భంగా కూడా ఇదే విధంగా దొంగ ఓట్లు వేయించిన సంగతి, ప్రజలను బలవంతపెట్టి ఓట్లు వేయించిన సంగతీ పాఠకులు గత సంచికల్లో చదివే ఉంటారు.

ఇదంతా ఇలా ఉన్నప్పటికీ మొత్తం 288 సీట్లకు గాను కాంగ్రెస్-ఎన్‌సీపీ కూటమికి కేవలం 145 సీట్లు, అంటే బొటాబొటి మెజారిటీ సీట్లు మాత్రమే వచ్చాయి. అది ఏదో విధంగా తిరిగి అధికార పగ్గాలు చేపట్టింది. అతి స్వల్ప తేడాతో సాధించిన ఈ విజయాన్నీ, ఎవరో ఒకరికి ఓట్లు వేయక తప్పని ప్రజల అనివార్య స్థితినీ ప్రజాస్వామ్యానికి ఘన విజయం అనీ, కాంగ్రెస్-ఎన్‌సీపీ కూటమికి తిరుగులేని విజయం అనీ ప్రచారం చేస్తున్నారు. ఎన్నికలకు ముందు పెద్ద పార్టీ అయినందువల్ల ముఖ్యమంత్రి పదవి కాంగ్రెస్‌కే ఇస్తామని ప్రకటించారు. అయితే ఎన్నికల్లో ఎక్కువ సీట్లు ఎన్‌సీపీకి దక్కడంతో ముఖ్యమంత్రి పదవి కోసం గుద్దులాట మొదలైంది. ముఖ్యమంత్రి పదవి తన చేతిలోంచి పోనివ్వగూడదని కాంగ్రెస్ గట్టిగా పట్టుబట్టింది. మరోవైపు ఎన్‌సీపీ రాజకీయ కాంక్షలు బాగా పెరిగిపోయాయి. ఈ పరిణామాలన్నీ ఈ కూటమి డొల్లతనాన్ని బైటపెట్టాయి. పొత్తుల పార్టీలు సాగించిన బేరసారాలు, కొనుగోళ్లు, లాభప్రదమైన మంత్రిత్వశాఖల డిమాండ్లు... వీటన్నిటితో ప్రభుత్వం ఏర్పాటుకు దాదాపు 12 రోజులు పట్టింది. చివరకు డబ్బు సంచులకూ, ఆదాయం బాగా ఉండే మంత్రిత్వశాఖలకూ, ఎక్కువ మంత్రి పదవులకూ తలొగ్గిన ఎన్‌సీపీ ముఖ్యమంత్రి సీటును కాంగ్రెస్‌కు ఇవ్వ సిద్ధపడింది. అయితే రెండు పార్టీల్లోనూ పెల్లుబికిన అసంతృప్తి జ్వాలలు ఇంకా చల్లారడం లేదు. రెండు పార్టీల అగ్ర నాయకత్వం చేస్తున్న హెచ్చరికలు కూడా వృధా అవుతున్నాయి. ఇవన్నీ ఈ ప్రభుత్వం భవిష్యత్తు అస్థిరంగా, అనిశ్చితంగా ఉందనే తెలుపుతున్నాయి. కానీ కాంగ్రెస్-ఎన్‌సీపీ కూటమి మాత్రం ఐదేళ్లు పూర్తిగా ప్రభుత్వం నడిపిస్తామని మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తోంది.

## ఎన్నికల బహిష్కరణ – ప్రతిఘటనా కార్యక్రమం

గత 54 ఏళ్లుగా లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు జరుగుతూ వస్తున్నాయి. ఇన్నేళ్లుగా అధికారం వెలగబెట్టిన ఏ పార్టీ కూడా ప్రజల మౌలిక సమస్యలను పరిష్కరించే ప్రయత్నం చేయలేదు. పేద ఆదివాసులపైనా, సాధారణ ప్రజలపైనా సాంఘిక, రాజకీయ అణచివేతలతో పాటు ప్రభుత్వ నిర్బంధం బాగా పెరిగిపోయింది. దోపిడీ మూలంగా సామాన్య ప్రజల జీవనం దుర్భరంగా మారుతూ వస్తోంది. ప్రజల్లో ఈ వ్యవస్థకు వ్యతిరేకంగా ఆక్రోశం పెల్లుబుకుతున్నది. ఈ ప్రజాక్రోశాన్ని అణచడానికి ప్రభుత్వం టాడా, పోటా లాంటి నల్ల చట్టాలు తెస్తున్నది. ఈ చట్టాలకు వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా ప్రజలు ఉద్యమించారు. ప్రజల వ్యతిరేకతను గమనించి ప్రభుత్వం ఈ చట్టాలను వెనక్కి తీసుకుంది. కానీ ప్రజల వ్యతిరేకతను కూడా లెక్క చేయని బీజేపీ-శివసేన పార్టీలు పోటా చట్టాన్ని ఉపసంహరించుకోవడాన్ని వ్యతిరేకిస్తున్నాయి. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటికీ అన్నీ కూడా సామ్రాజ్యవాద పెట్టుబడులను దేశంలోకి మరింతగా రప్పిస్తూ దేశాన్ని కొల్లగొట్టే పనిలోనే నిమగ్నమవుతున్నాయి.

ప్రత్యేక విదర్భ రాష్ట్రం కావాలన్న విదర్భవాసుల చిరకాల ఆకాంక్షను ఉపయోగించుకుంటూ రాజకీయ పార్టీలన్నీ కూడా సరిగ్గా ఎన్నికలకు ముందు ఈ సమస్యను లేవనెత్తుతున్నాయి. ఎన్నికలు ముగియగానే ఈ పార్టీలన్నీ విదర్భ సమస్యను పక్కన పెడుతూ ప్రజల మనోభావాలను దెబ్బ తీస్తున్నాయి. ఎన్నికల ఫలితాలు వెలువడి రాష్ట్రంలో కాంగ్రెస్-ఎన్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు ఖాయం అని తేలిన తర్వాత, గడ్చిరోలి జిల్లా భామ్రాగడ్ తాలూకాకు చెందిన ఐదుగురు అమాయక ఆదివాసులకు టాడా ప్రత్యేక కోర్టు యావజ్జీవ జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది. ఇది మొత్తం ఆదివాసీ ప్రజానీకాన్ని స్తబ్దుల్ని చేసింది. అయినా ప్రభుత్వానికి చీమ కుట్టినట్టయినా లేదు.

ఎన్నికల ద్వారా ప్రజల మౌలిక సమస్యలేవీ పరిష్కారం కావనే విషయం గత 54 ఏళ్ల ఎన్నికల చరిత్రే తేల్చివేసింది. నిజమైన అర్థంలో ప్రజల విప్లవకర ప్రజా ప్రభుత్వమే ఈ సమస్యలను పరిష్కరిస్తుంది. ఇందుకోసం కార్మికులూ, కర్షకులూ, విద్యార్థులూ, యువజనులూ, సమాజంలోని సమస్త పీడిత వర్గాలూ ఈ ఎన్నికల వ్యవస్థతో పాటు మొత్తంగా ఈ దోపిడీ వ్యవస్థకు వ్యతిరేకంగా ఉద్యమించాలి. దీన్ని కూకటివేళ్లతో సహా పెకిలించి వేసి నవ భారతాన్ని నిర్మించడానికి పూనుకోవాలి... ఆకలిచావులు, పేదరికం, నిరుద్యోగం, అధికధరలు, దోపిడీ, పీడన... ఇవేవీ లేని నవ భారతాన్ని.

## గడ్చిరోలి డివిజన్లో ఎన్నికల బహిష్కరణ క్యాంపెయిన్

*అహిరి ఏరియాలో...*

స్థానిక గెరిల్లా దళాలూ, మిలిషియా దళాలూ కల్సి ఎన్నికలను బహిష్కరించాలని ప్రజల్లో పెద్ద ఎత్తున ప్రచారం చేశాయి. 16 మందితో కూడిన ఒక బ్యాచ్ సిరొంచ, జిమ్మలగట్ట, అహిరి ప్రాంతాలలో ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేసింది.

*నిర్బంధం*

అహిరి, సిరొంచ ఏరియాలో పోలీసులు పెద్ద ఎత్తున నిర్బంధాన్ని ప్రయోగించారు. ఇక్కడ రాజకీయ పార్టీలు సీఆర్పీ, స్థానిక పోలీసు బలగాల మద్దతుతో ప్రచారం చేశాయి. డబ్బులు పంచి పెట్టి ప్రజలతో ఓట్లేయించుకోవడానికి కూడా స్థానిక రాజకీయ నాయకులు ప్రయత్నించారు. ఓట్లు వేయకుంటే పోలీసులతో తన్నిస్తామని బెదిరించారు. కొన్ని చోట్ల ప్రజల్ని కొట్టారు కూడా. సగునా తలాండి, దీపక్ ఆత్రం వంటి స్థానిక రాజకీయ నాయకులు పోలీసులతో కల్సి ప్రజలపై నిర్బంధాన్ని అమలు చేశారు.

*ప్రజా ప్రతిఘటన*

అక్టోబర్ 13న కొడ్సెపల్లి గ్రామం వద్ద రాత్రి పూట నిద్రిస్తున్న కమాండో పోలీసులపై పీఎల్‌జీఏ బలగాలు దాడి చేయగా ఒక్క కమాండో చచ్చాడు, మరొకడు గాయపడ్డాడు.

*భామ్రాగఢ్, గట్ట ఏరియాల్లో...*

స్థానిక పార్టీ కమిటీ నిర్ణయం ప్రకారం రెండు ఎల్జీఎస్‌లూ,

*మాడ్ కొండలపై ఉన్న బినగుండ గ్రామానికి ఎన్నికల నిర్వహణ కోసం వచ్చిన వివిధ సాయుధ బలగాలకు చెందిన 60 మంది జవాన్లతో మిలిషియా మూడు రోజుల పాటు నిర్విరామంగా ఒక చిన్నపాటి యుద్ధమే చేసింది. పగలూ, రాత్రీ బ్యాచీల వారీగా మిలిషియా సభ్యులు వెళ్లి పోలీసులు బస చేసిన స్కూలుపై కాల్పులు జరిపి పోలీసులకు నిద్ర లేకుండా చేశారు. పోలీసులు ఎంతగా భయపడిపోయారంటే ఆఖరుకు నీళ్లు తెచ్చుకోవడానికి కూడా బైటికి వెళ్ల సాహసించలేదు. తమ పిరికితనానికి పరాకాష్ఠగా స్కూలు భవనం లోపలే మలమూత్రాల్ని విసర్జించి దాన్ని పాడు చేశారు. ఈ దాడులలో ఒక పోలీసు గాయపడ్డాడు. గాయపడ్డ పోలీసును తీసుకెళ్లడానికి హెలికాప్టర్ రాగా దానిపై గెరిల్లాలు గ్రెనేడ్ విసిరారు. అయితే ఈ సంఘటనలో దురదృష్టవశాత్తు ఒక స్కూలు టీచర్ గాయపడ్డాడు. ఆ తర్వాత దీని పట్ల పీఎల్‌జీఏ తన విచారం ప్రకటించింది. ఈ కాల్పుల సందర్భంగా పోలీసులు దాదాపు 100కు పైగా మోర్టార్ షెల్స్ వేశారు. ఇక కాల్చిన తూటాల సంఖ్య కొన్ని వేలల్లో ఉంటుంది. అయితే ఈ కాల్పుల్లో పీఎల్‌జీఏ వైపు ఏ ఒక్కరికీ ఏమీ కాలేదు. ప్రజా వ్యతిరేక సైన్యాలు ఎన్ని ఆధునిక ఆయుధాలు కలిగి ఉన్నా అవి కాగితపు పులులేనన్న సత్యం ఈ సంఘటన ద్వారా మరోసారి రుజువైంది.*

మిలిషియా సభ్యులూ కలిసి ఎన్నికల బహిష్కరణ ప్రచారంలో పాల్గొన్నారు. రెండు ఏరియాల్లోనూ ఒక్కో పెద్ద సభ ఏర్పాటు చేసి ప్రజలకు ఈ ఎన్నికల బూటకత్వాన్ని గురించీ, ఈ వ్యవస్థను కూల్చివేసి నిజమైన ప్రజాస్వామిక వ్యవస్థను నెలకొల్పాల్సిన ఆవశ్యకతను గురించీ వివరించారు. ఒక సభలో 13 గ్రామాల నుండి 650 మంది ప్రజలు హాజరు కాగా, మరో మీటింగ్‌లో 1,300 మంది ప్రజలు పాల్గొన్నారు. ఈ సభల్లో పాల్గొన్న ప్రజలంతా ఎన్నికలను బహిష్కరిద్దామని నినాదాలు చేశారు.

### నిర్బంధం

ఈ రెండు ఏరియాల్లోనూ రాజకీయ నాయకుల ప్రచారం బాగానే సాగింది. పోలీసుల దన్నుతో ధర్మారావు ఆత్రం వంటి ప్రజా వ్యతిరేక నాయకులు ప్రజలను బెదిరించి ఓట్లు వేయాలని వత్తిడి తెచ్చారు. చిన్న చిన్న గ్రామాలకు డబ్బులు పంపించి ప్రజలకు పంచమని కబురు చేశారు. ఓట్లు వేయకుంటే పోలీసులతో కొట్టిస్తామనీ, జైలుపాలు చేస్తామనీ ప్రజలను బెదిరించారు. ప్రజలను పోలీసు క్యాంపుల్లోకి పిలిపించి ఎన్నికలను బహిష్కరిస్తే తీవ్రమైన పరిణామాలుంటాయని హెచ్చరించారు. అట్లాగే చుట్టుపక్కల ఎక్కడైనా ఏదైనా ప్రతిఘటనా చర్య జరిగితే మీదే బాధ్యత అవుతుందని ప్రజలను బెదిరించారు.

### ప్రజా ప్రతిఘటన

ఈ ఏరియాలో స్థానిక దళాలూ, 50 మంది ప్రజా మిలిషియా సభ్యులు కలిసి ప్రతిఘటనలో పాల్గొన్నారు. మర్దకుయి దగ్గర పోలీసులపై దాడి చేయగా ఒక్క పోలీసు చచ్చాడు, మరొకడు గాయపడ్డాడు.

### చామోర్షి ఏరియాలో...

ఈ ఏరియాలో స్థానిక దళం ప్రచారాన్ని విస్తృతంగా కొనసాగించింది. పోస్టర్లు, కరపత్రాలు పంపిణీ చేసింది. బూర్జువా నాయకులు కూడా ఈ ఏరియాలో ప్రచారం నిర్వహించారు.

### నిర్బంధం

చామోర్షి ఏరియాలో పోలీసు నిర్బంధం కూడా తీవ్రంగానే కొనసాగింది. బోలెపల్లి గ్రామానికి వచ్చిన సత్యవాన్ మహరాజు ప్రజలను మోసగించడానికి అనేక మోసపు వాగ్దానాలు చేశాడు. ఓట్లు వేయకుంటే మీపై కేసులు మోపక తప్పదని హెచ్చరించాడు. అట్లాగే మీరు ఓట్లు వేస్తే మీపై నడుస్తున్న నక్సలైటు కేసులన్నిటినీ ఎత్తివేయిస్తాని దొంగ మాటలు చెప్పాడు. బోలెపల్లి గ్రామం వద్ద ఓట్లు వేయించుకొని తిరిగి పోతున్న సీఆర్పీ బలగాలపై స్థానిక దళం, స్పెషల్ దళం కల్సి ఆంబుష్ చేయగా ఒక సీఆర్పీ జవాను, మరో పోలీసు జవాను చచ్చారు.

### ఏటపల్లి ఏరియాలో...

దేవ్‌దా రోడ్డుపై ఎన్నికల బహిష్కరణ ప్రచారంలో భాగంగా పెయింట్‌తో నినాదాలు రాశారు. అట్లాగే అక్కడ రోడ్డు పనిలో ఉన్న ఒక రోలర్‌ను గెరిల్లాలు కాల్చివేశారు. అక్కడే ఒక బ్యానర్ కట్టి డమ్మీ బాంబును కూడా అమర్చారు. దీన్ని తొలగించడానికి సీఆర్పీ, కమాండో బలగాలు నానా హైరానా పడాల్సి వచ్చింది. వాళ్ల భయాన్ని చూసిన ప్రజలు నవ్వుకున్నారు.

### ప్రజా ప్రతిఘటన

కోయందూడ్ గ్రామంలో పీఎల్‌జీఏ గెరిల్లాలు పోలింగ్ జరుగుతున్న సమయంలో, ఉదయం 9 గంటలకు ఎవరూ ఊహించని విధంగా సీఆర్పీ, కమాండో బలగాలు బస చేసిన స్కూలును చుట్టుముట్టి కాల్పులు ప్రారంభించారు. ఈ సంఘటనలో ఒక పోలీసు చచ్చాడు, మరొకడు గాయపడ్డాడు. దీంతో భయపడ్డ పోలీసులు పోలింగ్ పూర్తి కాకుండానే ఉడాయించారు.

ఏటపల్లి ఏరియాలో మంగడండి గ్రామం వద్ద ఎల్‌జీఎస్, ప్లటూన్ కల్సి ఓటింగ్ మిషన్లతో వస్తున్న పోలీసులపై అపార్చునిటీ ఆంబుష్ చేశారు. ఈ సంఘటనలో ఒక హవల్దారు, మరొక జవాను గాయపడ్డారు. పోలీసులు భయాందోళనకు గురై పారిపోయారు.

టిప్రాగడ్ ఏరియాలో కూడా గ్రామగ్రామానా ప్రజా సంఘాలూ, పీఎల్‌జీఏ యూనిట్లూ ఎన్నికల బహిష్కరణ ప్రచారాన్ని విస్తృత స్థాయిలో కొనసాగించాయి. శత్రువు జిల్లాలో 60 శాతం ఓట్లు పడ్డాయని ఎంతగా డబ్బా వాయించుకున్నప్పటికీ వాస్తవమేమిటో ప్రజలకు తెల్సు. ఇందులో దొంగ ఓట్లెన్నో వాళ్లు ప్రత్యక్షంగా చూశారు. అట్లాగే అనేక గ్రామాల్లో తుపాకీ ఎక్కుపెట్టి ప్రజలతో ఓట్లేయించుకొని ఇదే ప్రజాస్వామ్యమని బుకాయిస్తున్నారు. ఈ సందర్భంగా పీఎల్‌జీఏ బలగాలు ప్రజల క్రియాశీల మద్దతుతో జిల్లాలో ప్రతి ఏరియాలోనూ శత్రువుపై దాడులు చేసి కొందరు పోలీసుల్ని హతమార్చి మరెందరినో గాయపర్చారు. ఈ చర్యలలో ప్రజా మిలిషియా, ప్రజల పాత్ర చెప్పుకోదగ్గది. ఈ చర్యలు ప్రజల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందింపజేయగా, మరోవైపు శత్రు బలగాల మనోస్థైర్యాన్ని దెబ్బతీశాయి. అనేక ఘటనల్లో శత్రువు కేవలం ఆత్మరక్షణ స్థితిలోనే ఉండిపోవల్సి వచ్చింది. వాడి బలాధిక్యతా, ఆధునిక ఆయుధ సంపత్తీ చాలా సందర్భాల్లో ఎందుకూ కొరగాకుండా పోయాయి. ఈ విడివిడి దాడులలో సాధించిన చిన్న చిన్న విజయాలు రేపు శత్రువుపై వ్యూహాత్మకంగా సాధించాల్సిన విజయానికి బాటలు వేస్తాయన్నది స్పష్టం. ▲

# పోరుబాటలో దండకారణ్య ప్రజల ముందడుగు

[గత సంవత్సర కాలంగా దండకారణ్యంలో ప్రజలు అనేక పోరాటాలు చేశారు. ప్రభుత్వ నిర్బంధానికి వ్యతిరేకంగా పార్టీ తీసుకున్న నిరసన, ప్రతిఘటనా కార్యక్రమాలలో వేలాది మంది ప్రజలు పాల్గొన్నారు. తమ దైనందిన సమస్యలపైనా, అనేక రాజకీయ సమస్యలపైనా కూడా ఈ ప్రజా పోరాటాలు సాగాయి. అట్లాగే పలు అభివృద్ధి కార్యక్రమాలలో కూడా ప్రజలు పాల్గొని అనేక కొత్త నిర్మాణాలు చేశారు. విప్లవోద్యమ పురోగమనానికి అడ్డంకిగా మారిన కొన్ని దుష్ట శక్తులను ప్రజలు శిక్షించారు. అయితే కొన్ని రిపోర్టులు మాకు ఆలస్యంగా చేరడం వల్ల గత సంచికల్లో వేయలేకపోయాం. కొన్నిటిని సమయభావం వల్ల గత సంచికలో వేయలేకపోయాం. కాబట్టి మాకు ఇప్పటి వరకూ చేరిన రిపోర్టులన్నీ ఈ సంచికలో డివిజన్ల వారీగా ప్రచురిస్తున్నాం. పాఠకులకు కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నాం. ఈ రిపోర్టులన్నీ నడుస్తున్న దండకారణ్య విప్లవోద్యమ చరిత్రను అధ్యయనం చేయడానికి ఉపయోగపడతాయని ఆశిస్తున్నాం.

– సంపాదకులు]

## మాడ్ డివిజన్

### ప్రభుత్వ పోలీసు, అర్ధ సైనిక బలగాల నిర్బంధకాండకు నిరసనగా...

దండకారణ్య విప్లవోద్యమంపై ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న నిర్బంధకాండను నిరసిస్తూ సెప్టెంబర్ 21 నుండి 27 వరకు నిరసనవారం జరపాలని పార్టీ దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ పిలుపునిచ్చింది. ఈ పిలుపునందుకున్న మాడ్ డివిజన్ ప్రజలు పెద్ద ఎత్తున కదిలి ప్రభుత్వ నిర్బంధాన్ని గొంతెత్తి ఖండించారు. నేల్‌నార్ ఏరియాలో కరపత్రాలు పంచి ప్రజల్లో ప్రచారం చేసి మూడు చోట్ల సభలు నిర్వహించారు. ఒక చోట జరిగిన సభకు నాలుగు గ్రామాల నుండి 250 మందికి పైగా ప్రజలు రాగా, మరో చోట జరిగిన సభలో మూడు గ్రామాల నుండి 300 మంది ప్రజలు పాల్గొన్నారు. మూడో చోట జరిగిన సభలో ఒక గ్రామానికి చెందిన 170 మంది ప్రజలు పాల్గొన్నారు. ఈ సభలలో స్థానిక గెరిల్లా దళం నాయకులు మాట్లాడారు. ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఉండగా అమలు జరిగిన నిర్బంధానికి అనేక రెట్లు తీవ్రమైన నిర్బంధాన్ని బీజేపీ రమన్ సింగ్ ప్రభుత్వం అమలు చేస్తున్నదని వక్తలు విమర్శించారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ఘోరంగా విఫలమైన ప్రభుత్వాలు తమ దోపిడీ విధానాలను నిరాటంకంగా అమలు చేస్తూ విప్లవోద్యమాన్ని సమూలంగా అణచివేయాలని ప్రయత్నిస్తున్నారనీ, అయితే ప్రజా ఉద్యమాలు, ప్రజాయుద్ధం ఈ దాడిని తప్పక తిప్పికొడతాయనీ, ప్రజలే అజేయులనీ వక్తలు నొక్కి చెప్పారు. ముఖ్యంగా సీఆర్‌పీ బలగాలు బస్తర్‌లో ప్రవేశించిన తర్వాత నిర్బంధం తీవ్రరూపం దాల్చిందని చెబుతూ అరెస్టులూ, చిత్రహింసలూ, బూటకపు ఎన్‌కౌంటర్లూ, అత్యాచారాలు రోజువారీ దృశ్యాలుగా మారాయని అన్నారు. ఈ సంవత్సరం ఆగస్టు 10న నేల్‌నార్ ఏరియాలో నుల్‌బట్టి, మొర్సుల్ గ్రామాలపై దాడి చేసిన పోలీసు, అర్ధ సైనిక బలగాలు స్త్రీలనూ, పిల్లల్నీ కూడా చూడకుండా దొరికిన వాళ్లందరినీ చితకబాదారని అన్నారు. అట్లాగే ఓర్ఛ సంతలో కూడా నలుగురు రైతుల్ని విపరీతంగా కొట్టారనీ, ఇట్లా ప్రజల్లో భయోత్పాతాన్ని సృష్టిస్తున్నారనీ మాట్లాడారు. ఈ సభలలో ప్రజలు "బస్తర్ నుండి సీఆర్‌పీ బలగాలను వెనక్కి తీసుకోవాలి" అంటూ నినాదాలు చేశారు.

### ప్రజల సమిష్టి శ్రమతో చెరువు నిర్మాణం

మాడ్ డివిజన్ డౌల ఏరియా కుయినార్ గ్రామంలో ప్రతి వేసవిలో ప్రజలకూ, పశువులకూ తాగే నీటికి కటకటగా ఉండేది. చాలా సంవత్సరాలుగా ఇది తీవ్ర సమస్యగా ఉన్నప్పటికీ దోపిడీ ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి పనికీ పూనుకోలేదు. విప్లవోద్యమ క్రమంలో డీఏకేఎంఎస్, కేఏఎంఎస్‌లలో సమీకృతులైన ప్రజలు తమ స్వంత చొరవ ద్వారానే ఈ సమస్యను పరిష్కరించుకోవాలని అనుకున్నారు. తమ అభివృద్ధికి తామే పాటు పడదామనే ఉన్నత చైతన్యంతో నాలుగు వాడలకు చెందిన ప్రజలు సమిష్టిగా శ్రమించారు. 60 నుండి 75 మంది ప్రజలు వరుసగా ఏడు రోజుల పాటు శ్రమించి చెరువు నిర్మాణాన్ని పూర్తి చేశారు. అయితే ఈ ప్రాంతంలో నెలకొన్న తీవ్రమైన కరువు సమస్యను దృష్టిలో ఉంచుకొని స్థానిక పార్టీ ఈ పనిలో పాల్గొన్న ప్రజలకు 3 క్వింటాళ్ల బియ్యం సమకూర్చింది. ముఖ్యంగా ఈ బియ్యాన్ని తినడానికి తిండిలేని పేద కుటుంబాలకు పంచారు. ఈ చెరువు నిర్మాణం ద్వారా ప్రజల సమస్య పరిష్కారమవడంతో పాటు వాళ్లలో తమ సంఘటిత శక్తిపై విశ్వాసం ఇనుమడించింది.

### ఆగస్టు 15న నిరసన దినం పాటించిన డౌల ఏరియా ప్రజలు

మాడ్ డివిజన్ డౌల ఏరియాలో ఆగస్టు 15ను బహిష్కరించాలనీ, నిరసన దినం పాటించాలనీ ప్రజా సంఘాలూ, పార్టీ గ్రామగ్రామానా పోస్టర్లు వేసి ప్రచారం చేశాయి. పర్సగాం, ఉండ్‌వండ్, ఇన్నర్, మతులా, కల్లెపాడ్, మూంజ్‌మెట్ట, కాప్సీ, వాడి, గోటబేనూర్, మధోనార్, బయానార్, కొంగెర, తోయనార్, సులుంగ, కన్నార్‌గాం, కడియనార్, మడానార్, కజ్జుం గ్రామాలలోని స్కూళ్లలో విద్యార్థులు బూటకపు స్వాతంత్ర్యానికి నిరసనగా నల్లజెండాలు ఎగురవేశారు. ఈ సందర్భంగా డీఏకేఎంఎస్ పలు చోట్ల సభలు నిర్వహించింది. ఈ సభలలో ప్రసంగించిన సంఘ నాయకులు ఆగస్టు 15 స్వాతంత్ర్యం బూటకమైందనీ, నిజమైనది కాదనీ వివరించారు. నిజమైన స్వాతంత్ర్యం కోసం పోరాడాలని ప్రజలకు పిలుపునిచ్చారు. బయనార్ గ్రామంలో దళం నిర్వహించిన సభలో 25 గ్రామాల నుండి వచ్చిన సంఘ సభ్యులూ, విద్యార్థులూ, ఇతర సెక్షన్ల ప్రజలూ పాల్గొన్నారు. ఈ సభలో స్థానిక గెరిల్లా దళ కమాండర్ ప్రసంగించారు. "తెల్ల దొరల చేతి నుండి భూస్వామ్య, దళారీ పాలకవర్గాల చేతిలోకి అధికారం మారడమన్నది స్వాతంత్ర్యం కాదు. నిజమైన స్వాతంత్ర్యం కావాలంటే సాయుధ పోరాటం ఒక్కటే మార్గం. నాడు బ్రిటిష్ వలసవాద పాలనకు వ్యతిరేకంగా పోరాడిన గేంద్‌సింగ్, గుండాధుర్‌ల వారసత్వాన్ని కొనసాగించాలి" అంటూ కమాండర్ తన ప్రసంగాన్ని ముగించారు. ఈ సభలో దాదాపు 3,000 మంది ప్రజలు పాల్గొనగా అందులో దాదాపు 1,000 మంది మహిళలున్నారు.

## పోలీసు నిర్బంధానికి వ్యతిరేకంగా రెస్ట్‌హౌజ్‌ను కూల్చిన ప్రజా మిలిషియా

మాడ్ డివిజన్ డౌల ఏరియాలో ప్రజలపై సీఆర్‌పీఎఫ్, పోలీసుల నిర్బంధకాండ రోజురోజుకూ తీవ్రమవుతున్నది. బయనార్, కల్లెపాడ్, సులుంగ గ్రామాల్లో అమరుల జ్ఞాపకార్థం నిర్మించుకున్న స్తూపాలను సీఆర్‌పీ జవాన్లు కూల్చివేశారు. అడవిలో పనుల కోసం వెళ్లిన రైతుల్ని హింసించడం, మహిళల్ని, పిల్లల్ని కూడా వదిలిపెట్టకుండా కొట్టడం పోలీసు బలగాలకు పరిపాటయ్యింది. నిర్బంధానికీ, అమరుల స్తూపాల్ని కూలుస్తున్న పాశవిక చర్యలకూ నిరసనగా డౌల ఏరియా డోంగుర్ గ్రామంలో ప్రభుత్వ రెస్ట్‌హౌజ్‌ను ప్రజలు కూలగొట్టారు. ఈ చర్యలో 40 మంది ప్రజలు పాల్గొన్నారు.

## గుట్కా, మద్యపానాలకు వ్యతిరేకంగా...

మాడ్ డివిజన్ డౌల ఏరియాలో డీఏకేఎంఎస్, కేఏఎంఎస్ రేంజ్ కమిటీల నాయకత్వంలో మొత్తం ఏరియా వ్యాప్తంగా సారా, కల్లు, లంద, తదితర మద్య పానీయాలకూ, గుట్కాకూ వ్యతిరేకంగా కార్యక్రమం తీసుకున్నారు. వీటిని సేవించడం మూలంగా వచ్చే నష్టాల గురించి మీటింగుల ద్వారా ప్రచారం చేశారు. అట్లాగే విస్తృతంగా పోస్టర్లు కూడా వేశారు. డోంగుర్ సంతలో వీటిని పెద్ద ఎత్తున అమ్ముతారు. వీటిని ధ్వంసం చేయడం కోసం 26 గ్రామాల నుండి 3,000 మంది ప్రజలు కదిలి సంత రోజున వీటిని ధ్వంసం చేశారు. అట్లాగే కడియనార్ రేంజ్‌లో కూడా అన్ని గ్రామాల నుండి కదిలిన 2,500 మంది ప్రజలు గుట్కా, కల్లు, సారాల్ని ధ్వంసం చేశారు. ఒక క్యాంపెయిన్‌లా కొనసాగిన ఈ ఉద్యమం చుట్టుపక్కల అన్ని ఏరియాలకూ వ్యాపించింది. బేనూర్ సంతలో 2,500 మంది, వయనార్‌లో 800 మంది, వెడమకోట్‌లో 500 మంది, నారాయణపూర్‌లో 6,000 మంది ప్రజలు కదిలి వీటిని ధ్వంసం చేసారు. ఈ పోరాటానికి అన్ని వర్గాల ప్రజలలోనూ మంచి స్పందన వచ్చింది. ఈ ఉద్యమం ఇంకా కొనసాగుతున్నది.

## గంజాయికి వ్యతిరేకంగా...

ఆదివాసీ ప్రాంతాల్లో గంజాయిని ప్రభుత్వం ఒక పథకం ప్రకారమే ప్రోత్సహిస్తున్నది. అవినీతిపరులైన పోలీసు, రెవెన్యూ అధికార్లు లంచాలు మేసి ఈ వ్యాపారానికి పూర్తి అండదండలు అందిస్తున్నారు. దాంతో బస్తర్ ప్రాంతంలో ఒక పెద్ద గంజాయి మాఫియా తయారైందంటే అతిశయోక్తి కాదు. దీనికి వ్యతిరేకంగా పార్టీ చాలా ఏళ్ల నుండి ప్రజలను చైతన్యవంతుల్ని చేస్తున్నది. అయినా కూడా కొన్ని గ్రామాల పెత్తందార్లు దొంగచాటుగా దీన్ని పండించి అక్రమ వ్యాపారం చేస్తున్నారు. నారాయణపూర్ చుట్టపక్కల గ్రామాలలో పండిస్తున్న గంజాయిని బిలాస్‌పూర్, కాంకేర్ వంటి పట్టణాల నుండి వచ్చే స్మగ్లర్లు కొనుగోలు చేస్తున్నారు. చాలా మంది గోపనీయ సైనికులు స్వయంగా ఈ వ్యాపారం చేస్తున్నారంటే దీనికీ, పోలీసులకూ ఉన్న సంబంధాన్ని అర్థం చేసుకోవచ్చు. ఇటీవల ప్రజా సంఘాలు దీనికి వ్యతిరేకంగా ఒక క్యాంపెయిన్ చేపట్టాలని నిర్ణయం తీసుకున్నాయి. అందులో భాగంగా, రేంజ్ కమిటీల నాయకత్వంలో 8 టీములుగా ప్రజలు కదిలారు. ఒక్కో టీంలో 50-70 మంది ఉన్నారు. ఈ టీములన్నీ నాలుగు రోజుల పాటు ఈ క్యాంపెయిన్‌ను కొనసాగించి మొత్తం 22 గ్రామాల్లో దాదాపు 12 ట్రక్కుల గంజాయిని స్వాధీనం చేసుకొని ధ్వంసం చేశారు. దీన్ని పండిస్తున్న వాళ్లను గ్రామసభల ముందుకు తెచ్చి గట్టిగా హెచ్చరించి వదిలిపెట్టారు. ఇలా ధ్వంసం చేసిన గంజాయి విలువ కొన్ని లక్షల్లో ఉంటుంది. ఈ పోరాటం ద్వారా ప్రజలలో విప్లవోద్యమ ప్రాంతాల్లో గంజాయి పండించవద్దూ, తాగవద్దూ, వ్యాపారం చేయవద్దూ అనే ప్రచారం పెద్ద ఎత్తున సాగింది.

## రామకృష్ణ మిషన్ స్వామిజీ అత్యాచారయత్నానికి వ్యతిరేకంగా ప్రజా ఉద్యమం

ప్రజా సేవ చేయడమే మా లక్ష్యమని గొప్పలు చెప్పుకునే రామకృష్ణ మిషన్ ప్రజా వ్యతిరేక చర్యలు రోజురోజుకూ మరింత నగ్నంగా బైటపడుతున్నాయి. ఇందులో ఉండే స్వామిజీలు సర్వసంగ పరిత్యాగులమని చెప్పుకుంటారు. ఈ స్వామిజీలపై మహిళల పట్ల అనుచిత ప్రవర్తన, అత్యాచార ప్రయత్నం వంటి ఆరోపణలు గతంలో చాలా సార్లు వచ్చాయి. అయినా ఈ ఆరోపణలపై ఈ సంస్థ నిష్పక్షపాతంగా న్యాయవిచారణ జరపకుండా, పైగా అన్నిటినీ కొట్టి పారేస్తూ దోషులను రక్షిస్తూ వస్తున్నది. తాజాగా ఆగస్టు 2004లో నారాయణపూర్‌లోని రామకృష్ణ మిషన్ ఆసుపత్రిలో చికిత్స కోసం వెళ్లిన మీనా దుర్వా అనే ఆదివాసీ యువతిపై చీఫ్ మెడికల్ ఆఫీసర్‌గా వ్యవహరించే వేదాంత చైతన్య అనే స్వామిజీ అత్యాచారం జరుపబోగా ఆ అమ్మాయి తప్పించుకొని బైట పడింది. ఈ విషయం తెల్సిన నారాయణపూర్ చుట్టుపక్కల గ్రామాల నుండి 4 వేల మంది ప్రజలు ఆసుపత్రి ముందు ధర్నాకు దిగారు. ఇందులో మహిళలూ, విద్యార్థులూ, రైతులూ, ఉద్యోగులూ, అన్ని సెక్షన్ల ప్రజలూ పాల్గొన్నారు. కోపోద్రిక్తులైన ప్రజలు స్వామిజీని బైటికి ఈడ్చుకొచ్చి తన్నారు. ఇంతలో సీఎస్ఎఫ్, సీఆర్పీఎఫ్ జవాన్లు వచ్చి వీడిని రక్షించారు. ప్రజలు ఈ సంస్థకూ, పోలీసు అధికార్లకూ విజ్ఞప్తి చేసినప్పటికీ అతనిపై ఎలాంటి చర్యా తీసుకోలేదు. పైగా అతడిని అక్కడి నుండి రాత్రికి రాత్రే బైటికి పంపించివేశారు. డాక్టర్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని ప్రజలు ఊరేగింపు కూడా తీశారు. కానీ అరెస్ట్ చేయడం మాట అటుంచి కనీసం జరిగిన సంఘటనపై విచారణకు కూడా సిద్ధపడకుండా, అసలు ఈ ఆరోపణే తప్పు అని రామకృష్ణ మిషన్ బుకాయించింది. ఆ తర్వాత ఆసుపత్రిని మూసివేసి దీనికి బాధ్యత ప్రజలదేనని దబాయించసాగింది. ప్రజా సేవ చేస్తున్న తమను ఇలా నిందిస్తుంటే డాక్టర్లుగా పని చేయడానికి ఎవరొస్తారని మిషన్ నంగనాచి కబుర్లు చెబుతున్నది. అయితే ఈ మొండివైఖరి ద్వారా ప్రజలు ఈ సంస్థ అసలు స్వభావాన్ని తెలుసుకుంటున్నారు. పచ్చి హిందూత్వ భావాలను వ్యాప్తి చేస్తూ, సంస్కరణల ద్వారా ఇక్కడ సాగే విప్లవోద్యమం నుండి ప్రజలను పక్కదారి పట్టించే వ్యూహాత్మక లక్ష్యంతో పని చేస్తున్న ఈ సంస్థ సారంలో ఎలా ప్రజా వ్యతిరేకమైందో ప్రజలు ఆచరణాయుతంగా తెల్సుకుంటున్నారు. అత్యాచార యత్నం చేసిన డాక్టర్‌ను రక్షించడానికి పోలీసులు చూపిన శ్రద్ధా, చొరవా ఈ సంస్థతో, పోలీసులకూ, మొత్తం దోపిడీ వ్యవస్థకూ ఉన్న లింకేమిటో తెలుపుతున్నాయి.

## ప్రత్యేక బస్తర్ డిమాండ్‌కు మద్దతుగా నవంబర్ 1న బంద్

చత్తీస్‌గఢ్ రాష్ట్ర అవతరణ దినమైన నవంబర్ 1న ఛత్తీస్‌గఢ్‌లో బస్తర్ విలీనాన్ని నిరసిస్తూ, ప్రత్యేక బస్తర్ రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలని

డిమాండ్ చేస్తూ బస్తర్ బంద్‌కు పార్టీ పిలుపునిచ్చింది. అందులో భాగంగా మాడ్ డివిజన్‌లో నేల్‌నార్ ఏరియాలోని డోంగర్ నుండి ఓర్చకు వచ్చే రోడ్డుపై ప్రజా మిలిషియా పోస్టర్లు అంటించి, బ్యానర్లు కట్టింది. అట్లాగే వాహనాల రాకపోకల్ని అడ్డుకోవడానికి రాళ్లు ఏర్పాటు చేసింది. ఆ విధంగా మూడు రోజుల పాటు బంద్ జరిగింది. అయితే మూడో రోజున పోలీసులు రోడ్డు పక్కగా వచ్చి డోంగర్‌లో చదువుకోవడానికి వెళ్తున్న ఇద్దరు విద్యార్థులపై కాల్పులు జరిపారు. అట్లాగే ప్రజలపై కూడా సీఆర్‌పీ జవాన్లు విచ్చలవిడిగా కాల్పులు జరిపారు. ఈ ఘటనల్లో ప్రజలెవ్వరూ గాయపడలేదు. మరుసటి రోజు డోంగర్ నుండి పోలీసులు 30 మంది స్కూలు విద్యార్థుల్ని మానవ కవచాలుగా వాడుకుంటూ రోడ్డుపై బ్యానర్లు, పోస్టర్లు తొలగించారు. ఈ విధంగా ప్రజలు ప్రజాస్వామ్యబద్ధంగా తెలిపే నిరసనను కూడా పోలీసులు సహించలేకపోతున్నారని మరోసారి స్పష్టమైంది.

## పోలీసులకూ, అటవీ శాఖ అధికారులకూ తొత్తులుగా మారిన పెత్తందార్లకు హెచ్చరిక

మాడ్ డివిజన్‌లోని ధనోర గ్రామం ఓర్చ నుండి నారాయణపూర్ వెళ్లే రోడ్డుపై ఉంటుంది. ఇటు డోంగర్ పోలీసు స్టేషన్, అటు ఓర్చ పోలీసుస్టేషన్ ఇక్కడికి దగ్గరే. పోలీసులు తరచుగా వస్తూ పోతూ ఉంటారిక్కడికి. మధ్య చాలా కాలం పాటు ఈ ప్రాంతంలో దళం లేకపోవడంతో అటవీ శాఖ వాళ్లు తమ కార్యకలాపాలను తిరిగి ప్రారంభించడం కోసం ఈ గ్రామ పెత్తందార్లైన దుర్వ క్రిష్ణ, ఊసెండి బిస్రూలను తమ తొత్తులుగా మార్చుకున్నారు. వీళ్లలో ఒకరు మాజీ సర్పంచ్ కాగా మరొకరు ఊళ్లో పెద్ద. వీళ్లు గ్రామంలో ప్లాంటేషన్లు వేయడంలో అటవీశాఖకు సాయపడడమే కాకుండా వాళ్లకు కావల్సిన కల్లు, కోళ్లు కూడా సరఫరా చేయసాగారు. చుట్టుపక్కల గ్రామాల సంఘ సభ్యులను కూడా వీళ్లు పోలీసులకు చెబుతామంటూ బెదిరించే వాళ్లు. గత సంవత్సరం ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఓట్లేయకపోతే పోలీసులకు చెప్పి తన్నిస్తామని వీళ్లు ప్రజలను బెదిరించారు. ఫిబ్రవరిలో నేల్‌నార్ గ్రామంలో భూంకాల్ సభ జరిగిన తర్వాత కూంబింగ్‌కు వచ్చిన పోలీసు బలగాలకు వీళ్లే వెంట ఉండి తోవలు చూపించారు. వీళ్ల కుటుంబాల్లో కూడా అనేక గొడవలున్నాయి. వీళ్లకు గ్రామంలో ప్రతి ఒక్కరితోనూ గొడవలున్నాయి. స్థానిక దళం సెప్టెంబర్ 5న అన్ని పారల ప్రజలనూ పిలిచి వీళ్ల గురించి వివరంగా చర్చించింది. వీళ్ల ప్రజా వ్యతిరేక చర్యలను ప్రజలు తీవ్రంగా ఖండించారు. ఇకనైనా వీరిరువురూ సరిగా మసలుకోవాలనీ, పోలీసులకు మరోసారి సహకరిస్తే చావు తప్పదనీ పంచాయితీ తీర్పునిచ్చింది. వీళ్లు ప్రజలను క్షమించమని వేడుకోవడంతో పంచాయితీ ముగిసింది.

## గడ్చిరోలి డివిజన్

### ట్రాక్టర్‌తో దున్నకం రేట్లు తగ్గింపుకై పోరాటం

గడ్చిరోలి జిల్లా ఏటపల్లి తాలూకా గట్ట రేంజ్‌లో ట్రాక్టర్ల యజమానులు భూమిని దున్నడానికి గంటకు 250 నుండి 300 రూపాయలు తీసుకునేవాళ్లు. కానీ స్థానిక ప్రజలు ఇది చాలా ఎక్కువని భావించారు. దీన్ని తగ్గించాలని నిర్ణయించుకున్నారు. ఆ తర్వాత పార్టీ చొరవ తీసుకొని ఒక రోజు ఏరియాలోని ప్రజలనూ, ట్రాక్టర్ యజమానులందరినీ పిలిచి మాట్లాడింది. ఈ మీటింగ్‌లో ట్రాక్టర్ యజమానులు 10 మంది, ప్రజలు 190 మంది పాల్గొన్నారు. ఈ విషయంపై అందరూ కల్సి చర్చించారు.

ప్రజల ఐకమత్యాన్ని చూసిన ట్రాక్టర్ యజమానులు 250-300 రూపాయలున్న రేటును 230 రూపాయలకు తగ్గించడానికి ఒప్పుకున్నారు.

అట్లాగే పశువులతో దున్నకం కూలీని కూడా చర్చించి దున్నపోతులతో దున్నించినట్టయితే మనిషికీ, దున్నలకూ కలిపి ఒకటిన్నర కండీల ధాన్యం ఇవ్వాలనీ, ఎద్దులతో దున్నించినట్టయితే ఒక కండిగానూ నిర్ణయించారు. పడవల్లో బాండే నదిని దాటిస్తే మనిషికి పది రూపాయలు, సైకిల్‌కు పది రూపాయల చొప్పున తీసుకునే వాళ్లు. పడవల యజమానులను పిలిచి ఈ విషయం కూడా చర్చించి మనిషికి ఐదు, సైకిల్‌కు ఐదు రూపాయల రేటును ఖాయం చేశారు. ఈ సంఘటనతో ప్రజలలో తమ సంఘటిత శక్తి ద్వారా ఎలాంటి సమస్యనైనా పరిష్కరించుకోవచ్చుననే ఆత్మవిశ్వాసం పెరిగింది.

### కర్ర కూపులు దగ్ధం

అడవిలో కర్ర కూపులు తెరవద్దనీ, అడవిని నాశనం చేయొద్దనీ విప్లవోద్యమం చాలా ఏళ్ల క్రితమే తీర్మానించింది. అయితే ఇప్పటికీ ఈ నిర్ణయాన్ని ఉల్లంఘిస్తూ అక్కడక్కడా అటవీశాఖ వాళ్లు కూపులు తెరచి అడవిని నాశనం చేస్తూనే ఉన్నారు. ముఖ్యంగా పెరిగిన పోలీసు నిర్బంధాన్ని ఆసరా చేసుకొని అటవీశాఖ మళ్లీ తన ప్రజా వ్యతిరేక కార్యకలాపాలను ఉధృతం చేస్తోంది. గడ్చిరోలి జిల్లా టిప్పాగఢ్ ఏరియా మురుంగావ్ రేంజ్‌లో ప్రజా సంఘాలూ, ప్రజలూ వ్యతిరేకిస్తున్నప్పటికీ అటవీశాఖ కూపులు తెరిచింది. స్థానిక ప్రజలు అడవి నరకడానికి నిరాకరించడంతో బైటి నుండి కూలీల్ని తీసుకొచ్చారు. పోలీసుల ధీమాతో అటవీశాఖ అధికార్లు తమకు ఎదురే లేనట్టుగా ప్రవర్తించారు. లక్షలాది రూపాయల విలువ చేసే వేలాది చెట్లు నరికించారు. దాంతో ఆగ్రహించిన ప్రజలు ప్రజా మిలిషియా నాయకత్వంలో ఈ కూపులపై దాడి చేసి కర్రను కాల్చివేశారు.

### పోలీసు నిర్బంధాన్ని ధిక్కరించి రేట్లు పెంచుకున్న తునికాకు కూలీలు

గడ్చిరోలి జిల్లా మురుంగాం రేంజ్‌లో పోలీసులు అమలు జరుపుతున్న తీవ్రమైన నిర్బంధం మధ్యనే ప్రజలు తునికాకు కూలీ రేట్లు పెంచాలని డిమాండ్ చేస్తూ పోరాడి విజయం సాధించారు. మురుంగాం ఠానేదారు చౌహాన్ ఈ సమ్మెను ఎలాగైనా విఫలం చేయాలని తీవ్రంగా ప్రయత్నించి విఫలమయ్యాడు. నిప్పులు చెరిగే నిర్బంధం మధ్యనే ఒక్కో యూనిట్‌లో 15 గ్రామాల చొప్పున రెండు యూనిట్ల గ్రామాల ప్రజలు కాంట్రాక్టర్లను పిలిచి రేట్లు పెంచితే గానీ ఆకులు తెంపమని డిమాండ్ చేశారు. అయితే పోలీసుల వత్తిడి మూలంగా కాంట్రాక్టర్లు వెంటనే రేట్లు పెంచడానికి సిద్ధపడలేదు. అయితే ప్రజలు పట్టుదలగా ఆకులు తెంపకుండా సమ్మె కొనసాగించడంతో చివరకు లొంగివచ్చి ప్రజల డిమాండ్ మేరకు 148 రూపాయల రేటు ఇవ్వడానికి అంగీకరించారు.

## 'గాంబందీ' పథకంలో చేరిన ప్రజా శత్రువులకు దేహశుద్ధి

మహారాష్ట్ర పరిధిలోకి వచ్చే గడ్చిరోలి డివిజన్‌లో పోలీసులు తమ బహుముఖదాడిలో భాగంగా 'గాంబందీ' అనే ఎత్తుగడను అమలు చేస్తున్న విషయం పాఠకులకు తెలిసిందే. గతంలో గ్రామాల్లో పెత్తనాలు చేసిన తెగ ముఖ్యులు, విప్లవోద్యమం మొదలై ప్రతి గ్రామంలోనూ సంఘానిదే పై చేయి అయిన తర్వాత తమ సాంప్రదాయ అధికారాన్ని కోల్పోయిన తెగ పెద్ద మనుషులు, భూస్వాములు ప్రస్తుత నిర్బంధంలో కొన్ని గ్రామాల్లో పోలీసుల పక్షం చేరిపోయారు. మరి కొందరు వీళ్ల మాయ మాటలకో లేదా బెదిరింపులకో లొంగిపోయి వీళ్లతో చేయి కలిపారు. ఇలాంటి శక్తులు కొన్ని చోట్ల ప్రజలను అణచిపెట్టి నక్సలైట్లకు 'గాంబందీ' ప్రకటించాయి. వీళ్లకు ప్రభుత్వం లక్షల రూపాయలు మంజూరు చేయడం కూడా వీళ్లను దీనికి ప్రేరేపిస్తున్నది. ఇలాంటి శక్తులను ఎండగడుతూ, అవసరమైన చోట్ల వీళ్లపై చర్యలు తీసుకుంటూ విప్లవోద్యమం పురోగమిస్తున్నది. ఈ మధ్య కాలంలో గడ్చిరోలి డివిజన్లో పలు గ్రామాల్లో ఇలాంటి ప్రజా వ్యతిరేక శక్తులను శిక్షించారు. వాటిలో కొన్ని వివరాలు ఇలా ఉన్నాయి.

గడ్చిరోలి డివిజన్ ఏటపల్లి ఏరియా కొటిమి గ్రామం వద్ద లోక్‌సభ ఎన్నికల సందర్భంగా పీఎల్‌జీఏ గెరిల్లాలు పోలీసులపై కాల్పులు జరిపారు. ఈ సందర్భంగా పోలీసులు గ్రామంలో క్యాంపు వేశారు. క్యాంపు ఉన్న రోజుల్లో ఎస్పీ వచ్చి గ్రామస్తులను నక్సలైట్లను గ్రామంలోకి రానివ్వకుండా 'గాంబందీ' చేయాలని ఉపదేశించాడు. అట్లా చేస్తే 2 లక్షల రూపాయలిస్తామని ఆశ చూపాడు. దాంతో అప్పటికే పార్టీపై వ్యతిరేకతతో ఉన్న గ్రామ పటేల్, కొత్వాలు, ఇతర పెద్దలు వెంటనే సిద్ధపడ్డారు. లింగ, జోగి, ఝుగడూ, ఏసు అనే వ్యక్తులు వీళ్లకు తోడయ్యారు. ఇలా మొదలైంది ఈ ఊళ్లో గాంబందీ. వీళ్లు గ్రామ ప్రజలపై వత్తిడి తెచ్చి నక్సలైట్లను రానివ్వవద్దని నయానా భయానా ఒప్పించారు. ఇలా గాంబందీ చేశామన్న విషయాన్ని ఎక్కడా మాట్లాడవద్దనీ, చుట్టుపక్కల ఏ గ్రామంలోకి దళం వచ్చినా కలవడానికి వెళ్లవద్దనీ, సంఘంలో ఎవరూ చేరొద్దనీ వీళ్లు బెదిరించారు. అట్లా చేస్తే గ్రామానికి రావల్సిన రెండు లక్షల రూపాయలు కూడా రావని బుకాయించారు. ఈ విషయం తెల్సిన స్థానిక గెరిల్లా దళం ఈ గ్రామానికి వెళ్లి ప్రజలందరినీ పిలిచి మీటింగ్ ఏర్పాటు చేసింది. మీటింగ్‌లో ప్రజలు దీని వెనుక ఉందెవరో బైట పెట్టారు. ఇక తమ ఆటలు సాగవని భావించిన పటేల్, తదితరులు తప్పయిందని వేడుకోసాగారు. ఈ ఒక్కసారి క్షమించి వదిలేయాలని ఏడుపులు మొదలు పెట్టారు. నిజానికి ఈ పటేల్‌ను తన పదవి వదులుకొమ్మని పార్టీ ప్రజల సమక్షంలో ఏనాడో చెప్పింది. అయినా వీడు రహస్యంగా పదవిలో కొనసాగుతూ పోలీసుల నుండి రెగ్యులర్‌గా డబ్బులు తీసుకుంటున్నాడు. కొత్వాలు వీడికి తోడుదొంగ. వీడు గ్రామానికి వచ్చే డబ్బులు కాజేస్తుంటాడు. అట్లాగే ప్రభుత్వానికి ఇంటి పన్ను, తదితర పన్నుల్ని కట్టవద్దని ప్రజా సంఘాలు తీర్మానిస్తే వీడు ప్రజలను భయపెట్టి పన్నులు వసూలు చేస్తున్నాడని తేలింది. వీళ్ల ప్రజా వ్యతిరేక కార్యకలాపాలన్నీ మరోసారి వెలుగులోకి వచ్చాయి. దాంతో ప్రజల సమక్షంలో వీళ్లకు దేహశుద్ధి చేసి ప్రభుత్వం ప్రారంభించిన 'గాంబందీ' ఎత్తుగడను తిప్పికొట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రజా వ్యతిరేకులను ఎదిరిద్దామని ప్రజలు నినాదాలు చేశారు.

టిప్రాగడ్ ఏరియా మురుంగాం రేంజ్ కుల్‌బట్టి గ్రామంలో ఏడుగురు ప్రజా వ్యతిరేకులు ప్రభుత్వంతో లాలూచీ పడి 'గాంబందీ' చేశారు. వీళ్లంతా మొదటి నుండీ గ్రామంలో పెత్తనం చేసే కుటుంబాల వాళ్లే. గతంలో సంఘం వాళ్లను అరెస్ట్ చేయించడంలో, సంఘం వాళ్ల పేర్లు పోలీసులకు అందించడంలో వీళ్ల హస్తం ఉంది. ప్రజలను వీళ్లు అణచిపెట్టే వాళ్లు. ఇటీవల గడ్చిరోలిలో పోలీసులు తీసుకున్న 'గాంబందీ' పథకంలో భాగంగా వీళ్లు సహజంగానే చేరిపోయారు. వీళ్లు నక్సలైట్లను గ్రామాల్లోకి రానివ్వవద్దని ప్రచారం చేయడం, ప్రజలను బెదిరించడం, సెంట్రీలు కూడా చేయడం ప్రారంభించారు. దీని గురించి పూర్తి వివరాలు సేకరించిన గెరిల్లాలు గ్రామానికి వెళ్లి వీళ్లందరినీ పట్టుకొని ప్రజల మధ్య విచారించి దేహశుద్ధి జరిపింది. అయితే, దెబ్బల మూలంగా వీరిలో ఒకడు ఆ తర్వాత చనిపోయాడు.

## ప్రజా శత్రువులకు శిక్షలు

సావర్‌గాం గ్రామంలో పటేల్ మానూ మండావి, అటవీశాఖ గార్డుతో పాటు మరో ఐదుగురు కలిసి ప్రజలకు తలనొప్పిగా మారారు. గ్రామంలో ఏ చిన్న సంఘటన జరిగినా వీళ్లు పోలీసుస్టేషన్‌కు వెళ్లి సమాచారం అందించే వాళ్లు. రెండు సార్లు ఈ గ్రామానికి దళం వెళ్లగా వీళ్లు పోలీసులకు సమాచారం అందించారు. ఈ వివరాలు సేకరించిన గెరిల్లా దళం వీళ్లను ప్రజల ముందు నిలబెట్టి తప్పు ఒప్పించి దేహశుద్ధి జరిపింది.

కోసిమి గ్రామానికి చెందిన ఐదుగురు వ్యక్తులు ప్రజా వ్యతిరేకులుగా మారి సంఘం వాళ్లను పోలీసులకు పట్టించారు. వాళ్లు జైలు పాలయ్యారు. దాంతో ఈ ప్రజా శత్రువులను గెరిల్లాలు ప్రజల ముందుకు తెచ్చి దేహశుద్ధి చేశారు. వీరిలో ఇద్దరికి తీవ్రమైన హెచ్చరిక చేసి ఒకడిని గ్రామం నుండి వెళ్లగొట్టారు. అట్లాగే వీళ్లు సంఘ సభ్యులను అరెస్టు చేయించినందుకు 70 వేల రూపాయల నష్టపరిహారం చెల్లించాలని కూడా ప్రజలు తీర్పు చెప్పారు.

అట్లాగే టిప్రాగడ్ ఏరియాలోని డుంచాపూర్, పిట్టెమెట్ట, మర్కగాం, మిచ్‌గాం; ఏటపల్లి ఏరియాలోని కుదిరి, కోందవాహి, వాంగెఝరి, వాడ్స తదితర గ్రామాలకు చెందిన కొందరు ప్రజా శత్రువులను ప్రజల మధ్య పంచాయితీ జరిపి శిక్షించారు. వీళ్లంతా పోలీసు పటేల్, పెత్తందారీ కుటుంబాలకు చెందిన వాళ్లు. గతంలో లొంగి ఉన్నట్టుగా ఉన్న వీళ్లు ప్రస్తుతం పోలీసు నిర్బంధం తీవ్రం కాగానే ప్రజా వ్యతిరేకులుగా ముందుకు వచ్చారు. వీళ్లు ఈ గ్రామాల్లో సంఘ సభ్యులను పోలీసులకు పట్టించి జైలు పాలు చేయించారు. వీళ్లకు దేహశుద్ధితో పాటు ఆర్థిక జరిమానా కూడా విధించారు. అట్లాగే అరెస్ట్ అయ్యి జైళ్లలో ఉన్న సంఘ సభ్యులను విడిపించే బాధ్యత కూడా వీళ్లకు అప్పజెప్పారు. ఒక క్యాంపెయిన్ రూపంలో ప్రజా వ్యతిరేకులకు వ్యతిరేకంగా సాగిన పంచాయితీల ద్వారా ప్రజల్లో ఆత్మవిశ్వాసం ఇనుమడించింది.

## ప్రజా వ్యతిరేకి సర్పంచ్ తుర్సిరాం ఖతం

గడ్చిరోలి డివిజన్ ఏటపల్లి ఏరియాలో తాడిగాం రేంజ్ బాసపల్లి గ్రామ సర్పంచ్ తుర్సిరాంను గెరిల్లాలు ప్రజల అభీష్టం మేరకు ఖతం చేశారు. వీడు 1993 నుండీ పార్టీకి వ్యతిరేకంగా పని చేస్తూ వచ్చాడు. అప్పుడే ఒసారి ప్రజలు వీడిని హెచ్చరించారు. అయినా

వీడిలో మార్పు రాకపోగా పక్కా ఇన్‌ఫార్మర్‌గా మారాడు. దీంతో వీడిని ప్రజలు తన్నారు. వీడు ఇక గ్రామంలో ఉంటే నడవదని భావించి ఏటపల్లి పట్టణంలో డేరా వేసి విప్లవ వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొనసాగాడు. 1993-94 నాటి తీవ్ర నిర్బంధ కాలంలో వీడు సంఘ సభ్యులను పోలీసులకు చూపించి అరెస్టు చేయించాడు. అప్పటి నుండి వీడు ఏటపల్లి వదిలి గ్రామాల్లోకి వచ్చేవాడు కాదు. అయితే గత సెప్టెంబర్‌లో వీడు ఏటపల్లి ఏరియాలోని బిడారి అనే గ్రామంలో చుట్టాల ఇంటికి రాగా అక్కడి ప్రజలు వీడి సమాచారాన్ని పీఎల్‌జీఏ దళానికి అందించారు. దాంతో దళం వెంటనే వీడు పడుకున్న ఇంటిని చుట్టుముట్టి అరెస్ట్ చేసింది. వీడి దగ్గర ఒక కత్తి కూడా ఉండె. కానీ నిద్రపోయి ఉండడం మూలంగా దాన్ని ఉపయోగించే అవకాశం దొరకలేదు. ఆ తర్వాత వాడిని ప్రజల ముందు పెట్టి వాడి నేరాలన్నీ బైట పెట్టి కాల్చిచంపారు. ఇలా చాలా ఏళ్లుగా తప్పించుకు తిరుగుతున్న ఈ ద్రోహి మట్టి గరిచాడు.

## సెప్టెంబర్ 21 నుండి 27 వరకు నిర్బంధ వ్యతిరేక నిరసన వారం

గడ్చిరోలి డివిజన్ అహిరి ఏరియాలో ఈ సందర్భంగా ఐదు గ్రామాల ప్రజలను సమీకరించి రెండు చోట్ల సభలు నిర్వహించారు. కుర్మపల్లి, రాపల్లి, హెక్ర గ్రామాల వాళ్లు దాదాపు 100 మంది ఒకచోట సభ జరుపుకోగా, కప్పవంచ, కొడిశపల్లి గ్రామాల నుండి దాదాపు 90 మంది ప్రజలు మరో చోట సభ జరుపుకున్నారు. ఈ సందర్భంగా వక్తలు దండకారణ్య వ్యాప్తంగా ప్రభుత్వాలు కొనసాగిస్తున్న నిర్బంధకాండ గురించి వివరంగా మాట్లాడారు. అత్యాచారాలు, అక్రమ కేసులు, అమాయక ప్రజల్ని ఎన్‌కౌంటర్ల పేరుతో కాల్చి చంపడం, అమాయకులను కోర్టుల చుట్టూ తిప్పడం ద్వారా ఆర్థికంగా కుంగదీయడం వగైరా రూపాల్లో పోలీసులు సాగిస్తున్న దౌర్జన్యకాండకు హద్దే లేకుండా పోతోందని వక్తలు విమర్శించారు. చివరగా మనమంతా కల్సి ప్రజాయుద్ధాన్ని తీవ్రతరం చేయడం ద్వారా పాశవిక నిర్బంధాన్ని ఓడించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. బూటకపు ఎన్‌కౌంటర్లలో మరణించిన వాళ్ల కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుందామనీ, అండగా నిలుద్దామనీ కూడా ప్రజలు ఈ సందర్భంగా ప్రతిన బూనారు.

## నరబలి ఇస్తున్న సన్కూ బోగామికి శిక్ష

దండకారణ్యంలో ఒకప్పుడు నరబలులు ఎక్కువగానే జరిగేవి. నాగరిక సమాజంగా చెప్పే ఆదివాసీయేతర ప్రాంతాల్లో కూడా నరబలులు, మంత్రగత్తెలనే పేరుతో మహిళలను చంపడం వంటి మూఢాచారాలు ఇప్పటికీ చూస్తూనే ఉన్నాం. అయితే ఇక్కడ విప్లవోద్యమం అభివృద్ధి చెందుతున్న క్రమంలో నరబలులు కొంత వరకు అదుపులోకి వచ్చాయి. అయితే ఇప్పటికీ అక్కడక్కడా ఇలాంటి కేసులు వినవస్తూనే ఉంటాయి. వాటిని ప్రజా సంఘాలూ, పార్టీ ప్రజా పంచాయితీల ద్వారా పరిష్కరిస్తున్నాయి. ఇలాంటిదే ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో కాంకేర్ జిల్లా బాందే రేంజ్ మేకవాయి గ్రామంలో ఒక కేసు వెలుగులోకి వచ్చింది. ఈ గ్రామ పటేల్ సన్కూ బోగామి జనపద్ సభ్యుడిగా కూడా ఉన్నాడు. అంటే గ్రామంలో తెగ పెత్తనం సాగించడంతో పాటు ప్రభుత్వ రాజకీయాలను కూడా తన గుప్పిట్లో పెట్టుకున్నాడన్న మాట. వీడు గ్రామ ప్రజలపై దౌర్జన్యాలకు పూనుకోవడమే కాకుండా గ్రామానికి చుట్టరికంపై వచ్చే వాళ్లను దొంగచాటుగా పట్టుకొని నరబలి ఇవ్వడం కూడా ప్రారంభించాడు. ప్రతి సంవత్సరం పంటలు వచ్చే అక్టోబర్, నవంబర్ నెలల్లో వీడు ఎవరో ఒకరిని చంపేసి రక్తాన్ని పొలం దగ్గర చల్లుతుండే వాడు. డిసెంబర్ 2003లో హాలెటోల గ్రామం వాడైన మస్రూ నరోటి బాందేకు వెళ్తుంటే పట్టుకొని నరబలి ఇచ్చాడు. అయితే ఈ విషయం మెల్లిగా రెండు నెలల తర్వాత బైటికి పొక్కి డీకేఎంఎస్ నాయకత్వానికి తెల్సింది. ఈ విషయం తెలిసిన తర్వాత 38 గ్రామాల ప్రజలకు కబురు పంపి మే 5వ తేదీన ప్రజా పంచాయితీ ఏర్పాటు చేశారు. దాదాపు 600 మంది ప్రజలు ఈ పంచాయితీకి హాజరయ్యారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న వీడికి ఏ శిక్ష విధిద్దామని ప్రజల్ని అడగగా ప్రజలు పెద్ద పెట్టున లేచి సన్కూను చావబాదారు. అట్లాగే ఈ పనుల్లో వీడికి సహకరిస్తున్న చైతు బోగా, భూమ్యా బోగా, టోనీ బంగాలీలను కూడా ప్రజలు తన్నారు. సన్కూ గతం నుండీ చేసిన హత్యలను ఒప్పుకొని ఒక్క చివరి అవకాశం ఇవ్వాలని ప్రజలను ప్రాధేయపడ్డాడు. దాంతో ప్రజలంతా చర్చించి ఇదే చివరి అవకాశమని చెప్పి కొన్ని షరతులు విధించి వదిలేశారు. గ్రామ పటేల్ పదవిని వదిలిపెట్టాలనీ, పంచాయితి సభ్యత్వానికి రాజీనామా చేయాలనీ, చనిపోయిన మస్రూ నరోటి కుటుంబానికి 40 వేల రూపాయలు నష్టపరిహారం చెల్లించాలనీ, ప్రభుత్వం తునికాకు కూలీలకు బోనస్‌గా ఇవ్వగా దిగమింగిన డబ్బును తిరిగి ప్రజలకే ఇవ్వాలనీ, మరోసారి తునికాకు సీజన్‌లో ఎలాంటి పదవినీ చేపట్టవద్దనీ వీడిపై ప్రజా పంచాయితీ కొన్ని ఆంక్షలు విధించింది. ఈ సందర్భంగా సంఘ నాయకత్వం నరబలి చాలా దారుణమైన మూఢాచారమని చెబుతూ ఇలాంటివి ఎక్కడ జరిగినా సంఘం సహించదని ప్రజలకు వివరించి చెప్పింది.

## అటవీశాఖ అధికార్ల జులుంకు వ్యతిరేకంగా...

అహిరి, సిరొంచ తాలూకాల్లో ఒక వైపు పోలీసు నిర్బంధంతో ఆదివాసీ గూడాలు అల్లాడిపోతుండగా మరోవైపు అటవీశాఖ వాళ్ల ఆగడాలు పెచ్చరిల్లిపోతున్నాయి. ఇవన్నీ 1980ల రోజుల్ని జ్ఞప్తికి తెస్తున్నాయి. అటవీశాఖ వాళ్లు ప్రజలను అనేక విధాలుగా బాధలకు గురి చేస్తున్నారు. అడవిలో కనపడితే బండలతో దాడి చేయడం, గొడ్లను గుంజుకోవడం, బండ్లను నరకడం చేస్తూ ఇల్లు కడితే 2 వేలు, అర్క పట్టి 120 రూపాయలు, పొరక తెస్తే 120 రూపాయలు, పశువులపై పన్నులు విధించడం, ఇంకా బలవంతంగా ధాన్యం వసూలు చేయడం, డబ్బు గుంజడం మొదలైన గత కాలపు ఆగడాలన్నీ మళ్లీ మొదలయ్యాయి. అహిరి ఏరియాలో కమలాపూర్ గ్రామంలో అటవీశాఖ వాళ్లు కుటుంబాలతో సహా తిష్ట వేసి చుట్టుపక్కల గ్రామాల ప్రజలను తీవ్రమైన బాధలకు గురి చేస్తున్నారు. ఏప్రిల్ 4 నాడు స్థానిక గెరిల్లా దళం ఫారెస్ట్ గార్డ్, దఫేదారుతో సహా ఆరుగురికి దేహశుద్ధి జరిపింది.

సిరొంచ తాలూకాలో కూడా ఫారెస్టు వాళ్ల దుశ్చర్యలు తీవ్రంగానే ఉన్నాయి. లంకసేన, పిరిమేడ, ఎల్లె గ్రామాలకు చెందిన 13 బండ్లనూ, 26 ఎడ్లనూ ఫారెస్ట్ వాళ్లు బంధించి రేంజ్‌లో పెట్టారు. బండికి 2 వేల చొప్పున డబ్బు వసూలు చేశారు. కేసులు పెట్టి జైల్లో తోసారు. ఈ దుశ్చర్యలకు రేపన్‌పల్లి, సిరొంచ రేంజర్లు నాయకత్వం వహించగా, మొబైల్ స్క్వాడ్ అధికారి నాందేవ్ దనోర్కర్ తన బలగాలతో

రాత్రింబవళ్లు తిరుగుతూ ప్రజలను అరిగోస పెడుతున్నాడు. వీళ్లు అహిరి తాలూకాలోని జిమ్మలగట్ట గ్రామం దగ్గర పర్సవాడ గ్రామాన్ని కేంద్రంగా చేసుకొని తమ కార్యకలాపాల్ని కొనసాగిస్తున్నారు. ఏప్రిల్ 17న రెండు దళాలు కల్సి మొబైల్ స్క్వాడ్ అధికారి నాందేవ్‌నూ, గార్డులు మనోజ్, శంకర్, మహ్మద్ హుస్సేన్‌లనూ కొట్టి వెళ్లగొట్టాయి. అక్కడే ఉన్న అటవీశాఖ జీపును కూడా దగ్ధం చేశాయి.

పై రెండు సంఘటనల ద్వారా అటవీశాఖ వాళ్లు పట్టణాలకు పరుగుదీయగా, పోలీసు నిర్బంధంతో సతమతమవుతున్న ప్రజలు వీళ్ల పీడ విరగడ కావడంతో హాయిగా ఫీలయ్యారు.

## ప్రజావ్యతిరేకీ, పోలీసు ఏజెంటూ సోన్‌సింగ్ ఖతం

గడ్చిరోలి డివిజన్ టిప్రాగఢ్ దళం ఏరియాలోకి వచ్చే గట్టెగహన గ్రామం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం రాజ్‌నాంద్‌గాం జిల్లాకు చెందుతుంది. ఈ గ్రామ పటేల్ సోన్‌సింగ్ తులావీ తొలి నుండీ ప్రజా వ్యతిరేకిగా, దుర్మార్గుడిగా పేరు మోసాడు. అనేక మంది భూముల్ని అక్రమంగా చేజిక్కించుకున్నాడు వీడు. ఎవరైనా బతకడానికి వస్తే వాళ్లకు స్థలాన్ని చూపించి ఉండమని చెప్పేవాడు. వాళ్లు కష్టపడి భూమిని సేద్యం చేయడం మొదలు పెట్టాక ఏదో వంకతో వాళ్లను తరిమేసి ఆ భూములను గుంజుకునే వాడు. మహిళలపై వీడు జరిపిన అత్యాచారాలకు లెక్కే లేదు. వీడు కూలీ పనులు చేయించుకొని డబ్బులు ఎగేసేవాడు. ఇక్కడ పార్టీ పని మొదలు కావడంతో వీడు సహజంగానే పోలీసు ఏజెంటుగిరి మొదలు పెట్టాడు. తన పద్ధతుల్ని మార్చుకోమని వీడికి పార్టీ ఒకటి, రెండు సార్లు హెచ్చరికలు చేసింది. అయినా వీడు మారలేదు. పైగా ఈ విషయాలన్నీ మాన్‌పూర్, గ్యారపత్తి పోలీసు స్టేషన్లలో రెగ్యులర్‌గా చేరవేస్తూ వచ్చాడు. ఓసారి వీడు తన పొలంలో ధాన్యాన్ని తానే కాలబెట్టుకొని నక్సలైట్లు కాలబెట్టారని తప్పుడు రిపోర్టు ఇచ్చాడు. దాంతో వీడికి ప్రభుత్వం నుండి 2 లక్షల నష్టపరిహారం దొరికింది. ఇటీవల పోలీసులు నిర్వహించిన "ఝండా ఊంచా రహే హమారా" అనే అణచివేత క్యాంపెయిన్‌లో వీడు తోవలు చూపించేవాడిగా పాల్గొన్నాడు. ఇవన్నీ గమనించిన స్థానిక ప్రజలూ, పార్టీ కల్సి వీడిని చంపాలన్న నిర్ణయం తీసుకొని ఈ మధ్యనే ఖతం చేశారు.

## ఇన్‌ఫార్మర్ చేతన్‌సాయికి మృత్యుదండన

చేతన్‌సాయి టిప్రాగఢ్ ఏరియా ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో గల ఆమకొడ్డో గ్రామానికి చెందినవాడు. రాజ కుటుంబానికి చెందిన వీడు మొదట పార్టీతో బాగానే ఉండేవాడు. అయితే మధ్యలో వీడు పోలీసులతో సంబంధాలు ఏర్పర్చుకొని ఇన్‌ఫార్మర్‌గా మారాడు. వీడు దళాల, సంఘాల సమాచారాన్ని రెగ్యులర్‌గా మురుంగాం పోలీసుస్టేషన్‌లో అందిస్తూ వచ్చాడు. అయితే వీడినెవరూ అనుమానించలేకపోయారు. 2000 సంవత్సరంలో ఒకసారి వీడి గ్రామానికి దళం వెళ్లగా వీడు దళం మకాం వేసిన స్థలాన్నీ, సెంట్రీ పోస్టునూ చూసి వెళ్లి మురుంగాం పోలీసులకు కబురిచ్చాడు. దాంతో పోలీసులు వెంటనే వచ్చి దళంపై తీవ్రంగా కాల్పులు జరిపారు. అయితే దళం ప్రతిఘటించి ఎలాంటి నష్టాలు లేకుండా తప్పుకుంది. ఆ తర్వాత ఈ ద్రోహానికి కారకులెవ్వరో ఆరా తీస్తే చేతన్‌సాయి పేరు బైటికి వచ్చింది. ఇలాంటి ద్రోహిని వదలగూడదని భావించిన దళం ప్రజల అభీష్టానికి అనుగుణంగా చంపేసింది.

## పోలీసు ఇన్‌ఫార్మర్ రవి బైసారే ఖతం

టిప్రాగఢ్ ఏరియా కోట్గుల్ పోలీసుస్టేషన్ పరిధిలో ఆలోండి గ్రామానికి చెందిన వాడు రవి బైసారే. వీడు చాలా రోజులుగా పోలీసులతో సంబంధాలు ఏర్పర్చుకొని ఇన్‌ఫార్మర్‌గా పని చేస్తున్నాడు. సంఘ సభ్యుల పేర్లు సేకరించి పోలీసులకు తెలియజేస్తుండేవాడు. 2003లో కరువు రావడంతో పార్టీ స్థానిక ప్రభుత్వ గోదాంలపై దాడులు చేయాలని నిర్ణయించింది. అందులో భాగంగా కోట్గుల్ సొసైటీపై ప్రజలు దాడి చేసి రెండు మెటాడోర్లలో బియ్యం తీసుకొచ్చారు. అయితే వాటిని ఏ గ్రామానికి తీసుకెళ్లారు, ఎవరెవరు పంచుకున్నారు అనే వివరాలన్నీ రవి పోలీసులకు అందజేశాడు. వీడికి పోలీసులు గతంలోనే ట్రెయినింగ్ కూడా ఇచ్చారని తెల్సింది. దీంతో వీడిని ఇక వదలగూడదని భావించిన పీఎల్‌జీఏ గెరిల్లాలు ఏప్రిల్ 12వ తేదీన ఖతం చేశారు.

## భామ్రాగడ్ సభాపతి రామ బోగామికి దెబ్బలు

గడ్చిరోలి డివిజన్ భామ్రాగడ్ తాలూకా గట్ట ఏరియాలో కియేర్ గ్రామానికి చెందిన వాడు రామ బోగామి. వీడు 2002 ఎన్నికల్లో భామ్రాగడ్ బ్లాకు అధ్యక్షుడిగా (సభాపతి) ఎన్నికయ్యాడు. ఎన్నికలకు ముందు ప్రజల సమస్యలను పరిష్కరిస్తానని మాయమాటలు చెప్పిన రామ దాని కోసం చేసిందేమీ లేదు. 2003లో భామ్రాగడ్ తాలూకాలో తీవ్రమైన కరువొచ్చింది. ప్రజలు తునికి, రేక, ఇప్పపూలు తింటూ ప్రాణాలు నిలుపుకున్నారు. కానీ వీడు ప్రజల కష్టాల గురించి ఏమీ మాట్లాడలేదు. ఏ కార్యక్రమం తీసుకోలేదు. ఒక పక్క కరువు సమస్య కాగా మరోవైపు పోలీసు నిర్బంధం తీవ్రంగా కొనసాగుతోంది. సామాన్య ప్రజలను నక్సలైట్లకు అన్నం పెడుతున్నారంటూ, మీటింగులకు హాజరవుతున్నారంటూ అరెస్టు చేస్తున్నారు. ఒక్క భామ్రాగడ్ తాలూకా నుండే 27 మందిని జైల్లో నిర్బంధించారు. వీళ్ల విడుదల కోసం రామ చేసిందేమీ లేదు.

డిసెంబర్ 16, 2003 నాడు నేండువాడి గ్రామస్తుడైన కోమటి వాచామిని నారుగుండ పోలీసులు హత్య చేస్తే ప్రజలు పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. కానీ సభాపతి రామ మాత్రం కిమ్మనకుండా ఉండిపోయాడు. ఆ తర్వాత వీడు కోమటి తండ్రి దగ్గరకు వచ్చి పోలీసులపై కేసును ఉపసంహరించుకొని డబ్బులు తీసుకొమ్మని నచ్చజెప్పడానికి ప్రయత్నించాడు. ఈ ప్రజా వ్యతిరేక సభాపతికి బుద్ధి చెప్పాలని పార్టీ, ప్రజలూ నిర్ణయించి దేహశుద్ధి చేశారు.

## ప్రజా వ్యతిరేకి గోట సైనుకు దేహశుద్ధి

గడ్చిరోలి జిల్లా ఏటపల్లి తాలూకా గట్ట గ్రామంలో ఒకప్పుడు గోట సత్తు అనే పెత్తందారు పోలీసు ఇన్‌ఫార్మర్‌గా మారి 1990-91లో ప్రజల చేతిలో ఖతమయ్యాడు. ఈ గ్రామంలో పోలీసుస్టేషన్ ఉంటుంది. దీని అండతో వీడి తమ్ముడు గోట సైను ఇప్పుడు ప్రజా వ్యతిరేక కార్యకలాపాలను కొనసాగిస్తున్నాడు. వీడు మాజీ సభాపతి కూడా. ప్రజలపై పెత్తనం చేయడం, ఇతరుల భూముల్ని కాజేయడం వంటి దుశ్చర్యలతో ప్రజలు విసుగెత్తారు. మాటవర్సె అనే పాత గ్రామం తమదేనని చెప్పి అక్కడ కూడా వీడు ఒక రైతు భూమిని కాజేశాడు. అట్లాగే ఆదివాసీ సంస్కృతికి విరుద్ధంగా వీడు తన

గ్రామంలో దుర్గాదేవి, గణపతి దేవుళ్లను నిలబెడుతూ వాటి పేరుతో చందాలు వసూలు చేసి కాజేయసాగాడు. వీడికి ఒక ట్రాక్టర్ కూడా ఉంది. ట్రాక్టర్‌తో భూమిని దున్నించి కూలీగా వీడు 300 రూపాయలు వసూలు చేసే వాడు. ఇతరులు 250 రూపాయలు వసూలు చేస్తుంటే వీడు మాత్రం అందరినీ బెదిరించి 300 వసూలు చేయాలనే వాడు. దాంతో ట్రాక్టర్లు నడిపే ఇతర రైతులు 250 రూపాయల కూలీకే దున్నినప్పటికీ ఈ విషయం సైనుకు చెప్పొద్దని రైతుల్ని కోరేవారు. వీడికి అందరూ భయపడే వాళ్లు. వీడికి స్థానిక పార్టీ ఒకసారి హెచ్చరిక చేసింది. అయినా వీడు లెక్క చేయకుండా పోలీసులు అండగా ఉన్నారనే ధీమాతో తన ప్రజా వ్యతిరేక చర్యలను కొనసాగిస్తున్నాడు. దాంతో పార్టీ నిర్ణయం మేరకు ప్రజా మిలిషియా, దళం కలిసి వీడిపై దాడి చేసి దేహశుద్ధి చేశారు. ఇప్పటికైనా బాగు పడకపోతే చంపేస్తామని హెచ్చరించారు.

## సర్పంచ్ కోర్కెకు బుద్ధి చెప్పిన ప్రజలు

అహిరి తాలూకా ఆశ గ్రామ సర్పంచ్ కోర్కె కుడిమేత్ దామరంచ పోలీసులతో సంబంధాలు కలిగి ఉండేవాడు. దళానికి అన్నం పెట్టేవాళ్ల పేర్లు పోలీసులకు చెప్పేవాడు. పార్టీలో పని చేసి బైటికి వచ్చిన వాళ్లను వీడు సరెండర్ చేయించేవాడు. ఇలా చేసినందుకు వీడికి డబ్బు ముట్టేది. అట్లాగే పార్టీలో పని చేస్తున్న కామ్రేడ్ల కుటుంబాల వద్దకు వెళ్లి సరెండర్ అయ్యేలా నచ్చజెప్పమని 'హితబోధ' చేసే వాడు. ఇటీవల వీడు కమాండర్ జయక్క ఇంటికి వెళ్లి తల్లిదండ్రులతో తమ కూతురిని సరెండర్ చేయించమని చెప్పాడు. ఇవన్నీ గమనించిన గెరిల్లా దళం వీడిని ప్రజల ముందుకు ఈడ్చుకొచ్చి దేహశుద్ధి జరిపింది. పోలీసులకు తొత్తుగా ఇక ముందు వ్యవహరించవద్దని తీవ్రంగా హెచ్చరించింది.

## మాంద్ర సర్పంచ్‌కు దేహశుద్ధి

1998లో అహిరి ఏరియా మాంద్ర గ్రామంలో దళంపై పోలీసులతో దాడి జరిపించింది వీడే. అయితే అప్పట్లో ఇది నిర్ధారణ కాలేదు. ఆ తర్వాత వీడు గ్రామ ప్రజలను బెదిరించడం, కొట్టడం మొదలు పెట్టాడు. తనకు వ్యతిరేకంగా నిలబడ్డ వాళ్లను పోలీసులకు చెప్పి కొట్టిస్తానని బెదిరించసాగాడు. దళానికి అన్నం పెట్టిన వాళ్ల, సంఘంలో చేరిన వాళ్ల పేర్లు వీడు పోలీసులకు అందించాడు. దీంతో వీడిని స్థానిక దళం ప్రజల ముందుకు తీసుకొచ్చి వీడి నేరాలన్నీ కక్కించి కొట్టి వదిలిపెట్టింది. మరోసారి ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడితే తీవ్రంగా శిక్షిస్తామని హెచ్చరించింది.

## పోలీసు ఇన్‌ఫార్మర్ ఆనంద్‌కు దేహశుద్ధి

గడ్చిరోలి జిల్లా అహిరి తాలూకా ప్రాణహిత రేంజ్‌లోని నిమ్మలగూడెం గ్రామానికి చెందిన ఆనంద్ అనే యువకుడు ప్రజా వ్యతిరేకిగా మారాడు. వీడు గ్రామ పటేల్ కొడుకు. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా నిమ్మలగూడెం దగ్గరలో గెరిల్లాలు పోలీసులపై కాల్పులు జరిపారు. ఈ సంఘటనను ఆసరా చేసుకొని వీడు పోలీసుల ప్రోద్బలంతో నక్సలైట్లను గ్రామానికి రానివ్వవద్దని మాట్లాడసాగాడు. వీడిచ్చిన సమాచారంతో పోలీసులు గుడ్డిగూడెం గ్రామానికి చెందిన 8 మంది ప్రజలను అరెస్ట్ చేసి జైలుకు పంపారు. గెరిల్లా దళం ఈ రెండు గ్రామాల ప్రజల ముందుకు వీడిని తెచ్చి విచారించి ప్రజల తీర్పు మేరకు దేహశుద్ధి చేసింది.

## ఉత్తర బస్తర్ డివిజన్

## వన సురక్షా సమితి ఏర్పాటుకు వ్యతిరేకంగా...

దోపిడీ ప్రభుత్వం అడవులను రక్షించే పేరుతో వన సురక్షా సమితులను ఏర్పాటు చేస్తున్న విషయం తెల్సిందే. ఇవి ప్రపంచ బ్యాంకు ఆదేశాలను అనుసరించి ఏర్పాటు చేస్తున్న సంస్థలు. వీటి ద్వారా ప్రజల్లో ఒక సెక్షన్‌ను అవినీతిమయం చేయడం, ప్రజల్లో తగాదాలు పుట్టించడం, ఇంకా ఒక సెక్షన్‌ను ప్రభుత్వానికి అనుకూలంగా మార్చుకునే దురుద్దేశ్యం దీని వెనుక ఉంది. అందుకే విప్లవోద్యమ ప్రాంతాల్లో ప్రభుత్వం ఏర్పర్చే వన సురక్షా సమితులను ప్రజలు పూర్తిగా బహిష్కరిస్తున్నారు. అడవిని సంరక్షించే బాధ్యత విప్లవోద్యమమే స్వీకరించింది. ప్రజా సంఘాలు నిర్మాణమవుతున్న క్రమంలోనే అడవుల్ని కాపాడుకోవాలన్న చైతన్యాన్ని ప్రజలకు కలుగజేస్తున్నారు. ఇప్పుడు దండకారణ్యమంతటా ప్రజా రాజ్యాధికార సంస్థలు ఏర్పడుతున్న క్రమంలో అటవీ సంరక్షణ కోసం ప్రత్యేకంగా ఒక శాఖా కమిటీని ఏర్పాటు చేసి ప్రజా ప్రభుత్వం దీని బాధ్యతను స్వీకరిస్తున్నది. నిజానికి విప్లవోద్యమం బలపడ్డ తర్వాత అటవీ శాఖ ఉనికే నామమాత్రమై పోయింది. కేవలం రోడ్డు పక్కల గ్రామాలకు, పట్టణ ప్రాంతాలకు మాత్రమే వాళ్ల కార్యకలాపాలు కుదించుకుపోయాయి. అయితే ఇప్పటికీ అక్కడక్కడా కొందరు అటవీ శాఖ ఉద్యోగులు రహస్యంగా తమ కార్యకలాపాలు సాగిస్తూ వన సురక్షా సమితులు ఏర్పాటు చేస్తున్నారు. ఇలాంటిదే ఉత్తర బస్తర్ డివిజన్ రావ్‌ఘాట్ ఏరియాలో ఒక గ్రామంలో సమస్యగా ముందుకు రాగా డీఏకేఎంఎస్ దాన్ని పరిష్కరించింది.

ఆల్‌పర్స్ గ్రామానికి నారాయణపూర్ పట్టణం నుండి వచ్చిన ఫారెస్టర్ గ్రామ పటేల్, సర్పంచ్‌లతో కుమ్మక్కై రహస్యంగా వన సురక్షా సమితిని ఏర్పాటు చేశాడు. ఇందులో 30 మంది పేర్లు వీళ్లే రాశారు. ఆ పేర్లలో చాలా మంది సంఘ సభ్యులవి కూడా ఉన్నాయి. ఈ తతంగమంతా గ్రామంలో మరెవ్వరికీ తెలియదు. అయితే ఇది మెల్లగా సంఘ సభ్యులకు పొక్కిపోయింది. వాళ్లు ఈ ముగ్గురినీ నిలదీశారు. వాళ్లు జరిగిన తప్పును ఒప్పుకున్నారు. తన రిటైర్మెంట్ దగ్గర పడింది కనుక ఒకటైనా వన సురక్షా సమితిని ఏర్పాటు చేస్తే వేతనం పెరుగుతుందనే ఆశతో ఈ పనికి పూనుకున్నానని ఫారెస్టర్ ఒప్పుకున్నాడు. పటేల్, సర్పంచ్‌లు డబ్బాశకు ఒప్పుకున్నారన్నది స్పష్టమే. ఈ ముగ్గురినీ ప్రజల మధ్య నిలబెట్టి గట్టిగా హెచ్చరించారు. దోపిడీ ప్రభుత్వం ఏర్పాటు చేసే వన సురక్షా సమితులతో మాకు అక్కర లేదని, మా అడవుల్ని మా ప్రజా ప్రభుత్వం కాపాడుకుంటుందని స్పష్టం చేశారు. ముగ్గురూ కూడా చేసిన తప్పుకు ప్రజలను క్షమాపణ వేడుకున్నారు.

## తునికాకు రేట్ల కోసం పోరాటం

గత ఏప్రిల్ నెలలో ఉత్తర బస్తర్ డివిజన్ బార్దా ఏరియాలో డీఏకేఎంఎస్, కేఏఎంఎస్ సభ్యులతో ఏర్పాటైన 8 ప్రచార దళాలు గ్రామగ్రామానా తునికాకు రేట్ల కోసం పోరాడాలనే ప్రచారం చేశాయి. 100 కట్టలకు 87 రూపాయల కూలీ ఇవ్వాలనీ, మూడు రోజులకోసారి కూలీ డబ్బులివ్వాలనీ, ఉల్టాయి-పల్టాయి రేటు 70 రూపాయలివ్వాలనీ, ఆకులు కోసేటప్పుడు ఎవరైనా ప్రమాదవశాత్తు మరణిస్తే 50 వేల రూపాయల నష్టపరిహారం ఇవ్వాలనీ, ఇంకా కొన్ని డిమాండ్లతో పోరాటం ప్రారంభించాలని ఈ ప్రచారం సాగింది. అట్లాగే గ్రామాల్లో గోడలపై నినాదాలు కూడా రాశారు. ఈ సందర్భంగా బడేడోంగర్ గ్రామంలో "తునికాకు పోరాట కమిటీ" నాయకత్వం కింద ప్రజలు

పెద్ద ఊరేగింపు తీశారు. ఇందులో దాదాపు 4 వేల మంది ప్రజలు పాల్గొనగా అందులో వెయ్యి మంది మహిళలు. వీళ్లంతా 40-50 గ్రామాల నుండి వచ్చారు. తునికాకు కూలీ రేట్లు పెంచాలనీ, డిమాండ్లు సాధించే దాకా పోరాడుతామని ప్రజలు నినాదాలు చేస్తూ ఊరేగింపు తీశారు. చివరన వాళ్లు అక్కడి అధికార్లకు తమ డిమాండ్ల తెలుపుతూ విజ్ఞప్తులు అందజేశారు.

## మాట ఖాతరు చేయని కాంట్రాక్టరుకు బుద్ధి చెప్పిన ప్రజలు

కేస్కల్ ఏరియాలో ప్రజలు తునికాకు రేట్ల పెంపుదల కోసం పోరాటం ప్రారంభించారు. కొండగాం డివిజన్‌లోని కాకోడి యూనిట్ కాంట్రాక్టర్ ప్రజలు అడిగిన రేట్లు ఇవ్వడానికి సుతరామూ సిద్ధపడలేదు. కాకోడి గ్రామం కొండగాం-నారాయణపూర్ రోడ్డుపై ఉంటుంది. కనీసం రేట్ల విషయంలో చర్చించుకుందామని ప్రజలు పిలిచినప్పటికీ వాడు వినలేదు. తన యూనిట్ రోడ్డుపై ఉంది కనుక తనకు పోలీసుల మద్దతు ఉంటుందనీ, తననెవరూ ఏమీ చేయలేరనీ భావించి మొండి వైఖరి చేపట్టాడు. దీంతో వీడికెలాగైనా బుద్ధి చెప్పాలని ప్రజలు నిర్ణయించుకున్నారు. జూన్ 13వ తేదీన 35 మంది ప్రజా మిలిషియా కాకోడికి వెళ్లి ఆకుల కల్లాన్ని కాలబెట్టింది. అట్లాగే అక్కడున్న వాహనాల్ని కూడా ధ్వంసం చేశారు. తమ డిమాండ్లు నెరవేర్చాలని అక్కడున్న మేనేజర్‌ను హెచ్చరించి వెనుదిరిగారు.

## ఆకతాయిలపై మాసోడ్‌లో ప్రజా పంచాయితీ

జూలై 28 సందర్భంగా ప్రచారంలో భాగంగా బడ్‌గాం గ్రామంలో వాల్‌రైటింగ్ చేయడం కోసం మేండ్ర గ్రామానికి చెందిన ఇద్దరు సంఘ నాయకులు వెళ్లారు అయితే వీళ్లకు చదువు రాకపోవడంతో తమ గ్రామంలోని నలుగురు చదువుకున్న యువకులను తీసుకెళ్లారు. అయితే వీరిలో ఇద్దరు తిరుగుబోతులు. వీళ్లిద్దరూ విప్లవ నినాదాలకు బదులు ఇష్టం వచ్చినట్టుగా చెత్త రాతలు రాసి కింద పీపుల్స్‌వార్ అని పార్టీ పేరు రాశారు. అట్లాగే దుకాణాల యజమానులను బెదిరించడం, కొందరి దగ్గర సారా అడిగి తాగడం లాంటి తప్పుడు పనులు చేశారు. వీళ్ల వెంట వెళ్లిన సంఘ నాయకులకు చదువు రాదు కనుక వీళ్లు రాసిన రాతలేమిటో అర్థం కాలేదు. మరుసటి రోజు పనులపై బడ్‌గాం వెళ్లిన వేరే సంఘ సభ్యులు ఈ రాతలు చూసి పార్టీకి చెప్పడంతో బడ్‌గాం, ఆ చుట్టుపక్కల గ్రామాల ప్రజలను పిలిచి ప్రజా పంచాయితీ నిర్వహించారు. దాదాపు 300 మంది ఈ పంచాయితీకి హాజరయ్యారు. ఈ ఆకతాయిలు తమ తప్పును ఒప్పుకొని తాము రాసిన నినాదాలు తుడిచి ఇక ముందు ఎప్పుడూ ఇలాంటి తప్పుడు పనులు చేయమని హామీ ఇచ్చారు. సినిమాల ద్వారా, టీవీల ద్వారా చొరబడుతున్న సామ్రాజ్యవాద సంస్కృతి యువతను ఏ విధంగా తయారు చేస్తున్నదో ఈ ఘటన ద్వారా మరోసారి స్పష్టమవుతోంది. యువతను ఈ విషపూరిత మాయాజాలం నుండి బైటకు తేవడానికి విశేష కృషి చేయాల్సిన అవసరాన్ని కూడా ఈ సంఘటన తెలియజేస్తుంది.

## అటవీశాఖ అధికారుల మోటారు సైకిళ్లు దగ్ధం

కేస్కల్ ఏరియాలో కోకోడి అనే గ్రామం చుట్టుపక్కల అటవీశాఖ అధికారుల జులుం పెచ్చరిల్లిపోయింది. ప్రజలు వీళ్లతో విసిగిపోయారు. ప్రజలను అడవి నుండి కర్రలు తెచ్చుకోనివ్వకుండా, తప్పుడు కేసులు మోపి డబ్బులు వసూలు చేయడం, పంటపొలాలను అడవిలో కలుపుకోవడానికి ప్రయత్నించడం, ప్లాంటేషన్లు వేయడం, సామాన్య ప్రజలను భయపెట్టడం అటవీశాఖ వాళ్ల నిత్యకృత్యాలయ్యాయి. వీటికి అడ్డుకట్ట వేయడం కోసం ప్రజా మిలిషియా సభ్యులు మే 16న అడవిలోకి వచ్చిన డిప్యూటీ రేంజర్‌నూ, ఇతర అటవీ శాఖ ఉద్యోగులనూ పట్టుకొని వాళ్లను ప్రజల్లో విచారించి తన్ని బుద్ధి చెప్పారు. ఆ తర్వాత వాళ్ల రెండు మోటార్‌సైకిళ్లను కాల్చివేశారు.

## నకిలీ నక్సలైట్లకు బుద్ధి చెప్పిన ప్రజలు

ఆగస్టు 8న ఉత్తర బస్తర్ డివిజన్ రావ్‌ఘాట్ ఏరియాలో నకిలీ నక్సలైట్లపై ప్రజాకోర్టు నిర్వహించారు. ఇందులో 1000 మంది స్త్రీపురుషులు పాల్గొన్నారు. ఈ నకిలీలు మెండో, మాడ్‌కట్ట గ్రామాలకు చెందిన యువకులు. వీళ్లలో కొందరు చదువుకున్న వాళ్లు కూడా ఉన్నారు. దాదాపు అంతా పేద, మధ్య తరగతి కుటుంబాల వాళ్లే. సామ్రాజ్యవాద సంస్కృతితో ప్రభావితులైన ఈ యువకులు నక్సలైట్ల పేరు చెప్పి దొంగతనాలు చేయడానికి అలవాటు పడ్డారు. దళాలు వెళ్లని గ్రామాలకు వెళ్లి స్థానిక కమాండర్ల పేరు చెప్పి, దొంగ ఉత్తరాలు చూపించి డబ్బు వసూలు చేయడం ప్రారంభించారు. ఇలా వీళ్లు లూటీ చేసిన మొత్తం డబ్బు 3 లక్షల దాకా ఉంటుందని లెక్క తేలింది. ఆఖరుకు వీళ్లను ఒక గ్రామంలో ప్రజలే పట్టుకొని దళానికి అప్పగించారు.

ప్రజా కోర్టుకు దాదాపు 30 గ్రామాల ప్రజలు వచ్చారు. ఈ 11 మంది నకిలీ నక్సలైట్లు తాము చేసిన నేరాలన్నీ ప్రజల ముందు ఒప్పుకున్నారు. చివరన ప్రజల అభిప్రాయం మేరకు వీళ్లు లూటీ చేసిన డబ్బంతా వీళ్ల నుండి వసూలు చేసి సంబంధిత వ్యక్తులకు అప్పజెప్పాలనీ, అట్లాగే ఈ నేరాలకు పాల్పడ్డందుకు గాను వీళ్లు ప్రజల ముందు గుంజీలు తీసి ఇక ముందెన్నడూ ఇలాంటి దొంగ పనులకు పాల్పడమని క్షమాపణ కోరుకోవాలనీ ప్రజా కోర్టు తీర్పునిచ్చింది. ఈ సందర్భంగా సామ్రాజ్యవాద దుష్ట సంస్కృతి ఎలాంటి తప్పుడు విలువలు ప్రవేశపెడుతున్నదో, ఏ కష్టం లేకుండానే అక్రమ మార్గాలలో డబ్బు సంపాదించుకునేలా ఎలా యువతరాన్ని ప్రేరేపిస్తున్నదో పార్టీ నాయకులు వివరించారు. ఇలాంటి సంస్కృతిని రూపు మాపి ప్రజా సంస్కృతినీ, శ్రమైక జీవన సంస్కృతినీ పెంపొందించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు.

## ప్రజలతో బలవంతంగా ఓట్లేయించిన సర్పంచ్, వార్డ్ పంచ్‌లకు శిక్ష

కేస్కల్ ఏరియా హాట్‌చపాయి గ్రామ సర్పంచ్ కారియ గోట. ఇతను గత సంవత్సరం విధానసభ ఎన్నికల సందర్భంగా పోలీసులు వచ్చారంటూ పుకార్లు పుట్టించి ప్రజలను బలవంతపెట్టి ఓట్లు వేయించాడు. ఓట్లు పడ్డ తర్వాత పోలింగ్ సిబ్బందిని సురక్షితంగా బైటికి పంపించాడు. అట్లాగే తుర్కీ గ్రామానికి చెందిన వార్డ్ పంచ్ చమురూ విధానసభ, లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ప్రజలపై వత్తిడి తెచ్చి ఓట్లేయించాడు. సంఘ కార్యకర్తలను కూడా దబాయించాడు. అట్లాగే వీజె గ్రామ సర్పంచ్ కూడా ఇలాగే ఎన్నికల సందర్భంగా పోలింగ్ సిబ్బందికీ, పోలీసులకూ సహకరించాడు. ఈ గ్రామంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లు జప్తు చేసుకున్న సంఘ సభ్యుల పేర్లను వీడు పోలీసులకు చెప్పాడు. వీళ్లందరినీ ప్రజా మిలిషియా ఆ తర్వాత అరెస్టు చేసి సంబంధిత గ్రామాల ప్రజల సమక్షంలో ప్రజా పంచాయితీ జరిపి ప్రజల తీర్పు మేరకు దేహశుద్ధి చేసింది. ఇలా ప్రజా వ్యతిరేక చర్యలకు మరోసారి పూనుకుంటే క్షమించేది లేదని హెచ్చరించింది.

## ప్రజా వ్యతిరేకులకు శిక్షలు

ఉరుందబేడ రేంజ్ కానాగాం గ్రామస్తుడైన అమర్ గావ్డే ఒక తిరుగుబోతు. దొంగతనాలు, అమ్మాయిల్ని బలాత్కరించడం, పార్టీ పేరు చెప్పి తప్పుడు పనులకు పాల్పడడం, అడిగిన వాళ్లను పోలీసులకు చెబుతానని బెదిరించడం వగైరా వీడి కార్యకలాపాలు. వీడిని ప్రజలు ఒకసారి తన్నినా బుద్ధి రాలేదు. ఇక చివరగా వీడిపై స్థానిక దళం ప్రజా పంచాయితీ నిర్వహించి తీవ్రంగా కొట్టి బుద్ధి చెప్పింది.

అంతాగడ్ రేంజ్ సరండీ గ్రామస్తుడు రమన్‌సింగ్ సాహు ఒక సంవత్సర కాలంగా పోలీసులకు సహకరిస్తూ వస్తున్నాడు. సంత రోజున పోలీసులను కలిసి చుట్టుపక్కల సమాచారాన్ని అందజేస్తున్నాడు. రహస్య సమాచారం సేకరించేందుకు వచ్చే సీఐడీలకు వీడు తన ఇంట్లో ఆశ్రయం కల్పిస్తున్నాడు. దళాల కోసం దుకాణంలో సామాన్లు ఎవరు కొంటున్నారో పోలీసులకు ఎప్పటికప్పుడు తెలియజేస్తున్నాడు. ఇవన్నీ ప్రజల ముందు చర్చించి వాళ్ల ఆమోదంతో వీడికి గెరిల్లాలు దేహశుద్ధి జరిపారు.

కేస్కల్ ఏరియాలోనే అర్రా గ్రామానికి చెందిన సియారాం ప్రజలను పలు రకాలుగా పీడించసాగాడు. వీడు ప్రజల నుండి గుగ్గిలం గింజలు కొని డబ్బులు ఎగవేశాడు. డబ్బులిమ్మని అడిగినవాళ్లను బెదిరించసాగాడు. ఎన్నికల సందర్భంగా ప్రజలంతా బహిష్కరణ సిద్ధపడగా వీడు ప్రజలను బెదిరించి ఓట్లేయించడానికి ప్రయత్నించాడు. పార్టీకి వ్యతిరేకంగా వీడు ప్రజలను రెచ్చగొట్టసాగాడు. అటవీశాఖ అధికార్లకు తొత్తుగా మారిన వీడు ప్రజలకు బెడదగా పరిణమించాడు. దాంతో ప్రజా సంఘాల నాయకత్వంలో ప్రజా కోర్టు నిర్వహించి వీడికి దేహశుద్ధి చేశారు. ఈ ప్రజా కోర్టులో 150 మంది మహిళలతో సహా మొత్తం 250 మంది ప్రజలు పాల్గొన్నారు.

## ట్రాక్టర్లను కాల్చిన ప్రజా మిలిషియా

విప్లవోద్యమ అణచివేతలో భాగంగా ప్రభుత్వం దండకారణ్యంలో విస్తృత స్థాయిలో రోడ్ల నిర్మాణం చేపట్టింది. పార్టీ, ప్రజా సంఘాలు ఈ రోడ్ల నిర్మాణాన్ని వ్యతిరేకిస్తున్నాయి. ప్రజలు ఈ రోడ్ల నిర్మాణం వెనుక ప్రభుత్వ ఉద్దేశ్యమేమిటో అర్థం చేసుకొని దీన్ని క్రియాశీలంగా వ్యతిరేకిస్తున్నారు. ఇది తమ అభివృద్ధి కోసం కానే కాదని, అణచివేత కోసమే చేస్తోందని ప్రజలు చెబుతున్నారు. అందుకే గత మార్చ్ నెలలో ఉత్తర బస్తర్ డివిజన్ ఉరుందబేడ రేంజ్ ఇరాగాం గ్రామంలో రోడ్డు నిర్మాణాన్ని కాంట్రాక్టర్లు ప్రారంభించగా వెంటనే ప్రజా సంఘాలు పోస్టర్లు వేసి దీన్ని ఆపాలని కోరాయి. కానీ దీన్ని లెక్క చేయకుండా కాంట్రాక్టర్లు పని కొనసాగించడంతో ఆరు గ్రామాల నుండి ప్రజా మిలిషియా సభ్యులు దాదాపు 50 మంది కదిలి వెళ్లి కాంట్రాక్టర్‌కు చెందిన నాలుగు ట్రాక్టర్లను కాల్చి వేశారు. రాజస్థాన్‌కు చెందిన ఆ కాంట్రాక్టర్‌ను అక్కడి నుండి పారదోలారు.

## ప్రజలను లొంగదీసుకొని ఓట్లేయించిన పెద్ద మనుషులకు దండన

ఉత్తర బస్తర్ డివిజన్ కోయిలిబేడ ఏరియాలో గత లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ప్రతి గ్రామంలో బహిష్కరణ ప్రచారం జరిగింది. అయితే అక్కడక్కడా కొందరు పెద్ద మనుషులు రహస్యంగా బూర్జువా పార్టీల నాయకుల నుండి డబ్బులు తిని ప్రజలతో ఓట్లేయించారు. కోపెన్‌గుండ, రాజముండ, గోడియా, కాందాడి, హల్లదాండి, కైరిపదర్ గ్రామాల ప్రజలను వీళ్లు ఓట్లు వేసేలా చేయగలిగారు. వీళ్లంతా గ్రామాల్లో పటేళ్లుగా, ఇతర తెగ పెద్దలుగా అధికారం నడుపుతూ వచ్చిన వాళ్లే. ఓట్లు వేయకుంటే ప్రభుత్వం మనల్ని చంపేస్తుందనీ, భూముల్ని లాక్కొని వేలం వేస్తుందనీ, జైల్లో నిర్బంధిస్తుందనీ వీళ్లు ప్రజలను బెదిరించారు. ఎన్నికల పూర్తయిన తర్వాత వీళ్ల బండారం బైట పడింది. వీళ్లకు ఒక్కొక్కరికి 10 వేల రూపాయల చొప్పున లంచాలు ముట్టాయన్న విషయం కూడా బైట పడింది. దాంతో డీఏకేఎంఎస్, కేఏఎంఎస్‌ల నాయకత్వంలో చుట్టుపక్కల 10 గ్రామాల ప్రజల సమక్షంలో వీళ్లపై పంచాయితీ జరిపారు. వీళ్లు తమ తప్పును ఒప్పుకున్నారు. వీళ్లు ఎన్నికల పార్టీల నుండి తెచ్చుకున్న డబ్బుతో పాటు అదనంగా ఐదు వేల రూపాయల జుర్మానా ప్రజలకు చెల్లించాలనీ, అది ప్రజల సమిష్టి అభివృద్ధి కార్యక్రమాలకు ఖర్చు పెట్టాలనీ పంచాయితీ తీర్పునిచ్చింది. వీళ్లు తమ తప్పును ఒప్పుకున్నారు. వీళ్ల పేర్లు – పాండు పద్దా, కోలూరాం కళ్లామి, మంగేల్ గావ్డే, రామసింగ్ గావ్డే, ధనిరాం గావ్డే, కోరెటి గైత.

## దక్షిణ బస్తర్ డివిజన్

## చింతగుప్ప ఇన్‌ఫార్మర్ సోడి వారె ఖతం

దక్షిణ బస్తర్ డివిజన్ కుంట ఏరియా చింతగుప్ప గ్రామానికి చెందిన సోడి వారె పోలీసు ఇన్‌ఫార్మర్‌గా మారి సంఘ సభ్యులను పోలీసులకు పట్టించసాగాడు. వీడు చింతగుప్ప సంతకు వచ్చే డీఏకేఎంఎస్, కేఏఎంఎస్ కార్యకర్తలను పోలీసులకు చూపించేవాడు. వీడి మూలంగా కరిగుండ గ్రామ సంఘ నాయకుడు సోడి బుద్రాల్ అరెస్ట్ అయ్యాడు. మరో కేఏఎంఎస్ సభ్యురాలిని కూడా వీడు పోలీసులకు చూపించాడు కానీ ఆమె తప్పించుకుంది. వీడు పోలీసులతో ఉంటూ వాళ్లతోనే కల్లు తాగుతూ గడిపేవాడు. దీంతో వీడిని శిక్షించడం కోసం ప్రజా మిలిషియా చాకచక్యంగా చింతగుప్పలోనే అరెస్ట్ చేసి పట్టుకొచ్చింది. ఆ తర్వాత 12 గ్రామాల ప్రజల సమక్షంలో ప్రజా పంచాయితీ నిర్వహించారు. ఈ పంచాయితీలో మొత్తం 1,600కు పైగా మంది ప్రజలు పాల్గొన్నారు. వీడి నేరాలన్నీ విచారించిన తర్వాత ప్రజా పంచాయితీ వీడిని చంపాలని ఏకగ్రీవంగా తీర్పునిచ్చింది. వీడిని అక్కడికక్కడే చంపేసి శవాన్ని చింతగుప్ప రోడ్డుపై పడవేశారు. ▲

## పాఠకుల మాట

*ఆగస్టు 12, 2004*

'ప్రభాత్' 1/2004, 2/2004 సంచికలు చూశాను. పత్రిక దోపిడీకి వ్యతిరేకంగా తన వాణిని గట్టిగా వినిపిస్తోంది. "ప్రతి విప్లవంలోనూ రాజ్యాధికార సమస్యే మౌలిక సమస్య", "గ్రామీణ ప్రాంతాల పరిశీలన", "కేడర్లకు సంబంధించిన విధానం" వంటి మావో వ్యాసాలు జ్ఞానదాయకంగా ఉన్నాయి. కామ్రేడ్ గౌరవ్‌ను కలవడానికి వచ్చిన జర్మన్ ప్రతినిధివర్గంతో ప్రభుత్వం వ్యవహరించిన తీరు బాధాకరం. ఛత్తీస్‌గఢ్‌లో శిక్షాకర్మీల సమ్మె నాయకత్వ విద్రోహం మూలంగా విఫలం – పత్రికలో సరిగానే రాశారు. చాలా సార్లు రాజీవాద నాయకత్వాల విద్రోహం మూలంగానే ఉద్యమాలు ఎలాంటి నిర్దిష్ట నిర్ణయం జరక్కుండానే ముగుస్తున్నాయి. 'ప్రభాత్' తన పేరుకు తగ్గట్టుగానే శక్తిదాయకంగా ఉంది. దీన్ని ద్వైమాసిక పత్రికగా తెస్తే బాగుంటుంది.

ప్రజల ప్రయోజనాలకు అంకితమైన పత్రికకు శుభాకాంక్షలతో...

*మీ,*

*లక్మూ, గంగలూర్.*

# గోపనీయ సైనికుల భరతం పట్టిన ప్రజా మిలిషియా

దండకారణ్యంలో పోలీసులు ఇన్‌ఫార్మర్లను తయారు చేసుకొని వాళ్లను గోపనీయ సైనికుల పేరుతో పని చేయిస్తున్నారు. వీళ్లకు రెగ్యులర్‌గా జీతాలిస్తున్నారు. విప్లవ కార్యకలాపాల సమాచారాన్ని సేకరించడానికి శత్రువు ప్రధానంగా గ్రామాల్లోని జులాయి యువకుల పైనే ఆధారపడుతూ, క్రమంగా వీళ్లను గోపనీయ సైనికులుగా రిక్రూట్ చేసుకుంటున్నాడు. గ్రామాలలో, అడవుల్లో సీఆర్పీ, పోలీసు బలగాలు గస్తీ నిర్వహించడానికి గైడ్లుగా ఈ యువకులే పని చేస్తున్నారు. వీళ్లకు డబ్బిచ్చి, రకరకాల ఆశలు చూపి గోపనీయ సైనికులుగా చేర్చుకుంటున్నాడు. వీళ్లంతా ఉద్యమానికి పెద్ద ఆటంకంగా తయారయ్యారు. ఉత్తర బస్తర్, మాడ్ డివిజన్లలో ఈ సమస్య ఎక్కువగా ఉంది. వీళ్లను నిర్మూలించకుండా విప్లవోద్యమం ముందుకు పోవడం కష్టమని భావించిన పార్టీ అనేక యాక్షన్ టీంలు ఏర్పాటు చేసి వీళ్ల భరతం పట్టాలని పథకం తయారు చేసింది. ఈ టీంలు గత సంవత్సర కాలంలో అన్ని డివిజన్లలోనూ ప్రజల క్రియాశీల మద్దతుతో కొన్ని చర్యలు విజయవంతంగా పూర్తి చేశాయి. ఈ యాక్షన్ టీంలలో పీఎల్‌జీఏలోని మూడు రకాల బలగాల సైనికులూ సభ్యులుగా ఉన్నప్పటికీ ప్రజా మిలిషియా పాత్ర ప్రత్యేకించి చెప్పుకోదగ్గది.

## ధనోరలో దయాశంకర్ ఖతం

కేస్కల్ ఏరియాలో ధనోర పోలీసుస్టేషన్ దగ్గర పోలీసుల నీడనే ఉంటున్న దయాశంకర్‌ను ముగ్గురు సభ్యుల యాక్షన్ టీం సాహసోపేతంగా హతమార్చింది. దయాశంకర్ బార్దా ఎల్జీఎస్ ప్రాంతంలోని కొడ్యార్ గ్రామం వాడు. వీడు భూస్వామి, పెత్తందారూ కూడా. అక్రమంగా ప్రజల భూములను ఆక్రమించిన వీడు విప్లవోద్యమానికి వ్యతిరేకంగా నిలిచి పోలీసులకు సహకరిస్తూ వచ్చాడు. వీడిపై దాడికి ప్రజలు పెద్ద ఎత్తున కదిలి వెళ్లగా సివిల్‌లో ఉన్న దళ సభ్యుణ్ణీ, ఇద్దరు సంఘ నాయకులనూ పట్టుకొని పోలీసులకు అప్పజెప్పాడు. ఆ తర్వాత వీడు ధనోరకు వెళ్లి పోలీసులతో కల్సి ఉండ సాగాడు. చివరకు యాక్షన్ టీం వీడి పీడ విరగడ చేసింది. వీడు చచ్చాడని తెల్సిన కొడ్యార్ గ్రామ ప్రజలు కోళ్లు కోసుకొని పండుగ చేసుకున్నారు.

## పకంజూర్‌లో మంగె తులావీ ఖతం

కోయిలిబేడ ఏరియాలోని మెంఢ్ర గ్రామానికి చెందిన మంగె భార్యాపిల్లల్ని వదిలేసి మరో యువతిని తీసుకెళ్లి పకంజూర్‌లో కాపురం పెట్టాడు. పకంజూర్ పోలీసులతో కలిసి గ్రామాలలోకి వచ్చి సంఘ నాయకులను పట్టించాడు. అలాగే సంతలకు వెళ్లిన సంఘ నాయకులనూ, సభ్యులనూ గుర్తు పట్టి పోలీసులకు పట్టించడం వీడి పనిగా ఉండేది. గతంలో వీడి అన్న కూడా పోలీసు ఇన్‌ఫార్మర్‌గా మారగా గెరిల్లా దళం వాడిని అంతమొందించింది. మంగెను ఎలాగైనా మట్టుబెట్టాలనే పట్టుదలతో వెళ్లిన యాక్షన్ టీం మే 12న ప్రజల సహకారంతో పకంజూర్ పోలీసుస్టేషన్‌కు దగ్గరలోనే వీడిని హతమార్చింది.

## అంతగఢ్‌లో ఇంద్రపాల్ ఖతం

రావ్‌ఘాట్ ఏరియా సాలెభాట్ గ్రామానికి చెందిన ఇంద్రపాల్ గత మూడు సంవత్సరాలుగా గోపనీయ సైనిక్‌గా పని చేస్తున్నాడు. ఏప్రిల్ 2004లో వీడిని పీఎల్‌జీఏ యాక్షన్ టీం అంతగఢ్ సంతలో మట్టుబెట్టింది.

## దుర్గ్‌కొందుల్‌లో బిరుజా ఖతం

కోయిలిబేడ ఏరియా వట్టంటోయకు చెందిన వాడు బిరుజా. వీడి కుటుంబం బాబా బిహారీదాస్ అనుచరులుగా మారిన భక్తి కుటుంబం. వీళ్లు గ్రామ ప్రజలపై పెత్తనం చేసేవాళ్లు. ఈ కుటుంబంపై ప్రజా పంచాయితీ నిర్వహించడానికి గెరిల్లా దళం వెళ్లగా దాడి చేసి తుపాకీ గుంజుకోవడానికి ప్రయత్నం చేశారు. తర్వాత ప్రజలు గెరిల్లా దళం నాయకత్వంలో వీళ్ల ఇంటిపై దాడి చేసి ఆర్థికంగా నష్టపర్చారు. అప్పటి నుండి బిరుజా ఇన్‌ఫార్మర్‌గా మారి దుర్గ్‌కొందుల్ పోలీసుస్టేషన్ పక్కనే ఉండసాగాడు. ఈ ప్రాంత ప్రజలకు వీడొక పీడగా పరిణమించాడు. ఎవరు సంతకెళ్లినా పోలీసులకు చూపించి అరెస్టు చేయించే వాడు. చివరకు వీణ్ని యాక్షన్ టీం దుర్గ్‌కొందుల్ సంతలోనే హతమార్చి పీడ విరగడ చేసింది.

## కోయిలిబేడ రోడ్డుపై హల్లాల్ ఖతం

వీడు మర్ద గ్రామానికి చెందిన వాడు. వీని బావ నర్సింగ్ కూడా గోపనీయ సైనికుడే. వీడు గత 4 సంవత్సరాలుగా గోపనీయ సైనికుడిగా పని చేస్తూ మర్ద చుట్టుపక్కల గ్రామాల సంఘ నాయకులను పోలీసులకు పట్టించాడు. వీనికి పోలీసులు ఒక రివాల్వర్ కూడా ఇచ్చారు. వీడు కోయిలిబేడలో వేతనం తీసుకొని ప్యాసెంజర్ జీపులో వస్తుండగా ముగ్గురు గెరిల్లాలు జీపును ఆపారు. వీడిని పట్టుకోవడానికి ప్రయత్నించగా వాడు తప్పుకున్నాడు. వీడు తన రివాల్వర్‌తో గెరిల్లాలపై ఒక రౌండ్ ఫైర్ చేశాడు. కానీ ఆ తర్వాత అది జామ్ కావడంతో పరుగెత్తసాగాడు. యాక్షన్ టీం దాదాపు ఒక కిలోమీటర్ దూరం వీడి వెంట పడి కాల్చి చంపి రివాల్వర్‌ను స్వాధీనం చేసుకుంది.

## గోపనీయ సైనికుడు కోలియాను మట్టుబెట్టిన ప్రజా మిలిషియా

మాడ్ డివిజన్ ఢౌల ఏరియా వెడమకోట గ్రామం వాడు కోలియా. 26 సంవత్సరాల ఆదివాసీ యువకుడైన కోలియా గ్రామంలో ఐదో తరగతి పూర్తి చేసి హైస్కూలు చదువు కోసం నారాయణపూర్ చేరాడు. అక్కడ వీడు క్రమంగా తిరుగుబోతు లక్షణాల్ని అలవర్చుకొని తాగుబోతుగా మారాడు. అమ్మాయిలపై అత్యాచారాలు చేయడం, బెదిరించి లొంగదీసుకోవడం, గంజాయి దొంగవ్యాపారం చేయడం వీడి ప్రవృత్తిగా మారింది. క్రమంగా వీడు పోలీసు ఇన్‌ఫార్మర్‌గా మారాడు. 1995 నుండి వీడు పోలీసులకు సంఘ సభ్యుల, దళాల కదలికల గురించిన సమాచారం చేరవేయసాగాడు. అయితే ఎవరు సమాచారాన్ని అందిస్తున్నారో ఆరా తీసేలోగా వీడు గ్రామం నుండి ఉడాయించి నారాయణపూర్‌లో అడ్డా వేశాడు. 1997 నుండి వీడు నారాయణపూర్‌లోనే ఉంటూ పోలీసులకు, ప్రత్యేక బలగాలకు తోవలు చూపుతూ అణచివేత కార్యకలాపాలలో పాలుపంచుకోసాగాడు. ఇటీవల వీడు ఇన్‌ఫార్మర్ నెట్‌వర్క్‌ను పెంచుకోవడం కోసం చాలా మందిని ఇన్‌ఫార్మర్లుగా మార్చే పనిలో నిమగ్నమయ్యాడు. ఈ సమాచారం తెలిసిన ప్రజా మిలిషియా దళం వీడిని వీడి పద్ధతుల్లోనే మోసగించి దెబ్బ తీయాలని పథకం తయారు చేసింది. వీడిని నమ్మించడం కోసం మిలిషియా సభ్యులు కొంత సమాచారాన్ని అందిస్తూ

నమ్మించారు. ఆ క్రమంలో మే 23, 2004 నాడు మిలిషియా దళం వీడిని కలిసి సమాచారం చెప్పినట్టు నటించి దోస్తీ చేసి కల్లు తాగించి ఆ తర్వాత పిస్తోల్‌తో కాల్చి చంపారు. వీడిని చంపుతున్న సమయంలో కొద్ది దూరంలో ఉన్న పోలీసులు కాల్పుల శబ్దాలు విని తానాకు పరుగులు తీశారు. ఒక గంట సేపటి తర్వాత సంఘటనా స్థలానికి పెద్ద సంఖ్యలో వచ్చిన పోలీసులు అక్కడున్న వ్యాపారులపై తమ ప్రతాపాన్ని చూపిస్తూ బాగా హింసించారు. పోలీసుల ఈ దౌర్జన్యకాండకు వ్యతిరేకంగా వ్యాపారులు ఎస్పీ ఆఫీసు ముందు ధర్నా చేశారు. ఎంతో చాకచక్యంగా, సాహసంగా మిలిషియా దళం నిర్వహించిన ఈ చర్య ఈ ప్రాంత ప్రజలకు ఎంతో ఉత్సాహాన్ని కలిగించింది.

## కుక్కచావు చచ్చిన గోపనీయ సైనిక్ వత్తే

మాడ్ డివిజన్ కోహ్కమెట్ట ఏరియా ఇర్కుభట్టి గ్రామస్తుడైన వత్తే 1990 నుండి పోలీసు ఇన్‌ఫార్మర్‌గా పని చేస్తున్నాడు. వీడు మాడ్ డివిజన్‌లో గతంలో గెరిల్లాల క్యాంపులు జరిగిన స్థలాల గురించీ, గ్రామాలలో సంఘ సభ్యుల పేర్లనూ పోలీసులకు తెలియజేసేవాడు. వీడు మొదటి నుండీ తాగుబోతు, తిరుగుబోతు లక్షణాలు కలిగి ఉండేవాడు. 1993లో వీడు గోపనీయ సైనిక్‌గా పోలీసుల్లో చేరి నారాయణపూర్‌లో పని చేయసాగాడు. వీడు పరాల్‌కోట ఏరియాలో ఇన్‌ఫార్మర్లను తయారు చేసి నెట్‌వర్క్‌ను నిర్మించే ప్రయత్నం చేశాడు. అట్లాగే వీడు గంజాయి దొంగ వ్యాపారంలో కూడా పాలు పంచుకుంటూ ఉండేవాడు. అనేక మంది యువతులపై వీడు అత్యాచారాలకు పాల్పడ్డాడు. వీడిని చంపడం కోసం గతంలో గెరిల్లాలు ఒకటీ, రెండూ ప్రయత్నాలు చేసినప్పటికీ ఫలించలేదు. ఈ మధ్య వీడిని పోలీసులు నారాయణపూర్ నుండి రావ్‌ఘాట్‌కు బదిలీ చేసారు. వీడు అక్కడి నుండి నారాయణపూర్‌కు రాకపోకలు సాగిస్తూ గంజాయి దొంగ వ్యాపారం చేస్తూ ఉన్నాడు. ఈ విషయం తెల్సుకున్న మిలిషియా దళం వీడిని సెప్టెంబర్ 15, 2004 నాడు ఔల ఏరియా మూంజ్‌మెట్ట గ్రామంలో అరెస్టు చేసి వివరాలు తెల్సుకొని హతమార్చింది. ఈ విధంగా చాలా ఏళ్లుగా ప్రజలకు తలనొప్పిగా ఉన్న వీడిని అడ్డు తొలగించడంతో ప్రజలు హాయిగా ఊపిరి పీల్చుకున్నారు.

## గోపనీయ సైనిక్ తులారాంకు ప్రజల చేతిలో మరణదండన

మాడ్ డివిజన్ ఔల ఏరియా హాత్‌పాల్ గ్రామస్తుడైన తులారాం చాలా ఏళ్లుగా పోలీసు ఇన్‌ఫార్మర్‌గా పని చేస్తున్నాడు. వీడు ఆదివాసీయేతరుడు. పోలీసుల డబ్బాశకు లొంగిన వీడు గ్రామాల వెంట తిరుగుతూ సంఘ సభ్యుల సమాచారాన్ని సేకరిస్తూ పోలీసులకు చేరవేసేవాడు. అట్లాగే వీడు గ్రామాల్లో ప్రజా వ్యతిరేక, సంఘ వ్యతిరేక శక్తులను పోగు చేసి వాళ్లను కూడా తన లాగే ఇన్‌ఫార్మర్లుగా మార్చి ఒక నెట్‌వర్క్ తయారు చేశాడు. వీడు 1993లో ఇన్నర్ గ్రామ సంఘ నాయకులు సోందేర్, రైసింగ్‌లను కొండగాం పోలీసులకు పట్టించాడు. ఇలా వీడు 1990 నుండి 1998 దాకా కొండగాం ఏరియాలో పోలీసులకు నమ్మకమైన ఏజెంటుగా పని చేశాడు. వీడిపై 1991లో ఒకసారి దాడి చేసి వీడి ఇంటిని కూలగొట్టారు. ఆ తర్వాత వీడు తన మకాం బేనూరుకు మార్చి, అక్కడి పోలీసులతో కలిసి తుపాకీ పట్టుకొని తిరగసాగాడు. వీడు మహిళలతో అసభ్యంగా ప్రవర్తిస్తూ, సంఘ కార్యకర్తలను అరెస్టు చేయిస్తూ ప్రజలకు పెద్ద ముప్పుగా తయారయ్యాడు. ప్రజలు ఎంతో కాలంగా వీడిని హతమార్చాలని దళాలను డిమాండ్ చేస్తూ వస్తున్నారు. గతంలో ఒకసారి వీడిపై దాడి చేయడానికి ప్రయత్నించగా వీడు తప్పించుకోగలిగాడు. దాంతో చివరకు 2004 మే నెలలో పీఎల్‌జీఏ యాక్షన్ టీం కొండగాం టౌన్‌లో సంత జరిగే స్థలంలో వీడొక హోటల్ చాయ్ తాగుతుండగా కాల్చి చంపింది. గెరిల్లాలు విప్లవ నినాదాలు చేస్తూ ప్రజల మధ్య నుండే ఒడుపుగా తప్పుకున్నారు. ఈ దాడి ఈ ప్రాంతంలోని శత్రు ఏజెంట్ల గుండెల్లో భయకంపాలు సృష్టించింది. కొండగాం లాంటి పట్టణాలు కూడా తమను రక్షించలేవని ఇప్పుడు అర్థమవడంతో వాళ్లు వణికిపోతున్నారు. ఏరియా ప్రజలు పీఎల్‌జీఏ చేసిన ఈ వీరోచిత దాడిని ఎంతో కొనియాడారు.

## గోపనీయ సైనిక్ మాసు కొడో ఖతం

ఉత్తర బస్తర్ డివిజన్ కిస్‌కొడ్డో ఏరియా చింగ్‌నార్ గ్రామస్తుడు మాసు. వీడు మొదట దొంగతనాలు చేస్తూ అల్లరిచిల్లరగా బతికేవాడు. వీడిని పోలీసులు ఒకసారి అరెస్ట్ చేసి తీసుకెళ్లారు. ఆ తర్వాత వీణ్ని డబ్బులతో లొంగదీసుకొని ఇన్‌ఫార్మర్‌గా మార్చుకున్నారు. అప్పటి నుండి వీడు కోయిలిబేడ, కేస్కల్ ఏరియాల్లో దళాల సమాచారాన్ని రాబట్టి పోలీసులకు చేరవేయసాగాడు. దుకాణాల్లో సామాన్లు దొంగిలించడం, అమ్మాయిలను వేధించడం/లొంగదీసుకోవడం వంటి పనులు కొనసాగిస్తూ వచ్చాడు. వీడు ఓసారి గ్రామానికి రాగానే ప్రజా మిలిషియా అరెస్ట్ చేసి ప్రశ్నించింది. వీడు తాను రెండు, మూడేళ్ల నుండి ఇన్‌ఫార్మర్‌గా పని చేస్తున్నట్టు, తనకు పోలీసుల నుండి రెగ్యులర్‌గా డబ్బులు ముడుతున్నట్టు అంగీకరించాడు. ఆ తర్వాత వీడిని మిలిషియా ఖతం చేసి రావ్‌ఘాట్ రోడ్డుపై పడవేసింది.

## చప్రాసీ ముసుగులో ఉంటూ పోలీసు ఏజెంటుగిరి చేస్తున్న ఐతు ఖతం

మాడ్ డివిజన్ కోహ్కమెట్ట ఏరియా ముర్‌నార్ గ్రామానికి చెందిన ఐతు డబ్బుకు ఆశపడి పోలీసు ఏజెంటుగా మారాడు. మొదట ప్రజా సంఘాల కార్యకర్తల పేర్లు పోలీసులకు చెబుతుండేవాడు. క్రమంగా వీడిని పోలీసులు మరింత చేరదీసి స్కూలు చప్రాసీగా ఉద్యోగం ఇప్పించి ఔల ఏరియాలో నేల్‌వాడ గ్రామానికి పంపారు. వీడు నారాయణపూర్‌లో మకాం పెట్టి నేల్‌వాడ గ్రామంలో చప్రాసీగా పనిచేయసాగాడు. అయితే వీడు స్కూలు పని తక్కువగా చేస్తూ దళాల కదలికల సమాచారం సేకరించడం కోసం సంతలలో, ఇతర గ్రామాలలో తిరగడం ఎక్కువగా చేయసాగాడు. అట్లాగే వీడు ఇంకా కొందరిని పోలీసు ఇన్‌ఫార్మర్లుగా మార్చుకోవడం కోసం కూడా ప్రయత్నించసాగాడు. ఈ క్రమంలోనే గత ఆగస్టు 7న వీడు పీఎల్‌జీఏ చేతికి చిక్కడంతో ప్రజల్లో విచారించి ప్రజల తీర్పు మేరకు వీడిని శిక్షించారు.

## గోపనీయ సైనిక్ భగత్ దఖనే ఖతం

టిప్రాగడ్ ఏరియా మాన్‌పూర్ పోలీసుస్టేషన్ పరిధిలోని కందాడి గ్రామానికి చెందినవాడు భగత్. వీడి కుటుంబం బైట నుండి వచ్చి ఇక్కడ స్థిరపడింది. వీడి తండ్రి కూలీ పని చేస్తూ వీణ్ని కాలేజీ వరకు చదివించాడు. వీడు మాన్‌పూర్‌లో చదువుకుంటూనే పోలీసుల సంబంధాల్లోకి

*( తరువాయి...... 60వ పేజీలో..... )*

# కాలం చెల్లిన రీతిరివాజులకు వ్యతిరేకంగా మాడ్ ప్రజల పోరాటం

మాడ్ ప్రాంతం ప్రధానంగా పేంద (పోడు) వ్యవసాయం జరిగే ప్రాంతం. నాగళ్లతో దున్నడం తక్కువే. అయితే గత కొన్నేళ్లుగా విప్లవోద్యమ కృషి ఫలితంగా ఇప్పుడు చాలా గ్రామాల్లో నాగళ్లతో దున్నడం నేర్చుకున్నారు. అట్లాగే వరి పంట పండించడం కూడా గతంతో పోలిస్తే పెరుగుతున్నది. ఇక్కడి తెగ కట్టుబాట్లు, వివాహ సాంప్రదాయాలు తమ అభివృద్ధికి అడ్డంకిగా ఉన్నాయనే విషయాన్ని ప్రజలు క్రమంగా గ్రహిస్తున్నారు. ఇప్పుడు గ్రామ స్థాయిలో రాజ్యాధికార సంస్థలు (జనతన సర్కార్) ఏర్పడుతున్న క్రమంలో ప్రజలు మరింతగా చైతన్యవంతులవుతున్నారు. మాడ్ డివిజన్‌లోని కుతుల్, కోహ్కామెట్ట, పరాల్‌కోట ఏరియాలలో ప్రజలు డీఏకేఎంఎస్, కేఏఎంఎస్‌ల నాయకత్వంలో కొన్ని తెగ కట్టుబాట్లను, ఆచారాలను కాలం చెల్లినవిగా గుర్తిస్తూ వాటిలో మార్పు తేవడానికి కృషిని తీవ్రం చేస్తున్నారు.

**కర్సడ్ :** మాడ్ ప్రాంతంలో దాదాపు ప్రతి గ్రామంలో కర్సడ్ జరుగుతుంది. కర్సడ్ అంటే మేళా లేదా జాతర అనవచ్చు. ఇక్కడ యువతీయువకులు సామూహిక నాట్యం చేస్తారు. ఇక్కడే వాళ్లు తమ జీవిత భాగస్వాములను ఎంపిక చేసుకుంటారు. అయితే ఈ కర్సడ్‌లన్నీ కలిసి ఒకటి, రెండు నెలల పాటు కొనసాగుతాయి. ఇవి సరిగ్గా విత్తనాలు వేసే సమయంలోనే వస్తాయి. వీటి ద్వారా వ్యవసాయ పనులు వెనుకబడుతున్నాయి. కాబట్టి ఈ విషయంపై చర్చించిన ప్రజా సంఘాలు కర్సడ్‌లను ఎండాకాలంలోనే పూర్తి చేయాలనీ, ఆ విధంగా వ్యవసాయ పనులకు అడ్డంకి కాకుండా చూసుకోవాలనీ, అట్లాగే ఐదారు గ్రామాలు కలిసి ఒకేసారి కర్సడ్‌లు జరుపుకోవాలని నిర్ణయించారు.

**గోర్గ (జీలుగు కల్లు) :** గోర్గ తాగడం ఇక్కడి ఆదివాసులలో సర్వ సాధారణం. అది వాళ్ల జీవితంలో భాగమని చెప్పొచ్చు. ప్రతి గ్రామంలోనూ గోర్గ చెట్లుంటాయి. కొన్ని చోట్ల సంవత్సరం పొడుగూతా కల్లు దొరుకుతుంది. ఇక్కడ బాల్యం నుండే కల్లు అలవాటవుతుంది. అయితే ఈ అలవాటు ఇక్కడి వ్యవసాయాన్ని అభివృద్ధి కాకుండా నిరోధిస్తున్నది. ఎందుకంటే కొన్ని చోట్ల గోర్గ చెట్లు గ్రామానికి 1-2 గంటల దూరంలో కూడా ఉంటాయి. పొద్దున లేవగానే కల్లుకు వెళితే తిరిగి వచ్చే సరికి 10-11 గంటలవుతుంది. మళ్లీ సాయంత్రం మూడవగానే కల్లుకు బైలు దేరితే ఇల్లు చేరే సరికి రాత్రి 9-10 గంటలవుతుంది. దీంతో వీళ్ల చాలా సమయం ఇందులోనే గడచిపోతోంది. ఒకవైపు ఈ తాగుడు వ్యసనంతో వ్యవసాయాభివృద్ధి కుంటుపడుతుండగా, మరోవైపు తాగిన మత్తులో కొట్లాటలు పెరిగి ఒక్కోసారి చంపుకునే దాకా వెళుతున్నారు.

ఈ నష్టాలన్నీ గమనించిన ప్రజా సంఘాలు ముఖ్యంగా యువకులు, పిల్లలు కల్లు (గోర్గ, ఇప్ప కల్లు, లంద) తాగవద్దని ప్రచారం చేస్తున్నాయి. సంఘ సభ్యులు ముందుగా ఈ అలవాటుకు స్వస్తి చెప్పి ఆదర్శంగా నిలబడాలని విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. చాలా గ్రామాలలో యువకులూ, పిల్లలూ కల్లు వదిలి పెడతామని గ్రామాల్లో కిరియ (శపథం) చేశారు.

**పెళ్లిల్లు :** ఇక్కడ పెళ్లిల్లు కూడా సరిగ్గా వ్యవసాయ పనుల సమయంలోనే జరుగుతాయి. పెళ్లిల్లలో ఎక్కువ ఖర్చు కల్లుపైనే జరుగుతుంది. నిశ్చితార్థం (మాల) నాటి నుండి పెళ్లి జరిగే దాకా ఇచ్చిపుచ్చుకునే కల్లు అంతా లెక్కేస్తే బోలెడవుతుంది. గ్రామంలో నాలుగైదు పెళ్లిల్లుంటే ఒకటీ, ఒకటిన్నర నెలల సమయం పెళ్లి పనుల్లోనే గడిచిపోతుంది. కన్యాశుల్కంగా వరుడి కుటుంబం దాదాపు 100-150 సీసాల కల్లు ఇచ్చుకోవల్సి ఉంటుంది. ఇంకా ఖర్చు పేరుతో 500 రూపాయల నుండి 5,000 రూపాయల దాకా నగదు, పందులు ఇవన్నీ ఇచ్చుకోవల్సి ఉంటుంది. పెళ్లి చేసుకోవడమంటే పెళ్లి కొడుకు ఇల్లు గుల్లవుతుందన్న మాట. అన్నిటికన్నా ఎక్కువ ఖర్చు కల్లు కోసమే అవుతుంది. ఇప్ప పూలు ఇక్కడ ఎక్కువగా దొరకవు కాబట్టి వీళ్లు తమ కోహల ధాన్యాన్ని మోసుకొని గుట్టల కింది గ్రామాలకు వెళ్లి ఇప్పపూలకు బదులు అమ్ముతారు. ఈ విధంగా తినడానికి లేకున్నా కూడా ధాన్యాన్ని అమ్మక తప్పని పరిస్థితి ఎదురవుతుంది.

ఇవన్నీ చర్చించిన ప్రజా సంఘాల వాళ్లు పెళ్లి ఆచారాల్లో కొన్ని మార్పులు చేయాలని నిర్ణయించారు. అందులో ఒకటి – ఒక గ్రామంలో ఒకటికన్నా ఎక్కువ పెళ్లిల్లుంటే అన్నీ ఒకేసారి చేయాలి. అయితే సహజంగానే వృద్ధులు ఈ నిర్ణయం పట్ల వ్యతిరేకత వ్యక్తం చేశారు. అయితే వాళ్లకు నచ్చజెపుతూనే, ఈ నిర్ణయాన్ని అమలు చేసేలా ప్రజలను సంసిద్ధం చేస్తున్నారు. కుత్తుల్‌కు సమీపంలోని ఆల్‌వేడ గ్రామంలో ప్రజా సంఘాలు చొరవ చేసి నాలుగు పెళ్లిల్లు ఒకేసారి జరిపించాయి. అట్లాగే ఈ పెళ్లిల్లలో కల్లుసారాలు పూర్తిగా లేకుండా చేశారు. కొడ్డిలేర్ గ్రామంలో కూడా మూడు పెళ్లిల్లు ఒకే రోజు పూర్తి చేశారు. మునుపటి ఆచారాల ప్రకారం చేస్తే గనక ఈ పెళ్లిళ్లతో ఒక నెల గడిచిపోయేది.

అట్లాగే పెళ్లిళ్లలో కల్లును పూర్తిగా ఆపడం కష్టం కాబట్టి దానికి పది సీసాల పరిమితి విధించారు. అట్లాగే నిశ్చితార్థం జరిగే సమయంలో కల్లు తాగడాన్ని పూర్తిగా ఆపాలని నిశ్చయించారు. భర్తను కోల్పోయిన మహిళలు మరో పెళ్లి చేసుకుంటే ఖర్చు (మొగనాలి) వసూలు చేయడం కూడా సరైంది కాదని సంఘాలు నిర్ణయించాయి.

ఈ నిర్ణయాలన్నీ ప్రజలలో ఒక మార్పుకు సంకేతంగా నిలుస్తాయి. ప్రజాపంథాపై ఆధారపడుతూ వీటిని అమలు చేయడానికి ప్రజా సంఘాలు కృషి చేస్తున్నాయి. అట్లాగే ఇక్కడ వికసిస్తున్న ప్రజా సంస్కృతికి కూడా ఈ మార్పులు అద్దం పడతాయి. ఇవి ప్రజల చైతన్యంలో గొప్ప అభివృద్ధికి దారితీసి ఇక్కడి ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక జీవితంలో మరిన్ని మార్పులు రావడానికి దోహదపడుతాయని ఆశిద్దాం.⅄

---

*( ...... 59వ పేజీ తరువాయి )*

వెళ్లాడు. వీణ్ని గోపనీయ సైనికుడిగా చేర్చుకొని పోలీసులు ప్రతి నెలా 1,000 రూపాయల వేతనం ఇవ్వసాగారు. అట్లాగే ప్రభుత్వం వీడికి లక్ష రూపాయల రుణం కూడా ఇవ్వడంతో వీడు కిరాణా దుకాణం తెరిచాడు. వీడు దుకాణం మాటున విప్లవ వ్యతిరేక కార్యకలాపాలు చేయసాగాడు. వీడికి పోలీసులు ఒక మోటార్ సైకిల్ ఇవ్వగా వీడు విచ్చలవిడిగా గ్రామాల్లో తిరుగుతూ దళాల సమాచారం సేకరించేవాడు. అట్లాగే వీడు కాలేజీలో చదువుతూ అమ్మాయిల్ని వేధించడం, తాగడం వంటి దుశ్చర్యలకు కూడా పాల్పడేవాడు. వీడిని జూన్ 16న పీఎల్‌జీఏ దళం రోడ్డుపై మాటు గాచి పట్టుకొని అక్కడికక్కడే హతమార్చింది.

ఒక క్యాంపెయిన్ లాగా సాగిన ఈ యాక్షన్లతో చాలా మంది గోపనీయ సైనికులు బెదిరిపోయారు. తాము ప్రజల ముందుకు వచ్చి లొంగిపోతామని రాయబారాలు కూడా పంపుతున్నారు. పట్టణాల్లో పోలీసుల రక్షణలో ఉండగా తమనెవరూ ఏమీ చేయలేరని ఇంతకాలం విర్రవీగిన వీళ్లకు పెద్ద ఆశాభంగం కలిగింది. ఈ చర్యలను విజయవంతం చేసిన ప్రజా మిలిషియానూ, తదితర పీఎల్‌జీఏ బలగాలనూ అభినందిద్దాం.⅄

సభలూ – సమావేశాలూ

# విజయవంతంగా ముగిసిన కేస్‌మోండి రేంజ్ డీఏకేఎంఎస్ మహాసభ

ఉత్తర బస్తర్ డివిజన్ కేస్‌మోడి రేంజ్ డీఏకేఎంఎస్ మొదటి మహాసభ సెప్టెంబర్ 16-17 తేదీల్లో విజయవంతంగా ముగిసింది. నిరుడు నవంబర్‌లో ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పోలీసులు పట్టుకొని కాల్చి చంపిన జీరంతరాయి గ్రామ అమరుల కమ్యూన్‌లో, అనారోగ్యంతో అసువులు బాసిన కోతుల్ గ్రామ సంఘ సభ్యుడు కామ్రేడ్ బాల్‌సింగ్ హాల్లో ఈ మహాసభ జరిగింది. డీఏకేఎంఎస్ అధ్యక్షుడు భీవ్‌సింగ్ జెండా ఎగురవేయగా ఈ సభ ప్రారంభమైంది. ఇద్దరు కామ్రేడ్లు ఈ సభను నడపడానికి అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. ఇందులో మొత్తం 22 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. రాజకీయ తీర్మానంపైనా, ప్రణాళిక పైనా చర్చ జరిగిన తర్వాత ప్రతినిధులు ఆమోదించారు. చివరన ముగ్గురు కామ్రేడ్లను రేంజ్ కమిటీలోకి ఎన్నుకున్నారు.

కోలార్ రేంజ్ డీఏకేఎంఎస్ మొదటి మహాసభ కూడా ఇదే విధంగా పూర్తయింది. ఈ సభలు ఆమోదించిన తీర్మానాలలో ముఖ్యమైనవి ఇవి –

1) ప్రభుత్వ బూటకపు సంస్కరణలను వ్యతిరేకిద్దాం. ప్రజల నిజమైన అభివృద్ధి కోసం ముందడుగు వేద్దాం. 2) చార్‌గాం, రావ్‌ఘాట్ గనులను అడ్డుకొని మన సంపదల్ని కాపాడుకుందాం. బస్తర్ సంపదలను తరలించుకుపోయే దురుద్దేశ్యంతో ప్రభుత్వం నిర్మించ తలపెడుతున్న దల్లీ-రావ్‌ఘాట్ రైల్వేలైనును వ్యతిరేకిద్దాం. 3) ప్రభుత్వేతర సంస్థ ఏకతా పరిషత్ ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిద్దాం. గ్రామాల్లో ఈ సంస్థ కార్యకలాపాలను అడ్డుకుందాం. 4) పంచాయితీ ఎన్నికలను బహిష్కరిద్దాం.

## నేల్‌నార్ ఏరియాలో గ్రామ స్థాయి డీఏకేఎంఎస్ మహాసభలు

మాడ్ డివిజన్ నేల్‌నార్ ఏరియాలో తొలిసారిగా గ్రామ స్థాయిలో డీఏకేఎంఎస్ మహాసభలు విజయవంతంగా పూర్తయ్యాయి. ఈ ఏరియాలో సంఘాలు ఏర్పడి చాలా ఏళ్లే కావస్తున్నప్పటికీ ఇలా క్రమబద్ధంగా కింది నుండి మహాసభలు జరపడం ఇదే తొలిసారి. ప్రతి సభలో డీఏకేఎంఎస్ ప్రణాళికపై వివరంగా చర్చ చేశారు. అట్లాగే స్థానిక సమస్యలపై కూడా చర్చలు జరిగాయి. ఆ తర్వాత కొన్ని తీర్మానాలు చేశారు. బలవంతపు పెళ్లిళ్లు చేయగూడదనీ, చిన్న వయస్సులో మాల చెయ్యగూడదనీ, కల్లు అమ్మకాలను బంద్ చేయాలనీ, కర్ఫ్యూలను అదుపు చేయాలనీ, పంచాయితీ ఎన్నికల్ని బహిష్కరించాలనీ తీర్మానాలు చేశారు. దోపిడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడడానికి పెద్ద సంఖ్యలో యువతరాన్ని సమీకరించాలని కూడా తీర్మానించారు. ప్రతి గ్రామంలోనూ విప్లవకర రైతాంగ ఉద్యమాన్ని పటిష్టం చేయాలనే సంకల్పంతో ఈ సభలు విజయవంతంగా ముగిసాయి.

## అక్టోబర్ 1న చైనా విప్లవ వార్షికోత్సవం జరుపుకున్న నేల్‌నార్ ప్రాంత ప్రజలు

మాడ్ డివిజన్ నేల్‌నార్ ఏరియాలో ఒక చోట ప్రజలు అక్టోబర్ 1న చైనా విప్లవ వార్షికోత్సవం ఘనంగా జరుపుకున్నారు. స్థానిక గెరిల్లా దళం ఏర్పాటు చేసిన ఈ సభలో మొత్తం 21 గ్రామాల ప్రజలు హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానిక గెరిల్లా దళ కమాండర్ ప్రజలనుద్దేశించి ప్రసంగించారు : "మన వంటి పేద దేశంగా ఉన్న చైనాలో కార్మికవర్గ నాయకత్వాన పీడిత ప్రజలంతా దీర్ఘకాల ప్రజాయుద్ధ పంథాలో పోరాడి నూతన ప్రజాస్వామ్యాన్ని గెల్చుకున్నారు. భూస్వామ్యాన్నీ, దళారీ పెట్టుబడినీ, సామ్రాజ్యవాద దోపిడీనీ రూపుమాపి ప్రజలకు నిజమైన ప్రజాస్వామ్యాన్ని అమలు చేశారు. ఆ తర్వాత ఈ విప్లవాన్ని మరో మెట్టు ముందుకు కొనిపోయి సోషలిస్టు విప్లవాన్ని విజయవంతం చేసి సోషలిస్టు చైనాను స్థాపించారు. చైనా కమ్యూనిస్టు పార్టీ నాయకుడు మావో మార్క్సిజం-లెనినిజాన్ని మరో ఉన్నత దశకు అభివృద్ధి చేసి ప్రపంచ పీడిత ప్రజానీకానికి మావోయిజం అనే గొప్ప సిద్ధాంత ఆయుధాన్ని అందించాడు. అయితే కామ్రేడ్ మావో మరణం తర్వాత ఆధునిక రివిజనిస్టులు అధికారాన్ని చేజిక్కించుకొని సోషలిస్టు చైనాను తిరిగి పెట్టుబడిదారీ చైనాగా దిగజార్చి వేశారు. ఆనాడు ఏ సామాజిక రుగ్మతలనూ, ఆర్థిక అసమానతలనూ రూపుమాపారో నేడు ఆ రుగ్మతలూ, అసమానతలూ మరోసారి పెచ్చరిల్లిపోయాయి. ఇవి తప్పనిసరి ప్రజల్ని మరో విప్లవానికి పురికొల్పుతాయి. నేడు మార్క్సిజం-లెనినిజం-మావోయిజాన్ని మార్గదర్శక సిద్ధాంతంగా స్వీకరించిన పార్టీలెన్నో ప్రపంచంలో చాలా చోట్ల విప్లవాలను కొనసాగిస్తున్నాయి. ఈ విప్లవాలన్నిటికీ అక్టోబర్ 1 చైనా విప్లవం ఇప్పటికీ స్ఫూర్తిదాయకంగానే ఉంటుంది. ఇది విప్లవాల యుగం. విప్లవిస్తే జయం మనదే." కమాండర్ ప్రసంగం తర్వాత సాంస్కృతిక కార్యక్రమాలతో సభ ముగిసింది.

## సీపీఐ (మావోయిస్టు) ఆవిర్భావం సందర్భంగా మాడ్ డివిజన్‌లో సభలు

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు) [పీపుల్స్‌వార్], భారత మావోయిస్టు కమ్యూనిస్టు సెంటర్‌లు రెండూ భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)లో విలీనమైన సందర్భంగా ప్రజలలో విస్తృత ప్రచార క్యాంపెయిన్ చేపట్టాలని పార్టీ నిర్ణయించింది. ఇందులో భాగంగా మాడ్ డివిజన్‌లో పెద్ద ఎత్తున ప్రజలను సమీకరించి 12 చోట్ల సభలు జరిపారు. మర్రమెట్ట, ఉస్పుర్, ఆదేర్, రాజ్‌వేడ, జుర్రి, కుర్కుర్ఘోర్, ఆకబేడ, కోహ్కమెట్ట, కుత్తుల్, బేరేవేడ, నేల్‌నార్, రాజపూర్ గ్రామాల్లో ఈ సభలు జరిగాయి. మర్రమెట్టలో అత్యధికంగా 13 వేల మంది ప్రజలు సభలో పాల్గొన్నారు. ఇందులో కొన్ని సభలలో ఎక్కువ గ్రామాల ప్రజలను సమీకరించి జరిపినవి కాగా మరి కొన్ని స్థానిక స్థాయిలో జరిపినవి. డివిజన్‌లోని దాదాపు అన్ని గ్రామాల ప్రజలు ఏదో ఒక చోట సభలో పాల్గొన్నారు. మొత్తం 45 వేల దాకా ప్రజలు ఈ సభల్లో పాల్గొన్నారు. ఈ సభల్లో డివిజన్ సీఎన్ఎం, స్థానిక సీఎన్ఎం బృందాలు పాల్గొని సాంస్కృతిక ప్రదర్శనలిచ్చాయి. ఈ సభల్లో మాట్లాడిన వక్తలంతా పార్టీ విలీనపు ప్రాముఖ్యత గురించీ, ఈ రెండు పార్టీలు విడి విడి స్రవంతులుగా ఉంటూ వచ్చిన నేపథ్యం గురించీ, ఇప్పుడు సమైక్య పార్టీ ఏర్పడిన తర్వాత నెలకొన్న అనుకూల పరిస్థితుల గురించీ, ఎదురయ్యే సవాళ్ల గురించీ ప్రజలకు వివరించారు. సభల సందర్భంగా ఎర్ర జెండాలూ, బ్యానర్లూ చేబూని పెద్ద ఎత్తున ఊరేగింపులు తీశారు. సమైక్య పార్టీ చేపట్టిన నూతన కర్తవ్యాలను నినాదాల రూపంలో ప్రజల్లోకి తీసుకెళ్లారు. ఉత్సాహకర వాతావరణంలో ఈ సభలన్నీ ముగిసాయి. పీఎల్‌జీఏ బలగాలు అప్రమత్తంగా ఉంటూ ఈ సభల నిర్వహణను జయప్రదం చేయడంలో కీలక పాత్ర పోషించాయి. ▲

## ఇప్పటికీ వీడని టాడా నీలి ఛాయలు

# ఐదుగురు అమాయక రైతులకు యావజ్జీవ శిక్ష విధించడానికి వ్యతిరేకంగా గొంతెత్తి నినదిద్దాం !

టాడా చట్టం రద్దయ్యి పదేళ్లు కావస్తున్నా, ఒళ్లు గగుర్పొడిచే దాని నీలి ఛాయలు గడ్చిరోలి రైతాంగాన్ని ఇప్పటికీ వీడలేదు. అక్టోబర్ 20వ తేదీన ఒకవైపు ముంబాయిలో ముఖ్యమంత్రి పదవి కోసం కాంగ్రెస్, ఎన్‌సీపీలు మల్లాగుల్లాలు పడుతుంటే, మరోవైపు నాగపూర్‌లో టాడా న్యాయస్థానం ఐదుగురు అమాయక రైతులకు 18 ఏళ్ల యావజ్జీవ శిక్ష విధించి తన ప్రజా వ్యతిరేక చరిత్రలో మరో నల్ల అధ్యాయాన్ని చేర్చుకుంది. ఏ పార్టీ ఈ సంఘటనను మాట మాత్రంగా కూడా ఖండించలేదు. అవును మరి! పదవుల కోసం వాళ్లు కీచులాడుకుంటారు గానీ, ప్రజా ఉద్యమాన్ని అణచడంలో అందరిదీ ఒకే బాణీ కదా మరి!? నిజానికి టాడా రద్దయ్యి, ఆ తర్వాత వచ్చిన పోటా కూడా రద్దయిన తర్వాత టాడా చట్టం కింద నమోదు చేసిన కేసుల్ని ఎత్తేయకపోవడాన్ని బట్టి ఈ వ్యవస్థ ఎంత అప్రజాస్వామికమైందో గ్రహించవచ్చు. సమైక్య ప్రగతిశీల కూటమి 'ప్రగతిశీలత' ఏమిటో కూడా తెల్సుకోవచ్చు. ఈ శిక్షకు గురైన వాళ్లు : కిశోర్ లాల్‌సాయ్ సడిమెక్ (హీందెవాడ), చైతీ మూక పల్లో (మల్లెంపొడూర్), చైతూ ఇర్ప వడ్డె (ఇర్పనార్), దోగె కోర్కె వడ్డె, కోప నరుంగో మహ్కా. వాస్తవానికి ఈ ఐదుగురూ ఎన్నడూ నక్సలైట్లు కాదు. అయితే వీళ్లలో ఒకరి సోదరుడు, మరొకరి కొడుకు విప్లవోద్యమంలో పని చేస్తున్నారు. ఇకపోతే వీళ్లకు శిక్ష విధించడానికి మూలమైన కేసు మరింత హాస్యాస్పదమైంది. ఎందుకంటే 1992లో లాహిరి పోలీసు స్టేషన్‌పై ఈ 'నక్సలైట్లు' దాడి చేయగా ఒక పోలీసు చనిపోయాడని వీళ్లపై అభియోగం మోపారు. వాస్తవానికి ఆ దాడి నక్సలైట్లు చేసింది కానే కాదు, అసలు అది దాడి కూడా కాదు. పోలీసులు తమలో తాము గొడవ పడి అది తీవ్రమై కాల్పులకు దారి తీయడంతో ఒక పోలీసు చనిపోయాడు. ఇది జరిగిన వాస్తవం. దీని గురించి అప్పట్లో పత్రికల్లో కూడా వార్తలు వచ్చాయి. ఇలాంటి తప్పుడు కేసులో వీళ్లను ఇరికించి చాలా కాలం జైల్లో ఉంచి అనేక ఏళ్లుగా కోర్టు చుట్టూ తిప్పి, ఆర్థికంగా తీవ్రంగా కుంగదీసి చివరకు ఇలా యావజ్జీవ ఖైదు విధించడం చాలా అన్యాయం. అమానుషం.

వాస్తవానికి, నిజమైన హంతకులు బలాదూర్‌గా తిరగడమే కాదు, ఏకంగా చట్టసభలకు ఎన్నికై పదవులు కూడా చేపడుతున్నారు. వేల కోట్ల రూపాయల కుంభకోణాలకు బాధ్యులైన వాళ్లకు శిక్షలు విధించేందుకు ఏ న్యాయస్థానమూ 'చురుకుదనం' చూపించదు. వేల మంది ప్రజల దుర్మరణానికీ, లక్షలాది మంది ప్రజలు తీవ్ర రోగాల పాలవడానికి కారణమైన యూనియన్ కార్బైడ్ యజమాని ఆండర్సన్‌ను అరెస్టు చేయించడానికి మన న్యాయవ్యవస్థకు నోరు పెగలదు. బాబ్రీ మసీదును ధ్వంసం చేసిన కేసులో ఆఖరుకు చార్జ్‌షీట్లు కూడా వెనక్కి తీసుకున్నారు. అసలైన నేరస్తులే నాయకులై, మంత్రులై దేశాన్ని ఏలుతున్నారు. ఒక హర్షద్ మెహతా, ఒక తెల్గీ, ఒక పీవీ నర్సింహారావు, ఒక జయలలిత, ఒక లాలూ... ఇలా ఎందరో లంచగొండులు చట్టంతో ఆటలాడుకోగలరు. కానీ అమాయకులు, ఆదివాసులు ఈ న్యాయవ్యవస్థకు తేలిగ్గా బలవుతారు. ఈ శిక్ష ద్వారా ఈ న్యాయవ్యవస్థ స్వభావం మరోసారి ప్రజల కళ్ల ముందు బట్టబయలైంది. ఇది దోపిడీ వర్గాల న్యాయస్థానమేననీ, ఇందులో పేదలకు న్యాయం దొరకదనీ, వాస్తవానికి పేదలను అణచివేసి శిక్షించడానికే ఈ న్యాయస్థానాలున్నాయనీ ప్రజలు మరింతగా గ్రహిస్తారు.

ఈ ఐదుగురూ తమ పిల్లాపాపలతో సాధారణ జీవితం గడుపుతున్న పేద రైతులు. నిజానికి వీళ్ల నేరమేమీ లేదన్న విషయం వీళ్లను పట్టుకున్న పోలీసులకూ, కేసు నమోదు చేసిన అధికార్లకూ, కేసు విచారించిన న్యాయమూర్తులకూ అందరికీ స్పష్టంగా తెలుసు. విప్లవోద్యమ అణచివేతలో భాగంగానే వీళ్లకీ శిక్ష విధించారు. ఈ శిక్ష ద్వారా వీళ్లు ప్రజలకు గుణపాఠం నేర్పాలనుకుంటున్నారు... విప్లవోద్యమంలో చేరితే, దానికి మద్దతునిస్తే మీకూ ఇదే గతి పడుతుందనే హెచ్చరిక చేస్తున్నారు. విప్లవకారుల కుటుంబ సభ్యులకు శిక్ష విధించడం కూడా యాధృచ్ఛికమైంది కాదు. ఇది ప్రభుత్వం సాగిస్తున్న బహుముఖ దాడిలో భాగమైన మానసిక యుద్ధం. ఇదొక హెచ్చరిక. విప్లవంలో చేరే వాళ్ల తల్లిదండ్రులకూ, సోదరులకూ శిక్షలు తప్పవనే హెచ్చరిక. దీనితో ఏం సాధించాలనుకుంటున్నారు? ఏం జరుగుతుందనుకుంటున్నారు? చరిత్రలో ఇప్పటి దాకా ప్రజా వ్యతిరేక నియంతృత్వ ప్రభుత్వాలన్నీ కలగన్నట్టుగానే ఈ ప్రభుత్వం కూడా ఇలాంటి శిక్షల ద్వారా విప్లవోద్యమాన్ని రూపుమాపగలమని లేదా బలహీనపర్చగలమని భ్రమపడుతోంది. కానీ చరిత్రలో ఇలాంటి ప్రయత్నం జరిగిన ప్రతి సారీ ఘోర వైఫల్యాన్నే చవి చూడాల్సి వచ్చిందనే నిజాన్ని పాలకులు మర్చిపోతున్నారు.

ఈ ఐదుగురు అమాయక ఆదివాసులకు యావజ్జీవ శిక్ష విధించడాన్ని, వాళ్ల పిల్లాపాపల్ని అనాథలుగా చేయడాన్ని ప్రజలూ, ప్రజాస్వామ్యవాదులంతా ముక్త కంఠంతో ఖండించాలి. టాడా, పోటా నల్ల చట్టాల కింద నమోదు కేసులన్నిటినీ వెనక్కి తీసుకోవాలనీ, ప్రజల జీవించే హక్కును కాపాడాలనీ డిమాండ్ చేయాలి. ఈ కుటుంబాలకు అన్ని విధాలా అండదండలిస్తూ వారిని ఆదుకోవాలి. ఇది మనందరి బాధ్యత. ▲

దండకారణ్య ప్రజలపై, ప్రజా ఉద్యమాలపై రాజ్యం సాగిస్తున్న క్రూర నిర్బంధానికి నిరసనగా...

**జనవరి 26న 'దండకారణ్య బంద్'ను జయప్రదం చేయండి !**